
ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 1-2-2018 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 172

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



అందగాడా.. చందురూడా

పున్నమి వెలుగుల్లో మరింత అందంగా కనిపించే చందమామ కాసేపు మాయమైనా.. 'సూపర్, బ్లూ, బ్లడ్ మూన్'గా ఒకేరోజు భిన్న వర్ణాల్లో కనిపించి మురిపించాడు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో కనిపించిన గ్రహణాన్ని ప్రజలు పెద్దఎత్తున వీక్షించారు. దిల్లీలో చంద్రుడు దశలవారీగా ఇలా కనిపించాడు.

మొత్తం పోస్టులు: 8792

దరఖాస్తులు: 277574

టీఆర్‌టీ షెడ్యూలు విడుదల

- 24 నుంచి పరీక్షలు
- అత్యధికం ఆన్‌లైన్లోనే..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు జరగనున్నాయి. ఈ మేరకు పోస్టులు, సబ్జెక్టులు, మాధ్యమాలవారీగా పరీక్షల షెడ్యూలును టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

ఈ పరీక్షల్లో సబ్జెక్టులు, మాధ్యమాలను పరిగణనలోకి తీసుకుంటే కంప్యూటర్ ఆధారిత (ఆన్‌లైన్) పరీక్షలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా కేటగిరీల్లో దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. ఎస్జీటీ తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమ పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు మాధ్యమ (బయోలాజికల్ సైన్స్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్) పోస్టులను 'ఓఎంఆర్' పద్ధతి (ఆఫ్‌లైన్)లో నిర్వహిస్తామని కమిషన్ తెలిపింది. పదిరకాల పరీక్షలకు హైదరాబాద్ జిల్లాలో, ఎస్జీటీ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పరీక్షలకు హెచ్ఎండీఏ పరిధిలో పరీక్ష కేంద్రాలు ఉంటాయి. మిగతా పోస్టులకు జిల్లా కేంద్రాల్లోనూ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు (మిగతా 2లో)



జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

గద్దెపైన సారలమ్మ

పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా..

- అడుగడుగున జన నీరాజనాలు
- బారులు తీరిన వాహనాలు
- లక్షలాదిగా పోటెత్తిన భక్తులు
- జనసంద్రంగా జంపన్న వాగు
- మేడారానికి నేడు ఛత్తీస్‌గఢ్ సీఎం రాక
- ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఖరారు

11లో



సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు

కొత్త సీఎస్‌గా శైలేంద్రకుమార్ జోషి

- సీఎం కేసీఆర్ నిర్ణయం.. వెంటనే ఉత్తర్వులు
- ఎస్పీ సింగ్ నుంచి బాధ్యతల స్వీకరణ
- పూర్తి అదనపు బాధ్యతలపై నీటిపారుదల శాఖ కొనసాగింపు
- సీసీఎల్ఏగా రాజేశ్వర్ తివారీకి అదనపు బాధ్యతలు



ప్రభుత్వ లక్ష్యాలే ప్రాధాన్యాలు

- 'ఈనాడు'తో ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి

-వివరాలు 2లో

ప్రతిభావంతులకే ప్రవేశం

- గొలుసుకట్టు వలసలకు ముగింపు పలుకుదాం
- వలస సంస్కరణలను ప్రతిపాదించిన ట్రంప్
- కాంగ్రెస్ ఉభయసభలనుద్దేశించి తొలి ప్రసంగం

3లో

అధికారంలోకి రాకుంటే.. రాజకీయాలు వదిలేస్తా

- ఆ దమ్ము మీకుందా?
- ఉత్తమ్‌కు మంత్రి కేటీఆర్ సవాల్
- గద్వాల నుంచే జైత్రయాత్ర ప్రారంభమని వ్యాఖ్య

5లో

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై వేటు!

- రాష్ట్రపతికి సిఫార్సు చేయనున్న సీజేఐ
- వైద్య కళాశాలల వివాదంలో కొత్త మలుపు

3లో



ఆకాంక్షలా.. ఆర్థిక క్రమశిక్షణా?

- నేడే దేశ బడ్జెట్ సమర్పణ
- ఎన్నికల ముంగిట్లో జైట్లీకి కీలక సవాలు
- గ్రామీణంపై వరాల జల్లుకు అవకాశం
- మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయింపులు పెంపు!
- చిన్న వ్యాపారులకు ఉపశమనం కలిగించే నిర్ణయాలుండొచ్చు

దిల్లీ

ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఒకవైపు... దేశ ఆర్థిక క్రమశిక్షణ మరోవైపు. ఈ రెండింటిలో దేన్నీ విస్మరించడానికి వీలు లేని క్లిష్ట సమయంలో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మరికొద్ది గంటల్లో లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. నాలుగేళ్ల సంస్కరణల పథాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఈ ఏడాది 8 రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలు, వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన పరిస్థితుల్లో జైట్లీ ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కీలకం కానుంది. ఆసియాలోనే మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో వృద్ధికి జైట్లీ ఏం చేయనున్నారో సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామీణ గృహనిర్మాణం, పంటల బీమా పథకం వంటి ప్రస్తుత పథకాలకు నిధుల కేటాయింపు పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు కొత్త పథకాలను కూడా ఈ బడ్జెట్‌లో చోటు కల్పించవచ్చని భావిస్తున్నారు. ఇటీవలి (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఇది సంపదలో, ఇది పేదరికంలో, రెండూ మనకే వచ్చాయి తెలుసా!


హోంగార్డులకు వరాలు

- దినసరి భత్యం రూ.400 నుంచి రూ.675కి పెంపు
- ఇతర భత్యాలు.. పోలీసు ఆసుపత్రుల్లో వైద్యం
- ట్రాఫిక్‌లో పనిచేసేవారికి 30% అదనపు భత్యం
- మహిళా హోంగార్డులకు 6 నెలల ప్రసూతి సెలవు
- తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: అత్తెసరు జీతాలతో బతుకులు వెళ్లదీస్తున్న హోంగార్డులకు తెలంగాణ ప్రభుత్వం వరాలు ప్రకటించింది. వారు కోరినట్లే దినసరి భత్యం పెంచడంతోపాటు ఇతరత్రా సదుపాయాలు కూడా కల్పించింది. దీనివల్ల రాష్ట్రంలోని దాదాపు 20 వేల మంది హోంగార్డులకు ప్రయోజనం కలగనుంది. ఈ మేరకు హోం శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యాంశాలివీ.

ప్రస్తుతం రూ.400 ఉన్న దినసరి భత్యం రూ.675కి పెంపు.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1న వారి నెల జీతం వెయ్యి పెరిగేలా పెంపు ఉంటుంది. ఆమేరకు దినసరి భత్యం (మిగతా 2లో)



బరువుతగ్గే శస్త్రచికిత్సతో ఆత్మహత్య ముప్పు

సాధారణ పద్ధతుల్లో కంటే శస్త్రచికిత్స (బేరియాట్రిక్ సర్జరీ) ద్వారా అధిక బరువును తగ్గించుకునేవారిలో ఆత్మహత్యకు పాల్పడే లక్షణాలు ఎక్కువగా ఉంటాయట. స్వీడన్ నిర్వహించిన ఓ అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఇలా సర్జరీ చేయించుకొనేవారికి స్వీయ హాని ముప్పు గురించి, దీర్ఘకాలికంగా పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని ఆ అధ్యయనం సూచిస్తోంది. 3లో



సీఎస్‌గా పనిచేయడం నా అదృష్టం

- తెలంగాణ ప్రజలు సహృదయులు
- సీఎం దార్శనికుడు
- వీడ్కోలు సభలో ఎస్పీ సింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు సహృదయులు, ఎలాంటి కల్మషం లేని వారని, ఎవరొచ్చినా ఆదరించి అక్కున చేర్చుకుంటారని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తెలిపారు. ఇక్కడ సీఎస్‌గా పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని చెప్పారు. తెలంగాణ కొత్త రాష్ట్రమైనా దేశంలో అప్రతిహత విజయాలతో ముందుకు సాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణ వైపు అడుగులు వేస్తోందని అన్నారు. బుధవారం పదవీవిరమణ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. 'తెలంగాణతో నాకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది. సీఎస్‌గా అవకాశం ఇచ్చిన సీఎంకు కృతజ్ఞుణ్ని. రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన మూడు ప్రాజెక్టులు అవుటర్ రింగ్‌రోడ్డు, హైదరాబాద్ మెట్రో రైలు, మిషన్ భగీరథ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో నేను ఉండడం మధురానుభూతి. మిషన్ భగీరథ ప్రాజెక్టును నా జీవితంలో మరిచిపోలేను. దానిపై దిల్లీలో దృశ్యరూపక ప్రదర్శన ఇవ్వగా పెద్దఎత్తున ప్రశంసలు వచ్చాయి. రికార్డు సమయంలో పూర్తవుతున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడానికి సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శప్రాయం. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాయి. సీఎస్‌గా నేను అందరితోనూ కలిసిపోయాను. వర్గాలకు తావు లేకుండా అందరినీ సమానంగా చూశాను. అందరూ నాకు సహకరించారు. ఐఏఎస్‌గా 35 ఏళ్ల ప్రయాణం సజావుగా, ఎంతో సంతృప్తిగా సాగింది' అని ఎస్పీసింగ్ చెప్పారు. నూతన సీఎస్ ఎస్కే జోషి మాట్లాడుతూ తెలంగాణను అగ్రస్థానంలో నిలపడానికి మరింతఉత్సాహంతో పనిచేస్తామన్నారు. దీనికి అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రమేశ్ చందా, అజయ్‌మిశ్ర, ఉన్నతాధికారులు రామకృష్ణారావు, జయేశ్‌రంజన్, హర్‌ప్రీత్‌సింగ్, సీవీ ఆనంద్, జనార్దన్‌రెడ్డి, శ్రీలక్ష్మి, నవీన్‌మిత్తల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలు పాటిస్తా: అంతకుముందు పదవీవిరమణ సందర్భంగా తన కార్యాలయంలో ఎస్పీ సింగ్ మాట్లాడారు. శేష జీవితాన్ని ఆత్మసంతృప్తితో, ఆనందంగా గడుపుతానని చెప్పారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా సీఎం అవకాశం ఇస్తారనే ప్రచారం జరుగుతోందని విలేకరులు పేర్కొనగా సీఎం ఆదేశాలనుపాటిస్తానన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలే ప్రాధాన్యాలు

- శాయశక్తులా ప్రజలకు సేవ
- అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు
- తెలుగు ప్రజలతో సుదీర్ఘ అనుబంధం
- చిన్నతనంలోనే హైదరాబాద్ చూడాలని ఉండేది..
- ఇక్కడే సీఎస్ కావడం ఆనందదాయకం
- పాలమూరులో పచ్చని పంటల్ని చూసి పరవశించా..
- 'ఈనాడు'తో ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి


నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని అభినందిస్తున్న ఎస్పీ సింగ్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తానని, ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలుకు శాయశక్తులా కృషి చేస్తానని, సమష్టిగా పని చేసేందుకు ప్రాధాన్యం ఇస్తానని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.కె.జోషి పేర్కొన్నారు. తనకు చిన్నతనంలోనే హైదరాబాద్‌ను చూడాలని కోరిక ఉండేదనీ, ఇప్పుడు హైదరాబాద్‌లోనే సీఎస్‌గా పనిచేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన సచివాలయంలో 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తనను సీఎస్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు శాయశక్తులా సేవ చేసేందుకు పునరంకితం అవుతానని జోషి వెల్లడించారు. వివరాలివీ..

ప్రధాన కార్యదర్శిగా మీ ప్రాధాన్యాలేమిటి? ఏదైనా ప్రత్యేకంగా చేయాలనుకొంటున్నారా?

వ్యక్తిగతంగా ఏమీ ఉండవు. ప్రభుత్వ ప్రాధాన్యాలే నాకూ ప్రాధాన్యాలు. పథకాల పూర్తికి అవసరమైన చర్యలు తీసుకొంటాను. ఇందుకోసం బృందస్ఫూర్తితో అధికారులందరితో కలిసి పని చేస్తాను. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రివర్గం తీసుకొన్న నిర్ణయాలను సమర్థంగా అమలు చేయడానికి చర్యలు తీసుకొంటాను. అభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండింటిపైనా ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తా.

సుదీర్ఘకాలం సాగునీటి రంగంలో పని చేశారు. ఆ రంగంలో ఎదురైన అనుభవాలేంటి?

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తయి రైతులకు నీళ్లు అంది, సాగైన పంటలు చూసి ఎంతో ఆనందించా. ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించగలిగితే ఆ ప్రాంత పరిస్థితే మారిపోతుంది. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసేలా ప్రయత్నం చేస్తా. జూన్, జులై వరకు ఆ ప్రాజెక్టు పూర్తవుతుందని నమ్ముతున్నాను. దీంతోపాటు పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, దిండి ఇలా అన్నింటినీ పూర్తి చేసేందుకు, అదనపు భారం పడకుండా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకొంటాం.

ప్రాథమిక విద్యలోనే తెలుగును మూడో భాషగా తీసుకొన్న మీరు ఐఏఎస్‌కు అయ్యాక తెలుగు రాష్ట్రాన్నే ఎంపిక చేసుకొన్నారు. ఇక్కడి అనుభవం ఎలా ఉంది?

తెలుగు ప్రజలతోనూ, హైదరాబాద్‌తోనూ 30 సంవత్సరాల అనుబంధం ఉంది. ఆరు నుంచి ఎనిమిది తరగతుల వరకు తెలుగును మూడో భాషగా ఉత్తర్‌ప్రదేశ్‌లో చదువుకున్నాను. ఐఏఎస్‌గా ఎంపికైనా అనేక హోదాల్లో తెలుగు ప్రజలతో పని చేశాను. అనేక మంచి అనుభవాలున్నాయి. ప్రధాన కార్యదర్శిగా కూడా ప్రజల కోసం మరింత అంకిత భావంతో పని చేస్తా.

ఒకవైపు సీఎస్‌గా, మరోవైపు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు? రెంటింటినీ ఎలా నిర్వహిస్తారు?

రెండింటి నిర్వహణ సమస్య కాదు. సామర్థ్యానికి కొదవ ఉండదు.

ఎన్నికల సంవత్సరానికి ముందు బాధ్యతలు చేపట్టారు? ఏమైనా ఒత్తిడికి గురవుతున్నారా?

ప్రజలకు మొదటి రోజు నుంచే ఆకాంక్షలుంటాయి. వాటిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు నెరవేరుస్తుంది. ఎన్నికల సందర్భంగా కొత్తగా ఎలాంటి సమస్యలుండవు.

దస్త్రాల పరిష్కారం వేగవంతం కావాలని ప్రజలు ఆశిస్తున్నారు? దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

దస్త్రాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండదు. పాలన సంస్కరణలను అమలు చేస్తాం. యంత్రాంగం పారదర్శకంగా పని చేస్తుంది. సీఎస్‌గా ఎస్పీ సింగ్ సమర్థంగా పని చేశారు. ఆయన దారిలో నడుస్తాం.

ఉద్యోగులు పీఆర్‌సీని ఆశిస్తున్నారు? దీనిపై వారికి ఏమైనా శుభవార్త చెబుతారా?

దీనికి సంబంధించిన దస్త్రాలను పరిశీలించాలి, అధ్యయనం చేశాక స్పందిస్తాను.

విభజన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి, ఇంకా తెలంగాణ ఉద్యోగులు చాలామంది అక్కడే ఉన్నారు? వారిని ఎలా రప్పిస్తారు?

అన్నింటినీ చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

కొత్త సీఎస్‌గా శైలేంద్రకుమార్ జోషి

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శైలేంద్రకుమార్ జోషి నియమితులయ్యారు. ప్రస్తుత సీఎస్ ఎస్పీ సింగ్ నుంచి ఆయన సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది డిసెంబరు వరకు ఆయన సీఎస్‌గా కొనసాగుతారు. తెలంగాణకు ఆయన నాలుగో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. ప్రస్తుతం నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్‌కే జోషి సీఎస్ పదవితో పాటు నీటిపారుదల శాఖ పూర్తి అదనపు బాధ్యతలను కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఎస్పీ సింగ్‌కు సీఎస్‌గా కొనసాగింపు ఉత్తర్వులు రావని బుధవారం ఉదయం తేలిపోయింది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్‌కే జోషి నియామకానికి నిర్ణయం తీసుకున్నారు. తనను సీఎస్‌గా ఎంపిక చేయడంతో జోషి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ సింగ్ అదనపు బాధ్యతలతో నిర్వహించిన భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) పదవిని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీకి అదనపు బాధ్యతలపై అప్పగించారు. సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు గ్రామీణ నీటిసరఫరా శాఖ (మిషన్ భగీరథ)ను పూర్తి అదనపు బాధ్యతలపై అప్పగించారు.

ఎస్‌కే జోషి నేపథ్యం

జననం: 1959 డిసెంబర్ 20, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీలో

తల్లిదండ్రులు: శంకర్‌లాల్, శ్యామాజోషి. తండ్రి బ్యాంకు ఉద్యోగి. తల్లి గృహిణి.

కుటుంబం: భార్య అనురాధా జోషి ఎల్ఎల్‌బీ చదివారు. ఆమె గృహిణి. కుమార్తె రియాజోషి ప్రస్తుతం ఐఆర్ఎస్ అధికారిణి.

విద్యాభ్యాసం: అయిదో తరగతి వరకు విష్ణుబాల సదన్‌లో. 6 నుంచి 12వ తరగతి వరకు బరేలీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగింది. అప్పట్లో బరేలీలో తృతీయ భాషగా తెలుగు ఉండడంతో 6 నుంచి 8 తరగతుల వరకు తెలుగును తృతీయ భాషగా అభ్యసించారు.

1977 నుంచి 81 వరకు రూర్కీ ఐఐటీలో బీటెక్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, తర్వాత దిల్లీ ఐఐటీలో ఎంటెక్ కమ్యూనికేషన్ పూర్తి చేశారు.

సివిల్స్ రాసి మొదట ఇండియన్ రైల్వే సర్వీస్‌కు ఎంపికయ్యారు. అందులో 8 నెలలు పనిచేశారు.

1984లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

ఉద్యోగ ప్రస్థానం

నెల్లూరులో సహాయ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్.

తర్వాత తెనాలి, వికారాబాద్‌ల్లో ఉప కలెక్టర్‌గా పనిచేశారు.

కృష్ణా జిల్లాలో జేసీగా, కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

1991- 94, 2001- 2006 వరకు రెండు దఫాలు కేంద్ర పర్యావరణ శాఖలో పనిచేశారు.

కేంద్ర విద్యుత్ మంత్రికి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. వ్యవసాయ శాఖలో విధులు నిర్వహించారు.

2007లో మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. ఐటీ, నీటిపారుదల శాఖల్లో పని చేశారు.

తెలంగాణ ఆవిర్భావ సమయంలో పురపాలక శాఖలో ఉన్నారు. వైద్యఆరోగ్యం, స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖలోనూ విధులు నిర్వహించారు.

2015 నుంచి భారీ నీటిపారుదల శాఖలో పనిచేస్తున్నారు. గతేడాది ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు.

2010లో తెరి స్కూల్ నుంచి పీహెచ్‌డీ సాధించారు.

జోషికి అభినందనలు

ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్‌కే జోషిని పాత సీఎస్ ఎస్పీ సింగ్‌తో పాటు పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు అభినందించారు. ఆయన పనిచేస్తున్న నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టీఆర్‌టీ షెడ్యూలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. మొత్తం 8792 పోస్టులకుగాను 277574 దరఖాస్తులు వచ్చాయి.

విభాగాలవారీగా దరఖాస్తులు..

స్కూల్ అసిస్టెంట్:	145158
ఎస్జీటీ :	89149
లాంగ్వేజీ పండిట్లు:	24219
స్కూల్‌అసిస్టెంట్(పీఈ)	2177
పీఈటీ	16871
మొత్తం	277574

తేదీ	సమయం	పోస్టు పేరు	సబ్జెక్టు	మీడియం	పరీక్షవిధానం
ఫిబ్రవరి 24	ఉదయం	భాషాపండితులు	తెలుగు	--	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 24	మధ్యాహ్నం	స్కూల్‌అసిస్టెంట్	తెలుగు	--	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 25	ఉదయం	ఎస్జీటీ	--	తెలుగు	ఓఎంఆర్
ఫిబ్రవరి 25	మధ్యాహ్నం	ఎస్జీటీ	--	ఇంగ్లిష్	ఓఎంఆర్
ఫిబ్రవరి 26	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	ఇంగ్లిష్	--	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 26	మధ్యాహ్నం	స్కూల్‌అసిస్టెంట్	గణితం, సోషల్	ఇంగ్లిష్	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 27	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	ఫిజికల్‌సైన్స్	తె/ఉ/హి/మ/త	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 27	మధ్యాహ్నం	భాషాపండితులు	ఉర్దూ,మరాఠా,హిందీ	--	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 28	ఉదయం	పీఈటీ	--	తె/ఉ/మ/క/హి	కంప్యూటర్ ఆధారిత
ఫిబ్రవరి 28	మధ్యాహ్నం	స్కూల్‌అసిస్టెంట్	హి/క/త/ఉ	--	కంప్యూటర్ ఆధారిత
మార్చి 2	ఉదయం	ఎస్జీటీ	--	బె/హి/క/మ/ఉ/త	కంప్యూటర్ ఆధారిత
మార్చి 2	మధ్యాహ్నం	ఎస్ఏ (పీఈ)	--	తెలుగు	కంప్యూటర్ ఆధారిత
మార్చి 3	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	బయోలాజికల్‌సైన్స్	ఉ/మ/క	కంప్యూటర్ ఆధారిత
మార్చి 3	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	మేథమెటిక్స్	ఉ/క/మ/హి/త	కంప్యూటర్ ఆధారిత
మార్చి 3	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	సోషల్‌స్టడీస్	మ/ఉ/హి/త	కంప్యూటర్ ఆధారిత
మార్చి 3	మధ్యాహ్నం	స్కూల్‌అసిస్టెంట్	ఫిజికల్ సైన్స్	ఇంగ్లిష్	కంప్యూటర్ ఆధారిత
మార్చి 4	ఉదయం	స్కూల్‌అసిస్టెంట్	బయోసైన్స్,గణితం,సోషల్	తెలుగు	ఓఎంఆర్
మార్చి 4	మధ్యాహ్నం	పీఈటీ	--	ఇంగ్లిష్	కంప్యూటర్ ఆధారిత

తె: తెలుగు, ఉ: ఉర్దూ, హి: హిందీ, మ: మరాఠీ, త: తమిళం, క:కన్నడ, బె:బెంగాలీ

గురుకుల పోస్టులకు 19 నుంచి ప్రధాన పరీక్షలు

గురుకుల విద్యాలయాల సొసైటీలో వివిధ పోస్టులకు ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు ప్రధాన పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది.

తేదీ	సమయం	పోస్టు
ఫిబ్రవరి 19	మధ్యాహ్నం	జూనియర్ లెక్చరర్
ఫిబ్రవరి 20	ఉదయం	డిగ్రీ లెక్చరర్
ఫిబ్రవరి 20	మధ్యాహ్నం	లైబ్రేరియన్ (డిగ్రీ గురుకులాలు)
ఫిబ్రవరి 21	ఉదయం	గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ (పేపర్-1)
ఫిబ్రవరి 21	మధ్యాహ్నం	గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ (పేపర్-2)
ఫిబ్రవరి 22	ఉదయం	గురుకుల జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ (పేపర్-1)
ఫిబ్రవరి 22	మధ్యాహ్నం	గురుకుల జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ (పేపర్-2)
ఫిబ్రవరి 23	ఉదయం	ఫిజికల్ డైరెక్టర్లు (గురుకుల జూనియర్ కళాశాలలు)
ఫిబ్రవరి 23	మధ్యాహ్నం	ఫిజికల్ డైరెక్టర్లు (గురుకుల డిగ్రీ కళాశాలలు)

సంక్షోభ నివారణ చర్చలు సశేషం

మధ్యాహ్న భోజన సమయంలో కలుసుకున్న సుప్రీం న్యాయమూర్తులు

దిల్లీ: సుప్రీంకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తులు జనవరి 12వ తేదీ నాటి విలేకరుల సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు, తదనంతరం తలెత్తిన సంక్షోభం పరిష్కార దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. అయితే, అవి ఇంకా స్పష్టమైన రూపందాల్చలేదని సమాచారం. బుధవారం మధ్యాహ్న విందు సమయంలోనూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర భేటీ అయ్యారు. జస్టిస్ ఏకే గోయెల్ ఈ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తుల మధ్య కొద్ది సమయంపాటు చర్చ జరిగిందని తెలిసింది. అయితే, వాటి ఫలితం ఏమిటనేది తెలియరాలేదు. తమ అసంతృప్తిని బహిరంగంగా వెల్లడించిన నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తుల్లో జస్టిస్ జాస్తి చలమేశ్వర్ బుధవారం సెలవులో ఉండటంతో భేటీలో పాల్గొనలేదు. మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ మాత్రం హాజరయ్యారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, న్యాయం చేస్తామని ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీష్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఎస్సీ గురుకులాల సంక్షేమ సిబ్బంది కాలమానినిని మంత్రి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంక్షేమ సిబ్బంది సంఘం అధ్యక్షుడు కొల్లు వెంకటర్‌రెడ్డి వారి సమస్యలను ఆయనకు వివరించారు.

ఆకాంక్షలా.. ఆర్థిక క్రమశిక్షణా?

(మొదటి పేజీ తరువాయి)

గుజరాత్ ఎన్నికల్లో భాజాపాకు గ్రామీణ ఓట్లలో గండి పడిన నేపథ్యంలో వ్యవసాయ రంగానికి జైట్లీ ప్రోత్సాహకాలను ప్రకటించవచ్చు.

భాజపాకు సంప్రదాయ మద్దతుదారులుగా ఉన్న చిన్న వ్యాపారస్తులకు వస్తుసేవల పన్ను, పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగిన ఇబ్బంది నుంచి ఉపశమనం కలిగించడానికి కొన్ని వరాలు ప్రకటించవచ్చు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిధిని పెంచడం ద్వారా సామాన్యులకు కూడా కొంత ఉపశమనం కలిగించవచ్చని భావిస్తున్నారు.

ఆర్థిక వృద్ధి నాలుగేళ్ల కనిష్ఠానికి చేరిన నేపథ్యంలో వృద్ధికి ఊపునివ్వడానికి జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేల ఆధునికీకరణ వంటి మౌలికసదుపాయాలకు వ్యయాన్ని పెంచవచ్చు. అయితే వీటన్నింటినీ కూడా బడ్జెట్ లోటునుతగ్గించాలనే లక్ష్యానికి కట్టుబడుతూనే చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును స్థూల జాతీయోత్పత్తిలో 3.2శాతానికి పరిమితం చేయాలని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 3శాతానికి పరిమితం చేయాలని గతంలో జైట్లీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రజాకర్షక బడ్జెట్ ఉండదని ప్రధాని మోదీ ఇప్పటికే సంకేతాలిచ్చారు.

స్టాక్ పెట్టుబడులకు సంబంధించి మూల ధన లబ్ధిపై ఇస్తున్న పన్ను రాయితీని తొలగించవచ్చని ప్రచారం జరుగుతోంది. కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామని 2015లో తాను ఇచ్చిన హామీపై జైట్లీ ముందడుగు వేస్తారా అన్నది కూడా చూడాలి.

కొని రంగాల్లో ఎగుమతులు పెంచడానికి కొన్ని ప్రోత్సాహకాలను ప్రకటించవచ్చు. అంకుర సంస్థల కోసం కొన్ని వరాలుండవచ్చు. వ్యాపారాపేక్షతను ప్రోత్సహించే ప్రకటనలూ ఉండవచ్చు.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెరుగుదల జైట్లీకి ఇబ్బందిగా పరిణమించే అంశం. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరగవచ్చు. కరెంటు ఖాతా లోటు కూడా పెరగవచ్చు. ఈ సమస్య పరిష్కారానికి ఏం చేస్తారో వేచి చూడాలి.

బ్రిటిష్ హయాం నుంచి ఫిబ్రవరి చివరిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయానికి గత ఏడాది స్వస్తి పలికి ఫిబ్రవరి 1నే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రైల్వేలకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయాన్నీ రద్దు చేసి సాధారణ బడ్జెట్‌లో కలిపేశారు.

2019 సాధారణ ఎన్నికలకు ముందు భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వ అత్యవసర వ్యయం కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయం. ఎన్నికలయిన తర్వాత కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం కూడా విశేషం. ఎక్సైజ్ సుంకం, సేవా పన్నులు వస్తు, సేవల పన్నులో కలిసిపోయినందున ఈ బడ్జెట్‌లోని వర్గీకరణల్లో మార్పులుంటాయి. వస్తు, సేవల పన్ను ద్వారా సమకూరే ఆదాయాలకు సంబంధించి కొత్త వర్గీకరణలను వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉద్దేశించిన బడ్జెట్‌లో ప్రస్తావిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండు జతల వర్గీకరణలుండొచ్చు- వస్తు, సేవలపన్ను అమల్లోకి రాకముందు అంటే ఏప్రిల్-జూన్ వరకు ఎక్సైజ్, కస్టమ్స్, సేవా పన్ను వర్గీకరణలుంటాయి. జులై-మార్చి వరకు వస్తుసేవల పన్ను, కస్టమ్స్ సుంకం కింద వర్గీకరణలుంటాయి.

కేంద్ర బడ్జెట్‌పై కోటి ఆశలు

రూ.34 వేల కోట్లకు తెలంగాణ ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు తాజా బడ్జెట్‌లో కేంద్రం బాసటగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. గురువారం కేంద్రం బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ డిమాండ్లను కేంద్రం ముందు ఉంచింది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో భేటీ సందర్భంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రభుత్వం తరపున వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల నేపథ్యంలో రాష్ట్రానికి రూ.34 వేల కోట్లు సాయం అందించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రత్యేక కేటాయింపులు చేయాలన్నారు. ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతుండటమే కాకుండా పూర్తిగా ఉపరితల జలాల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని పేర్కొంటూ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కోరింది. నీతిఆయోగ్ కూడా మిషన్ భగీరథకు రూ.19 వేల కోట్ల నిధులివ్వాలని సిఫారసు చేయగా ఎంతో కొంత తోడ్పాటు ఉంటుందని తెలంగాణ సర్కారు భావిస్తోంది. చిన్న నీటివనరుల సంరక్షణలో భాగంగా చెరువుల పునరుద్ధరణకు తాము అమలు చేస్తున్న మిషన్ కాకతీయకు రూ.5000 కోట్లు ఇవ్వాలని తెలంగాణ కోరింది. రూ.88 వేల కోట్ల వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్ల సాయం అడిగింది.

గ్రహం అనుగ్రహం

1-2-2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ **ఉత్తరాయణం**
శిశిర రుతువు; మాఘ మాసం; **బహుళ** పక్షం
పాడ్యమి: సా. 5-44 తదుపరి విదియ
ఆశ్లేష నక్షత్రం: సా. 5-12 తదుపరి మఖ
అమృత ఘడియలు: మ. 3-41 నుంచి 5-12 వరకు
వర్జ్యం: ఉ. 6-39 నుంచి 8-09 వరకు
తిరిగి తె. 4-37 నుంచి 6-08 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-20 నుంచి 11-05 వరకు
తిరిగి మ. 2-50 నుంచి 3-35 వరకు
రాహుకాలం: మ 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; **సూర్యాస్తమయం:** సా.5-50

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.7	33.0
మెదక్	8.5	33.2
హైదరాబాద్	11.8	32.1
రామగుండం	12.0	32.8
హన్మకొండ	13.0	32.0
కరీంనగర్	13.0	32.0
నిజామాబాద్	14.0	31.0
మహబూబ్‌నగర్	15.0	34.4
ఖమ్మం	19.0	31.0
సూర్యాపేట	20.0	34.0

హోంగార్డులకు వరాలు

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతుంది.

ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులకు కానిస్టేబుళ్ల మాదిరిగానే 30 శాతం అదనంగా చెల్లిస్తారు.

యూనిఫాం అలవెన్సు కూడా కానిస్టేబుళ్లతో సమానంగా ఇస్తారు.

మహిళా హోంగార్డులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు. పురుష హోంగార్డులకు 15 రోజుల పితృత్వ (పెటర్నిటీ) సెలవు. ఇద్దరు పిల్లల వరకే ఇది వర్తిస్తుంది.

ప్రధానమైన సందర్భాల్లో బందోబస్తు విధుల్లో పాల్గొనే హోంగార్డులకు కానిస్టేబుళ్ల మాదిరిగానే కరవు భత్యం చెల్లింపు.

పోలీసు ఆసుపత్రుల్లో హోంగార్డులు కూడా ఆరోగ్య సేవలు, మందులు పొందవచ్చు.

సర్వీసులో ఉండగానే హోంగార్డు మరణిస్తే అంత్యక్రియల కోసం ఇచ్చే తక్షణ సాయం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు.

హోంగార్డులు, వారి కుటుంబసభ్యులకు జీవిత బీమా సదుపాయంతోపాటు రెండు పడకగదుల ఇళ్లు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం అంగీకరించింది. వీటికి సంబంధించి అనుబంధ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వేతనాల పెంపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ ఉత్తర్వులివ్వడంపై హోంగార్డులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ హోంగార్డుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, నేతలు దయానంద్, అశోక్, పెద్ద సంఖ్యలో హోంగార్డులు పాల్గొన్నారు. హోంగార్డులకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా సౌకర్యాలు కల్పించిన కేసీఆర్‌కు వారంతా రుణపడి ఉంటారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వేతనం పెంపు, ఇతరత్రా సదుపాయాల కల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డిలకు సంఘం అధ్యక్షులు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభావంతులకే ప్రవేశం

వాషింగ్టన్

అమెరికాలో ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థను తీసుకురావాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ దిశగా వలస సంస్కరణల చట్టం తీసుకురావడానికి రెండు పార్టీలూ మద్దతు పలకాలని, రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ట్రంప్ తొలిసారి బుధవారం కాంగ్రెస్ ఉభయసభలను ఉద్దేశించి (స్టేట్ ఆఫ్ ది యూనియన్ అడ్రెస్) ప్రసంగించారు. తనపై ఉన్న ఏకపక్ష ముద్రను ఈ ప్రసంగంలో పక్కన పెట్టడానికి ప్రయత్నించారు. అమెరికన్ల ప్రయోజనాల కోసం తనతో కలిసి పని చేయాలని డెమొక్రాట్లకు పిలుపునిచ్చారు. వలససంస్కరణలకు నాలుగు ప్రధానాంశాలను ఆయన ప్రతిపాదించారు. 1)తల్లిదండ్రుల వెంట చిన్నప్పుడే చట్టబద్ధ పత్రాలేమీ లేకుండా అమెరికాలోకి ప్రవేశించిన 18లక్షల మంది డ్రీమర్లకు పౌరసత్వం కల్పించేందుకు మార్గం సుగమం చేయడం, 2)సరిహద్దు భద్రత (మెక్సికో సరిహద్దులో గోడ కట్టడం ఇందులో ఒకటి), 3)వీసా లాటరీ కార్యక్రమానికి ముగింపు పలకడం, 4)కుటుంబ ఆధారిత వలసలను పరిమితం చేయడం. "వర్ణం, మతం, నేపథ్యం ఏదైనా మన పౌరులనందరినీ రక్షించడానికి డెమొక్రాట్లు, రిపబ్లికన్లు- రెండు పార్టీల సభ్యులతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నా. మన విభేదాలన్నింటిని పక్కనపెట్టి మనల్ని ఎన్నుకున్న ప్రజల కోసం కలిసి పని చేద్దాం." అని తన 80 నిమిషాల ప్రసంగంలో ట్రంప్ పిలుపునిచ్చారు. "ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థవైపు అడుగులు వేయాల్సిన సమయం ఇది. మన దేశాన్ని ప్రేమించే వారు, గౌరవించేవారికి- మన సమాజం కోసం కృషి చేసేవారికి- నైపుణ్యవంతులకు.. ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థ ప్రవేశం కల్పిస్తుంది." అని అన్నారు. డ్రీమర్లకు పౌరసత్వం కల్పించే మార్గాన్ని ప్రతిపాదిస్తూ "మా ప్రణాళిక ప్రకారం.. తగిన విద్య, ఉద్యోగ అర్హతలు ఉన్నవారు, నైతిక గుణ సంపన్నులు అమెరికా పూర్తిస్థాయి పౌరులవుతారు." అని చెప్పారు. రెండో ప్రతిపాదన అయిన సరిహద్దు భద్రత గురించి మాట్లాడుతూ అమెరికాలోకి అడుగుపెట్టడానికి నేరగాళ్లు, ఉగ్రవాదులు ఉపయోగించుకున్న లొసుగులను తమ ప్రణాళిక రూపుమాపుతుందని చెప్పారు. గొలుసు కట్టు వలసల నియంత్రణ ప్రతిపాదన గురించి మాట్లాడుతూ "ఉద్యోగుల జీవిత భాగస్వాములు, వారి మైనర్ పిల్లలకే వీసా స్పాన్సర్‌షిప్‌ను పరిమితం చేస్తాం. ఈ ముఖ్యమైన సంస్కరణ మన ఆర్థిక వ్యవస్థ కోసం మాత్రమే కాదు.. మన భద్రతకు, మన భవిష్యత్తుకు అవసరం." అని చెప్పారు. ఒక వలసదారుడు ఎంతో మంది దూరపు బంధువులను కూడా అమెరికాకు తీసుకు రావడానికి ప్రస్తుత విధానం వీలు కల్పిస్తోందని, దీనికి ముగింపు పలకాలని అన్నారు.



అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ట్రంప్

గొలుసుకట్టు వలసలను నియంత్రించడం ద్వారా వలసలు వచ్చే వారిని సంఖ్యను తగ్గించడానికి తన ప్రణాళికలను ట్రంప్ ప్రస్తావించినట్లు డెమొక్రాట్ సభ్యులు నిరసన ధ్వనులు చేశారు. పలువురు డెమొక్రాట్ సభ్యులు తమతో పాటు అతిథులుగా డ్రీమర్లను తీసుకొచ్చారు. ప్రతిభ ఆధారిత వలసవ్యవస్థతో, వీసా లాటరీ వ్యవస్థ రద్దుతో భారత్ వంటి దేశాలకు చెందిన టెకీలకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. తన యంత్రాంగం సురక్షిత, బలమైన, గర్వకారణమైన అమెరికాను నిర్మిస్తోందని ట్రంప్ అన్నారు. "ఇది కొత్త అమెరికా ఉద్యమం." అని చెప్పారు. అమెరికా ప్రయోజనాలను, ఆర్థిక వ్యవస్థను, విలువలను చైనా, రష్యా వంటి ప్రత్యర్థి దేశాలను సవాల్ చేస్తున్నాయని ట్రంప్ తన ప్రసంగంలో ఆరోపించారు. "ప్రపంచ వ్యాప్తంగా మనం రుజువర్తన ఏ మాత్రం లేని అధికార వ్యవస్థలను, ఉగ్రవాద సంస్థలను, మన ప్రయోజనాలు, మన ఆర్థికవ్యవస్థ, మన విలువలను సవాల్ చేస్తున్న చైనా, రష్యా వంటి ప్రత్యర్థులను ఎదుర్కొంటున్నాం." అని అన్నారు. అమెరికా తన అణ్వాయుధాలను ఆధునికీకరించాలని, పునఃనిర్మించాలని పిలుపునిచ్చారు. తాను వాటిని వాడకూడదని ఆకాంక్షించారు. అయితే ఎటువంటి దాడినైనా నిలువరించేంత బలంగా, శక్తిమంతంగా అమెరికా రక్షణ వ్యవస్థను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఉత్తరకొరియా అణ్వాయుధాలను సమకూర్చుకోవడంలో కనబరుస్తున్న దూకుడును ప్రస్తావిస్తూ అమెరికా నగరాలకు ముప్పు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అమెరికాను ప్రమాదంలోకి నెట్టేలా గత ప్రభుత్వాలు చేసిన తప్పులను తాను పునరావృత్తం చేయనని స్పష్టం చేశారు.

ఈ భూగోళంపై ఐసిస్ ఉగ్రవాదం లేకుండా భాగస్వామపక్షాలతో కలిసి తుదముట్టిస్తానని గత ఏడాది తాను ప్రతిన బూనానని, ఇరాక్, సిరియాలో ఐసిస్ చెర నుంచి దాదాపు 100 శాతం ప్రాంతాన్ని విముక్తం చేశామని ఇప్పుడు ఏడాది తర్వాత గర్వంగా చెబుతున్నానని అన్నారు. అయితే ఇంకా చేయాల్సింది చాలా ఉందని చెప్పారు. ఐసిస్ పూర్తిగా అపజయం పాలయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్ పైపైకి దూసుకెళ్లడం, నిరుద్యోగిత తగ్గడం వంటి వాటిని ప్రస్తావిస్తూ తన యంత్రాంగం సాధించిన ఆర్థిక విజయాలుగా ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య పన్నును 35శాతం నుంచి 21శాతానికి తగ్గించిన సంగతిని గుర్తు చేశారు. ఫలితంగా అమెరికా సంస్థలు ప్రపంచంలో ఏ సంస్థతో అయినా పోటీ పడగలవని, విజయం సాధించగలవని చెప్పారు. ట్రంప్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా తిలకించడానికి ఆయన సతీమణి మెలానియా హాజరయ్యారు.

ట్రంప్ ప్రసంగానికి హాజరైన సునయన

వాషింగ్టన్: గతేడాది కేన్సస్ ఓలేథ్‌లో జాతివిద్వేషానికి బలైన తెలుగు ఇంజినీరు శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన దుమాల బుధవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగానికి హాజరయ్యారు. కాంగ్రెస్ సభ్యుడు కెవిన్ యోడర్ ఆమెను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. తొలుత ఆమె స్పీకరు పాల్‌రేయన్, పలువురు కాంగ్రెస్ సభ్యులను కలుసుకున్నారు.

బడ్జెట్ భేటీల్లో విపక్ష వ్యూహం ఖరారు నేడు

- సోనియా అధ్యక్షతన సమావేశం
- 17 పార్టీల నేతలు హాజరయ్యే అవకాశం

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఉమ్మడిగా అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు 17 ప్రతిపక్ష పార్టీల నేతలు గురువారం భేటీ కానున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, యూపీఏ ఛైర్‌పర్సన్ అయిన సోనియాగాంధీ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారని సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత సాయంత్రం పార్లమెంటు గ్రంథాలయ భవనంలో వీరు భేటీ అయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో విపక్ష పార్టీల్లో కనిపించిన ఐక్యతను బడ్జెట్ సమావేశాల్లోనూ కొనసాగించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఆయా పార్టీల నేతలను ఆహ్వానించటంలో కీలకపాత్ర వహించారు. ముమ్మారు తలాక్ బిల్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదం, ఉత్తర్‌ప్రదేశ్‌లో అల్లర్లు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, ఎన్సీపీ అధినేత పవార్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, ఆర్ఎస్పీ, ఐయూఎంల్, కేరళ కాంగ్రెస్ నేతలతో పాటు జేడీ(యు) తిరుగుబాటు నేతలు శరద్ యాదవ్, అలీ అన్వర్ అన్సారీ తదితరులు విచ్చేయనున్నారు. టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ తాను భేటీకి రాలేనని, తమ పార్టీ నేతలను పంపిస్తానని తెలిపారు. మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీ(ఎస్) నేతల హాజరుపై ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో బలమున్న జేడీ(ఎస్) ప్రతినిధులు సమావేశానికి వస్తే...ఆ రెండు పార్టీల ఎన్నికల పొత్తుపై సంకేతాలు వెలువడే అవకాశం ఉంది.

శాశ్వత నివాసం కల్పనలో యూకే తాత్సారం

- వలస వెళ్లిన నిపుణుల ఆందోళన

లండన్: యునైటెడ్ కింగ్‌డంలో శాశ్వత నివాసం కల్పించే విషయమై ప్రభుత్వం రూపొందించిన వీసా నిబంధనలు అన్యాయంగా, అమానవీయంగా ఉన్నాయని ఆరోపిస్తూ వివిధ రంగాల నిపుణులు ఆందోళనకు దిగారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఏకమయిన వీరంతా లండన్‌లోని డౌనింగ్ స్ట్రీట్ (ప్రధాని నివసించే ప్రాంతం) వద్ద నిరసన ప్రదర్శన చేశారు. హోంశాఖపై న్యాయపోరాటానికి 25వేల పౌండ్లను విరాళాలుగా సేకరించారు. అత్యంత నైపుణ్యంగల వలసదారులు పేరిట దాదాపు 600 మంది వైద్యులు, ఇంజినీర్లు, ఐ.టీ.ఉద్యోగులు, అధ్యాపకులు సంఘంగా ఏర్పడ్డారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నారు. నేరగాళ్లు, పన్ను ఎగవేతదార్లకు ఉద్దేశించిన నిబంధనలను తమకు వర్తింపజేసి శాశ్వత నివాసం ఇవ్వడానికి నిరాకరిస్తోందని విమర్శిస్తున్నారు. ఒకటో శ్రేణి (జనరల్) వీసా ఆధారంగా వచ్చిన వృత్తి నిపుణులు అయిదేళ్లపాటు పనిచేస్తే వారు శాశ్వత నివాసం కోసం ఉద్దేశించిన (లీవ్ టు రిమైన్-ఐఎల్ఆర్) దరఖాస్తులు సమర్పించడానికి అర్హత పొందుతారు. భారత ఐ.టి. రంగ నిపుణులకయితే 2010 నుంచే జనరల్ వీసాలు ఇవ్వడం నిలిపివేసింది. మిగిలినవారికీ శాశ్వత నివాసం ఇవ్వడంలో తాత్సారం చేస్తోంది. పన్ను చెల్లింపు రిటర్నుల్లో ఉన్న చిన్న చిన్న లోపాలను ఇందుకు కారణాలుగా చూపుతోంది. ఆ లోపాలను సవరిస్తూ మళ్లీ పన్ను చెల్లించామని, అయినా దానిని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆదితి భరద్వాజ్ తెలిపారు. మాతృదేశాలతో తమకు సంబంధాలు తెగిపోయాయని, అయినా తమ దరఖాస్తులు పరిష్కరించడంలో ఆలస్యం జరుగుతోందని పలువురు ఆరోపించారు. ప్రథమ శ్రేణి వీసా దరఖాస్తుల పరిశీలన సంక్లిష్టమైనది, వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హోంశాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. వలస, పన్ను విధానాలు దుర్వినియోగంకాకూడదన్న ఉద్దేశంతోనే అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వివరించారు.



బుధవారం ముంబయిలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెట్టిన జలాంతర్గామి కరంజ్

నూతన జలాంతర్గామి 'కరంజ్' ఆవిష్కరణ

ముంబయి: నూతన జలాంతర్గామి 'కరంజ్'ను నౌకాదళాధిపతి అడ్మిరల్ సునీల్ లాంబా సతీమణి రీనా లాంబా బుధవారం ఇక్కడ ప్రారంభించారు. అత్యాధునిక స్కార్పీన్ శ్రేణికి చెందిన మూడో జలాంతర్గామిని మజగావ్ డాక్‌లో నిర్మించారు. ఈ సందర్భంగా అడ్మిరల్ లాంబా మాట్లాడుతూ జలాంతర్గాముల నిర్మాణంలో ఆలస్యం జరుగుతోందని, దీనిపై ఆత్మపరిశీలన జరగాల్సి ఉందని చెప్పారు. సేవలు విరమించిన యుద్ధ విమాన వాహక నౌక 'విరాట్' భవిష్యత్తుపై స్పందిస్తూ దీనిని ప్రదర్శనశాలగా మార్చడానికి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం కోరిందన్నారు.

కాస్‌గంజ్ హత్య ఘటనలో ప్రధాన నిందితుడి అరెస్టు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో ఇటీవల చందన్‌గుప్త అనే యువకుడు హత్యకు గురైన కేసులో ప్రధాన నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితులైన ముగ్గురు సోదరులకు గాను సలీమ్ అనే వ్యక్తి అరెస్టు కాగా.. నసీమ్, వసీమ్‌ల కోసం గాలిస్తున్నట్లు అలీగఢ్ రేంజి ఐజీ సంజీవ్ గుప్త తెలిపారు. చందన్‌పై కాల్పులు జరిపినట్లు నిందితుడు అంగీకరించాడని వెల్లడించారు. కాగా కాస్‌గంజ్‌లో గణతంత్ర దినోత్సవాన చెలరేగిన హింసాత్మక ఘటనలు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీసుకున్న చర్యలపై కేంద్ర హోంశాఖకు యూపీ ప్రభుత్వం నివేదిక సమర్పించింది.

బరువుతగ్గే శస్త్రచికిత్సతో ఆత్మహత్య ముప్పు

- స్వీడన్ అధ్యయనంలో వెల్లడి

స్టాక్‌హోం

మామూలు పద్ధతుల్లో కంటే శస్త్రచికిత్స (బేరియాట్రిక్ సర్జరీ) ద్వారా అధిక బరువును వదిలించుకునేవారిలో ఆత్మహత్యకు పాల్పడే లక్షణాలు ఎక్కువగా ఉంటాయా? అవుననే చెబుతోంది స్వీడన్ నిర్వహించిన ఓ అధ్యయనం..! శస్త్రచికిత్సకు సిద్ధపడేవారి మానసిక ఆరోగ్యంపై ముందుగానే మదింపు చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్న ఈ వివరాలు 'లాన్సెట్ డయాబిటిస్ అండ్ ఎండోక్రైనాలజీ' పత్రికలో ప్రచురితమయ్యాయి. స్వీయ హాని ముప్పు గురించి, దీర్ఘకాలికంగా పాటించాల్సిన జాగ్రత్తల గురించి వీరికి అవగాహన కల్పించాలని ఈ వ్యాసం పేర్కొంది. అదనపు బరువును తగ్గించుకునేందుకు శస్త్రచికిత్స మార్గాన్ని ఎంచుకున్న 2101 మందిని, ఇతరత్రా జీవనశైలి మార్పులను అనుసరించిన 2037 మందిని ఎంచుకుని అధ్యయనం నిర్వహించారు. శస్త్రచికిత్స చేయించుకున్నవారిలో ఆత్మహత్య ముప్పు 78% ఎక్కువగా ఉందని తేల్చారు. ఇతర విధానాల ద్వారా బరువు తగ్గినవారి కంటే వీరు ఆత్మహత్యకు పాల్పడే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువని లెక్కకట్టారు. అధ్యయనానికి ఎంపిక చేసుకున్నవారిలో సగం మందిని కనీసం 18 ఏళ్లపాటు గమనించారు. ఈ పరిశీలనలో తేలిన విషయం పరిశోధకుల్ని నివ్వెరపరిచింది. శస్త్రచికిత్స చేయించుకున్నవారిలో 87 మంది ఆత్మహత్యల ద్వారా గానీ, తమను తాము గాయపరచుకోవడం ద్వారా గానీ చనిపోయినట్లు తేలింది.



సంబంధమేమిటో రుజువు చేయలేకపోయాం...

అధ్యయనంలో రెండో భాగంగా మరింత విస్తృతంగా పరిశీలన చేశారు. దీనిలో శస్త్రచికిత్స ద్వారా బరువు తగ్గిన 20,256 మందిని, జీవనశైలి మార్పులతో నాజూకుగా మారిన 16,162 మందిని అధ్యయనం చేశారు. ఈ రెండు విభాగాల్లోనూ దాదాపు సగం మందిని నాలుగేళ్లపాటు పరిశీలించారు. మాదక ద్రవ్యాలు, మద్యం పుచ్చుకునే అలవాటున్నవారు ప్రాణాలు తీసుకునే అవకాశాలు ఎక్కువని తేలింది. బరువుతగ్గే శస్త్రచికిత్సకు, ఆత్మహత్య లక్షణాలకు నేరుగా ఉన్న సంబంధమేమిటో తాము రుజువు చేయలేకపోయామని అధ్యయనకర్తలు అంగీకరించారు. తక్కువ కోతతో నిర్వహించే 'స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ' శస్త్రచికిత్స చేయించుకున్న వారిలో ఎవరినీ తాము పరిశీలించలేదని కూడా తెలిపారు.

ఇటీవలి కాలంలో ఎక్కువ మంది ఈ తరహా శస్త్రచికిత్సనే చేయించుకుంటున్నందువల్ల ఈ ఫలితాలు వారి పరిస్థితిని ప్రతిబింబించబోవని స్పష్టం చేశారు. 'శస్త్రచికిత్సకు, ఆత్మహత్యకు మధ్య ఉన్న లంకెను సమగ్రంగా పరిశీలించాలి. శస్త్రచికిత్స తర్వాత తగ్గిన బరువు విషయంలో అసంతృప్తి ఈ ఆత్మహత్యలకు ఒక కారణం కావచ్చు. బరువు తగ్గాక వదులుగా కనిపిస్తున్న చర్మం, పోషకాలను స్వీకరించే తీరులో మార్పు, వాడాల్సిన మందులు... ఇలాంటివీ బలవన్మరణాల దిశగా ప్రేరేపించవచ్చు. శస్త్రచికిత్స ద్వారా లభించే ప్రయోజనాలు మాత్రం ఎక్కువే. అధికబరువుకు అత్యంత సమర్థవంతమైన విధానాల్లో అదొకటి' అని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 190 కోట్ల మంది పెద్దవారు అధిక బరువుతో సతమతం అవుతున్నారు.

ఇలా చేస్తే మంచిది...

బరువు తగ్గాలంటే రోజూ అరగంట వ్యాయామంతో పాటు ఏం చేయాలో పరిశోధకులు సూచించారు.

1) చిన్న పరిమాణాల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి. అంటే రోజుకు మూడుసార్లు భోజనం, రెండుసార్లు అల్పాహారం కొద్ది పరిమాణాల్లో తీసుకోవాలి.
2) అనవసరంగా కేలరీలను పెంచే చీజ్, సాస్‌లకు దూరంగా ఉండాలి.
3) తగినంత నీరు తాగాలి. భోజనానికి ముందు ఒక గ్లాసు నీరు తాగితే ఆకలి తగ్గడంతో పాటు కడుపు నిండిన భావన కలుగుతుంది. తక్కువగా తినడానికి వీలుంటుంది.
4) నెమ్మదిగా తినాలి. బాగా నమిలి మింగడం వల్ల అది పూర్తిగా, త్వరగా జీర్ణమవుతుంది. తక్కువ ఆహారమే తీసుకునేందుకు ఈ ప్రక్రియ వీలు కల్పిస్తుంది.
5) పండ్లు, కూరగాయల్ని వీలైనంత ఎక్కువగా ఆహారంలో చేర్చుకోవాలి. దానివల్ల తక్కువ కేలరీలతో ఎక్కువ పోషకాలు అందుతాయి. ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. మధ్యమధ్యలో మరేదీ తినకుండా ఆపుతుంది.

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై వేటు!

- రాష్ట్రపతికి సిఫార్సు చేయనున్న సీజేఐ

దిల్లీ: అలహాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ శ్రీనారాయణ్ శుక్లాపై వేటు వేయడానికి రంగం సిద్ధమవుతోంది. 'దుష్ప్రవర్తన' కారణంగా ఆయన్ని తొలగించాల్సిందిగా సిఫార్సు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర నిర్ణయించారు. తొలగింపునకు వీలుగా త్వరలో ఆయన రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి లేఖలు రాయనున్నట్లు న్యాయస్థాన వర్గాలు బుధవారం వెల్లడించాయి. పదవిలో ఉన్న ఒక హైకోర్టు న్యాయమూర్తిని తొలగించాలంటే సీజేఐ నుంచి అలాంటి లేఖ అవసరమని నిబంధనలు చెబుతున్నాయి. అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు... లోతుగా పరిశీలించి, న్యాయమూర్తి తప్పు చేసినట్లు రుజువైతే ఆయన తొలగింపు నిమిత్తం ఓటింగ్ చేపడతారు. జస్టిస్ శుక్లాను న్యాయపరమైన విధుల నుంచి తొలగిస్తూ జనవరి 23న అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.బి.భోసలే నిర్ణయం తీసుకున్నారు. లఖ్‌నవూలో నిషిద్ధ జాబితాలో ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలలు విద్యార్థుల్ని చేర్చుకునే విషయంలో 1.9.2017న జస్టిస్ శుక్లా ఇచ్చిన ఉత్తర్వులతో వివాదం మొదలయింది. ఆ కళాశాలల్లో 2017-18 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిలిపివేయాలని తాము స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా వాటిని ధిక్కరించేలా ఆయన నిర్ణయం వెలువరించడంపై సుప్రీం కోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 1.9.17న ఆయన ఇచ్చిన ఉత్తర్వులో కొన్ని మార్పుల్ని 4.9.17న చేతిరాతతో ఆయనే చేయడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహించింది. నిబంధనల్ని అతిక్రమించి, "వెళ్లకూడని మార్గం"లో ఆయన వెళ్లారని ఆక్షేపించింది.

యూపీ ఏజీ ఫిర్యాదుతో మొదలైన విచారణ

ఉత్తర్‌ప్రదేశ్ అడ్వకేట్ జనరల్ నుంచి వచ్చిన ఫిర్యాదు సహా రెండు ఫిర్యాదులపై అంతర్గత విచారణ నిమిత్తం మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.కె. అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కె.జైస్వాల్‌లతో త్రిసభ్య సంఘాన్ని సీజేఐ ఇటీవల నియమించారు. జస్టిస్ మిశ్రపై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవనీ, వాటికి తగిన ఆధారాలు ఉన్నాయనీ కమిటీ నివేదిక ఇచ్చింది. "కార్యాలయ హుందాతనాన్ని, విశ్వసనీయతను, గౌరవాన్ని తగ్గించేలా, చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించేలా, న్యాయవ్యవస్థ విలువలకు అగౌరవాన్ని ఆపాదించేలా వ్యవహరించిన ఆయన్ని తొలగించడమే సబబ"ని కమిటీ అభిప్రాయపడింది. న్యాయమూర్తి తప్పు చేసినట్లు నివేదిక రావడంతో సీజేఐ తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. పదవి నుంచి వైదొలగేందుకు, స్వచ్ఛంద పదవీ విరమణను కోరేందుకు వివాదాస్పద న్యాయమూర్తి నిరాకరించడంతో ఆయన్ని అభిశంసించడమే మేలని త్రిసభ్య సంఘం సిఫార్సు చేసింది. తొలిచర్యగా సీజేఐ సూచన మేరకు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మంగళవారం ఆయన్ని న్యాయపరమైన విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం జస్టిస్ మిశ్ర దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. వైద్య కళాశాలల ప్రవేశాల వివాదంలో విశ్రాంత న్యాయమూర్తి ఒకరిని అరెస్టు చేయగా సీనియర్ న్యాయమూర్తుల పేరుతో ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలూ వచ్చాయి. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చేసిన విమర్శల్లోనూ వైద్య కళాశాలల కేసు ప్రస్తావన ఉండడం గమనార్హం.

నెమలితో విమానం ఎక్కబోతే..!



విమానాశ్రయంలో నెమలి

న్యూయార్క్: అమెరికాలో ఓ మహిళ తన పెంపుడు నెమలితో సహా విమానం ఎక్కేందుకు ప్రయత్నించగా యునైటెడ్ ఎయిర్‌లైన్స్ నిరాకరించింది. న్యూజెర్సీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇటీవల ఈ ఘటన చోటుచేసుకుంది. న్యూయార్క్‌కు చెందిన ఛాయాచిత్ర గ్రాహకురాలు, కళాకారిణి వెంటికో లాస్‌ఏంజెలిస్ వెళ్లేందుకు తన పెంపుడుపక్షితో కలిసి రాగా.. ఆరోగ్య, భద్రత ప్రమాణాల కారణంగా దాన్ని అనుమతించలేమని ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది. కాగా తాను నెమలికి టిక్కెట్ కూడా తీసుకున్నానంటూ.. ఆమె విమానం ఎక్కేందుకు విఫలయత్నం చేసింది. అనంతరం సంబంధిత చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో చక్కర్లు కొట్టాయి. కాగా నెమలికి సంబంధించి బరువు, పరిమాణం సహా పలు అంశాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు వైమానిక సంస్థ మహిళా ప్రతినిధితెలిపారు. విమానాశ్రయానికి రావడానికి ముందే నిబంధనలన్నీ చెప్పినట్లు వివరణ ఇచ్చారు.

అఫ్గాన్‌ను కుదిపిన భూకంపం

పాక్, భారత్‌లలోనూ ప్రకంపనలు

కాబూల్/ ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్‌లోని ఉత్తర ప్రాంతాలను బుధవారం మధ్యాహ్నం శక్తిమంతమైన భూకంపం కుదిపేసింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 6.1గా నమోదయింది. అఫ్గాన్-తజికిస్థాన్ సరిహద్దుల్లో హిందూకుష్ పర్వతాలకు చేరువగా జుర్మ్ జిల్లాలో 191 కి.మీ.లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. 2015 అక్టోబరులో ఇదే జిల్లాలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు 380 మంది ప్రాణాలు కోల్పోయారు. కాబూల్‌లో రెండుసార్లు పెను ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలతో వీధుల్లో పరుగులు తీశారు. ఎక్కడా ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ఇటు పాకిస్థాన్, భారతదేశాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. పాక్‌లోని ఇస్లామాబాద్, పెషావర్, లాహోర్‌లలో ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలల్ని వెంటనే ఖాళీ చేయించారు. క్వెట్టా పట్టణంలో ఇల్లు కుప్పకూలి ఒక బాలిక మరణించింది. ఇతర ఘటనల్లో 12 మంది గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తువా తదితర చోట్ల కూడా ప్రకంపనల ప్రభావం కనిపించింది. పెషావర్‌లో పాఠశాల భవనం కూలిపోయింది. దిల్లీలోనూ స్వల్పంగా ప్రకంపనలు నమోదయ్యాయి.

రాహుల్ ఖరీదైన జాకెట్‌పై భాజపా విసుర్లు

బహుమతిగా వచ్చిందన్న కాంగ్రెస్ అధ్యక్షుడు

షిల్లాంగ్‌/దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధరించిన ఖరీదైన జాకెట్‌పై మేఘాలయ భాజపా నేతలు సామాజిక మాధ్యమంలో సంధించిన వాగ్బాణాలు ఆ రెండు పార్టీల నాయకుల మధ్య మాటల వేడిని రగిలించాయి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలకు దూరంగా ఉండే 'సూటు బూటు సర్కార్' అంటూ రాహుల్ తరచూ చేసే ఎత్తిపొడుపులను భాజపా నేతలు తాజాగా కాంగ్రెస్ పార్టీ అధినేతపైనే ఎక్కుపెట్టారు. షిల్లాంగ్‌లో మంగళవారం ఒక కార్యక్రమానికి హాజరైన రాహుల్ ధరించిన జాకెట్ విలువ రూ.63,000 (990 అమెరికా డాలర్లు) అంటూ మేఘాలయ భాజపా నేతలు ట్వీట్ చేశారు. పైగా అది నల్లధనంతో కొనుగోలు చేసిందనీ ఆరోపించారు. డాలర్లలో ధరను తెలియజేసేలా ఓ జాకెట్ చిత్రాన్నీ ఆ ట్వీట్‌తో పోస్టు చేశారు. మేఘాలయలో గత 15ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ సాధించిన పురోగతి ఏమిటో రాహుల్ వివరిస్తే బాగుండేదనే వ్యాఖ్యను దానికి జోడించారు. భాజపా నేతల ట్వీట్‌పై కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి తీవ్రంగా స్పందించారు. రాహుల్‌ని ప్రశ్నించే నైతిక హక్కు భాజపా నేతలకు లేదని మండిపడ్డారు. షిల్లాంగ్‌లోనే ఉన్న రాహుల్...ప్రధాని మోదీపై గతంలో తాను చేసిన 'సూటు-బూటు' విమర్శలను పునరుద్ధరించారు. జాకెట్ వివాదంపై స్పందిస్తూ అది తనకు ఎవరో బహుమతిగా ఇచ్చారని తెలిపారు.

మహిళల సాధికారతకు ఆరెస్సెస్ వ్యతిరేకం: రాహుల్

షిల్లాంగ్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)లో మహిళలకు ప్రాధాన్యమివ్వరని, వారి సాధికారతకు ఆ సంస్థ వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ విమర్శించారు. "ఆరెస్సెస్‌లో నాయకత్వ స్థాయిలో ఉన్న మహిళలపేర్లు ఏవైనా మీకు తెలుసా? ఎవరూ లేరు. మహిళా నాయకత్వం అక్కడ శూన్యం" అని షిల్లాంగ్‌లో సెయింట్ ఎడ్మండ్స్ కళాశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్ పేర్కొన్నారు. "మహాత్మాగాంధీ ఉన్న ఏదైనా ఛాయా చిత్రం చూడండి. ఆయనకు ఇరువైపులా, వెనుక మహిళలు కనిపిస్తారు. అదే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చిత్రం చూడండి. ఒంటరిగా ఉంటారు లేదా చుట్టూ పురుషులే కనిపిస్తారు" అని తెలిపారు.

సుప్రీం న్యాయమూర్తులుగా ఇద్దరి పేర్లకు కేంద్రం విముఖం?

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం ప్రతిపాదించిన పేర్లలో రెండింటిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని సమాచారం. సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసఫ్‌ల పేర్లను అంగీకారం తెలపకుండా జాబితాను కొలీజియంకు తిప్పిపంపినట్టు సమాచారం. ఇందుకుగల కారణాలు తెలియరాలేదు. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతిపాలన విధిస్తూ 2016లో కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పునరుద్ధరిస్తూ జస్టిస్ జోసఫ్ తీర్పు ఇచ్చారు. ఇదిఅప్పట్లో కేంద్రానికి ఇబ్బందికరంగా పరిణమించింది.

అత్యాచారానికి గురైన పసికందు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించండి: సుప్రీం

దిల్లీ: దిల్లీలో 8 నెలల బాలిక అత్యాచారానికి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాలని ఎయిమ్స్‌కు చెందిన ఇద్దరు వైద్యులను బుధవారం ఆదేశించింది. వైద్యులకు తోడుగా వెళ్లాలని దిల్లీ న్యాయ సేవా సంస్థ సభ్యున్ని సూచించింది. ఆ బాలికపై గత ఆదివారం సమీప బంధువైన 28 ఏళ్ల యువకుడు అత్యాచారం చేశాడు. ఆ బాలికకు తీవ్రగాయాలయ్యాయని, మూడు గంటల పాటు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చిందని అలఖ్ అలోక్ శ్రీవాత్సవ అనే న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి ఆయన దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. మద్యం మత్తులో నిందితుడు అత్యాచారం చేశాడని, అతడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో 2 జిల్లాలకే మావోయిస్టుల పరిమితం

ఈనాడు, దిల్లీ: తెలుగురాష్ట్రాల్లో రెండు జిల్లాలకే మావోయిస్టుల ప్రాబల్యం పరిమితమైందని నీతి ఆయోగ్ వెల్లడించింది. దేశంలోని 115 వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై ఇటీవల ప్రధానమంత్రి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, తెలంగాణలో ఖమ్మం జిల్లాలలో మాత్రమే ప్రస్తుతం వారి కార్యకలాపాలు సాగుతున్నట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా 35 జిల్లాలను మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలుగా పేర్కొంది. ఇందులో అత్యధికం ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లలోనే ఉన్నాయి. 2022 నాటికి దీన్ని తుడిచిపెట్టి నవభారతం నిర్మించాలంటే ప్రభుత్వ పథకాల్లో అన్ని వర్గాలకు భాగస్వామ్యం కల్పించడంతోపాటు, సంతృప్తికరస్థాయిలో అమలుచేయాలని సిఫార్సు చేసింది. సంక్షేమ పథకాల్లోని నిబంధనలను సడలించి అమలుచేయాలని పేర్కొంది. అడవులను ఆర్థికమండలాలుగా అభివృద్ధిచేయాలని పేర్కొంది. వెదురు, వనమూలికలు, తేనెలాంటి అటవీ ఉత్పత్తులను గిరిజనులు విక్రయించుకొని సంపాదించుకొనే మార్గాన్ని చూపాలని స్పష్టంచేసింది. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలని పేర్కొంది. ఈ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలను సృష్టించాలని పేర్కొంది. అధిక సంఖ్యలో వైద్యఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రక్షిత నీరు, పీడీఎస్ సౌకర్యం, సామాజిక భద్రత పథకాలను ఈ ప్రాబల్యప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిఫార్సు చేసింది.

భూగర్భ రహదారులను నిర్మించండి

ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్‌కు ఎంపీ నర్సయ్యగౌడ్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: భువనగిరి నియోజకవర్గంలో పలుచోట్ల భూగర్భ రహదారులు (అండర్‌పాస్‌లు) నిర్మించాలని కోరుతూ... జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఛైర్మన్ దీపక్‌కుమార్‌కు తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్ బుధవారమిక్కడ వినతిపత్రం అందజేశారు. వంగపల్లిలో మోటకొండూరు రోడ్, ఆలేరులో బైపాస్ ఎంట్రీ, జేడికల్ రోడ్డు, జనగాంలో జిల్లా కేంద్రం బైపాస్ ఎంట్రీ, ఎగ్జిట్‌ల వద్ద అండర్‌పాస్‌లను నిర్మించాలని కోరారు. ఆయా చోట్ల అండర్‌పాస్‌లు లేక వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఎంపీ ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఓబీసీ కులాలకు న్యాయం చేయాలి

జస్టిస్ రోహిణికి జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల ఓబీసీ జాబితాల్లో ఉన్న అన్ని కులాలకు న్యాయం చేయాలని ఓబీసీ వర్గీకరణ ఛైర్‌పర్సన్ జస్టిస్ రోహిణికి జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. బుధవారమిక్కడ సంఘం ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు ఆధ్వర్యాన ఏపీ, తెలంగాణ నేతలు ఆమెకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటానని జస్టిస్ రోహిణి వారికి హామీ ఇచ్చారు.

ఈనాడు

ఎంపీలకూ సహేతుక జీతాలు

'ఏడో వేతన సవరణ సంఘం సూచనల అనుసారం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు పెరిగిన జీతభత్యాలకు అనుగుణంగా ఉన్నత న్యాయమూర్తుల జీతాల పెంపుదల సంగతి ఏమైంది?'- నిరుడు అక్టోబరు చివరి వారంలో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం సంధించిన సూటి ప్రశ్న అది. హైకోర్టులు, సుప్రీం న్యాయమూర్తుల జీతభత్యాలకు సంబంధించి భారత ప్రధాన న్యాయమూర్తి నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీ చేసిన సిఫార్సులను జతచేసి వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీజేఐగా జస్టిస్ టీఎస్ ఠాకూర్ 2016లోనే కేంద్రానికి లేఖ రాశారు. కొద్దిపాటి సవరణలతో జడ్జీల కమిటీ సూచనల్ని నిరుడు మార్చిలోనే మోదీ ప్రభుత్వం ఆమోదించినా, సంబంధిత బిల్లు పార్లమెంటు ముందుకు రావడంలో జాప్యంపై మాన్య న్యాయమూర్తులు సూటిగా స్పందించారు. న్యాయమూర్తుల జీతనాతాల బిల్లు చర్చకు వచ్చినప్పుడు- 'మరి మా సంగతేమి'టంటూ సభాపర్వంలో ఎంపీలు సైతం ఒంటికాలిమీద లేచారు. హోదాపరంగా కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ కంటే పైఎత్తున ఉండే తమకు ఆయనకంటే తక్కువ జీతం అందడం నామోషీ అన్న న్యాయపాలిక, శాసన నిర్మాణ వ్యవస్థలోని పెద్దల అభ్యంతరాల నేపథ్యంలో- ఉన్నత న్యాయమూర్తుల జీతభత్యాల పెంపుదలపై తాజాగా నోటిఫికేషన్ సైతం వెలువడింది. పని ప్రమాణాలు, విధి విహిత హోదాలకు దీటుగా అందరికీ తగు వేతనాతాలు దక్కాలనడంలో భిన్నాభిప్రాయానికి తావెక్కడుంది? కాకపోతే, జన ఖజానా నుంచి జీతభత్యాలు పొందుతున్న వ్యవస్థలన్నీ ప్రజా ప్రయోజనాలకు పట్టం కట్టే పనితీరుతో ఆకట్టుకోవాలనే ఆకాంక్షలు వట్టిపోరాదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్నత న్యాయస్థానాల్లో 1,079 న్యాయమూర్తుల స్థానాలుంటే 682 మాత్రమే భర్తీ అయినట్లు గణాంకాలు చాటుతున్నాయి. న్యాయమూర్తుల నియామక ప్రక్రియకు మూలాధారమైన 'మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్'పై దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రతిష్టంభన- పెండింగ్ కేసుల కొండల్ని మరింతగా పెంచుతున్నదనే చెప్పాలి. గౌరవప్రద జీతాల కోసం పార్లమెంటు సభ్యులు చేస్తున్న డిమాండ్లలోని హేతుబద్ధతనూ గుర్తించి తదనుగుణ చర్యలు చేపట్టడంతోపాటు వారికి జవాబుదారీతనాన్నీ మప్పాలి!

రాజకీయాలు ప్రజాహిత రంగంగా మన్ననలందుకొన్న స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే, చట్టసభల సభ్యులకు సరైన జీతాలు ఉండాలని మహాత్మాగాంధీ సూచించారు. అవి ఎంత ఉండాలన్నదానిపై దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి వాదోపవాదాలు! ఇండియాలో ఎంపీల జీతం మరీ అన్యాయంగా ఉందని లోక్‌సభాపతిగా పీఏ సంగ్మా గళమెత్తి రెండు దశాబ్దాలైంది. ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యదర్శులకన్నా ఎంపీల హోదా ఎక్కువైనందున వారి జీతంకంటే కనీసం ఒక్క రూపాయి అయినా అధికంగా ఎంపీల వేతనం ఉండాలన్న మెజారిటీ అభిప్రాయానికే 2010లో చరణ్‌దాస్ మహంత్ కమిటీ మొగ్గుచూపింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువుతీరాక యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని కమిటీ- ఎంపీల జీతాల్ని రెట్టింపు చెయ్యాలని, ఇతర భత్యాల్ని గణనీయంగా పెంచాలని 2015లో సూచించింది. వాటిని కేంద్రం అటకెక్కించిన నేపథ్యంలో- హోదాకు తగ్గ జీతం కోసం డిమాండ్లు ముమ్మరిస్తున్నాయి. నియోజకవర్గంలో నాలుగైదు లక్షల మందికి ప్రాతినిధ్యం వహించే ఎంపీల పని పరిస్థితుల దృష్ట్యా వారి జీతనాతాలు గణనీయంగా పెరగాల్సిందే. ఏడాది వ్యవధిలో 543 మంది లోక్‌సభ సభ్యుల జీతాలు, ఖర్చుల కోసం వెచ్చించింది రూ.176 కోట్లు. అంటే నెలకు తలా రెండు లక్షల 70 వేల రూపాయలు లెక్కతేలినట్లు! దేశీయంగా ఎంపీల జీతంతో పోలిస్తే ఇటలీ, బ్రిటన్, అమెరికాల్లో అక్కడి సభ్యులు పొందుతున్నది మరెన్నో రెట్లు! ఆర్థికంగా స్తోమత లేనివారు చట్టసభ సభ్యులుగా బాధ్యతల్ని సజావుగా నిర్వర్తించాలంటే, ఎంపీలందరికీ సహేతుక వేతనాలు అందడం తప్పనిసరి. అదే సమయంలో ప్రజాజీవితంలో ఎంపీల అవినీతి, దుర్వర్తనల్ని ఏ మాత్రం ఉపేక్షించని పటిష్ఠ యంత్రాంగమూ కొలువుతీరాలి!

రాజకీయం అంటే రాక్షసంగా జనానికి కీడు చేసే యంత్రాంగం అన్న దుర్గంధం స్థిరపడేలా మెజారిటీ ఎంపీల పనితీరు దిగజారిందనడంలో సందేహం లేదు. అదే సమయంలో, ఎంపీలంతా పారిశ్రామికవేత్తల్లో, స్థితిమంతులో కాదు; పార్లమెంటు ఇచ్చే జీతమే మాలో చాలామందికి ఆధారం అంటున్న పార్లమెంటరీ కమిటీలోని గళాల్నీ విస్మరించే వీల్లేదు. ఎంపీలు ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ జీతాల్ని పెంచేసుకుంటారన్న విమర్శలకు విరుగుడుగా భాజపా అతిరథుడు అద్వాణీ లోగడ ఒక సూచన చేశారు. ప్రభుత్వ కార్యదర్శి, లోక్‌సభ సెక్రటరీ జనరల్ జీతంతో సమానంగా ఎంపీల జీతభత్యాల్ని నిర్దేశిస్తే గొడవే ఉండదని ఏనాడో సూచించారు. ఎంపీల జీతభత్యాలకు సంబంధించిన చట్టం 1954 జూన్ నుంచి అమలులోకి వచ్చినా క్రమానుగత సవరణలకు వీలుకల్పించే విస్పష్ట విధానంగాని, ప్రత్యేక వ్యవస్థగానీ లేకపోవడంతో ప్రతిసారీ పేచీలు తప్పడంలేదు. మాన్య సభ్యులకు జీతాలు అరకొరగా నిర్ధారించి ఇతరేతర సదుపాయాలు, సౌకర్యాలు దండిగా కల్పించడంతో, అడ్డదారుల్లో వాటిని అమ్మి సొమ్ము చేసుకొనే యావ లావయ్యిందని అనేక శూలశోధనల్లో తేటతెల్లమైంది. ప్రజాపనుల్లో వాటాలు, కాంట్రాక్టుల్లో అవినీతి కోటలు విశ్వరూపం జన సామాన్యాన్ని భీతిల్లజేస్తోంది. నిరుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పరిమాణం 21 లక్షల 46 వేలకోట్ల రూపాయలు. పార్లమెంటు సభ్యులపై వెచ్చించేది రూ.300 కోట్ల లోపు అంటే- అది ఏ మూలకు? ఈ సువిశాల దేశానికి ప్రతినిధులుగా శాసన నిర్మాణ మహాక్రతువును సక్రమంగా నిర్వర్తించడానికి అవసరమైన ఆర్థిక దన్ను ఉండేలా ఎంపీల జీతభత్యాల్ని తక్షణం హేతుబద్ధీకరించాలి. పార్లమెంటులోనూ బయటా ఉన్నత ప్రమాణాలకు వారు కట్టుబడేలా విస్పష్ట ప్రవర్తన నియమావళితో లక్ష్మణ రేఖలూ గీసినప్పుడే శాసన నిర్మాణ వ్యవస్థ గౌరవం ఇనుమడించేది!

అప్పులపై ఇక ముప్పేటదాడి



పెద్దలు మనకు నేర్పిన పాఠం- తలకు మించిన భారం మోయొద్దని, అప్పు చేసి పప్పు కూడు తినొద్దని! వ్యక్తులకే కాదు- కుటుంబం, రాష్ట్రం, దేశానికీ ఈ సూత్రం వర్తిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ఈ క్రమశిక్షణ మరీ అవసరం. ఎలాంటి పంథాలో ప్రయాణిస్తున్నాం, ఏ తరహా విధానాలు అమలు చేస్తున్నామన్న దాని మీదే ఆర్థికంగా ఒక దేశం బలోపేతం కావడం, బలహీనపడటం ఆధారపడి ఉంటుంది. మన దేశానికి సంబంధించి ప్రాథమ్యాల ఎంపికలో జరిగిన తప్పిదాలు శీఘ్ర అభివృద్ధికి విఘాతమయ్యాయి. వివిధ ఆర్థిక, సామాజికాంశాల్లో ఇరుగు పొరుగు దేశాలతో పోలిస్తే భారత్ బాగా వెనకబడి ఉంది. ఇరవై ఒకటో శతాబ్దంలో గణనీయ అభివృద్ధి దిశగా భారత్ ముందడుగు వేస్తుందని, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనాలు వినిపిస్తున్నాయి. ఎంతో సంతోషం కలిగించే మాటలవి. ఆర్థికాభివృద్ధి ప్రాతిపదికన భారత్ వడివడిగానే అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో తప్పటడుగులు వేయరాదు. వృద్ధితోపాటు క్రమశిక్షణ, సమ్మిళిత అభివృద్ధి అవసరం. క్రమశిక్షణతో కూడిన అభివృద్ధి బాటను ఎంచుకుంటే భవిష్యత్తు తరాలకు గట్టి పునాది ఏర్పరచినట్లవుతుంది.

సమ్మిళిత అభివృద్ధే ధ్యేయం

2003లో ఎన్డీయే హయాములో మొదటిసారిగా ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం తీసుకువచ్చారు. ఆ చట్టం అమలులోకి వచ్చి పదిహేనేళ్లు అవుతోంది. ఆర్థిక వ్యవహారాలను ఓ క్రమపద్ధతిలో పారదర్శకంగా నిర్వహించడమే దాని ఉద్దేశం. అప్పులభారం మితిమీరకుండా తగుమోతాదులో ఉంచడం, దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరీకరణ దిశగా కృషి చేయడం ఎఫ్ఆర్‌బీఎం లక్ష్యాలు. అందుకుగాను స్వల్ప, మధ్య, దీర్ఘకాల లక్ష్యాలను నిర్దేశించింది. అందులో భాగంగా ఆర్థిక లోటును తగ్గించుకోవడం, రెవిన్యూ లోటును పూర్తిగా నిర్మూలించడం, స్థూల దేశీయోత్పత్తిలో మొత్తం అప్పులను 60శాతానికి లోబడి ఉండేట్లుగా చర్యలు తీసుకోవాలని నిర్ధారించారు. ఉద్దేశాలు, లక్ష్యాలు ఉన్నతంగానే ఉన్నా; వాటిని చేరుకోవడానికి చేపట్టిన చర్యల్లోనే నిబద్ధత కొరవడింది. చరిత్ర చెబుతోంది. ఉదాహరణకు ఆర్థికలోటును 2008 సంవత్సరానికల్లా మూడు శాతానికి కుదించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అది అమలు కాలేదు. 2014లో ఎన్డీయే తిరిగి అధికారంలోకి రావటం, ఆర్థికమంత్రిగా అరుణ్ జైట్లీ ఆగమనంతో ఆర్థిక లోటును మూడు శాతానికి కుదించాలన్న లక్ష్యంపై సానుకూల వైఖరి వ్యక్తమైంది. ఎఫ్ఆర్‌బీఎం-2003 నాటి చట్టాన్ని సమీక్షించేందుకు ఎన్.కె.సింగ్ అధ్యక్షతన ఓ కమిటీని నియమించారు. ఆ కమిటీ చాలా సుదీర్ఘమైన నివేదిక సమర్పించింది. ఆర్థిక వ్యవస్థను పటిష్ఠంగా తీర్చిదిద్దడంకోసం ఎన్నో సూచనలు చేసింది. '2003 చట్టం' స్థానంలో నూతన చట్టం తీసుకురావడం, ఆర్థిక సమితిని ఏర్పాటు చేయడం, 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటును రెండున్నర శాతానికి కుదించడం, రెవిన్యూ లోటును 0.8 శాతానికి తగ్గించడం, మొత్తం అప్పును స్థూల దేశీయోత్పత్తిలో 60శాతానికి పరిమితం చేయడం (కేంద్రం 38.7 శాతం, రాష్ట్రాలు 20 శాతం), రిజర్వు బ్యాంకు నుంచి సాధ్యమైనంత వరకు అప్పుల స్వీకరణకు అడ్డుకట్టవేయడం, రాష్ట్రాల అప్పులు, లోటుపై ప్రత్యేక దృష్టి సారించడం వంటివి ఎన్.కె.సింగ్ కమిటీ చేసిన సూచనలు.

వాటి ప్రకారం ఆర్థిక లోటు మూడు శాతం లోపు ఉండాలి. అయితే నోట్ల రద్దు చర్యతో ఆర్థిక వృద్ధిరేటు ప్రభావితమైంది. కాబట్టి లక్ష్యాన్ని వాయిదా వేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యం. ఏ మేరకు సాకారమైందన్న విషయంపై ఇవాళ్టి బడ్జెట్ ప్రసంగంలోగానీ స్పష్టత రాదు. నోట్ల రద్దు తరవాత ఆ స్థాయిలో తీసుకువచ్చిన అతిపెద్ద ఆర్థిక సంస్కరణ జీఎస్టీ అమలు! దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన ఆ సంస్కరణ మంచిదే అయినప్పటికీ- తాత్కాలిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. 2017 జులైలో జీఎస్టీ వసూళ్లు రూ.92,283 కోట్లుగా ఉంటే నవంబరునాటికి ఆ మొత్తం రూ.80,808 కోట్లకు పడిపోవడం గమనార్హం. మరోవంక స్థిరాస్తి రంగాన్ని సంస్కరించే క్రమంలో తీసుకొచ్చిన ఆర్ఈఆర్ఈ (రెరా) చట్టమూ కొన్ని తాత్కాలిక ఇబ్బందులకు కారణమైంది. ఇన్ని ఆర్థిక సంస్కరణలను ఏకకాలంలో ఒకేసారి తీసుకురావడం ఒకరకంగా సాహసోపేతమైన చర్యే. దీనివల్ల తొలుత ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసినా చొరవగా ముందుకు వెళ్ళడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. మరోవంక బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరిగిపోయిన నేపథ్యంలో రుణ స్తబ్ధత తొలగించేందుకు అదనపు మూలధనాన్ని సమకూర్చడానికి (రీక్యాపిటలైజేషన్) ప్రభుత్వం రెండు లక్షల 11వేల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించింది. ఆర్థిక క్రమశిక్షణపై ప్రభావం చూపిన పరిణామమిది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల తరవాత రుణాల్లో రాష్ట్రాల వాటా భారీగా పెరిగిపోయింది. అదే సమయంలో ఇటీవల రాష్ట్రాల వ్యయమూ గాడితప్పింది. అంతకుముందు అయిదేళ్లు సగటున రెండున్నర శాతంగా ఉన్న ఆర్థిక లోటు ఈ రెండేళ్లలో మూడు శాతానికిపైగా పెరిగింది. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలకున్న అదనపు వనరుల సమీకరణ పరిమితిని మూడు శాతం నుంచి మూడున్నర శాతానికి అనుమతించిన విషయం తెలిసిందే. రెవిన్యూ మిగులు ఉన్న రాష్ట్రాలకు ఈ వెసులుబాటు కల్పించింది. ఆర్థికలోటు పెరగడానికి ఇదీ ఒక కారణమే. ఇక రాష్ట్రాల వ్యయ వివరాలు పరిశీలిస్తే అంతకుముందు తీసుకున్న అప్పుల వాయిదాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు 21శాతం ఖర్చవుతోంది. విద్యారంగంకోసం 15శాతం వ్యయం చేస్తున్నారు. వాటితోపాటు కొన్ని రాష్ట్రాలు అమలు చేసిన రుణమాఫీ పథకాలు ఆర్థిక లోటుపై ప్రభావం చూపాయి. విద్యుత్తు పంపిణీ సంస్థల రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉదయ్' పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన బాండ్లు



'ఎఫ్ఆర్‌బీఎమ్'కు కట్టుబాటు చాటాలి

సైతం సమస్యకు కారణమవుతున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల పెరుగుదలతోపాటు మిగిలిన వ్యయాలూ సమస్యను రాజేస్తున్నాయి. వీటిన్నింటివల్ల రాష్ట్రాల వ్యయం తడిసిమోపెడవుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రాల సగటు ఆర్థికలోటు 3.4 శాతానికి చేరవచ్చని అంచనా. కొన్ని రాష్ట్రాల అప్పులవాటా (జమ్ము కశ్మీర్, పశ్చిమ్ బంగ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, గోవా) చూస్తే గుండె గుభేల్‌మంటుంది.

ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలే దేశాభివృద్ధికి సిసలైన ప్రాతిపదిక. ఆ లెక్కన భారత్ పరిస్థితి ఏ మాత్రం బాగాలేదనే చెప్పాలి. తలసరి ఆదాయం ప్రకారం ప్రపంచంలో భారత్ 124వ స్థానంలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అధ్యయనం వెల్లడిస్తోంది. ఈ విషయంలో 'బ్రిక్స్' దేశాల్లో భారత్ చిట్టచివర ఉంది. 'సార్క్' దేశాల్లోనూ మన స్థానం అంతంతమాత్రమే. తలసరి ఆదాయం ప్రాతిపదికన భారత్‌కన్నా రెట్టింపు మొత్తంతో శ్రీలంక (12,262 డాలర్లతో) తొలి స్థానంలో ఉంది. రాష్ట్రాల అప్పుల తీరుతెన్నుల మధ్య విపరీతమైన అంతరాలు కనిపిస్తున్నాయి. దేశంలో తలసరి ఆదాయం 1,12,432 రూపాయలు. అత్యధిక జనాభా ఉన్న ఉత్తర్ ప్రదేశ్‌లో అది కేవలం రూ.72,300, బిహార్‌లో రూ.63,200 మాత్రమే. తెలంగాణ రూ.1,58,360, ఆంధ్రప్రదేశ్ రూ.1,37,000గా ఉంది. రాష్ట్రాల స్థూలోత్పత్తిలో మూడింట ఒక వంతు దక్షిణాది రాష్ట్రాల నుంచే వస్తుంది. తూర్పు, ఈశాన్య భారతం మొత్తం కలిపినా ఇది 15శాతమైనా లేదు. ఈ అసమానతల నిర్మూలనపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. అక్షరాస్యత, శిశు మరణాల నివారణ; తల్లి, పిల్లల పోషక పదార్థాలు; సగటు జీవన వయస్సు, పారిశుద్ధ్యం, పేదరిక నిర్మూలన, లింగ విచక్షణ వంటి సామాజిక అంశాల్లోనూ ఉపఖండంలో భారత్ వెనకబాటు ప్రస్ఫుటమవుతోంది. దేశంలోనూ అంతర్గతంగా ఈ విషయాల్లో ఎక్కడాలేని అసమానతలు కనిపిస్తున్నాయి. ఆందోళన కలిగిస్తున్న పరిణామాలివి.

ఆర్థిక క్రమశిక్షణ తక్షణావసరం

నిరుడు బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకొన్న లక్ష్యాలకు చాలా దూరంలోనే ఆగిపోయామన్నది స్పష్టమవుతున్న వాస్తవం. ఈ పరిస్థితుల్లో కొత్త ఆర్థిక సంవత్సరంలో విత్త లోటును మూడు శాతానికి పరిమితం చేయాలని నిర్దేశించుకునే లక్ష్యం చేరుకోవడం అసాధ్యంగానే కనిపిస్తోంది. లక్షల కోట్లకు చేరిన బ్యాంకుల నిరర్థక ఆస్తులు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనబరుస్తున్నాయి. దివాలా చట్టం తీసుకురావడంతోపాటు రిజర్వు బ్యాంకుకు అధికారాలు కల్పించడం స్వాగతించదగ్గ పరిణామాలు. వీటి ఫలితం ఏ మేరకు ఉంటుందో వేచిచూడాలి. పెద్దయెత్తున రుణాల ఎగవేతకు పాల్పడినవారిపై త్వరితగతిన విచారణ జరిపి శిక్షించడంపైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. అప్పుడే ప్రజల్లో ప్రభుత్వ చర్యలపై విశ్వాసం నెలకొంటుంది. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి పరీక్షగా భావించాలి. ముడిచమురు ధరలు అంతకంతకూ పెరుగుతుండటం, దిగుమతుల పరిమాణం మితిమీరి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత ఖాతా లోటు మరింత పెరిగే అవకాశం ఉందనేందుకు సూచనలివి.

సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఎన్నికల అవసరాల కారణంగా ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పే ప్రమాదం కొట్టిపారేయలేనిది. ప్రైవేటు పెట్టుబడి ప్రోత్సాహకరంగా లేకపోవడంతో ప్రభుత్వం పెట్టుబడులు పెంచాల్సిన అవసరమూ ఎక్కువగా ఉంది. అదే సమయంలో ఆశాకిరణాలు కూడా కనబడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక గమనం ప్రస్తుతం బాగుంది. చైనా, అమెరికా, ఐరోపా, జపాన్, 'ఆసియాన్', దక్షిణ కొరియా దేశాల వృద్ధిరేటు బాగుంటుందని అంచనా. మొత్తంగా ప్రపంచ వృద్ధిరేటు మూడు శాతానికి అటూ ఇటూగా ఉంటుంది. ఇది శుభపరిణామం. దీన్ని భారత్ అవకాశంగా మలచుకోవాలి. ముఖ్యంగా ఎగుమతి రంగాన్ని పరుగులు పెట్టించాలి. అవసరమైన వసతులు, వనరులు, నైపుణ్యాలను అభివృద్ధిపరచుకోవాలి. దేశ ప్రజల స్థితిగతులు మెరుగుపడాలంటే కనీసం ఎనిమిది శాతం వృద్ధితో నడక సాగాలి. అప్పుడే సమ్మిళిత, క్రమశిక్షణతో కూడిన అభివృద్ధి సాధ్యమవుతుంది. మౌలిక రంగంలో పెట్టుబడుల్ని పెంచాలి. మానవ వనరులే అన్నింటికీ మించిన పెట్టుబడి. విద్య, ఆరోగ్యం, రక్షిత నీరు, పారిశుద్ధ్యం, పక్కా గృహ వసతి వంటివి కల్పించాలి. మానవ వనరుల సమగ్ర వికాసానికి, వారు దేశానికి తిరుగులేని పెట్టుబడులుగా ఆవిర్భవించడానికి అప్పుడే అవకాశం ఉంటుంది. పారిశ్రామికీకరణ, అధునాతన సాంకేతికత ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం ప్రాధాన్యాలుగా ముందుకు సాగాలి. దేశ పునర్నిర్మాణంలో పార్టీలన్నీ ఒక్కతాటిపై నిలవాలి. చైనా, జపాన్‌ల అనుభవాలనుంచి పాఠాలు నేర్చుకుంటూ కలిసి ముందుకు సాగాలి. ఆర్థిక వృద్ధి, క్రమశిక్షణ జోడు గుర్రాలుగా ముందుకు దూకాలి. అవినీతికి తావులేని పారదర్శకత, జవాబుదారీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకొని అన్ని ప్రాంతాల సమతులాభివృద్ధి దిశగా ప్రస్థానించాలి!

- కె.రామకోటేశ్వరరావు

ఆచితూచి రుణాలు



2017-18 ఆర్థిక సంవత్సరంలో ఏర్పడిన ప్రతిబంధకాల వల్ల కేంద్రప్రభుత్వానికి అదనపు అప్పులు చేయక తప్పని పరిస్థితి తలెత్తింది. అందులో భాగంగా 50వేల కోట్ల రూపాయల అప్పులు అదనంగా తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. దరిమిలా పరిస్థితిని సమీక్షించి ఆ మొత్తాన్ని రూ.20వేల కోట్లకు కుదించుకుంది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఎఫ్ఆర్‌బీఎమ్ బోధిస్తోంది ఈ సంయమనాన్నే! మొత్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అప్పుల శాతం 70 శాతానికి అటు, ఇటుగా ఉంటుందని అంచనా (కేంద్రం 50 శాతం, రాష్ట్రాలు 20 శాతం). ప్రపంచవ్యాప్తంగా చూస్తే అప్పులపరంగా చైనా 46 శాతం, ఇండొనేసియా 28 శాతం, ఫిలిప్పీన్స్ 34 శాతం ఉండటం గమనార్హం. అభివృద్ధి చెందిన దేశాల్లో జర్మనీ, ఇంగ్లాండ్ పరిస్థితి బాగుంది. మరోవంక అమెరికా 106 శాతం, జపాన్ 250 శాతం, ఇటలీ 132 శాతంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థికవేత్తల అంచనా ప్రకారం 60శాతం లోపు అప్పు ఆరోగ్యదాయకం.



కులదీప్ నయ్యర్

విశ్వసనీయతపై క్రీనీడలు

అది టీ కప్పులో తుపానో, అంతకన్నా పెద్దదో చెప్పలేం కానీ, న్యాయ వ్యవస్థ పరువు మాత్రం నిస్సందేహంగా బజారున పడింది. ఇంతకాలం నిష్పాక్షికతకు మారుపేరుగా నిలిచిన న్యాయవ్యవస్థపై నమ్మకం సడలింది. మొట్టమొదటిసారిగా న్యాయమూర్తులు ప్రజలకు జవాబు చెప్పుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అసలు ఈ వివాదం తెరవెనక కథాకమామిషు ఏమిటో ఎవరికీ పూర్తిగా తెలియదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా చర్యల గురించి తమవైపు కథనాన్ని వెల్లడించడానికి నలుగురు న్యాయమూర్తులు- జాస్తి చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బి.లోకూర్, కురియన్ జోసెఫ్‌లు ఇటీవల పాత్రికేయుల ముందుకు వచ్చి సంచలనం సృష్టించారు. న్యాయ వ్యవస్థ చరిత్రలో ఇటువంటి ఘటన ఎన్నడూ చోటుచేసుకోలేదు. ప్రధాన న్యాయమూర్తి సమానుల్లో ప్రథముడు మాత్రమే అయినా, ఆచరణలో అన్నీ తానే అన్నట్లు చెలరేగిపోతున్నారని వారు ఆరోపించారు. ప్రధాన న్యాయమూర్తిని వారు ఇంత బహిరంగంగా ప్రశ్నించడం మొత్తం వ్యవస్థను ఇరుకున పెట్టింది. ప్రభుత్వం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా, సమస్యను పరిష్కరించుకునే అవకాశాన్ని న్యాయమూర్తులకే వదిలివేయడం విజ్ఞతాయుతమైంది!

నలుగురు న్యాయమూర్తులు అనూహ్యంగా పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఇంటిగుట్టును బయటపెట్టడం అనేకమంది మాజీ ప్రధాన న్యాయమూర్తులను దిగ్భ్రాంత పరచింది. అసలు ఇంతటి తీవ్ర సమస్యను రెండు నెలల నుంచి ఎందుకు నానబెట్టినట్లని మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం.లోధా ప్రశ్నించారు. 'ఈనాటి పరిణామాలు నన్ను కలవరపెడుతున్నాయి. సుప్రీంకోర్టు వంటి సర్వోన్నత సంస్థకు నేతృత్వం వహించినవారు వీటిని చాలా బాధాకరమైనవిగా, దురదృష్టకరమైనవిగా పరిగణిస్తారు' అన్నారాయన. పరిస్థితిని ఇంతదాకా రానివ్వకుండా ప్రధాన న్యాయమూర్తే చొరవ తీసుకుని అసంతృప్త న్యాయమూర్తులతో స్వయంగా చర్చించి ఉండాల్సిందన్నారు.

ఒక వైద్య కళాశాల ప్రవేశాల్లో జరిగిన కుంభకోణంపై పిటిషన్‌ను సుప్రీంకోర్టులో రెండో సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఒడిశా హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఐ.ఎం.ఖుద్దూసీకి ఈ కేసుతో ప్రమేయం ఉందని అనుమానిస్తున్నారు. ఏ కేసును ఏ ధర్మాసనానికి కేటాయించాలో నిర్ణయించాల్సింది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మిశ్రాయే తప్ప చలమేశ్వర్ కాదంటూ కేసును స్వీకరించడానికి అయిదుగురు జడ్జీల బెంచి నిరాకరించింది. అసలు ఎలాంటి కేసులను అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి కేటాయించాలో రాజ్యాంగం స్పష్టంగానే నిర్దేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇటీవలి కాలంలో ఈ ప్రమాణాలను పాటిస్తున్నట్లు లేదు. ఇద్దరు ముగ్గురు సభ్యుల ధర్మాసనాలతోనే విచారణ కానిచ్చేస్తోంది. దీనివల్ల సర్వోన్నత న్యాయస్థానంపట్ల న్యాయమూర్తుల్లోనే నమ్మకం సన్నగిల్లి, నేడు సంక్షోభం తలెత్తింది. న్యాయమూర్తుల మధ్య విభేదాలు ఇలా ఏర్పడటం కొత్తేమీ కాదు. కొన్ని సమస్యలపై వారు వాగ్యుద్ధానికి దిగిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. 1970లు, 1980లలో ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్‌కు, ఆయన తరవాత ఈ పదవిని చేపట్టిన మరో చీఫ్ జస్టిస్ పి.ఎన్.భగవతికి; 1990లలో జస్టిస్ ఎ.ఎం.అహ్మదీ, జస్టిస్ కులదీప్ సింగ్‌ల మధ్య విభేదాలు చెలరేగాయి. వాటిని క్రమశిక్షణ రాహిత్యంగా భావించారే తప్ప తిరుగుబాటుగా ఎవరూ పరిగణించలేదు. తాజాగా ప్రధాన న్యాయమూర్తికి, ఇతర న్యాయమూర్తులకు మధ్య విభేదాలెన్ని ఉన్నా వాటిని పాత్రికేయుల సమావేశంలో బయటపెట్టుకోవడం సుప్రీంకోర్టు నైతికాధికారంపై అనుమాన ఛాయలు ప్రసరింపజేసింది. న్యాయవ్యవస్థ నిజాయతీపై ప్రశ్నలు రేపింది. ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో నలుగురు న్యాయమూర్తులూ గతంలో జరిగిన కొన్ని తప్పిదాలపై దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా ఎవరైనా మన న్యాయవ్యవస్థకన్నా ఎక్కువ కారు. ధర్మాసనాలను నెలకొల్పే అధికారం ప్రధాన న్యాయమూర్తికి ఉన్నమాట నిజమే కానీ, దాన్ని ఏకపక్షంగా కాకుండా వివేచనతో ఉపయోగించాలి. జాతీయ న్యాయనియామకాల సంఘం చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని కేంద్రప్రభుత్వం యోచిస్తున్నా, న్యాయమూర్తులు దాన్ని తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. సరికొత్త వివాదాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం న్యాయమూర్తుల నియామకంలో తనమాట నెగ్గించుకునే అవకాశం ఉందని జడ్జీలు గ్రహించడం లేదు.



న్యాయవ్యవస్థలో తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉండటం మన అదృష్టం. న్యాయవ్యవస్థ జావకారిన సందర్భాలు ఉన్నా- సుప్రీంకోర్టుకు చెందిన జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా, అలహాబాద్ హైకోర్టుకు చెందిన గజ్ మోహన్‌లాల్ సిన్హాలు తమ సాహసిక, నిష్పాక్షిక ప్రవృత్తితో వ్యవస్థ ఔన్నత్యాన్ని పునరుద్ధరించారు. ఆత్యయిక స్థితి రోజుల్లో నిజం మాట్లాడటానికి జస్టిస్ ఖన్నా వెరవలేదు. తోటి న్యాయమూర్తులకు భిన్నంగా ప్రాథమిక హక్కులు తిరుగులేనివని తీర్మానించారు. దీనికి ఆయన మూల్యం చెల్లించుకోవడానికి వెనకాడలేదు. తనకన్నా జూనియర్‌కు పదోన్నతి కల్పించగా, ఖన్నా నిరసనగా రాజీనామా చేశారు. ఈ అక్టోబరులో ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా పదవీ విరమణ చేసిన తరవాత సీనియారిటీ ప్రకారం ఆ పదవి రంజన్ గొగోయ్‌ని వరించాల్సి ఉన్నా, ఇప్పుడు కూడా ఖన్నా అనుభవమే పునరావృతమవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు ఏ కేసులోనూ సత్వర న్యాయం జరుగుతుందనే ఆశలేదు. వకీళ్లు కేసును తమకు అనుకూలుడైన న్యాయమూర్తి వద్దకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోగలుగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. న్యాయవ్యవస్థలో అవినీతి అనేది కొంతకాలం క్రితం వరకు ఎవరూ ఊహించలేని మాట. ఇప్పుడు చాలామంది నోట ఆ మాటే వినిపిస్తోంది. కొంతకాలం క్రితం వరకు కోర్టు తీర్పులు సామాన్యులు, బలహీనుల పక్షం వహించేవి. పర్యావరణకు అనుకూలంగా ఉండేవి. ప్రపంచీకరణ యుగం మొదలయ్యాక పరిస్థితి మారిపోయింది. ధనికులకు, అధికార స్థానాల్లో ఉన్నవారికి, పర్యావరణానికి హాని చేసేవారికి అనుకూలంగా ఉండే తీర్పులు వస్తున్నాయి. ప్రజలు ఎన్నుకున్న చట్టసభల మీద తమ మాట నెగ్గాలనే ధోరణి న్యాయవ్యవస్థలో కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు. అయితే, రాజకీయ నాయకులను దారిన పెట్టగలిగే సత్తా న్యాయవ్యవస్థకు ఉందనడంలో సందేహం లేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంతసేపూ తమ గురించే ఆలోచించుకుంటూ న్యాయాన్ని పట్టించుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది!

(రచయిత- ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

స్వేచ్ఛ

మునుపటితో పోలిస్తే, ఆధునిక సమాజంలో వ్యక్తి స్వేచ్ఛ సర్వే సర్వత్రా బాగా పెరిగినట్లు కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో అది అన్ని హద్దుల్నీ చెరిపేసి, అన్ని గీతల్నీ తుడిచేసి, ఇతరుల స్వేచ్ఛను కుదింపజేసే స్థాయికి చేరుతోందనీ అనిపిస్తుంది. 'వ్యక్తి స్వేచ్ఛకు హద్దులేమిటి, పరిమితులేమిటి... అలాంటి ఆలోచనా ధోరణే అనాగరికం, వెనకబాటుతనం, మూర్ఖత్వం' అంటారు కొందరు. స్వదేశీ కంటే విదేశీ సంస్కృతి వల్ల ఎక్కువ ప్రభావితులైన వ్యక్తులు వారిని పూర్తిగా సమర్థిస్తారు.

'అసలు వ్యక్తి స్వేచ్ఛకు ఆకాశమే హద్దు. ఆ మాటకొస్తే, అదీ హద్దు కాదు! ఎవరి జీవితం వారి ఇష్టం. ఇష్టం వచ్చినట్లు, ఎవరికి తోచిన పద్ధతిలో వారు సుఖాన్వేషణ చేస్తూ జీవించడమే పరమానందం. అంతకు మించింది మరొకటి లేదు' అనే భావజాలం మరికొందరిది!

'నేనేదో ఇతరుల స్వేచ్ఛను ఉల్లంఘించి ఇబ్బంది కలిగిస్తే తప్ప- ప్రభుత్వానికో సమాజానికో కుటుంబానికో ఇతరులకో... నా వ్యక్తిగత జీవితంలోని ఏ దశలోనూ ప్రమేయం ఉండనక్కరలేదు. ఎలాంటి సంకెళ్లూ లేకుండా, 'విశృంఖలం'గా, నా జీవితం నేను గడపటం నా జన్మహక్కు' అన్నదే అటువంటివారి అభిమతం. స్వేచ్ఛ అమూల్యమే, అది లేనప్పుడు అంతా బానిస జీవితమే! గాలి, నీరు, ఆహారంలా స్వేచ్ఛ- ఆనందమయ జీవితానికి అత్యవసరం. అది పూర్తిగా హేతుబద్ధమైనా, ఇతర సిద్ధాంతాల్లా దానికీ కొన్ని షరతులు లేదా పట్టువిడుపులు తప్పవు.

స్వబుద్ధి కావాలి. యుక్తాయుక్తాలు తెలిసి, వివేచనతో వ్యవహరించాలి. 'కొత్త ఒక వింత'గా అనుకరించడం మోజు అవుతుంది. అది సహజసిద్ధమైన ఇచ్ఛా ప్రకటన అనిపించుకోదు. స్వేచ్ఛావాదంలో అతి ధోరణులు అరాచకానికి, హింసాత్మక ఘర్షణలకు దారితీయవచ్చు. 'అతి' ఎప్పుడూ వర్జనీయమే!

పరిణతి లేనిచోట స్వేచ్ఛ ఉన్నా ప్రమాదకరమే! అనుభవంతో మనిషికి పరిణతి కలుగుతుంది. అతడి దృక్పథాలు, ధోరణులు మారతాయి. జీవితం, దాని ప్రయోజనాల గురించి లోతుగా తరచి చూసిన మహర్షులు, ఇతర ఆధ్యాత్మికవాదులు అసలైన స్వేచ్ఛాప్రియులు. భయాలు, సంకోచాలు లేని స్వేచ్ఛాజీవితాన్ని గడపాలని మానవాళికి వారు ప్రబోధించారు. ఆ బోధన తీరు ఎంతో విభిన్నమైనది.



అంతర్యామి

'కామ క్రోధాలకు, లోభ మోహాలకు, మద మాత్సర్యాలకు లొంగిపోకు. నీ స్వేచ్ఛను వాటికి తాకట్టు పెట్టుకోకు. అవి ఎటు లాగితే అటు వెళ్లే పరాధీన స్థితిని, బానిసత్వాన్ని 'స్వేచ్ఛ'గా భావించి భ్రమపడకు. ఆ ఆరు శత్రువుల్నీ జయించి, నీ స్వేచ్ఛను నువ్వు పరిరక్షించుకో. దుఃఖానికి దూరంగా ఉండు!' అంటారు ఆధ్యాత్మిక బోధకులు. ఆకర్షణకు చిక్కి, ఇష్టానుసారం పరుగులు తీయడం స్వేచ్ఛ కాదు. నిగ్రహంతో నియమాలు అనుష్ఠించేవారే స్వేచ్ఛగా ఉన్నట్లు లెక్క.

'నువ్వు రథికుడివి. శరీరం నీ రథం. నీ బుద్ధి ఆ రథానికి సారథి. మనసు కళ్లెం. ఇంద్రియాలే గుర్రాలు' అని ఉపనిషత్తులు చెబుతాయి. గుర్రాలు ఎటు తీసుకెళితే అటు వెళ్లేవాడి జీవనయాత్ర స్వ, ఇచ్ఛ ప్రకారం సాగదు. రథాన్ని, గుర్రాల్ని, పగ్గాల్ని, సారథిని నియంత్రణలో ఉంచేవాడే స్వేచ్ఛాజీవి. విశృంఖలంగా బతకడం ఎన్నటికీ స్వేచ్ఛ అనిపించుకోదు. సంయమనం, పరిణత బుద్ధితో సాగే జీవయాత్రే నిజమైన స్వేచ్ఛాజీవనం!

స్వేచ్ఛ అనేది కత్తి. పరిణతి- దాని ఒర. అజాగ్రత్తగా కత్తి దూస్తే, అది ఆ ఆయుధధారికే ప్రమాదం. సంయమనం, నిగ్రహం వల్ల దీర్ఘకాలంలో సుఖపడనివారు ఉండరు. రజో తమో గుణాలతో పాటు, విశృంఖల విజృంభణ కారణంగా దుఃఖం బారిన పడనివారూ ఉండరు!

- మల్లాది హనుమంతరావు

అధికారంలోకి రాకుంటే రాజకీయాలు వదిలేస్తా


గద్వాల సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, భారీగా హాజరైన కార్యకర్తలు

ఈనాడు డిజిటల్, గద్వాల: రాష్ట్రంలో 2019 సాధారణ ఎన్నికల్లో తెరాస మళ్లీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు (కేటీఆర్) ప్రకటించారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని సవాలు విసిరారు. బుధవారం గద్వాల పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేటీఆర్ అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలపై మాకు విశ్వాసం ఉంది.. మా పనితీరుపై ప్రజలకు నమ్మకం ఉందని చెప్పారు. అదే నమ్మకంతో చెబుతున్నాం.. హైదరాబాద్, తెలంగాణలో తెరాస విజయం సాధిస్తే మీకు రాజకీయ సన్యాసం తీసుకునే దమ్ముందా అంటూ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. 2019 ఎన్నికల జైత్రయాత్ర గద్వాల నుంచే ప్రారంభమైందన్నారు. ఇది తెలంగాణ మొత్తం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్ల పాలనను తరచి చూసుకోవాలని హితవు పలికారు. నల్గొండ జిల్లాలో 2 లక్షల మంది ఫ్లోరైడ్‌తో బాధపడుతుంటే వారికి మంచినీళ్లు కూడా ఇవ్వలేని దద్దమ్మలని కాంగ్రెస్ నేతలను ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ సొంత నియోజకవర్గంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలయిందని, అలాంటి వ్యక్తి తెలంగాణకు వచ్చి చేసేదేమీ లేదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులు రాకుండా పాలమూరు ప్రజల నోట్లో మట్టి కొట్టింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇక్కడున్న 14 నియోజకవర్గాల ప్రజలు ఈ చేదు నిజాన్ని ఒప్పుకోవాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లలో ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్ల తెరాస పాలనలో 5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని, అయిదేళ్లలో మొత్తం 8 లక్షల ఎకరాలకు నీరు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఆర్డీఎస్ నుంచి ఈ నలభై ఏళ్లలో ఏనాడన్నా సాగునీరు వచ్చిందా అని ప్రశ్నించారు. నడిగడ్డలో కేసీఆర్ పాదయాత్ర చేసినప్పుడే తుమ్మిళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని, అందులో భాగంగా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు నడిగడ్డకు నీళ్లు ఇవ్వడానికి గద్వాల ఎమ్మెల్యే ప్రయత్నం చేశారా అని ప్రశ్నించారు. పైగా అనంతపురంలో హంద్రీనీవా ప్రాజెక్టులు కడితే మంత్రిగా అక్కడికి వెళ్లి హారతులు ఇచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, బాల్‌రాజు, అంజయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ భాస్కర్, తెరాస రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాయిలర్ వెలిగించడాన్ని కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ఇంజినీర్లు

మిగులు విద్యుత్ సంకల్పానికి ఉద్యోగుల తోడ్పాటు

ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి విద్యుత్ ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని సీఎం కేసీఆర్ అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం కేటీపీఎస్‌లో కొత్తగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంగల థర్మల్ కేంద్రంలో బుధవారం బాయిలర్‌ను విజయవంతంగా వెలిగించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. జెన్‌కో సీఎండీ డి.ప్రభాకరరావుకు సీఎం ఫోన్ చేసి అభినందించారు. ఈ ప్లాంటును వేగంగా తక్కువ సమయంలో నిర్మించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని భద్రాద్రి, యాదాద్రి విద్యుత్కేంద్రాలను సైతం పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో వేగం పారదర్శకత కోసం ప్రభుత్వ రంగ సంస్థ భెల్‌కు ఈ ప్లాంట్ల నిర్మాణం అప్పగించామని, ఈ లక్ష్యం నెరవేరుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

విజయవంతంగా వెలిగిన బాయిలర్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కేటీపీఎస్ ఏడో దశలో కీలక ఘట్టమైన బాయిలర్‌ను వెలిగించడం బుధవారం విజయవంతమైంది. ఉదయం 8.40 గంటలకు బాయిలర్ నుంచి ఈఎస్పీ, ఐడీ ఫ్యాన్, చిమ్నీ ద్వారా పొగ బయటకు వెళ్లడంతో ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ క్రతువును కంప్యూటర్‌కు అనుసంధానించి చేపట్టారు. సీఎండీ డి.ప్రభాకర్‌రావు పర్యవేక్షించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంపై ఆయన అధికారులను అభినందించారు.

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

- అన్నదాతల కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించాలి
- అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడి కింద ఎకరానికి రూ.4 వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, మార్కెటింగ్ సంస్కరణలతో 2022 నాటికి రాష్ట్ర రైతుల ఆదాయం రెట్టింపవుతుందని నీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అన్నదాతలకు మరిన్ని ప్రయోజనాలు కల్పించడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, హరియాణాల్లో వ్యవసాయ మార్కెట్లపై అధ్యయనం చేసి వచ్చిన అధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. ఆ రాష్ట్రాల్లో పంటల కొనుగోలు తీరును వారు వివరించారు. మహారాష్ట్రలో 30 ఏళ్లుగా పత్తి కొనుగోలు సమాఖ్య పనిచేస్తోందని.. హరియాణాలో కూరగాయల కొనుగోలుకు ప్రాథమిక ధరను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు వివరించారు. ఈ అధ్యయన నివేదికలను సీఎంకు అందచేసి ఆయన నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. 'మన కూరగాయలు' విక్రయ కేంద్రాలను వందకు పెంచాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో కందులు 2.84 లక్షల టన్నుల దిగుబడి వస్తున్నందున లక్షన్నర టన్నులను మద్దతు ధరకు కొనేందుకు అనుమతించాలని కేంద్రానికి విన్నవిస్తూ లేఖ రాయగా..1.13 లక్షల టన్నుల వరకూ పరిమితిని పెంచడానికి కేంద్రం బుధవారం అనుమతించిందని తెలిపారు. కందులు అమ్మిన రైతులకు వెంటనే సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనగామ, భువనగిరి మార్కెట్లలో కందుల విక్రయాల్లో అక్రమాలు జరిగినందున అక్కడి మార్కెట్ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చనాకా-కొరాటా, తుమ్మిడిహట్టి ప్రాజెక్టులకు మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు పచ్చజెండా

- అనుమతి కోసం కేంద్ర వన్యప్రాణి బోర్డుకు సిఫార్సు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు సంబంధించిన రెండు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు ఆమోదం తెలిపింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అధ్యక్షతన బుధవారం ముంబయిలో ఆ రాష్ట్ర వన్యప్రాణి బోర్డు సమావేశమైంది. ఈ రెండు బ్యారేజీలతో వన్యప్రాణులకు ఎలాంటి హానీ ఉండదని బోర్డు తేల్చింది. తుది అనుమతి కోసం కేంద్ర వన్యప్రాణి బోర్డుకి ప్రతిపాదించింది. చనాకా-కొరాటా బ్యారేజీని పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్నారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బ్యారేజి నిర్మిస్తున్నారు. ఈ సమావేశంలో మహారాష్ట్ర, తెలంగాణ అధికారులు పాల్గొన్నారు. మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు నిర్ణయంపై మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తంచేశారు.

4న లక్ష మందితో శ్రీనివాస్ సంతాపసభ

కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఓటమి భయంతోనే తెరాస నేతలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. ఈ దారుణాలను ప్రపంచానికి చాటి చెప్పేలా నల్గొండ మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్ సంతాప సభను ఫిబ్రవరి 4న లక్ష మందితో నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. బుధవారం కోమటిరెడ్డి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్ హత్యోదంతంలో నిందితుల కాల్‌డేటా వివరాలు, సీసీటీవీ ఫుటేజీలు ఇచ్చేందుకు ఎస్పీ ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. శ్రీనివాస్‌ది రాజకీయ హత్యేనని పునరుద్ఘాటించారు.

దూకుడు పెంచితేనే అధికారం

- లేదంటే మళ్లీ ప్రతిపక్షంలోనే
- మార్చిలోపు 60 నియోజకవర్గాలకైనా ఇంఛార్జీలను ప్రకటించాలి
- కుంతియాతో ముఖాముఖిలో కుండబద్దలు కొట్టిన కాంగ్రెస్ నేతలు


కుంతియాతో జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికలు ఎప్పుడొచ్చినా సమర్థంగా ఎదుర్కోవాలంటే ఇప్పట్నుంచే కార్యక్షేత్రంలోకి దిగాల్సిన అవసరం ఉందని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. దూకుడుగా ముందుకు వెళితేనే అధికారం సాధ్యమని, లేదంటే మళ్లీ ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుందని కుండబద్దలు కొట్టారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామచంద్ర కుంతియా బుధవారం గాంధీభవన్‌లో ముఖ్య నాయకులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఒక్కొక్కరితో విడివిడిగా 20-30 నిమిషాల చొప్పున మాట్లాడి వారి సలహాలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. బుధవారం జానారెడ్డి, షబ్బీర్ అలీ, గీతారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వీహెచ్, సబితా ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, శ్రీధర్‌బాబు, మల్లు రవి తదితర 30 మంది నేతలు, డీసీసీ అధ్యక్షులతో ముఖాముఖి మాట్లాడారు. రాజకీయ సమీకరణలు, రాబోయే ఎన్నికల్లో పొత్తులు, కేసీఆర్ ఇస్తున్న హామీల వలలో ప్రజలు పడకుండా చూడటంతోపాటు..వారిని కాంగ్రెస్ వైపు తిప్పుకోవడానికి ఎలాంటి ప్రణాళిక రచించాలి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలు, బస్సు యాత్రలు, ప్రచార సభలు ఎలా నిర్వహించాలి? అనే అంశాలతోపాటు తెలంగాణ నుంచి ఏఐసీసీలో ఎవరెవరికి ప్రాధాన్యం కల్పించాలన్న దానిపైనే ప్రధానంగా చర్చసాగినట్టు తెలిసింది. వారి నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, పీసీసీ అధ్యక్షుడితో విభేదాలేమైనా ఉన్నాయా? తదితరాలూ వాకబు చేసినట్లు సమాచారం.

పార్టీ పరిస్థితిపై అసంతృప్తి

ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరులు సహా పలువురు పార్టీ ప్రస్తుత పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. గ్రేటర్ హైదరాబాద్ సహా స్పష్టత ఉన్న కనీసం 60 నియోజకవర్గాల్లో వెంటనే ఇన్‌ఛార్జీలను ప్రకటించాలని, రెండు వారాల్లోపు గ్రేటర్ హైదరాబాద్‌లోని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను ప్రకటించని పక్షంలో రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నట్టు సమాచారం. 'ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చురుకుగా స్పందించడం లేదనే అభిప్రాయం కార్యకర్తల్లో ఉంది. చాలామంది నేతలు కనీసం వారి నియోజకవర్గాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. అలాంటి వారికి ప్రత్యామ్నాయంగా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.' అని కొందరు..'ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోలు వంటివి చేయడం లేదు. అలాంటి లోపాలు సరిదిద్దుకుంటూ పక్కా ప్రణాళికతో అందర్నీ కలుపుకుంటూ ముందుకెళ్తేనే ఎన్నికల్లో గెలుపు సాధ్యం. లేకుంటే తిరిగి ప్రతిపక్షంలోనే కూర్చోనే పరిస్థితి వస్తుంది' అని మరికొందరు అభిప్రాయపడినట్టు సమాచారం.

జిల్లా నేతలతో సంప్రదించాకే చేరికలు

ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి పార్టీలో చేర్చుకునే ముందు ఆయా జిల్లాలకు చెందిన నేతలతో టీపీసీసీ సంప్రదించాలని కొందరు కుంతియాను కోరారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న కుంతియా తమ అభిప్రాయాలు, సూచనలను రాత పూర్వకంగా ఇవ్వాల్సిందిగా కొందరికి సూచించినట్లు తెలిసింది.

38 నెలల తర్వాత గాంధీభవన్‌కు కోమటిరెడ్డి

సీఎల్పీ ఉపనేత, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి దాదాపు 38 నెలల తర్వాత బుధవారం గాంధీభవన్‌కు వచ్చారు. కుంతియా విన్నపం మేరకే తాను గాంధీభవన్‌కు వచ్చినట్లు ఆయన చెప్పారు.

ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

- ఉత్తమ్, జానారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముందస్తు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డిలు తెలిపారు. 102 స్థానాల్లో తెరాస గెలుస్తుందని ఎంపీ కవిత చెప్పడం...కాంగ్రెస్ శ్రేణులను బలహీనపరిచే ప్రయత్నమేనన్నారు. బుధవారం ఇరువురూ గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మహా భారతంలో ఎక్కువ అస్త్రాలు, సైన్యం కౌరవుల వద్దే ఉన్నా అంతిమంగా పాండవులే గెలిచారని, ప్రస్తుతం పాండవుల స్థానంలో తామున్నామని వివరించారు. పార్టీ సర్వేలో 90 స్థానాలు గెలుస్తామన్న నివేదిక వచ్చినా.. తాము 70 స్థానాలే చెప్పుకున్నామన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెరాస ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అభ్యంతరం లేదన్నారు. సమయం, ఇతర పరిస్థితుల దృష్ట్యా పునర్విభజన ఇప్పట్లో సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కూటమి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్న మాట వాస్తవమేనని, దానిపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. పెట్టుబడి సాయంగా రూ.4 వేలు అందించడం కన్నా..గిట్టుబాటు ధర, బోనస్ కల్పిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుందన్నారు. రాజీనామా చేయకుండానే రేవంత్‌రెడ్డిని పార్టీలోకి తీసుకోవడంపై విలేకరులు ప్రశ్నించగా 'రేవంత్‌రెడ్డి కన్నా ముందిచ్చిన రాజీనామాలనే స్పీకర్ ఇంకా ఆమోదించలేదు. తన పరిస్థితి కూడా అదే అవుతుందన్న భావనతోనే ఆయన ఆగారు. వాటిని ఆమోదించిన వెంటనే రాజీనామా ఇవ్వడానికి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు.' అని తెలిపారు.

రుణమాఫీ సమస్యలపై ఎప్పుడు స్పందిస్తారు? : సండ్ర

ఈనాడు, హైదరాబాద్: పంటరుణాల మాఫీలో రైతులపై అదనంగా పడిన వడ్డీకి సంబంధించిన వివరాలు సభాపతికిస్తే పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ సభలోనే హామీ ఇచ్చారని.. కానీ, సభాపతికిచ్చి చాలా రోజులైనా ఇంతవరకూ వాటికి మోక్షం లేదని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలసి బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ సమస్యలపై అఖిలపక్షాన్ని పిలిచి సీఎం ఎప్పుడు చర్చిస్తారో చెప్పాలని సండ్ర డిమాండ్ చేశారు. రావుల మాట్లాడుతూ తెరాస ఇచ్చిన హామీలు ఆకాశంలో, వాటి అమలు పాతాళంలో ఉన్నాయని విమర్శించారు.

నా భర్త హత్య కేసును సీబీఐకి అప్పగించండి

- హైకోర్టును ఆశ్రయించిన నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ లక్ష్మి
- ప్రమాణపత్రం దాఖలు చేయాలని నల్గొండ ఎస్పీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తన భర్త శ్రీనివాస్(45) హత్య కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్), లేదా సీబీఐకి అప్పగించాలని అభ్యర్థిస్తూ నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ లక్ష్మి బుధవారం హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ హత్య కేసుకు సంబంధించి అరెస్టు చేసిన నిందితుల కాల్‌డేటాను తనకు ఇప్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపారు. పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని నల్గొండ ఎస్పీని ఆదేశించారు. విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు. పిటీషనర్ తరఫున న్యాయవాది దామోదర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మృతుడు కాంగ్రెస్‌పార్టీలో పనిచేస్తున్నారన్నారు. ఆయన్ని తెరాసలో చేరాలని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ఒత్తిడి చేశారన్నారు. ఎమ్మెల్యే సూచనమేరకే హత్య జరిగిందని పిటీషనర్‌కు సందేహం ఉందన్నారు. జిల్లా ఎస్పీ ఈ కేసు దర్యాప్తును సరైన కోణంలో జరపడంలేదన్నారు. అరెస్టు చేసిన నిందితుల ఫోన్ కాల్ డేటా సేకరించి ఆ కోణంలో దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)శరత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నిందితుల కాల్‌డేటాను పోలీసులు సేకరించారని ఈ దశలో ఆ వివరాల్ని బయటకు ఇస్తే దర్యాప్తునకు అవరోధం కలుగుతుందన్నారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలన్నారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి.. ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఎస్పీని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

మీడియా ముందుకు తెచ్చి మాట్లాడించడమా?

ఈ కేసులో అరెస్టు చేసిన నిందితుల్ని పోలీసులు మీడియా ముందుకు తెచ్చి వాళ్లతో మాట్లాడించడంపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అందులో నిందితులెవరో? పోలీసులెవరో తెలియకుండా ఉందని వ్యాజ్య విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు పెంచాలి

శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సూచన

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం ఉన్న సీట్లను పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సూచించింది. విశ్వవిద్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు ఉద్యోగుల నియామకం, ప్రవేశాలపై బుధవారం కమిటీ సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కమిటీ ఛైర్మన్ వి.గంగాధర్‌గౌడ్, శాసనసభ్యులు ప్రకాష్‌గౌడ్, సి.విఠల్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య తదితరులు ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీలకు ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేకవిభాగాన్ని బీసీలకూ అమలు చేయాలని ఉద్యోగులు తమ దృష్టికి తెచ్చారని గంగాధర్‌గౌడ్ తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విదేశాలకు వెళ్లేలా ప్రోత్సహించాలని, అందుకు ప్రత్యేక అధ్యయన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ కమిటీ సూచనల మేరకు విశ్వవిద్యాలయం సీట్ల పెంపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఇప్పటికే కొత్త కళాశాల ఏర్పాటుకు నివేదించామన్నారు.

తెదేపా పాలనలోనే సామాజిక న్యాయం: రమణ

ఈనాడు, హైదరాబాద్: తెదేపా పాలనలోనే ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని, తెలంగాణలో రూ.లక్షల కోట్ల బడ్జెట్ పేదలకు అందాలంటే తెదేపా అధికారంలోకి రావాల్సిందేనని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మండల స్థాయి నేతల శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. తెరాస, తెదేపాకు మధ్య నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పేదలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించిన పార్టీ తెదేపా ఒక్కటేనన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బక్కని నర్సింలు, నేతలు పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యవస్థలో ప్రక్షాళన అవసరం

4న పార్టీ ఏర్పాటుపై కార్యాచరణ ప్రకటన: కోదండరాం


సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొందని, స్వార్థపూరితంగా మారిన ఈ వ్యవస్థలో ప్రక్షాళన తప్పనిసరి అని ఐకాస ఛైర్మన్ కోదండరాం పేర్కొన్నారు. ఈ నెల 4న రాజకీయ పార్టీకి సంబంధించి పూర్తి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం దగ్గరలోని బొంగుళూరు గేట్ సమీపంలో ఐకాస ఆధ్వర్యంలో ఆ జిల్లా రైతు సమస్యలపై కార్యాచరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. పదవులు, కాంట్రాక్టులు కాదని.. ప్రజా సంక్షేమమే రాజకీయాల ముఖ్య ఉద్దేశమన్నారు. 4వ తేదీన జిల్లాలోని తుర్కయాంజాల్‌లో జరిగే అన్ని జిల్లాల ఐకాస నాయకుల సమావేశంలో చర్చించిన అనంతరం కార్యాచరణ వెల్లడిస్తామన్నారు. విలువలతో కూడిన రాజకీయానికి బీజం వేస్తామని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేలా పరిశోధనలు జరపాలని, వ్యవసాయంపై జీఎస్టీని ఎత్తివేయాలని పేర్కొన్నారు.

టీపీసీసీ ఓబీసీ సాధికారిక కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్(టీపీసీసీ) ఓబీసీ సాధికారిక కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కమిటీ ఛైర్మన్‌గా టి.నాగయ్య, కన్వీనర్‌గా మహేష్‌కుమార్‌గౌడ్‌లను నియమించారు. వీరితోపాటు మరో 25 మంది కమిటీలో సభ్యులుగా కొనసాగుతారు.

సమస్య వద్దకే పరిష్కారం..!

- ఇంటికొస్తారు.. సమస్య తెలుసుకుంటారు
- ఆపై విశ్లేషణ చేస్తారు.. పరిష్కరిస్తారు
- రాష్ట్రవ్యాప్తంగా కాలనీల బాట పట్టనున్న పోలీసులు
- హైదరాబాద్‌లో విజయవంతమవడంతో ఇతర ప్రాంతాలపై దృష్టి



సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: అనేక ఏళ్లుగా కొన్ని కాలనీల్లో రౌడీయిజం రాజ్యమేలుతోంది.. మరికొన్ని చోట్ల మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్న జనం కోకొల్లలు. వీటికి పరిష్కారం చూపేందుకు పోలీసు శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కాలనీలకు పోలీసులే స్వయంగా వెళ్లి సమస్యల గురించి తెలుసుకోబోతున్నారు. తరువాత తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి సిద్ధమవుతున్నారు. హైదరాబాద్ మహానగరంలో మొదలుపెట్టిన ఈ ప్రక్రియ విజయవంతమవడంతో రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమల్లోకి తేబోతున్నారు.

హైదరాబాద్ మహానగరంలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి 'ప్రజా రక్షణ అవసరాలు గుర్తింపు' పేరిట జనంబాట కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అప్పటి సిటీ కమిషనర్, ప్రస్తుత డీజీపీ మహేందర్‌రెడ్డి దీన్ని రూపొందించారు. నగరంలోని ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలోని కాలనీలకు సంబంధిత స్టేషన్ల పోలీసులు వెళ్లి.. అక్కడి అపార్టుమెంట్లు, దుకాణాలు, ఇళ్లు, విద్యాసంస్థల్లో రక్షణపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం మొదలుపెట్టారు. గత కొన్ని నెలలుగా నగరంలోని రెండు వేల మంది పోలీసులు కాలనీల బాటపట్టారు.

హైదరాబాద్‌లోని 3750 కాలనీల్లో ఇళ్లు, అపార్టుమెంట్లకు వెళ్లిన పోలీసులు మొత్తంమీద 6866 సమస్యలను గుర్తించారు. ఇందులో ప్రధానంగా అక్రమంగా రోడ్ల మీద పార్కింగ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు 1282, తప్పతాగి రోడ్ల మీదే వేధిస్తున్నారంటూ 463, తమ కాలనీల్లో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందంటూ 865 ఫిర్యాదులు అందాయి. ఇలా వేలాది ఫిర్యాదులను పోలీసులు స్వీకరించారు.

6866 సమస్యలకుగాను ఇంతవరకు 5625 సమస్యలను పరిష్కరించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. 1241 సమస్యలను మాత్రం ఇంకా పరిష్కరించాల్సి ఉంది.

ఒకవైపు అందిన ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు కొత్త ప్రాంతాలకు పోలీసులను పంపించి కొత్త సమస్యలను గుర్తించే పనిని మొదలుపెట్టారు.

ఈ క్రమంలో కాలనీల్లో అరాచకాలను చేస్తున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం, హెచ్చరించడం ద్వారా ప్రశాంత వాతావరణానికి చేస్తున్న ప్రయత్నాలు చాలా వరకు సఫలమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని ఎవరైనా తమ కాలనీల్లో సమస్యను పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొంటున్నారు.

ఈ సమస్యలను గుర్తించేటప్పుడు జీహెచ్ఎంసీకి సంబంధించిన సమస్యలు వెలుగులోకి వస్తే సంబంధిత అధికారులకు పోలీసులు వాటిని పంపిస్తున్నారు. జనంబాటకు నగరంలో మంచి స్పందన రావడంతో సైబరాబాద్, రాచకొండ కమిషరేట్లతోపాటు రాష్ట్రంలోని 827 పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. కొద్ది రోజుల్లో మొదలుపెట్టడానికి ప్రణాళికను రూపొందించారు.

ప్రజలకు అండగా ఉంటాం

మహేందర్‌రెడ్డి, తెలంగాణ డీజీపీ



రాష్ట్రంలోని వేలాది గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ప్రజలకు చేదోడువాదోడుగా ఉండటానికే ఈ కార్యక్రమం చేపట్టాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా జనం సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం ద్వారా మా వంత తోడ్పాటు అందిస్తాం. ఎవరైనా సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావచ్చు.

ఏపీ రాజధానిలో తాత్కాలిక హైకోర్టు భవనం

- అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం

ఈనాడు అమరావతి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని రాజధాని అమరావతికి తరలించేందుకు అక్టోబరు నాటికి తాత్కాలిక భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని పరిపాలన నగరంలో శాశ్వత హైకోర్టు భవన నిర్మాణానికి కొంత సమయం పట్టే అవకాశముండటం, రాజధానిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాలేవీ హైకోర్టు ఏర్పాటుకు తగినట్టుగా లేకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 2 నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, హైకోర్టుని రాజధానికి తరలించాలన్నది ఆలోచన. పరిపాలన నగరంలోని శాశ్వత హైకోర్టు కాంప్లెక్స్‌లో ట్రైబ్యునళ్లు, శిక్షణ కేంద్రాల భవనాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలోనే తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణం చేపడతారు. దీనికి సంబంధించిన ఆకృతులను (డిజైన్లను) ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పరిశీలించారు. డిజైన్లు తుది దశలో ఉన్నాయని, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు వాటిని చూపించి వారి అనుమతి తీసుకుంటామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోగానీ, మార్చి మొదటివారంలోగానీ నిర్మాణం మొదలు పెడతామన్నారు. అది శాశ్వత భవనమేనని, భవిష్యత్తులో శాశ్వత హైకోర్టు భవన నిర్మాణం పూర్తయిన తర్వాత, ఇప్పుడు నిర్మిస్తున్న భవనాన్ని ట్రైబ్యునళ్ల కోసం వినియోగిస్తారని మంత్రి తెలిపారు.

భవనాల పరిశీలనకు వస్తాం: లేఖ రాసిన హైకోర్టు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖపై హైకోర్టు స్పందిస్తూ.. జనవరి చివరి వారం తర్వాత ఎప్పుడైనా వచ్చి ప్రతిపాదిత భవనాల్ని(నమూనాల్ని) పరిశీలించేందుకు సిద్ధమని సర్కారుకు లేఖ రాసినట్లు తెలిసింది. హైకోర్టు లేఖ నేపథ్యంలో..ఫిబ్రవరి మూడవ తేదీ లేదా ఆ తరువాత ఎప్పుడైనా పరిశీలనకు రావచ్చని ప్రభుత్వం.. హైకోర్టును కోరనున్నట్లు సమాచారం. అమరావతిలో జస్టిస్ సిటీ ఒరిజినల్ ప్లాన్ పరిధిలో ఉన్న కోర్టు కాంప్లెక్స్‌ను అయిదు మాసాల్లో సిద్ధం చేయనున్నట్లు తెలిసింది. ఆ భవనాన్ని కూడా ప్రతిపాదిత భవనాల్లో ఒకటిగా హైకోర్టును నుంచి వచ్చే భవన పరిశీలన కమిటీకి చూపించనున్నారు.

ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలకు సమయం పొడిగింపు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలను జూన్ 30వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోనూ పూర్తి చేయాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు దినేష్‌కుమార్, ఎస్.పి.సింగ్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టులో జారీచేసిన ఉత్తర్వుల్లో స్పౌజ్, మ్యూచువల్ కింద అంతరాష్ట్ర బదిలీలు చేయాలని, ఈ ప్రక్రియ మొత్తాన్ని రెండు నెలల్లో పూర్తిచేయాలని నిబంధనల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సమస్యలపై చర్చించేందుకు నవంబరులో సమావేశమైన రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ మేరకు సమయాన్ని పొడిగించాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

5న దండకారణ్యం, తెలంగాణ బంద్‌కు పిలుపు

మావోయిస్టుల నేతల లేఖ

చర్ల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాశవిక నిర్బంధకాండకు నిరసనగా దండకారణ్యం, తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 5న బంద్ పాటించాల్సిందిగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పిలుపునిచ్చారు. వారి పేరిట బుధవారం ఇక్కడికి లేఖలు పంపారు.

పెరగని ఆహారధాన్యాల సాగు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత యాసంగి సీజన్‌లో నాలుగు నెలలు పూర్తయినా ఆహార ధాన్యాల పంటల సాగు సాధారణం 9.65 లక్షల హెకార్లలో 16 శాతం ఇంకా నాట్లు, విత్తనాలు వేయలేదు. ఇప్పటివరకూ వరి సాధారణ సాగు విస్తీర్ణం 6.15 లక్షల హెక్టార్లలో 88 శాతమే నాట్లు వేసినట్లు వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యాసంగి వరి నాట్లు డిసెంబరుకల్లా వందశాతం పూర్తయితేనే మంచి దిగుబడి వస్తుంది. కానీ ఈ గడువు ముగిసి నెల అయిపోయినా ఇంకా తక్కువగా ఉంది. ఆహార ధాన్యాల్లో సెనగ తప్ప మరేదీ సాధారణ స్థాయిలో సాగు కాలేదు. మొక్కజొన్న 25, జొన్న 41 శాతం తక్కువ విస్తీర్ణంలో వేశారు. వేరుసెనగ లక్షా 51 వేల హెక్టార్లలో 1.41 లక్షల హెక్టార్లే వేశారు. వరి నాట్లు వేగం పుంజుకుంటున్నాయని సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరే అవకాశాలున్నాయని వ్యవసాయశాఖ తెలిపింది.

మకరందం

7 కరీంనగర్, గురువారం , ఫిబ్రవరి 1, 2018 ఈనాడు

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

makarandam@eenadu.in



విజయం అంటే
రణక్షేత్రం... రక్తపాతం
కాదు... గెలవడం...
తనలోని శత్రువులను...
మాలిన్యాలను
తుదముట్టించడం...
తనపై తాను యుద్ధం
ప్రకటించుకుని అందులో
గెలవాలంటే అపారమైన
ఆత్మశక్తి కావాలి...
ఈ యుద్ధంలో
గెలిచిన వాడే
జినుడవుతాడంటుంది
జైన ధర్మం.
ఆశలకన్నా ఆశయం...
సామ్రాజ్యం కన్నా చైతన్యం
ముఖ్యమని నమ్మి పాదాల
ముందుకు వచ్చిన
రాజ్యాధికారాన్ని,
అంతులేని సంపదలను
తృణప్రాయంగా భావించిన
వాడే బాహుబలి.
అతని కథ
నిత్యస్మరణీయం

సాహోరే బాహుబలి

ఫిబ్రవరి 17 నుంచి మహామస్తకాభిషేకం

జైన ధర్మ ప్రచారకులను తీర్థంకరులంటారు. అంటే తరింపజేసేవారని అర్థం. వీరు ఇరవై నాలుగు మంది. వీరిలో చివరి వాడు వర్ధమాన మహావీరుడు. మొదటి వాడు రిషభదేవుడు. ఇతన్నే రిషభనాధుడు, ఆది నాధుడని కూడా పిలుస్తారు. ఇతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య సంతానంలో పెద్ద వాడు భరతుడు. రెండో భార్య కుమారుడు బాహుబలి. తన రాజ్యంలో అయోధ్యను పెద్ద కొడుకు భరతుడికి, తక్షశిలను బాహుబలికి ఇచ్చి రిషభదేవుడు తపస్సుకు వెళ్లిపోయాడు.

భరతుడు రాజ్య విస్తరణ కాంక్షతో తమ్ముడితోనే యుద్ధానికి సిద్ధపడతాడు. పెద్దలు వారించి జనక్షయం కన్నా వారిద్దరూ నిరాయుధులుగా తలపడి గెలిచిన వారు రాజ్యాన్ని పొందేలా ఒప్పిస్తారు. ద్వంద్వ యుద్ధంలో బాహుబలి ముందు భరతుడు నిలవలేక నిబంధనలను ఉల్లంఘించి 'చక్రరత్న'మనే ఆయుధాన్ని తమ్ముడిమీద ప్రయోగించాడు. ఆగ్రహించిన బాహుబలి తన ఉక్కు పిడికిలితో అన్న తల బద్దలు కొట్టబోతాడు. కానీ అదే క్షణంలో ఆయనలో అంతర్మథనం ప్రారంభమైంది. అశాశ్వతమైన రాజ్యం, సంపదల కోసం సొంత సోదరుడినే చంపాలనుకోవడం తప్పని భావించాడు. తన రాజ్యాన్ని కూడా ఏలుకోమని తన సోదరుడికి చెప్పి వైరాగ్యంతో తపోసీమలకు వెళ్లిపోయాడు.

'త్రయోత్సర్గ'... ఇదో సమాధి స్థితి. నిశ్చలంగా ఒకేచోట కదలకుండా నిలబడి ఆత్మ సాధన చేయడం. యోగమార్గంలో ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నవారు మాత్రమే ఈ స్థితిలో తపస్సు చేయగలుగుతారు. బాహుబలి తన తపస్సుకు ఇదే మార్గాన్ని అనుసరించారు. శరీరం నిండా లతలు అల్లుకున్నా, చీమలు, పాములు పాకుతున్నా శిలావిగ్రహంలా నిలబడి ఆయన తపస్సును కొనసాగించినా ఆత్మసాక్షాత్కారం కలగలేదు. అప్పుడు తండ్రి రిషభదేవుడు 'అహంకారం అనే ఏనుగును దిగ'మని సందేశం పంపారు. బాహుబలి అహంకార విముక్తిని, తద్వారా ఆత్మసాక్షాత్కారాన్ని కూడా పొందాడు. తర్వాత తీర్థంకరుడిగా జైన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు.



బాహుబలి కథే ఒక సందేశం....
ఆత్మ విజయమే అసలు విజయం...
ఆత్మ బలమే మహా బలం అని నిరూపించారు
ఆశ, అహంకారం అనే రెండు బాహువులను నిర్వీర్యం చేసి తపస్సు, జ్ఞానం అనే దివ్య బాహువులను పొందిన మహనీయుడు బాహుబలి.
ఉపవాసం, ధ్యానం, పరోపకారం, తీర్థంకరుల బోధనలను ఆచరించడం... జైనుల నిత్యజీవన శైలి.
జైనులు బాహుబలిని గోమతేశ్వరుడని కూడా ఆప్యాయంగా పిలుచుకుంటారు.
శ్రావణబెళగొళలోని గోమతేశ్వరుడి యాభై ఏడు అడుగుల ఏకశిలా విగ్రహాన్ని చంద్రగిరి కొండల్లో చాముండరాయ సేనాపతి నిర్మించారు.
పన్నెండేళ్లకోసారి ఆయనకు మహామస్తకాభిషేకం చేస్తారు.

– కాటూరి రవీంద్ర త్రివిక్రమ్



దైవం సాహస రూపేణా!

పవిత్ర సంకల్పంతో. పదిమంది కోసం చేసిన త్యాగం జేజేలు అందుకొంటుంది. విజయం వరించినా, వీర స్వర్గం ధరించినా ఆ మహోన్నత త్యాగం మనిషిని దేవుడిగా నిలబెడుతుంది. ఆ గాథ భావితరాల గుండె గుడిలో దీపమై, ఆధ్యాత్మిక ప్రవృత్తిలో విడదీయలేని భాగమవుతుంది. అందుకే ప్రకృతి ఆరాధనకు పెద్దపీట వేసి, చిటికెన వేలిపై గోవర్ధనగిరినెత్తిన చిన్ని కృష్ణుడు మొదలుకొని అడవి తల్లి పరిరక్షణ కోసం అసువులు బాసిన సమ్మక్క, సారలమ్మల వరకు భక్తజన హృదయాల్లో దేవతా మూర్తులుగా కొలువులందుకొంటున్నారు. సంకల్పశుద్ధితో కూడిన సాహసాన్ని మానవ సమూహాల్లో మేల్కొల్పుతున్నారు..

ఆరాధన పద్ధతులు అనేక రకాలు. ప్రతి పద్ధతి వెనకా ఓ పవిత్ర ఆధ్యాత్మిక ప్రవృత్తి ఉంటుంది. సాటి వారి కోసం చూపిన సాహసం, చేసిన త్యాగం మనిషిని దేవుడిగా నిలబెడుతుంది. ఈ భావన మేడారం జాతరలో అడుగడుగునా స్ఫురిస్తుంది.

చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోవడం కన్నా సమూహంలో బతకడం మేలని తెలుసుకున్న మనుషులు గుంపులుగా ఏర్పడ్డారు. అది గణవ్యవస్థకు బీజం వేసింది. సామాజిక వ్యవస్థగా రూపుదిద్దుకుంది. అది సజావుగా సాగేందుకు అనువైన కట్టుబాట్ల నుంచి సంప్రదాయాలు, సంస్కృతులు శాఖోపశాఖలుగా విస్తరించాయి. అందులో భాగంగానే ప్రతి సమూహాన్ని ముందుండి నడిపించే వాళ్లకు, రక్షణ కల్పించే వాళ్లకు ప్రాధాన్యం లభించింది. సింహాసనమెక్కించింది. తమ సమూహానికి ముప్పు వాటిల్లినప్పుడు నేతలు తెగువ చూపించారు. ధైర్యసాహసాలు ప్రదర్శించారు. గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా వీరులుగా, అమరులుగా పూజలందుకున్నారు. తరాలు మారినా తమ పూర్వీకుల త్యాగాలు గుర్తుంచుకునే సంస్కృతి ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ ఏదో రూపంలో కొనసాగుతోంది.





"వీరగంధము తెచ్చినారము.. వీరుడెవ్వడొ తెల్పుడీ.. పూసిపోదుము.. మెడను వైతుము.. పూలదండలు భక్తితో.." అంటూ తరాలు మారినా తమ పూర్వీకుల త్యాగాలను గుర్తుంచుకొనే సంస్కృతి ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లోనూ ఏదో ఒక రూపంలో కొనసాగుతోంది. క్రీస్తుపూర్వం పది, తొమ్మిది శతాబ్దాల నాటి పురాతన గ్రీకు ధార్మికతలో సాహసవంతులైన అమరవీరులను ఆరాధించే సంప్రదాయం కనిపిస్తుంది. కవి హోమర్ తన సాహిత్యంలో గ్రీకువీరులను దైవ స్వరూపులుగా చూపించారు. రెండువేల సంవత్సరాల నాటి 'సంగం తమిళ సాహిత్యం'లో సైతం సమాజం కోసం సాహసాలు ప్రదర్శించి అమరులైన వారిని కీర్తించే గాథలున్నాయి. వారి దివ్య స్మృతులకు గుర్తులుగా రాతి బొమ్మలను పూజించడం కనిపిస్తుంది. అలాగే కర్ణాటక, రాజస్థాన్ ప్రాంతాల్లో త్యాగమూర్తులైన మహిళలను వీర పత్నులుగా ఆరాధించడం గమనించవచ్చు. తమదైన జీవనశైలి, సంస్కృతీ సంప్రదాయాలపై దాడి జరిగినప్పుడు, మనుగడ మసిగా మారి, మూలాలకు ముప్పు ఎదురైనప్పుడు ప్రాణాలను పణంగా పెట్టి... అగ్నిశిఖలతోనూ, అసిధారలతోనూ సై అంటూ సవాలు చేసి అమరులైన వారు దేవతామూర్తులుగా నిలిచిపోయిన ఉదంతాలు చరిత్రలో అనేకం. ఈ చరిత్ర వృక్షంలోని ఒక శాఖ ఏటూరునాగారంలో ఎర్రగా పుష్పించింది. మేడారం జాతరగా ఖ్యాతికెక్కింది. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిన్న మొదలై.. వారం రోజుల పాటు కొనసాగనుంది.

అడవి తల్లి ఒడిలో...

తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతికెక్కి, రెండేళ్లకోసారి జరిగే ఈ ధార్మికోత్సవంలో కొలువులు చెల్లించేందుకు సుమారు కోటిన్నర మంది భక్తులు తరలివస్తున్నారు. వారి రాకతో ఇప్పుడు అన్ని దారులూ మేడారం వైపే! ఏటూరునాగారం అడవుల్లో చెట్టు తల్లులకు చేతులెత్తి మొక్కడానికే. సమ్మక్క-సారలమ్మలకు హారతి పట్టి, కానుకలర్పించి కొలువులు చెల్లించడానికే. ఇందులో తెలంగాణ వాసులే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి పసివారు మొదలుకుని, పండు ముసలివారి వరకు తండోపతండాలుగా వస్తున్నారు. జంపన్న వాగులో స్నానాలు చేసి, వన దేవతలైన సమ్మక్క, సారలమ్మలకు కానుకలు సమర్పించి అమ్మలిద్దరికీ హారతులు పట్టి నిండు మనసుతో కొలువులు చెల్లిస్తున్నారు.


ఈ ఆధ్యాత్మిక ప్రవృత్తి వెనక అడవిని అమ్మగా, అందమైన బతుకమ్మగా కొలిచే దృక్పథం ఉంది. నీడనిచ్చి బువ్వపెట్టి, పచ్చని ఆకుల చేతులతో చల్లటిగాలిని వీస్తూ, గరిక పచ్చల ఒడిలో జోకొట్టి, వాగుల సవ్వడితో జోలపాడి, సేదతీర్చే అడవిని కొలవడమంటే అమ్మను కొలవడమే! ఆ ప్రకృతి కాపాడడమంటే కన్న తల్లిని కంటికి రెప్పలా చూసుకోవడమే. 'నువ్వు నన్ను కాపాడు... నేను నిన్ను కాపాడతాను' అంటుంది అడవి తల్లి. అలాంటి తల్లిని, అక్కడ చిగురించిన గిరిజన సంస్కృతిని కాపాడడం కోసం అమరులైన వన దేవతలే సమ్మక్క, సారలమ్మలు! అడవి తల్లికి ముద్దు బిడ్డలైన ప్రకృతి ప్రతిరూపాలు. ఈ సత్యాన్ని చాటిచెప్పడానికే ఆ తల్లులు చెట్ల రూపంలో పూజలందుకుంటున్నారు. తీయని ప్రేమను, విడదీయలేని భక్తిని బెల్లం రూపంలో 'బంగారు' కానుకగా అందుకుంటున్నారు. ఎనిమిది శతాబ్దాల నాటి సమ్మక్క, సారక్కల చరిత్ర అత్యంత స్ఫూర్తిదాయకం! గిరిజన సంస్కృతీ సంరక్షణోద్యమానికి తలమానికం! ఆ తల్లీబిడ్డల వీరోచిత కథనం కదిలిస్తుంది. కంటతడి పెట్టిస్తుంది... చెతులెత్తి మొక్కేలా చేస్తుంది.

– ఓలేటి శ్రీనివాసభాను

ఇస్లాం సందేశం

నోరు మంచిదైతే...

'నోరు మంచిదైతే.. ఊరు మంచిదవుతుంది' అని సామెత. మన మాటతీరే మనం ఎలాంటి వారిమో చెబుతుంది. మనుషుల మధ్య సంబంధాలకు.. మాటే వారధి. దీని వినియోగంపైనే మన సాఫల్య, వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. దేహంలోని అవయవాలన్నీ ఉదయాన్నే నోటితో.. "తల్లీ! నువ్వు కాస్త అదుపులో ఉండు. మంచి-చెడు తెలుసుకొని పలుకు. అనవసరంగా ఎదుటివారిని నిందించకు. నువ్వు ఏమాత్రం తూలినా.. మేమంతా (అవయవాలు) హూనం అయిపోతామ'ని వేడుకుంటాయట. నోరు జారితే.. చాలా అనర్థాలు జరుగుతాయి.



"ఒక స్త్రీ ఎన్నెన్నో.. నఫిల్ (విధిగా చేయవలసినవి కాక అదనపు ఆరాధనలు) నమాజులు చేస్తుంది. మరెన్నో ఉపవాసాలు పాటిస్తుంది. దానధర్మాలు చేస్తుంది. కానీ, ఆమెకు నోటి దురుసు. ఎవరు కంటపడితే వారిని దూషించేది" అని ఓ వ్యక్తి ప్రవక్త (స)తో నివేదించాడు. దానికి ప్రవక్త (స) "ఆ స్త్రీ నరకానికి పోతుంది" అని బదులిచ్చారు. ఆ వ్యక్తి మరో మహిళ గురించి చెబుతూ.. "ఒక స్త్రీ ఫర్జ్ (విధిగా ఆచరించేవి) నమాజులు. ఫర్జ్ రోజాలు మాత్రమే ఆచరిస్తుంది. నఫిల్ నమాజులు చేయడం అరుదు. దానధర్మాలు తక్కువే. కానీ, ఇరుగుపొరుగును పల్లెత్తు మాట అనదు. ఎవరి మనసూ నొప్పించదు. ఈమెకు దైవం కల్పించే స్థానం ఏమిటి?" అని అడిగాడు. "ఆమె స్వర్గవాసి" అని బదులిచ్చారు ప్రవక్త (స). ప్రార్థనలు, దానధర్మాలు ఉన్నతమైనవి. వాటిని ఆచరించే మనిషి కూడా ఉన్నత మనసు కలిగి ఉండాలి. ఇతరులను దూషిస్తూ.. దైవాన్ని ఆరాధిస్తే ఏ ప్రయోజనమూ ఉండదు. ఎదుటివారిలో దైవాన్ని చూసినప్పుడు.. వారి మనసును గాయపరచాలనే ఉద్దేశం కలగదు. పరుషంగా మాట్లాడరు.

– ఎం.డి.ఫారుఖ్ జునైద్‌ఖాన్

ధర్మ సందేహం

కాలక్షేపం కాకూడదని..

పుణ్యక్షేత్రాలు దర్శించుకున్న తర్వాత.. ఇతరుల ఇళ్లకు వెళ్తే.. యాత్ర వల్ల కలిగే పుణ్యమంతా వారికే దక్కుతుందని చెబుతారు. ఇది వాస్తవమా?

– శ్రీనాథ్, అవనిగడ్డ

ఏదైనా పుణ్యక్షేత్రం దర్శించిన తర్వాత సరాసరి తమ ఇంటికే వెళ్లాలనీ, మరెవరి ఇళ్లకూ వెళ్లరాదనీ.. శాస్త్రాలు చెప్పలేదు. ఇది ఒక ఆచారంగా వచ్చింది. క్షేత్రంలో స్వామి దర్శనంతో కలిగిన దివ్యానుభూతిని పదే పదే తలుచుకుంటూ.. ఇంటికి వచ్చి సమారాధన చేసి పదిమందికి ఆ అనుభూతిని పంచిపెట్టాలి. బంధుమిత్రుల ఇళ్లకు వెళ్తే.. అక్కడ మళ్లీ ప్రాపంచిక వ్యవహారాల ప్రస్తావనతో తీర్థయాత్ర, దైవ సందర్శన కాలక్షేపంగా మిగిలిపోతాయి. ఈ దృష్టితోనే పెద్దలు ఈ విధానాన్ని అనుసరించి ఉంటారు. ఇతరుల ఇళ్లకు వెళ్లినంత మాత్రాన.. యాత్ర చేసిన పుణ్యం ఆ కుటుంబానికి చెందుతుందనే అపోహ సరికాదు.

క్రీస్తువాణి

మీ కుటుంబం అలాగే ఉందా?



సమాజం బాగుండాలంటే కుటుంబాలు బాగుండాలని క్రీస్తు ఉపదేశించేవారు. తమ వారిపైనే అనుక్షణం కోపంతో, పగతో రగిలిపోయే వారు ఎప్పటికీ దైవ సామ్రాజ్యానికి అర్హులు కాదని ఆయన చెప్పేవారు. తోబుట్టువులపై కోపం చూపేవాడు విమర్శలపాలవుతాడు. నీవు దేవుని వద్ద శరణు పొందేటప్పుడు నీకు, నీ సోదరుడికి విరోధం ఉందని గుర్తుకు వస్తే ముందు నీ సోదరునితో సమాధానపడు. అదే నీవు దేవునికి నీవు ఇచ్చే మంచి సమర్పణ అవుతుందని ఆయన అన్నారు. ఒకసారి ఒక శిష్యుడు ప్రభువును ప్రశ్నించాడు... 'తండ్రీ నా సోదరుడు తప్పు చేస్తే నేను ఎన్నిసార్లు క్షమించాలి.. ఏడుసార్లా?' అని.. అప్పుడు ప్రభువు 'ఏడు సార్లు కాదు... డెభ్బై ఏడు సార్లు!' అని సమాధానం ఇచ్చాడు. ఎన్నిసార్లు తప్పు చేసినా క్షమించాల్సిందే అని దీని అర్థం. కుటుంబాల్లోని సభ్యులంతా ఒకరి కోసం మరొకరు అనే రీతిగా బతకాలి. ప్రేమ, నమ్మకం, నిబద్ధత కలిగిన కుటుంబాలతో కూడిన సమాజం, అలాంటి సమాజం ఉన్న దేశం శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లుతాయన్నది ఆయన సందేశం. – ఎం.సుగుణరావు

మల్లన్న చెల్లి.. కొండపోచమ్మ తల్లీ..!!

కొన్ని ప్రముఖ ఆలయాల దర్శనానికి ముందో.. వెనకో మరో ఆలయాన్ని తప్పనిసరిగా దర్శించుకోవాలనే సంప్రదాయం పలు ప్రాంతాల్లో ఆచరణలో ఉంది. మేడారం జాతరకు ముందు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం కొన్ని తెలంగాణ జిల్లాల్లో ఆనవాయితీ. ప్రఖ్యాత కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రానికి కూడా అలాంటి అనుబంధ క్షేత్రం ఒకటి ఉంది. దాని గురించి తెలుసుకుందామా..

సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం అందరికీ సుపరిచితమే. సంక్రాంతి నుంచి ఉగాది వరకు ఏటా ఇక్కడ జరిగే జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివస్తుంటారు. అయితే, ఈ ఆలయాన్ని దర్శించినవారు మల్లన్న చెల్లెలు దగ్గరికీ తప్పనిసరిగా వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. సిద్దిపేట జిల్లాలోనే జగదేవపూర్ మండలం తిగుల్ నర్సాపూర్‌లో వెలిసిన కొండపోచమ్మ దేవతే మల్లన్న చెల్లెలుగా ప్రసిద్ధి. మల్లన్నను దర్శించుకున్న భక్తులు తర్వాత కొండపోచమ్మ దగ్గరికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. అప్పుడే యాత్ర సంపూర్ణమైనట్లుగా భావిస్తారు. కొమురవెల్లిలో జాతర జరిగినన్ని రోజులు కొండపోచమ్మ సన్నిధి కూడా భక్తులతో సందడి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పాములపర్తి వద్ద నిర్మిస్తున్న భారీ రిజర్వాయర్‌కు సైతం కొండపోచమ్మ పేరే పెట్టడం విశేషం.

ఎలా వెళ్లాలి

హైదరాబాద్ నుంచి నేరుగా వెళ్లేవారు రాజీవ్ రహదారిపై కుకునూరుపల్లి వద్ద కుడివైపునకు తిరిగితే.. బొబ్బాయిపల్లి, రామునిబండ మీదుగా 4 కి.మీ. ప్రయాణించి కొండపోచమ్మ క్షేత్రానికి చేరుకోవచ్చు. కొమురవెల్లి నుంచి ఈ ఆలయం సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

– ఆదరాసుపల్లి గిరిధర్

దర్శనీయం

పురాణ ప్రతీతి..

ఒకానొక సందర్భంలో తన సోదరుడు మల్లన్నతో విభేదించిన పోచమ్మ అలిగి తిగుల్ నర్సాపూర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వచ్చి స్థిరపడిందట. కొమురవెల్లి రావాలని మల్లన్న ఎంతగా బతిమిలాడినా పోచమ్మ ససేమిరా అందట. పోచమ్మను శాంతింపజేయడానికి ఏం వరం కావాలో కోరుకో అన్నాడట మల్లన్న. కొమురవెల్లికి వచ్చిన ప్రతి భక్తుడూ.. తన దర్శనం కూడా చేసుకునేలా వరమడిగిందట పోచమ్మ. నాటి నుంచి కొమురవెల్లి వచ్చిన భక్తులంతా కొండపోచమ్మ దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారని పురాణ ప్రతీతి.



ఈనాడు సినిమా



రకుల్ ప్రీత్ సింగ్

నవ్వుకొన్నా తప్ప.. బాధపడలేదు!

"సున్నిత మనస్కురాలినే. అలాగని నా గురించి ఎవరో ఏదో అనుకొంటున్నారని కంగారు పడిపోను" అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. అచ్చమైన తెలుగమ్మాయిలా మారిపోయిన ఈమె ప్రస్తుతం తమిళం, హిందీ చిత్రాలపైనే దృష్టిపెట్టింది. త్వరలోనే తెలుగు సినిమాకి సంబంధించిన కొత్త కబుర్లు వినిపిస్తానంటోంది. హిందీకి వెళ్లినా ఈమెని తెలుగు చిత్ర పరిశ్రమకి సంబంధించిన విషయాల గురించీ ఆరా తీస్తున్నారంతా. ఏ విషయం గురించి అడిగినా ధైర్యంగా సమాధానం చెప్పే గడసరిగా రకుల్‌కి గుర్తింపు ఉంది. తనపై వచ్చిన పుకార్ల గురించీ ఎప్పుడూ బాధపడలేదంటోంది. "నా గురించి వినిపించిన మాటలు నాకు నవ్వునే తెప్పించాయి తప్ప, ఎప్పుడూ బాధపడింది లేదు. సామాజిక మాధ్యమాల వల్ల ఎవరేం మాట్లాడుకొన్నా నా దృష్టికొస్తుంది. వాటి గురించి వెంటనే స్పందిస్తుంటా. ఆచితూచి మాట్లాడటం అలవాటు లేదు. ఉన్నదున్నట్టు మొహం మీదే చెప్పేస్తా. దాంతో నా సమస్యలన్నీ అప్పటికప్పుడే పరిష్కారమైపోతుంటాయి. నా తీరు నాకు మంచే చేసింది" అని చెప్పింది రకుల్.



ఈషా, అనుష్క, నిత్యమేనన్, కీరవాణి, ప్రశాంతి, రాజమౌళి, ప్రశాంత్, నాని, కాజల్, ప్రియదర్శి, రెజీనా

నా సంపాదనంతా ఇక్కడే పెట్టడానికి సిద్ధం!

"నాని వరుసగా విజయాలు అందుకొంటున్నాడు. ఎన్ని విజయాలో తనకి కూడా గుర్తుందో లేదో! ఒక సినిమా విడుదలైన తర్వాత 'దీన్ని దాటి మరో మెట్టు ఎదగాలి, దానికోసం మేమంతా ఎదురు చూస్తున్నాం' అని తనకి సందేశం పంపా. ఆ వెంటనే చేపలాగా కనిపించి ఆశ్చర్యపరిచాడు" అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. ఆయన బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన 'అ!' ముందస్తు విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాని చేపగా నటిస్తూ ప్రశాంతితో కలిసి నిర్మిస్తున్నారు. కాజల్, నిత్యమేనన్, రెజీనా, ఈషా, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ దర్శకుడు. రాబిన్ స్వరకర్త. ఎస్.ఎస్.రాజమౌళి, అనుష్క, ఎం.ఎం. కీరవాణి ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం రాజమౌళి మాట్లాడుతూ "నా సన్నిహిత మిత్రులు, ఇష్టమైనవాళ్లు కలిసి చేసిన సినిమా ఇది. ట్రైలర్ చూడగానే సినిమా చూడాలనిపించింది. ఆ విషయంలో దర్శకుడు ప్రశాంత్‌ని అభినందించాలి. నాని సినిమా అంటే విజయం అనే ఓ గ్యారెంటీ వచ్చేసింది. తను మరింతగా ఎదగాలని కోరుకొంటున్నా. ఇందులోని నటుల జాబితాని చూడగానే ఇంతమంది కలిసి ఈ సినిమాలో నటిస్తున్నారంటే ఇందులో ఏదో ఉందనే అభిప్రాయం కలిగింది. ఈ సినిమా ఒక సెట్టర్‌గా నిలుస్తుందని నమ్ముతున్నా"న్నారు. అనుష్క మాట్లాడుతూ "ఈ సినిమా గురించి తెలిసిన తొలి రోజు నుంచే ఆత్రుతగా ఉన్నా. తొలి రోజు తొలి ఆట చూసే సినిమా ఇది" అన్నారు. "సినిమా పేరు కంటే, నిర్మాణ సంస్థ పేరు ఇంకా బాగుంద"న్నారు ఎం.ఎం.కీరవాణి. కాజల్ మాట్లాడుతూ "చాలా కొత్త కథ. ఇలాంటి ప్రయత్నం నా కెరీర్‌లో తొలిసారి చేశా"న్నారు. నిత్యమేనన్ మాట్లాడుతూ "ఒక్క సెకను ఆలోచించకుండా ఈ సినిమా చేయడానికి ఒప్పుకొన్నా. 'అలా మొదలైంది' సమయంలో నాని, నేను టామ్ అండ్ జెర్రీలా గొడవపడేవాళ్లం. ఇప్పుడు మేమిద్దరం ఎదిగాం" అన్నారు. దర్శకుడు ప్రశాంత్ మాట్లాడుతూ "చేప పాత్ర కోసం వాయిస్ ఇవ్వాలని నానిని సంప్రదించా. ఆయన ఈ కథ వినగానే 'చాలా బాగుంది. చిన్నగా కాకుండా ఒక స్థాయిలో తీయాల్సిన సినిమా ఇది' అన్నారు. అన్నట్టుగానే ఆయన ఈ సినిమాలో భాగమయ్యాక పెద్ద సినిమా అయ్యింది. ప్రతిభగల నటులున్నారు ఇందులో. నిజాయతీతో చేసిన ప్రయత్నమిది" అన్నారు. నాని మాట్లాడుతూ "ప్రశాంత్‌ను దర్శకుడుగా నేను పరిచయం చేస్తున్నానన్న గర్వంగా ఉంది. మనందరిలో ఓ తిక్క ఉంటుంది. ఆ తిక్కని సంతృప్తి పరిచే చిత్రమిది. ప్రశాంత్ ఎప్పుడైతే ఈ కథ చెప్పాడో, దీనికి ఒక మంచి నిర్మాత కుదిరితే అందరికీ చేరువయ్యే సినిమా అవుతుందనిపించింది. దాంతో నేనే నిర్మాతనయ్యా. ఈ రోజు వరకు నేను సంపాదించింది అంతా సినిమాల నుంచే. అందుకే మొత్తం సినిమామీదే పెట్టడానికి సిద్ధంగా ఉన్నా. ఇలాంటి కథని ప్రోత్సహించకపోతే మంచి సినిమాలు ఎప్పుడూ రావనిపించింది. సినిమాని నేను నిర్మిస్తున్నానని తెలియకముందే ఈ సినిమాకి వాయిస్ ఓవర్ ఇస్తానని ఒప్పుకొన్నారు రవితేజ అన్న. ఇందులోని పాత్రల్లో వేరొకరిని ఊహించలేం అనేలా నటించారంతా. రాబిన్, కార్తీక్‌తో పాటు ఇతర సాంకేతిక బృందమంతా చక్కటి సహకారం అందించింది. ఈ నెల 16 చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"న్నారు. ఈ కార్యక్రమంలో సాయి కొర్రపాటి, రమా రాజమౌళితో పాటు చిత్రబృందం పాల్గొంది.



కల్యాణ్‌దేవ్, చిరంజీవి, సెంథిల్, కీరవాణి, రాజమౌళి, మాళవిక నాయర్, రాకేష్ శశి

చిరు అల్లుడి చిత్రం ప్రారంభం

ప్రముఖ కథానాయకుడు చిరంజీవి కుటుంబం నుంచి మరో నటుడు వెండితెరపై సందడి చేయబోతున్నాడు. చిరు అల్లుడు కల్యాణ్‌దేవ్ కథానాయకుడిగా వారాహి చలన చిత్రంపై ఓ సినిమా తెరకెక్కుతోంది. మాళవిక నాయర్ కథానాయిక. రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి కొర్రపాటి నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్‌నిచ్చారు. ఎం.ఎం.కీరవాణి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఎస్.ఎస్.రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత మాట్లాడుతూ "కల్యాణ్‌దేవ్ తొలి చిత్రాన్ని మేం నిర్మిస్తుండడం ఆనందంగా ఉంది. దర్శకుడు రాకేష్ శశి ఒక మంచి కాన్సెప్టుతో స్క్రిప్టుని సిద్ధం చేశారు. అందుకు తగ్గట్టుగానే ఉన్నతమైన నిర్మాణ విలువలతో చిత్రాన్ని రూపొందించబోతున్నాం. 'బాహుబలి 2' తర్వాత సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'రంగస్థలం' చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ కళా విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు. త్వరలోనే చిత్రీకరణ మొదలుపెడతాం" అన్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో ఎన్వీ ప్రసాద్, గుణ్ణం గంగరాజు, కల్యాణ్ కోడూరి, అవసరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే నిర్మాతగా మారా!

"నిర్మాతల్లో డి.రామానాయుడు అంటే ఇష్టం. ఆయన స్ఫూర్తితోనే ఇప్పటివరకు 70 చిత్రాలు నిర్మించా. ఇదే ఉత్సాహంతో వంద చిత్రాలు పూర్తి చేస్తా" అన్నారు సి.కల్యాణ్. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వరుసగా చిత్రాలు నిర్మిస్తున్నారాయన. ఈ ఏడాది ఆరంభంలోనే 'జై సింహా'తో విజయాన్ని అందుకొన్నారు. సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా వి.వి. వినాయక్ దర్శకత్వం వహించిన 'ఇంటిలిజెంట్' చిత్రానికీ ఆయనే నిర్మాత. ఆ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సి.కల్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



"వి.వి.వినాయక్, నేను అన్నదమ్ముల్లా మెలుగుతుంటాం. ఆయన దర్శకత్వంలో నేను తొలిసారి సినిమాని నిర్మించా. 'ఇంటిలిజెంట్' సినిమా మాకు ఓ గొప్ప ప్రయాణం. కథ విషయంలో పూర్తిగా సంతృప్తి చెందితేనే సినిమా తీస్తాడు వినాయక్. సినిమా పేరుకు తగ్గట్టుగానే సినిమాని చాలా తెలివిగా తీర్చిదిద్దాడు. సాయిధరమ్ కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకొనే ఓ మంచి చిత్రమవుతుంది. విడుదలయ్యే సినిమాలన్నీ బాగా ఆడాలి. అప్పుడే పరిశ్రమకి మేలు జరుగుతుంది. సాయిధరమ్ తేజ్ నటించిన 'ఇంటిలిజెంట్', వరుణ్‌తేజ్ నటించిన 'తొలి ప్రేమ'కి పోటీ ఎంత మాత్రం కాదు. వరుణ్‌తోనే నాకు అనుబంధం ఎక్కువ. అందుకే 'లోఫర్' చిత్రాన్ని కలర్‌ఫుల్‌గా తీశాం. ఈ రెండు సినిమాలతో పాటు, అన్నయ్య మోహన్ బాబు నటించిన 'గాయత్రి' కూడా విజయవంతం కావాలని కోరుకొంటున్నా".

"సహాయ దర్శకుడిగా ప్రయాణం మొదలుపెట్టా. అప్పట్లో సుమన్, జయసుధ, సుహాసిని కలయికలో ఓ సినిమా తెరకెక్కించాలనుకొన్నా. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా ఆగిపోయింది. దాంతో నిర్మాతగా మారా. 'ఇంటిలిజెంట్' నా 70వ సినిమా. నాపై మా గురువు, రచయిత సత్యమూర్తి ప్రభావం ఎక్కువ. కథలపై దర్శకులకి నా సలహాలు, సూచనలు ఇస్తూ సినిమాలు నిర్మిస్తుంటా. త్వరలోనే 'భారతి' అనే ఓ సినిమా నిర్మించబోతున్నా. రానా నటిస్తున్న '1945' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. ఆ తర్వాత వినాయక్ దర్శకత్వంలో మరో సినిమా ఉంటుంది. నిర్మాతగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ జాతీయ సినీ కార్మిక సమాఖ్యకి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కొద్దిమంది చేతుల్లో దోపిడీకి గురవుతున్నారు. దానిపై మార్చి 1 నుంచి థియేటర్ల బంద్‌కి పిలుపునిస్తున్నాం".



బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, దిల్‌రాజు

ఒకరోజు ఆలస్యంగా 'తొలిప్రేమ'

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలి ప్రేమ'. ఈ నెల 9న ఈ చిత్రాన్ని విడుదల చేద్దామనుకున్నారు. అయితే అదే రోజున సాయిధరమ్ తేజ్ నటించిన 'ఇంటిలిజెంట్' కూడా వస్తోంది. అందుకే 'తొలిప్రేమ'ని ఒకరోజు ఆలస్యంగా అంటే.. 10న విడుదల చేస్తామంటున్నారు నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ నిర్మాత, 'తొలిప్రేమ' పంపిణీదారుడు దిల్‌రాజు మాట్లాడుతూ "ఒకే రోజు రెండు మెగా చిత్రాలు విడుదల అవుతున్నాయి. వీటిలో ఏ సినిమా చూడాలా? అనే గందరగోళంలో ఉన్నారు అభిమానులు. వాళ్ల కోసం 'తొలిప్రేమ'ని ఒకరోజు ఆలస్యంగా విడుదల చేస్తే బాగుంటుందని భావించాం. సి.కల్యాణ్‌కీ మాకూ మధ్య సరైన సమాచారం లేకపోవడం వల్ల ఈ నెల 9నే రెండు చిత్రాల విడుదల తేదీలు ప్రకటించాల్సి వచ్చింది. పోటీ పడడం వ్యక్తిగతంగా నాకు ఇష్టం ఉండదు. ఏ సినిమా చేసినా కష్టపడతాం. అంతిమంగా డబ్బులు రావాలన్నది ప్రతి నిర్మాత ఆశయం. మామధ్య పోటీ ఉండకూడదు. అందుకే మాలో మేం మాట్లాడుకుంటాం. అయితే విదేశాల్లో ముందు అనుకున్న సమయానికి విడుదల చేసే అవకాశం ఉంది. ఈ విషయంలో పంపిణీదారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం. 'తొలిప్రేమ' సినిమా చూశా. ఈ సంస్థలో వచ్చిన మంచి చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంద"న్నారు. "ప్రేమికుల రోజు కానుకగా ఈ నెల 9న తీసుకొద్దామనుకున్నాం. ఈగోలకు పోకుండా బాధ్యత గల నిర్మాతగా ఈ నిర్ణయం తీసుకున్నామ"న్నారు బివిఎస్ఎన్ ప్రసాద్.

గీతోపదేశం

ఒకే ఒక్క జీవితం ఇది చెయ్యిజారిపోనీకు
మళ్లీ రాని ఈ క్షణాన్ని మన్నుపాలు కానీకు
కష్టమనేది లేని రోజంటూ లేదు కదా
కన్నీరు దాటుకుంటూ సాగిపోగ తప్పదు కదా

గీతం: ఒకే ఒక్క జీవితం.., చిత్రం: మిస్టర్ నూకయ్య
రచన: రామజోగయ్య శాస్త్రి
- పంపినవారు: జి.మధుసూదన్, ఖమ్మం

అమ్మకు నచ్చిన అమ్మాయినే పెళ్లాడతా!



"అమ్మాయిలతో మాట్లాడ్డానికి సిగ్గుపడే నన్ను లవర్ బోయ్, చాక్లెట్... ఐస్‌క్రీమ్.. ఇలా పలు రకాల పేర్లతో పిలుస్తుంటారు. నిజానికి నాలో ఎవరికీ తెలియని కరకుతనం కూడా దాగి ఉంది. అలాంటి నన్ను, నన్నుగా చూపించే సినిమానే 'ఛలో'" అంటున్నాడు నాగశౌర్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఛలో'. ఈ నెల 2న విడుదలవుతుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నాగశౌర్య విలేకర్లతో ముచ్చటిస్తూ చెప్పిన విశేషాలు...

"ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఓ ఊరు గొడవలతో రెండుగా విడిపోతుంది. ఓ అబ్బాయి తన ప్రేమని సాధించుకోవడానికి ఆ ఊరు వెళతాడు. ఆ గొడవల్లో తలదూరుస్తాడు. తర్వాత ఆ రెండూళ్ల వారికీ నచ్చేలా ఎలాంటి తీర్పునిచ్చాడనేదే సినిమా. పతాక దృశ్యాలను ఇప్పటివరకు చూడని విధంగా ఆసక్తికరంగా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించాడు. 'జాదూగాడు' సినిమాకి అసిస్టెంట్‌గా చేస్తోన్నప్పట్నుంచీ ఆయనతో పరిచయం ఉంది. ఈ పక్కా కమర్షియల్ చిత్రాన్ని మా ఐరా క్రియేషన్స్‌లో 'ఛలో' పేరుతో తొలి ప్రయత్నంగా అమ్మ ఉషా ముల్పూరి తీశారు. నేను కథలో తప్ప నిర్మాణంలో జోక్యం చేసుకోలేదు. అమ్మకి మా బాబాయి బుజ్జి, మావయ్య శ్రీనివాసరెడ్డి సహకారం అందించారు. ఛాయాగ్రాహకుడు సాయిశ్రీరామ్, సంగీత దర్శకుడు స్వర సాగర్ మహతి సినిమాకి ప్రాణం పోశారు. 'బ్రూస్‌లీ' సినిమాలోని 'లే ఛలో' పాట ఉంది. అది వినగానే ఆ పదం టైటిల్‌గా పెడదామని వెంకీకి సూచించా. కథకి సరిపోతుండటంతో 'ఛలో'నే నిర్ణయించాం. ఎప్పుడూ నా సినిమాల గురించి మాట్లాడని అమ్మ 'ఛలో' చూడగానే 'భలే...చేశావ్‌రా' అని పొగిడేసింది. అమ్మ దీవెనలు తప్పక నెరవేరుతాయి. ఇందుకు నిదర్శనం ఈ సినిమా వ్యాపారం మన దేశంలోనూ, విదేశాల్లోనూ బాగా జరగడమే".

"అదేంటో తెలియదుగానీ నాతో చేసిన నాయికలతో ముడిపెట్టేస్తూ, వాళ్లతో నా పెళ్లంటా..! అంటూ పలు పుకార్లు ప్రచారమవుతున్నాయి.. అవేవీ నిజం కావు. అన్నీ అబద్ధాలే. అమ్మాయిలతో మాట్లాడాలంటేనే సిగ్గుపడతాను. ఇల్లు వదిలి బయట తిరగనే తిరగను. బోర్ అనిపిస్తే ఇంట్లోనే మిత్రులతో గడిపేస్తాను. నాకు ఎవరన్నా ఫోన్ చేయాలన్నా వీలుండదు. ఎందుకంటే నేను సెల్‌ఫోన్ వాడను. నా మిత్రులే నా సెల్‌ఫోన్ (నవ్వుతూ). నా తొలి నాళ్లల్లో ఆ పుకార్లు కొంచెం బాధ కలిగించాయి. రాను రాను అలవాటైపోయింది. పట్టించుకోవడం మానేశా. నిజానికి నేను ఎవరినీ ప్రేమించలేదు. ప్రేమిస్తే పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకుంటా. పెద్దలు కుదిర్చిన పెళ్లయితే... పెళ్లయ్యాక ప్రేమిస్తా. ఈ తిరకాసంతా ఎందుకుగానీ... అసలు, అమ్మ చూసిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను. కానీ అదీ ఇప్పుడు కాదు మూడు నాలుగేళ్ల తర్వాతే"


"కారణాలేవయినా నాకు ఈ మధ్యకాలంలో సరైన విజయాలు దక్కలేదు. ఇకనుంచీ తగిన జాగ్రత్తలు తీసుకుంటాను. నా సినిమా సెట్‌కి వెళ్లకముందే నా బాధ్యతగా కథలో పాలుపంచుకుంటాను. కానీ సెట్‌కెళ్లాక జోక్యం చేసుకోను. కథ పక్కాగా తయారైన తర్వాత సినిమాకి శ్రీకారం చుడతాను. ఇలానే సాయిశ్రీరామ్ దర్శకత్వంలో మార్చి నుంచి చేసే చిత్రం స్క్రిప్టు పక్కాగా సిద్ధమైంది. ఇది విభిన్నమైన ప్రేమకథ. ఐరా క్రియేషన్స్‌లో నా రెండో చిత్రం 'నర్తనశాల' నాలుగు నెలల్లో మొదలుకానుంది. దీనికి కృష్ణవంశీ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన శ్రీనివాస్ దర్శకుడు. పాత 'నర్తనశాల'కీ ఈ చిత్రానికీ చాలా తేడా ఉంటుంది. ఇది పక్కా కమర్షియల్ చిత్రం."

కాలేజీలో 'కిరాక్ పార్టీ'



అనిల్ సుంకర, తేజ, సంయుక్త, నిఖిల్, సిమ్రన్, శరణ్

నిఖిల్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. సిమ్రన్, సంయుక్త హెగ్డే కథానాయికలు. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు తేజ ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. ఇదేదో మాట వరసకు చెప్పడం లేదు. నాకు నచ్చకపోతే.. అది మొహంమీదే చెప్పేస్తా. ఈ సినిమా బాగా ఆడుతుందనిపిస్తోంది. కథానాయికలిద్దరూ బాగున్నార"న్నారు. అనిల్ సుంకర మాట్లాడుతూ "వినోదం, భావోద్వేగాలు నిండిన ఓ కాలేజీ కథ ఇది. ఈమధ్యకాలంలో విడుదలైన చిత్రాల్లో అత్యుత్తమంగా నిలుస్తుంద"న్నారు. "కన్నడలో మంచి విజయం సాధించిన చిత్రమిది. తెలుగు వాతావరణానికి, ఇక్కడి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా తీర్చిదిద్దాం. చందూ మొండేటి, సుధీర్ వర్మ అందించిన సహకారం మర్చిపోలేన"న్నారు దర్శకుడు. "ఈ కథలో నేను కథానాయకుణ్ని కాదు. కాలేజీనే అసలైన హీరో. నాతో పాటు నటించిన తొమ్మిది మందీ కథానాయకులే. ఈ సినిమాకి పనిచేస్తున్నప్పుడు 'హ్యాపీడేస్' గుర్తొచ్చింది. అప్పట్లో మేమంతా కలసి మెలసి నిజంగానే స్నేహితుల్లా పనిచేశాం. చివరి రోజు సెట్లోంచి వెళ్లలేక అందరూ ఏడ్చేశాం. దాదాపుగా 'కిరాక్ పార్టీ'కీ అలానే జరిగింద"న్నారు నిఖిల్. సంగీతం: అజనీష్ లోక్‌నాథ్



సల్మాన్, సంతోషి

దేవుడు.. దెయ్యం

సల్మాన్, మేఘన, సంతోషి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హెచ్‌బీడీ'. హ్యాక్ బై డెవిల్ అనేది ఉపశీర్షిక. కృష్ణ కార్తిక్ దర్శకుడు. ఉదయ్ భాస్కర్ నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రచార చిత్రాల్ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "దేవుడు ఉంటే దెయ్యం ఉన్నట్టే. ఒకటి నమ్మితే రెండోదీ నమ్మి తీరాల్సిందే. కంటికి కనిపించకపోతే లేదని కొట్టిపారేయలేం. ఈ విషయాన్నే ఈ చిత్రం ద్వారా చెబుతున్నాం. హారర్ కథల్లోనే కొత్త కోణంలో సాగే చిత్రమిద"న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ పట్నాయక్, రాజ్ కందుకూరిలతో పాటు తెలంగాణ శాసన సభ్యులు ఎస్.ప్రభాకర్, నవీన్ యాదవ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'హౌరా బ్రిడ్జ్' పాటలు



నవీన్‌చంద్ర, నారా రోహిత్, పత్తిపాటి పుల్లారావు, చాందినీ చౌదరి, రాహుల్, చరణ్, రేవన్

రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి, మనాలీ రాథోడ్ నాయకానాయికలుగా నటించిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. రేవన్ యాదు దర్శకత్వం వహించారు. ఇ.ఎమ్.వి.ఈ స్టూడియోస్ సంస్థ నిర్మించింది. శేఖర్ చంద్ర స్వరాలు సమకూర్చిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. కథానాయకుడు నారా రోహిత్ తొలి సీడీని ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పత్తిపాటి పుల్లారావు స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ "వినూత్నమైన కథ, కథనాలతో తెరకెక్కించిన చిత్రమిది. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్ల సినిమా బాగా వచ్చింది. శేఖర్ చంద్ర సంగీతం చిత్రానికి ప్రధాన బలం"అన్నారు. "యాదు హుందాతనంతో కూడిన పాత్రల్ని సృష్టించారు. ఈ సినిమా ప్రయాణం ఒక మంచి అనుభూతిని మిగిల్చింది" అన్నారు రాహుల్. "ఒక మంచి ప్రేమకథ ఇది. ఇందులో నటిస్తూ చాలా విషయాలు నేర్చుకొన్నా. ఈ సినిమాతో రాహుల్ రవీంద్రన్ రూపంలో ఓ మంచి స్నేహితుడు దొరికాడ"ని చెప్పారు చాందినీ చౌదరి. మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ "మంచి కథతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో నిఖిల్, నవీన్‌చంద్ర, రాజారవీంద్ర, సాయి కార్తీక్, లలిత్ చరణ్, ప్రతాని రామకృష్ణగౌడ్, జె.ఎన్.రాజు, అశ్విన్‌కుమార్ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'శతమానంభవతి'



పిల్లల పుట్టిన రోజు అంటే మనకీ పండగే. ఆ రోజు పిల్లలకు నచ్చిన పదార్థాలు చేయడమే కాదు, వాళ్లను కాస్త ఆశ్చర్యపరచండి. కుదిరితే ఇలా చేసి చూడండి.

బుడగలు అంటే ఇష్టపడని చిన్నారులు ఉండరు. అందుకే వారు నిద్రలేచే సమయానికి ముందే వాళ్ల గదిని బుడగలతో నింపేయండి.

ఆ రోజు తమకిష్టమైన వంటకాలకే ప్రాధాన్యం ఇవ్వండి. ముఖ్యంగా అల్పాహారాన్ని ప్రత్యేకంగా తయారు చేయండి. ఆహార పదార్థాలను కూడా ప్రత్యేకమైన, కొత్త పళ్లెంలో అందిస్తే పిల్లల ఆనందం అంతా ఇంతా కాదు. మధ్యాహ్న భోజనాన్ని కూడా ప్రత్యేకంగా ప్యాక్ చేసి అందిస్తే చిన్నారులు సంతోషపడతారు. ఇలాంటివి ఇప్పుడు మార్కెట్‌లో బోలెడు దొరుకుతున్నాయి.

వారు పుట్టిన సందర్భాన్నీ, ఆ రోజును పిల్లలకు వివరించే ప్రయత్నం చేయండి.

పుట్టినరోజుకు వారం ముందు నుంచీ ప్రతి రోజూ ఒక బహుమతి వారికి ఇవ్వండి. ఒక రోజు వారికిష్టమైన ఐస్‌క్రీమ్, మరోరోజు స్కూల్ నుంచి నేరుగా పార్క్‌కి తీసుకువెళ్లడం. . లాంటివన్నమాట. అలాగే పూర్తయిన సంవత్సరాలు తెలిపేలా అంకెను సూచించే దుస్తులు వేసి చూడండి.

పాప/బాబు పుట్టినరోజు సందర్భంగా దగ్గరలోని వృద్ధాశ్రమం/చిన్నారులు ఉండే హోమ్‌కి వెళ్లి వారితో కాసేపు గడిపేలా చూడండి. అలాగే వాళ్లచేతే ఏదయినా సాయం చేయించాలి. ఇది పిల్లలకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సేవా గుణం కూడా అలవడుతుంది.

అద్దాలపై మరకలా... టీపొడి ఉందిగా



మనం రోజూవారీ ఉపయోగించే టీపొడితో చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దాన్ని ఎన్ని రకాలుగా వాడుకోవచ్చో ఒకసారి చూద్దామా..

అద్దాలూ, కిటికీలూ, సిరామిక్ టైల్స్‌మీద త్వరగా మరకలు పడుతుంటాయి. అలాంటప్పుడు టీబ్యాగులు మరిగించిన నీటితో తుడిచి చూడండి. మార్పు మీకే తెలుస్తుంది.

ఫ్రిజ్‌లో కూరగాయల తాలూకు వాసన వదలడం లేదా? ఒక మూలన రెండు మూడు టీ బ్యాగులు పెట్టి చూడండి.

కారు ఫ్రెష్‌నర్ల కోసం చాలా ఖర్చు పెడుతుంటాం. అలాకాకుండా కారులో రెండు టీ బ్యాగులు ఉంచండి. కనీసం వారం వరకు కారు లోపల ఎలాంటి దుర్గంధం రాకుండా ఉంటుంది.

ఎండలో తిరగడం వల్ల ముఖం కమిలిపోయినట్లు అనిపిస్తే టీ బ్యాగును కాసిని నీటితో తడిపి సమస్య ఉన్న ప్రదేశంలో ఉంచి చూడండి. దీని వల్ల చర్మం తాజాగా మారుతుంది. అలాగే కళ్లమీద కూడా వాడేసిన, చల్లనిటీబ్యాగుల్ని పెట్టుకుంటే అలసట తగ్గి, కళ్లు మిలమిలలాడతాయి.

పెంపుడు జంతువులకు తరచూ చిన్న చిన్న పురుగులు అంటుకుంటాయి. వాటికోసం హానికర రసాయనాలు వాడకండి. బదులుగా కాస్త టీ పొడిని చల్లండి. ఫలితం ఉంటుంది.

టీ పొడి వేసి మరిగించిన నీళ్లతో తలస్నానం చేసిచూడండి. ఇది చక్కని కండిషనర్‌లా పనిచేస్తుంది. జుట్టుకు అవసరమైన తేమ అందుతుంది. పోషణ అంది పట్టులా మారుతుంది.

కార్పెట్‌మీద ఏమైనా పడి వాసన వస్తుంటే టీ పొడి చల్లితే చాలు. పదినిమిషాలు అలా వదిలేసి ఆ తరువాత దులిపేసి, కాసేపు ఎండలో ఉంచితే చాలు.

అబ్బాయిల కన్నా ఎక్కువగా కష్టపడగలం..
ఏ పని చెప్పినా సాధించి చూపించే తెగువ మా సొంతం...
అవసరం అయితే అర్ధరాత్రి వరకూ ఉండి కూడా పనిచేయగలం..

మనం... మారక్కర్లేదట!

ఒక ఉద్యోగినిగా మీ ప్రత్యేకతలు చెప్పమని అడిగితే... చాలామంది నుంచి వచ్చే సమాధానాలు ఇంచుమించు ఇలానే ఉంటాయి. పురుషాధిక్యత ఉన్న రంగాల్లో రాణించాలంటే ఇవన్నీ తప్పనిసరే.. కానీ ఇవన్నీ నాణేనికి ఒకవైపే అంటున్నారు కెరీర్ రంగ నిపుణులు. పై లక్షణాలతో పాటూ స్త్రీతత్వాన్ని వదిలేసుకోవాల్సిన అవసరం లేదు. భావోద్వేగ ప్రజ్ఞను పెంచుకోవడం ముఖ్యం అంటున్నారు.



దాదాపు నాలుగేళ్లపాటు ఓ సంస్థలో పనిచేసిన సంజన ఇప్పుడు ఉద్యోగం మారాలనుకుంటోంది. స్నేహితురాలూ, మెంటార్ అయిన ప్రియను సలహా అడిగితే.. 'పురుషులతో సమానంగా నీలో ఉన్న ప్రత్యేకతలు అంటే పని పట్ల దృష్టీ, సాధించే గుణం, దేన్నయినా చేయగల సామర్థ్యం లాంటివి ఎక్కువగా హైలేట్ చెయ్యి. అప్పుడే ఇంటర్వ్యూలో నెగ్గుకువస్తావు..' అని సలహా ఇచ్చింది. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. సంస్థలు కూడా పురుషులతో సమానంగా ఉండే అలాంటి లక్షణాలనే ఎక్కువగా పరిగణిస్తాయి. అదేవిధంగా పోరాట పటిమా, ఏదయినా విషయాన్ని స్పష్టంగా, సూటిగా నిక్కచ్చిగా చెప్పడం, సందర్భాన్ని బట్టి కాస్త గట్టిగా మాట్లాడటం.. ఇవన్నీ మహిళలకు అవసరమే. ఇవి పెంచుకుంటూనే మహిళలు ఆహార్యాన్నీ మార్చేస్తున్నారు. అప్పుడే పురుషాధ్యిక్యత ఉన్న రంగంలో ధైర్యంగా నిలదొక్కుకోగలం అనుకుంటున్నారు. సందర్భం, పరిస్థితి బట్టీ ఉద్యోగినులు పాటించే ఈ ధోరణి కొంతవరకూ పదోన్నతులూ తెచ్చిపెడుతోంది. మహిళా పోలీసులు అందుకు చక్కని ఉదాహరణ. తమ సామర్థ్యం, ప్రత్యేకత చాటుకోవడానికి పురుషుల్లా మాట్లాడేస్తుంటారు. ముందు చెప్పుకొన్నట్లు ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే అంటున్నారు నిపుణులు. ఆ నైపుణ్యాలతోపాటూ స్త్రీ కోణంలో కూడా ఆలోచించగలిగితే, స్త్రీ సహజ బలాలూ సామర్థ్యాలపై దృష్టిపెట్టగలిగితే, ఏ రంగంలోనైనా తిరుగుండదని చెబుతున్నాయి అధ్యయనాలు. పనిలో రాణించేందుకూ, ఉత్పాదకత పెరిగేందుకు అవి కూడా ఎంతో అవసరమనీ, అలాంటి ప్రత్యేకమైన నైపుణ్యాలూ ఇప్పుడు సంస్థలు గుర్తిస్తున్నాయట. వాటిల్లో చెప్పుకోవాల్సింది భావోద్వేగ ప్రజ్ఞ.

భావోద్వేగాల్లో మేటి...

పురుషులతో పోలిస్తే.. మహిళల భావోద్వేగ ప్రజ్ఞ భిన్నంగా, కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఒక బృందంలో పనిచేస్తున్నప్పుడు అది వాళ్లకు ఓ బలం అవుతుంది. సాటివారితో సేవాభావం, పరిస్థితులు అర్థం చేసుకోగలగడం, ఎదుటివారి కష్టాలను తమవిగా భావించడం.. ఇవన్నీ వాళ్లకు సహోద్యోగులతో సత్సంబంధాలు పెంచుతాయి. దీన్ని జయించగలిగితే వ్యక్తిగత నైపుణ్యాల్లో తిరుగుండదనీ, నాయకులుగా ఎదుగుతారనీ, సందర్భానుసారంగా స్పందిస్తారనీ చెబుతున్నాయి అధ్యయనాలు. ఎందుకంటే బృందంలోని ఇతర సభ్యుల భావోద్వేగాలను వీరు క్షుణ్నంగా అర్థం చేసుకోగలరు కాబట్టి. మనస్తత్వ శాస్త్రవేత్తల ప్రకారం 'సహానుభూతి'కి సంబంధించి మెదడులోని ఇన్సులా శరీరంలోని అన్ని భాగాలనుంచీ సూచనలను గ్రహిస్తుంది. ఎదుటివారిపట్ల సహానుభూతి కనబరిచినప్పుడు మన మెదడు ఎదుటివారి బాధా, సమస్యని అర్థంచేసుకుని దానికి తగినట్లుగా స్పందిస్తుంది. స్నేహ, ధైర్య హస్తాన్ని అందిస్తుంది. ఇదీ పురుషులకూ, మహిళలకూ ఉన్న తేడా. ఎదుటి వ్యక్తి దిగులుగా ఉన్నప్పుడూ, మానసికంగా కుంగిపోయినప్పుడు వారిని చూసి ఆ మహిళ కూడా బాధపడుతుంది. కానీ పురుషుడి మెదడు పనితీరు దీనికి కాస్త భిన్నంగా ఉంటుంది. వాళ్లూ బాధపడతారు కానీ, అది తాత్కాలికమే. దాన్నుంచి త్వరగా బయట పడతారు. 'మహిళల్లో భావోద్వేగాలు ఎక్కువని పురుషులూ... వాళ్లకు ఎలాంటి ఉద్వేగాలు ఉండవనీ మహిళలూ ఒకరిపై ఒకరు ఆరోపిస్తుంటారు. కానీ అది మెదడు పనితీరులో తేడా అని గుర్తించాలి.



ఆ నాలుగే కీలకం...

పైవన్నీ సరే.. మరి భావోద్వేగ ప్రజ్ఞను సొంతం చేసుకోవాలంటే.. మహిళలు ఏం చేయాలో చూద్దామా..

స్వీయ అవగాహన: భావోద్వేగ ప్రజ్ఞను జయించాలంటే దీన్నుంచే మొదలుపెట్టాలి. అంటే వాళ్ల గురించి వాళ్లు ముందుగా తెలుసుకోగలగాలి. ఎప్పుడు ఒత్తిడికి గురవుతాం. బలాలూ, బలహీనతలూ, ఏ పనులపై ఎక్కువ ఆసక్తీ, దేన్ని ఎక్కువగా చేయడానికి తహతహలాడతాం, మన లక్ష్యం, ఆశయాలు.. ఇవన్నీ మనకు మనమే అంచనా వేయగలగాలి. కుదిరితే ఇవన్నీ ఓ పుస్తకంలో రాసుకుంటే మరీ మంచిది. అలాగే ఆయా సందర్భాల్లో మనం స్పందించినతీరు కూడా రాసుకోవాలి. అప్పుడే మరోసారి అలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు సానుకూలంగా స్పందించగలుగుతాం.

నియంత్రించుకోగలగడం: రకరకాల భావోద్వేగాలు మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. కొన్నిసార్లు ఎలా స్పందించాలో కూడా తెలియదు. కానీ వాటిని అదుపులో ఉంచుకోవడం లేదా సరైన విధంగా నియంత్రించుకోగలగడంలో నేర్పరి కాగలగాలి. అప్పుడే మనం వాటి అదుపులోకి వెళ్లకుండా ఉంటాం. ముందు దేనికి ఎలా స్పందించాలో తెలుసుకోవాలి. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోగలగాలి. కొన్నిసార్లు ఉద్వేగాలూ, దాన్నుంచి వచ్చే ప్రతికూల ఆలోచనలు మనసులో అలజడి సృష్టిస్తాయి. వాటన్నింటినీ కూడా ఓర్పుగా, నేర్పుగా అధిగమిస్తేనే విజయం సాధించినట్లు. ఆ కాస్త ఓర్పు పెంచుకుంటే గనుక ఆ ఉద్వేగాలు కదిలే మేఘాల్లా నెమ్మదిగా వెళ్లిపోతాయి.

సహానుభూతి: భావోద్వేగ ప్రజ్ఞకు పునాది ఇదే. ఎదుటివారి బాధల్ని తమవిగా భావించడం, దానికి తగినట్లుగా స్పందించడమే సహానుభూతి. అలాగని సున్నితంగా ఉండమని కాదు. ఎదుటివారి భావాలను ఎక్కడ గాయపరుస్తామో అని భయపడాలనీ కాదు. పరిస్థితిని గమనించి, దానికి తగినట్లుగా సరైన నిర్ణయం తీసుకోగలగాలి. అది కాస్త కష్టమైనా సరే. భావోద్వేగ ప్రజ్ఞ ఉన్నవారు తమ ఆలోచనలూ, బాధలూ, ఆశలూ, ఆశయాలూ నలుగురిలో ధైర్యంగా చెప్పగలుగుతారు. అదే సమయంలో ఎదుటివారినీ అర్థంచేసుకుంటారు. అవతలివాళ్ల స్థానంలో నిల్చుని ఆలోచించగలుగుతారు.

వ్యక్తిగత నైపుణ్యాలు: ఎదుటివారి స్థాయీ, కుటుంబనేపథ్యం, వ్యక్తిత్వంతో సంబంధం లేకుండా వాళ్లలో తమకు సంబంధించి ఉన్న ఒక ప్రత్యేకతను ఆపాదించుకోగలగడం చాలా అవసరం. ఒక బృందంతో కలిసి పనిచేయడం, వాళ్లమధ్య సత్సంబంధాలు పెంచుకోవడం, నెట్‌వర్క్‌ని విస్తృతం చేసుకోవడం ఇవన్నీ నైపుణ్యాలు పెంచుతాయి.

మొత్తంగా చెప్పాలంటే ఇవన్నీ వ్యక్తిగతంగానే కాదు, వృత్తిపరంగానూ ఎంతో మేలుచేస్తాయి. ఉపయోగపడతాయి. ఇది కాస్త కష్టమైనా సాధించగలిగితే తిరుగుండదు.


డా॥ కవిత గూడపాటి, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

కౌర్న్ ఫెర్రీ హే అనే సంస్థ తొంభైదేశాలకు చెందిన దాదాపు 55,000 మంది ఉద్యోగులపై ఓ అధ్యయనం చేసింది. అందులో. పురుషుల కన్నా మహిళల్లోనే భావోద్వేగ ప్రజ్ఞ ఎక్కువని తేలింది. వాళ్లు ఎదుగుతూ తోటివారు ఎదిగేలా ప్రోత్సహించడం, అవసరమైన సలహాలు ఇవ్వడం, భావాల్ని ధైర్యంగా చెప్పగలగడం ఇవన్నీ మహిళల్లోనే ఎక్కువట. అదే సమయంలో ఉద్యోగినిగా కాకుండా సంస్థ కోణం నుంచీ ఆలోచిస్తారట. అయితే కేవలం తమ ఉద్వేగాలను ఎక్కడ, ఎలా వ్యక్తం చేయాలో తెలుసుకోవడంలోనే కాస్త వెనుకబడి ఉంటారనీ.. దాన్ని జయిస్తే గనుక తిరుగుండదనీ చెబుతోందా అధ్యయనం.

బంగారం వెండి

31న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,900	2,892
వెండి (గ్రా)	42.40	42.10



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,250	31,360	30,100	30,100	30,800	30,750	31,000	30,920	30,930	30,930
ఆర్నమెంట్	29,360	29,290	28,850	28,800	28,550	28,520	29,000	28,920	28,770	29,770
వెండి(కిలో)	40,200	40,200	41,000	41,000	40,400	40,200	39,700	39,400	41,500	41,500

నజరానా

నిమ్మకాయలకు కాస్త కొబ్బరి నూనె రాసి ఫ్రిజ్‌లో ఉంచితే... కనీసం నెలరోజుల పాటు తాజాగా ఉంటాయి.

దీపికను రాణీ పద్మావత్‌గా మార్చేశా...!


రాణి పద్మావత్ ఎంత అందంగా ఉండేదో మనలో ఎవరికీ తెలియదు! కానీ తెరపై కనిపించిన పద్మావత్ (దీపికా పదుకొణె) అందం గురించి మనకు కొంత తెలుసు... ఈ సినిమాలో ఆమె ఆహార్యం, అందం, అలంకరణలో ప్రీతిశీల్ సింగ్ శ్రమ కూడా ఉంది. '24', 'బాజీరావ్‌మస్తానీ', 'మామ్', 'హౌస్‌ఫుల్' వంటి విజయవంతమైన చిత్రాలకు పనిచేసిన ప్రీతిశీల్ ను వసుంధర ప్రత్యేకంగా పలకరించింది.



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీ చిత్రాలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అలాంటి ఆయన వద్ద నుంచి కబురొచ్చింది నాకు. అసలు నా కెరీర్ ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డా. బాలీవుడ్‌లో ఎన్ని స్టుడియోలు న్నాయో అన్నింటికి వెళ్లి 'నో ఛాన్స్..' అనిపించుకున్నా. అయితే ఇప్పుడు అందాల పద్మావత్‌కి వన్నెలద్దే అవకాశం వచ్చింది. ఆ అదృష్టం ఎలా వచ్చిందో చెబుతా.

ఉద్యోగం వదిలి... అవకాశాలు లేక

పంజాబ్‌లోని రాజ్‌కోట్ మా ఊరు. ఇంజినీరింగ్ చదివా. టీసీఎస్‌లో ఉద్యోగం. నాకు చిన్నవయసు నుంచి మేకప్ అంటే చాలా ఇష్టం. సినిమాలంటే పిచ్చి. బాలీవుడ్, హాలీవుడ్ అంటూ తేడా లేకుండా సినిమాలన్నీ చూసేదాన్ని. చివరకు ఫిక్సయిపోయా. మేకప్ కళలో లోతు తెలుసుకోవాల్సిందే అని. కానీ అందుకు డబ్బులు కావాలి కదా.. అమ్మావాళ్లని అడక్కుండా నేనే సొంతంగా సంపాదించుకోవాలనుకున్నా. అందుకే కొన్ని రోజులు ఉద్యోగం చేసి నాకు కావల్సినంత డబ్బు సంపాదించుకున్నా. ఆ డబ్బుతోనే లాస్‌ఏంజిలస్, లండన్‌లో మేకప్ కోర్సులు పూర్తి చేశా. అప్పుడే ఫ్యాషన్, మేకప్‌తోపాటు... క్యారెక్టర్ డిజైన్, ప్రోస్థెటిక్ కోర్సులు కూడా పూర్తి చేశా. ప్రోస్థెటిక్ మేకప్ అంటే హారర్ చిత్రాల్లో మనల్ని భయపెట్టే మేకప్ అన్నమాట.





ఇంత చదివాను కదా... అవకాశాలు వెల్లువెత్తుతాయని సంతోషంగా ముంబయికి చేరుకున్నా. ఒక్క అవకాశమూ లేదు. నిజం చెప్పాలంటే అప్పటివరకూ లేని కష్టాలు అప్పుడు మొదలయ్యాయి. చాలా కష్టం మీద 'ది బే' అనే టీవీ సీరీస్‌లో అవకాశం దొరికింది. మరికొన్ని సొంతంగా మేకప్ వీడియోలు తయారుచేసి స్టూడియోల చుట్టూ తిరిగి వాటిని చూపించేదాన్ని. ఎక్కే మెట్టు, దిగే మెట్టు తప్ప ప్రయోజనం కనిపించలేదు. నిర్మాతలయితే నన్ను విసుక్కునేవారు. ఈ మేకప్ పనికిరాదనేవారు. ఇదీ ఒక మేకప్పేనా అనేవారు. నేను పట్టువదల్లేదు. చివరకు 2014లో దర్శకుడు సాయికబీర్ 'రివాల్వర్ రాణీ' అనే హిందీ చిత్రంలో అవకాశాన్నిచ్చారు. ఆ తరువాత వరుసగా హిందీ హారర్ చిత్రాలకు ప్రోస్థెటిక్ ఆర్టిస్ట్‌గా పని చేశా.

కెరీర్‌లో మలుపు...

సవాళ్లకు వెనుతిరక్కుండా సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే... మనలోని సత్తా కూడా బయటకు తెలుస్తుందని నమ్ముతా. నా విషయంలోనూ అదే జరిగింది. సిక్కుల గురువైన గురునానక్ దేవ్ జీవితచరిత్రకు సంబంధించిన సినిమా అది. అందులో హీరోగా నటించిన.... యువకుడిని కురువృద్ధుడిలా చూపించాలి. అది కూడా సహజంగా ఉండాలి. మేకప్ ఆర్టిస్ట్‌గా ఇది నాకు పెద్ద సవాల్. దీన్ని ఎంత విజయవంతంగా పూర్తిచేసానంటే, ఈ సినిమాకి ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా జాతీయ స్థాయి గౌరవం దక్కింది. అలాగే ఈ చిత్రం నేషనల్ ఫిల్మ్ అవార్డూ, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డులూ సొంతం చేసుకుంది. ఆ ఊపుతోనే 'బ్రదర్స్', 'తల్వార్' చిత్రాల్లో ప్రోస్థెటిక్ ఆర్టిస్ట్‌గా అవకాశం దక్కించుకున్నా. ఓ రోజు బన్సాలీ నుంచి కబురొచ్చింది. 'బాజీరావు మస్తానీకి మేకప్, హెయిర్ డిజైనర్‌గా పని చేస్తావా' అని అడిగారు. ఇక నా ఆనందం మాటల్లో చెప్పలేనిది. నా కళకు ఇదొక పరీక్ష. నన్ను నేను నిరూపించుకోవాలనుకున్నా. కథంతా ఒకెత్తు. క్లైమాక్స్‌లో యుద్ధం సీన్లు ఒకెత్తు. గాయాలతో నిండిన క్షతగాత్రులని చూపించడం అంత తేలిగ్గా పూర్తి కాలేదు. నా పనిలో ఎక్కడా రాజీపడలేదు. ఆ తర్వాత ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎంత పెద్ద హిట్టో చెప్పాలా? ఇదిగో ఆ విజయమే పద్మావత్ అవకాశాన్ని తెచ్చిపెట్టింది. 13 శతాబ్దం నాటి రాజకుమారి. అపురూపమైన అందం. చరిత్రలో ఇప్పటికీ.. చర్చగానే మిగిలిన అందం. అది మరింత పెరగాలే కానీ తగ్గకూడదు. అందుకే ప్రతీ డిజైన్ బన్సాలీకి చూపించేదాన్ని. స్క్రిప్టుని పదేపదే చదువుతూ ఉండేదాన్ని. అలా రణవీర్, షాహిద్‌కపూర్, దీపికాపదుకొణె పాత్రలకు మేకప్, డిజైనింగ్ పనితనం అందించా. ఇదొక్కటే కాదు అమితాబ్ నటించిన '102 నాట్ అవుట్', 'ముల్క్', 'బాల్‌ఠాకరే' చిత్రాలకు మేకప్, డిజైనింగులు చేశా. ఇవన్నీ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

సంతృప్తినిచ్చిన పాత్రలు...

శ్రీదేవి నటించిన 'మామ్' చిత్రంలో నేను చేసిన ప్రోస్థెటిక్ మేకప్ నాకు పూర్తిగా సంతృప్తినిచ్చింది. తమిళం, తెలుగు భాషల్లో విజయం సాధించిన 24, 'హౌస్‌ఫుల్', 'శివాయ్', 'రంగూన్', 'బ్రదర్స్' లాంటి సినిమాలకూ పనిచేశా. ప్రోస్థెటిక్ మేకప్‌లో శిక్షణ అందించేందుకు 'ద మేకప్ ల్యాబ్' స్టూడియోని ప్రారంభించా. వ్యక్తి ముఖకవళికలని పూర్తిగా మార్చేసే అద్భుతమైన కళ ఇది.

సిగ సింగారం

స్ప్రింగులాంటి జడ సింగారం...

జడ వేసుకోవాలి, అయితే అది వేలాడే స్ప్రింగులా కనిపించాలని అనుకుంటే మాత్రం... ఇలా ప్రయత్నించి చూడండి. వేసుకోవడం సులువు. ప్రత్యేక సందర్భాలకు చక్కగా నప్పుతుంది.







1

తల మధ్యలో పాపిట తీయాలి. తరువాత తలకు ముందువైపు నుంచి చిన్నజడకు సరిపోయేలా మూడు పాయలు తీసుకోవాలి. వాటితో జడ వేయడం ప్రారంభించి, అందులో చెంపల వైపున జుట్టును కూడా కలుపుతూ జడను చెవుల కిందవరకు వచ్చేలా అల్లి, రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.



2


కుడి వైపు కూడా ఇదేవిధంగా వేసుకోవాలి. ఇప్పుడు ఈ రెండు జడలను కలిపి రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. అది కనిపించకుండా ఒక పాయను దాని చుట్టూ చుట్టుకోవాలి.



3

దీనికి అంగుళం చొప్పున దూరంలో రబ్బరుబ్యాండులు పెట్టుకుంటూ వెళ్లాలి. పోనీటెయిల్ చివరివరకూ ఇదే విధంగా చేసుకోవాలి. తరువాత వీటి మధ్యలోని జుట్టును కొంచెం వదులు చేస్తూ ఉంటే చిన్న బుడగల్లా మారుతాయి. చూడటానికి మీ జడ స్ప్రింగులా అనిపిస్తుంది.

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను **www.eenadu.net**లోని వసుంధర విభాగంలో చూడొచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

మెరుపునిచ్చే గులాబీరేకలు...

పని ఒత్తిడీ, ఆఫీసు పనులు కారణం ఏదైనా సరే! కొన్నిసార్లు అందంపై శ్రద్ధపెట్టే తీరిక ఉండదు. అలాంటప్పుడు తక్షణం ముఖం మెరిసిపోయే చిట్కాలివి.

గులాబీరేకలు ముఖానికి మెరుపునివ్వడమే కాదు తాజాదనాన్నీ అందిస్తాయి. చెంచా గులాబీరేకల్ని ముద్దకు చెంచా తేనె కలిపి ముఖానికి పూతలా వేస్తే సరి. ఎంచక్కా రెడీ అయిపోవచ్చు.

పెసరపిండిలో కాసిని పాలూ, తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. ఇలా ఐదునిమిషాలు రుద్ది ముఖం కడిగేసుకుంటే చర్మంపై ఉండే మృతకణాలు తొలిగి కాంతిమంతంగా మెరిసిపోతుంది.

ఊహాశక్తి మీకుంటే ఉద్యోగాలు మీవెంటే!



మన జాతీయజెండా, రూపీ సింబల్ మొదలు బాహుబలిలోని మాహిష్మతి నగర నిర్మాణం వరకు వచ్చిన ఆవిష్కరణలన్నీ గొప్ప గొప్ప డిజైనర్ల పనితీరుకు నిదర్శనాలు. వీటన్నింటినీ మీరు ఆసక్తిగా పరిశీలిస్తుంటే.. మీ సృజనాత్మక, తార్కిక ఆలోచనలను బొమ్మల రూపంలో ప్రదర్శించగలుగుతుంటే.. మీలోనూ ఒక డిజైనర్ ఉన్నాడనే అర్థం. మీలోని ఆ కళాసృష్టికర్తకు ఒక రూపాన్ని ఇచ్చి, దాన్ని మీ వృత్తిగా మార్చుకోడానికి కొన్ని కోర్సులు ఉన్నాయి. మరెన్నో రంగాలు ఉద్యోగాలతో మీలాంటి వారికి ఆహ్వానం పలుకుతున్నాయి.

మన స్నేహితుల్లో కొందరు మొబైల్, కారు లేదా ల్యాప్‌టాప్ కొనడానికి వెళ్లినప్పుడు బ్రాండ్, డిజైన్‌ల పట్ల చాలా పట్టుదలతో ఉంటారు. ఫలానా కంపెనీ ఫోన్ లేదా ఫలానా కంపెనీ ల్యాప్‌టాప్‌కి 'ఫిదా' అయ్యా.. అదే కావాలంటారు. ఇలా కొన్ని బ్రాండ్‌లకు, కంపెనీలకు ఫిదా అయ్యేలా చేసేది సాంకేతికంగా ఆయా ఉత్పత్తులను ఉన్నత ప్రమాణాలతో డిజైన్ చేయడమే. దాంతోపాటు ఆయా వస్తువులను రంగు, రూపు, పరిమాణంలో ముచ్చటగా తీర్చిదిద్దడమే. ఇలా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్తువులను రూపొందించడానికి ప్రత్యేక నిపుణుల బృందం పని చేస్తుంటుంది. అదే ప్రోడక్ట్ డిజైన్ టీమ్.


రవి కటుకం
ఇన్నొవేషన్ ఇవాంజిలిస్ట్

ఇంజినీరింగ్ పరంగా ఎంతో ఉన్నతమైన హార్డ్‌వేర్‌ని, సాఫ్ట్‌వేర్‌ని వినియోగించినప్పటికీ కస్టమర్ కంటికి నచ్చకపోవడంతో ఎన్నో ఉత్పత్తులు విఫలమవుతున్నాయి. ఆటోమొబైల్, మొబైల్స్, ఏరోస్పేస్, ఫర్నిచర్ రంగాల్లో దిగ్గజ సంస్థల నుంచి కంపెనీలు రూపొందించే వెబ్‌సైట్స్, మొబైల్ యాప్స్ వరకు అన్నింటినీ ఆకర్షణీయంగా తయారుచేయడానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఇది మరింత పెరిగింది. ఎన్నో కంపెనీలు తమ వస్తువులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా 'ప్రోడక్ట్ డిజైనర్'లను నియమించుకుంటున్నాయి.

ప్రోడక్ట్ డిజైనర్ వృత్తిలోకి ప్రవేశించడానికి ఇంజినీర్లు, ఆర్కిటెక్చర్ అభ్యర్థులు, క్రియేటివ్ ఆర్ట్స్ రంగంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోడక్ట్ డిజైనింగ్‌కి సంబంధించి బ్యాచ్‌లర్స్, మాస్టర్స్ స్థాయుల్లో కోర్సులు అందించే వృత్తి విద్యాసంస్థలు మనదేశంలో ఎన్నో ఉన్నాయి.

పీజీ

మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్స్‌ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ పేరుతో దేశవ్యాప్తంగా క్యాంపస్‌లను ఏర్పాటుచేశారు. ఎన్ఐడీలో 10+2 అర్హతతోనూ, బ్యాచ్‌లర్ డిగ్రీతోనూ ప్రవేశాలు కల్పిస్తున్నారు.

ప్రధానంగా సీడ్- కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (సీఈఈడీ) ద్వారా మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లోకి ఐఐటీ బాంబే ఐఐటీ దిల్లీ ఐఐఎస్సీ బెంగళూరు ఐఐటీ గువాహటి ఐఐటీ కాన్పూర్ ఐఐటీ హైదరాబాద్ ఐఐఐటీడీఎం జబల్‌పూర్ యూపీఈఎస్ డెహ్రాడూన్ విద్యాసంస్థలు- ఎండీఈఎస్ (మాస్టర్ ఆఫ్ డిజైన్) కోర్సులోకి ప్రవేశాలు కల్పిస్తున్నాయి. దీనికి నాలుగు సంవత్సరాల డిగ్రీ/డిప్లొమా/ పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా 10+2 తర్వాత 3+2 డిగ్రీ పూర్తి చేసిన వాళ్లు అర్హులు. గ్రాఫిక్ డిజైన్ ఆర్ట్స్ డిప్లొమా ప్రోగ్రామ్ (10+5) లెవెల్ చేసిన వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు అప్లై చేయవచ్చు. ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ కాన్పూర్‌లు గేట్ స్కోరు ఆధారంగా కూడా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయి.

యూజీ

బ్యాచ్‌లర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశానికి యూసీడ్ - అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (యూసీఈఈడీ) పరీక్ష నిర్వహిస్తున్నారు. 10+2 లేదా తత్సమాన అర్హత కలిగిన అన్ని విభాగాల అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా రెండుసార్లు మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది. వయసుకి సంబంధించిన పరిమితులు కూడా ఉన్నాయి. చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేయవచ్చు.

యూసీడ్ స్కోర్ ఆధారంగా ఐఐటీ బాంబే ఐఐటీ గువాహటి ఐఐఐటీడీఎం జబల్‌పూర్ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లోకి ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఈ రెండు పరీక్షలకు నోటిఫికేషన్లు సాధారణంగా ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో వస్తుంటాయి.

ఇతర ప్రముఖ సంస్థలు

మరికొన్ని సంస్థలు ఎన్నో దేశవ్యాప్తంగా బ్యాచ్‌లర్ ఆఫ్ డిజైన్ కోర్సులను అందిస్తున్నాయి. వాటిలో కొన్ని..

వాక్సెన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ డిజైన్, హైదరాబాద్ సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, హైదరాబాద్

ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ డిజైన్, బెంగళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, విజయవాడ గాయత్రీ విద్యాపరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, విశాఖపట్నం

ఉండాల్సిన లక్షణాలు

ప్రోడక్ట్ డిజైనర్ కావాలనుకునే విద్యార్థులకు ఈ కింది లక్షణాలు ఉండాలి.

రూపొందించే వస్తువు సాంకేతికతపై పట్టు ఉండాలి. ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ అభ్యర్థులకు లేటెస్ట్ టెక్నాలజీపైన; మెకానికల్, ఏరోస్పేస్ వాళ్లకి కొత్తగా మార్కెట్లోకి వస్తున్న ప్రోడక్ట్‌లపై అవగాహన ఉండాలి.

ప్రతి వస్తువును కళాత్మక దృష్టితో చూడటం అలవాటు చేసుకోవాలి. వస్తువు రంగుల కలయిక, దానిలో వినియోగదారుడిని ఆకర్షించే అంశాలను గుర్తించగలగాలి.

మనిషిని, వస్తువులను అనుసంధానం చేసే ఆలోచనలను కలిగి ఉండాలి. ఈ క్రమంలో వస్తువును ఉపయోగించడం వల్ల వినియోగదారుడిపై ఒత్తిడి కలగకుండా చూసుకోవాలి.


సృజనాత్మకతను జోడించి ప్రాజెక్టులు చేయాలి.

మహిళలకు, పిల్లలకు ఉండే ప్రత్యేక అవసరాలను గుర్తించి వాటిని తీర్చే విధంగా పరిష్కారాలను ఆలోచించగలగాలి.

కంప్యూటర్ సైన్స్, ఐటీ రంగాల్లోని విద్యార్థులు యూజర్ ఎక్స్‌పీరియన్స్ (యూఎక్స్) లేదా యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ)పై ఆసక్తిని కలిగి ఉండాలి.

డిజైన్ థింకింగ్

రాబోయే రోజుల్లో మనిషి కేంద్రంగా ప్రతి ఉత్పత్తినీ రూపొందించడానికి కంపెనీలు 'డిజైన్ థింకింగ్' అనే విధానాన్ని అవలంబిస్తున్నాయి. ప్రోడక్ట్ డిజైనర్‌గా రాణించాలనుకునే విద్యార్థులు డిజైన్ థింకింగ్ కోర్సులు చేయడం ద్వారా ఉత్తమమైన ప్రోడక్ట్ పరికల్పన విధానాలను తెలుసుకోవచ్చు. కళాశాల స్థాయిలో డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్‌ల్లో పాల్గొని తమ సృజనాత్మకతకు పదును పెట్టుకోవచ్చు.



డిజైన్ ఆలోచనా విధానాన్ని కళాశాల స్థాయిలో మినీ ప్రాజెక్ట్‌గా చేయాలి. కళాశాలలు కూడా ఈ కోర్సులను ఒక ఎలెక్టివ్‌గా చేయవచ్చు. దీనిపై గెస్ట్ లెక్చర్లను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. డిజైన్ థింకింగ్‌పై ప్రసిద్ధి చెందిన సంస్థల ద్వారా ఆన్‌లైన్ కోర్సులు చేయడం మంచిది.

కోర్స్‌ఎరా వంటి ప్రముఖ వెబ్‌సైట్లు ఈ కింది విభాగాలపై ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి.

డిజైన్ థింకింగ్ ఫర్ ఇన్నోవేషన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్ యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్ గ్రాఫిక్ డిజైన్ హ్యూమన్ సెంటర్డ్ డిజైన్ ఇంజినీరింగ్ డిజైన్.

కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్

ప్రస్తుతం అన్ని రంగాల్లో కంప్యూటర్స్ వినియోగం వేగంగా పెరుగుతోంది. అందుకే విద్యార్థులు కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్ టూల్స్‌ని నేర్చుకోవాలి. కొత్త ఆలోచనలను, ఊహలను కంప్యూటర్ బేస్‌డ్ టూల్స్ అయిన కాటియా, ఆటోక్యాడ్, ప్రో-ఈ వంటివి కొత్త ఉత్పత్తులను కంప్యూటర్ మోడల్స్‌గా మార్చడానికి ఉపయోగపడతాయి. ఇంజినీరింగ్ మొదలు ఆర్కిటెక్చర్ వరకు విద్యార్థులు కనీసం ఒక డిజైన్ టూల్‌పైన అయినా పట్టు కలిగి ఉండాలి. కళాశాలలో క్యాడ్ లేదా క్యామ్ పరికరాలపై జరిగే వర్క్‌షాప్‌ల్లో పాల్గొనాలి.

ఉద్యోగావకాశాలు

ప్రోడక్ట్ డిజైన్ లేదా ఇండస్ట్రియల్ డిజైన్‌లో డిగ్రీ చేసిన వారికి ఈ కింది విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఆటోమొబైల్ రంగం: కారు, బైక్, బస్సు, ఏర్ క్రాఫ్ట్ లాంటి ఉత్పత్తులకు బాహ్య, అంతర నిర్మాణాలను ప్రయాణికులకు సౌకర్యంగా, ఆకట్టుకునేలా, పూర్తి రక్షణతో రూపకల్పన చేయడం.

వినియోగదారుల ఉత్పత్తులు: నిత్యజీవితంలో ఉపయోగించే గృహోపకరణాలైన మిక్సీ, ఫ్రిజ్, టీవీలకు డిజైన్‌లు చేయడం.

ఫర్నిచర్ కంపెనీల్లోనూ సౌకర్యవంతమైన డిజైన్లు చేయడం. ఇళ్లు, ఆఫీసుల్లో ఇంటీరియర్ డిజైనింగ్. ఎలక్ట్రానిక్స్ రంగంలో మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లను వినియోగదారులకు నచ్చేలా రూపకల్పన చేయడం. ఉత్పత్తి సంస్థలు, పరిశ్రమల్లోని డిజైన్ విభాగాలు కన్సల్టింగ్ కంపెనీలు సిరామిక్ పరిశ్రమల్లోని టేబుల్ వేర్, శానిటరీ వేర్ తదితర డిపార్ట్‌మెంట్‌లు లైట్ ఫిటింగ్స్, డెకొరేటివ్ విభాగాల వంటివి ఉండే ఎలక్ట్రికల్, ఇతర పరిశ్రమలు.

ప్రధాన రిక్రూటర్లలో జనరల్ మోటార్స్ డిజైన్, హైడిజైన్, హోండా, డిజైన్ డాకు, ఎల్జీ, ఓజీఎస్ యానిమేషన్, ఓనియో వంటి సంస్థలు ఉన్నాయి. అర్హతలు, అనుభవాల ఆధారంగా సంవత్సరానికి జీతం రూ. రెండున్నర లక్షల నుంచి రూ. పన్నెండు లక్షల వరకు ఉంటుంది.

ఒక సంస్థ ఉత్పత్తి చేసిన కారు లేదా మొబైల్ ఫోన్ సాంకేతికంగా ఉన్నతంగా ఉండటంతోపాటు, ఉపయోగించే క్రమంలో మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి. అప్పుడే ఆ సంస్థను వినియోగదారులు ఎక్కువ కాలం ఆదరిస్తారు. నిత్యజీవితంలో మనం ఉపయోగించే ప్రతి వస్తువు వెనుక ఒక అనుభవజ్ఞుడైన ప్రోడక్ట్ డిజైనర్ ఉన్నారు. రాబోయే రోజుల్లో ఆ రూపకర్త మీరే కావచ్చు. సంవత్సరానికి దాదాపు ఇరవై వేల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందని ఒక అంచనా.



నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణలో 310 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు

తెలంగాణ గిరిజన, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల్లో 310 ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ప్రకటన జారీ చేసింది.

1. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1: 04 పోస్టులు
2. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2: 306 పోస్టులు

అర్హతలు, దరఖాస్తు తదితర వివరాలు: www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఇస్రో

పోస్టు: సైంటిస్ట్/ ఇంజినీర్ ఎస్‌సీ **ఖాళీలు:** 106 (ఎలక్ట్రానిక్స్-32, మెకానికల్-45, కంప్యూటర్ సైన్స్ -29)

అర్హత: 65శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్).

వయసు: 35 సంవత్సరాలకు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

రాతపరీక్ష తేది: 22.04.2018 **దరఖాస్తు:** ఆన్‌లైన్

చివరితేది: 20.02.2018

వెబ్‌సైట్: https://www.isro.gov.in/careers

ఎన్ఎండీసీ, హైదరాబాద్

పోస్టు: వర్క్‌మెన్ క్యాటగిరీ పోస్టులు-36 (మెయింటినెన్స్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్ తదితరాలు) **అర్హత:** పోస్టులను అనుసరించి ప్రకటనలో తెలిపిన విధంగా. **వయసు:** 18 - 30 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

చివరితేది: 26.02.2018

వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

మిధాని, హైదరాబాద్

పోస్టు: జూనియర్ మేనేజర్, క్యాడ్ ఆపరేటర్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్.

ఖాళీలు: 03 **అర్హత:** మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, డిప్లొమా; హిందీ, ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా డిగ్రీతోపాటు డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్.

ఎంపిక: నిబంధనల ప్రకారం.

దరఖాస్తు: ఆన్‌లైన్

దరఖాస్తు ఫీజు: రూ. 100

చివరితేది: 14.02.2018

వెబ్‌సైట్: http://www.midhani.com/

ఐఐపీఈ, విశాఖపట్నం

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ ప్రొఫెసర్

ఖాళీలు: 10

అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీతోపాటు పరిశోధన/ బోధన రంగంలో అనుభవం ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఈ-మెయిల్ **చివరితేది:** 22.02.2018

ఈమెయిల్: jobs@iipe.ac.in

వెబ్‌సైట్: http://iipe.ac.in/careers/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

Eat a humble pie అంటే తెలుసా?

English language skills

కొంతమంది ఎప్పుడూ తామే కరెక్ట్ అని భావిస్తుంటారు. ఆ విషయం గురించి ఇతరులతో ఎంత గట్టిగానైనా వాదిస్తుంటారు. అయితే అలాంటివాళ్ళు కూడా కొన్ని సందర్భాల్లో తమ తప్పుని ఒప్పుకోక తప్పదు. ఇలాంటి పరిస్థితిని సూచించే వ్యక్తీకరణ ఏమిటి? తెలుసుకుందామా?


ఎం. సురేశన్

Ranganath: I do not see why I should talk anymore to Nagaraj. His behaviour turns me off (నాగరాజ్‌తో నేను ఎందుకు మాట్లాడాలో నాకు తెలీడం లేదు. వాడి ప్రవర్తన నాకు రోత పుట్టిస్తోంది).

Jagannath: But you had been hanging out with him for years together. I don't see why you dislike him now (మరి నువ్వు వాడితో సంవత్సరాలపాటు తిరుగుతూనే ఉన్నావు కదా. మరి వాడంటే నీకెందుకు ఇష్టం లేదో తెలీడం లేదు).

Ranganath: I want to break up with him. His attitude I can no longer tolerate (వాడితో సంబంధాలు తెంపేసుకోవాలనుకుంటున్నాను. వాడి వైఖరి నేనింక భరించలేను).

Jagannath: What exactly happened between you? Why are you so put out with him? (మీ మధ్య అసలేం జరిగింది? వాడంటే నీకెందుకు ఇష్టం లేకుండా పోయింది?)

Ranganath: You know he borrowed some money from me. I have waited patiently for three years. Last week when I asked him for the money, he put me off by saying that he does not owe me any money (నీకు తెలుసుకదా, నా దగ్గర వాడు అప్పు తీసుకున్నాడని. మూడేళ్లు ఓర్పుతో ఉన్నాను, ఇస్తాడులే అని. క్రితం వారం నేను వాడిని డబ్బు తిరిగివ్వమని అడిగితే నాకేమీ తాను డబ్బివ్వక్కర్లేదని వదిలించుకున్నాడు).

Jagannath: So that is the reason. Yours was the mistake in lending him the money. You have to pay for it now (అయితే అదన్నమాట కారణం. వాడికి అప్పివడం నీ తప్పే. దానికి శిక్ష అనుభవించు నువ్వు).

Ranganath: But I have a friend who I can count on to recover the money from Nagaraj. I will definitely get back at him. I will make him eat the humble pie (అయితే నా డబ్బు నాకప్పగించగల స్నేహితుడున్నాడు. అతను నాగరాజు దగ్గర్నుంచి నా డబ్బు తిరిగి ఇప్పించగలడు. నాగరాజుకు సరైన బుద్ధి చెప్తా. వాడిని నేను మట్టి కరిపిస్తా).

Jagannath: Wish you all luck. Next time when we meet I like to hear that you have recovered the money from him (నీకా అదృష్టం కలగాలని కోరుకుంటున్నా. మళ్లీ ఈసారి కలుసుకున్నప్పుడు నువ్వు నీ డబ్బును తిరిగి వాడి దగ్గర్నుంచి తెచ్చుకోగలిగావని వినాలనుకుంటున్నా).

Now let us look at the phrasal verbs from the conversation

1) Turns me off – the original phrasal verb – turn somebody off = make a person lose liking for somebody (ఒకరి మీద అయిష్టం కలగడం).

a) Pandu: Nataraj really is not a person to like. How I hate him! (నటరాజ్ అంతగా మనం ఇష్టపడే వ్యక్తి కాదు. అతనంటే నాకు ద్వేషం).

Srinivas: How long have you taken to realize it! He turns off everybody that tries to be friendly with him (అది గ్రహించడానికి నీకెంత సమయం పట్టింది! వాడు తనతో స్నేహం చేయాలనుకునే వాళ్లందరినీ అతనంటే ఇష్టం పోయేలా చేస్తాడు).

b) Harsha: Though I have been friends with Raghu for just a short while, I have found him very likable (రఘుతో నేను స్నేహం చేయడం మొదలుపెట్టింది చాలా తక్కువ కాలమే అయినా అతనంటే అందరూ ఇష్టపడేట్టు చేస్తాడు).

Ashok: That is true. He never behaves in a way that turns people off from him (అది నిజమే. ఇతరులు తనంటే ఇష్టం పోయేలా ఎప్పుడూ ప్రవర్తించడు).



2) Be put out with = make a person dislike someone else (ఒకరంటే మనకు ఇష్టం లేకుండా చేసుకోవడం).

a) Srikar: I don't see why you are so much against Sekhar (శేఖర్ అంటే నీకెందుకు ఇష్టం లేదో నాకర్థం కావడం లేదు).

Bhavan: Yea, move with him for a few days, and you will understand how he puts you out (వాడితో నువ్వు కొన్నిరోజులు కలిసి తిరుగు, అప్పుడు నీకర్థం అవుతుంది, అతనంటే నువ్వెందుకు ఇష్టపడవో).

b) Sambasiva: I found Nithyanand very friendly. He has very pleasant manners (నిత్యానంద్ చాలా స్నేహ స్వభావం కలవాడు. అతనికి ఆహ్లాదకరమైన ప్రవర్తన ఉంది).

Rajaram: Yea. He is such a nice guy. You never feel put out with him even if you move with him for a long time (అవును. అతను చాలా నాగరికుడు. అతనితో నువ్వు చాలాకాలం కలిసి ఉన్నా అతనంటే నీకు అయిష్టం కలగదు).

3) Eat a humble pie = Admit that you are wrong (మనం తప్పుని ఒప్పుకోవడం)

a) Sridhar: Kesav argued very strongly that he was right, but Prabhakar proved that he was wrong (కేశవ్ చాలా గట్టిగా వాదించాడు, తాను సరి అని. కానీ ప్రభాకర్ అతను తప్పని రుజువు చేశాడు).

Bhagavan: So he had to eat a humble pie, after all. The trouble with Kesav is he feels he is always right (అంతా అయిన తరువాత తను తప్పని ఒప్పుకోక తప్పలేదు. కేశవ్‌తో ఉన్న సమస్యే అది. ఎప్పుడూ తనే కరెక్ట్ అని భావిస్తాడు).

b) Suprabhat: Srikanth always makes sure he is right when he argues (తాను వాదించేటప్పుడు, శ్రీకాంత్ తాను కరెక్టే అని రూఢి చేసుకుంటాడు).

Sunanada: That is right. He sees to it that he has never to eat the humble pie (అవును, అది కరెక్టే. తాను తప్పని ఒప్పుకునే పరిస్థితి ఎప్పుడూ తెచ్చుకోడు).



జంపన్నవాగు జోడు వంతెనల ఇరుపక్కల జన సందడి

జన సంద్రంగా జంపన్నవాగు

ఈనాడు, మేడారం: తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరలో జంపన్నవాగు జనసంద్రమైంది. జాతరలో తొలిఘట్టం సారలమ్మ దేవతతోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపైకి తీసుకురావడంతో బుధవారం లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తారు. వారంతా మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ ప్రాంగణమంతా లక్షలాది భక్తులతో నిండిపోయింది. ఒకేసారి 5 వేలకుపైగా భక్తులు జల్లు స్నానం చేసేందుకు అనువుగా షవర్లను ఏర్పాటు చేసి, వాటికి నల్లాలను బిగించారు. ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన 3 కిలోమీటర్ల మేర జంపన్నవాగుకు ఇరువైపుల స్నానఘట్టాలను ఏర్పాటు చేసింది. భక్తులకు భద్రత కల్పించేందుకు మత్స్యశాఖ 300 మంది గజ ఈతగాళ్లకు జంపన్నవాగు వద్ద విధులు కేటాయించింది. జంపన్నవాగు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో వేలాది గుడారాలు వాగు చుట్టూనే వెలిశాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఖరారు

ఈనాడు, హైదరాబాద్: సీఎం కేసీఆర్ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పర్యటన ఖరారయింది. శుక్రవారం(ఫిబ్రవరి 2న) 12.30కి ఆయన బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 1.15కి మేడారం చేరుకుంటారు. అక్కడి నుంచి 1.25కి వాహనంలో జాతర ప్రాంగణానికి చేరుకుని సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించి పూజలు చేస్తారు. 1.50కి అక్కడి నుంచి బయల్దేరి పోలీసు క్యాంపు చేరుకుంటారు. అక్కడ భోజనం చేసి మంత్రులు, అధికారులతో సమావేశమవుతారు. పలు నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉంది. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

2.60 లక్షల మంది భక్తులను చేరవేసిన ఆర్టీసీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, 31వ తేదీ నాటికి 2.60 లక్షల మంది భక్తులను మేడారం చేరవేసినట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ జి.వి.రమణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి 5800 ట్రిప్పులను నడుపుతున్నామని పేర్కొన్నారు.

మేడారం వెళ్తూ ఇద్దరి దుర్మరణం

ఆటోను ఢీకొన్న ఇసుక లారీ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులతో కలిసి మేడారం జాతరకు ఆటోలో వెళ్తుండగా ఇసుక లారీ ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందగా నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన ఇది. తాడ్వాయి ఎస్సై కర్ణాకర్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన పులిశెట్టి అంజయ్య తన కుటుంబంతో కలిసి మొత్తం ఆరుగురు ఆటోలో మంగళవారం మేడారానికి బయలుదేరారు. అర్ధరాత్రి 2.30 గంటలకు వారి ఆటో పస్రా వైపు వెళ్తూ జనగలంచ వాగు దాటుతుండగా వరంగల్ నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో పూర్తిగా దెబ్బతినగా అందులో ప్రయాణిస్తున్న అంజయ్య(50), నవీన్‌కుమార్(23) అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా కుటుంబసభ్యులు, బంధువులు తోట సీతమ్మ, పొలిశెట్టి కృష్ణకుమారి, కంచర్ల రమణ, లక్ష్మీబాయిలకు తీవ్రగాయాలయ్యాయి.

గద్దెపైన సారలమ్మ

- అడుగడుగున జన నీరాజనాలు

ఈనాడు - మేడారం

గణగణ గంటలు మోగుతుంటే ప్రతి గుండె భక్తిభావంతో పులకించిపోయింది. శివసత్తుల పూనకాలతో మేడారం ఊగిపోయింది. కోయరాజుల కోలాహలం, డప్పుచప్పుళ్లతో వనం దద్దరిల్లింది. ఆదివాసీ ఆచారాల మధ్య గిరిజన పూజారులు సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించే అద్భుత ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది. కన్నెపల్లి నుంచి మేడారం వరకు సారలమ్మను భారీ బందోబస్తు మధ్య తీసుకొచ్చారు. ఈ ఘట్టం కన్నులపండువగా సాగింది. కన్నెపల్లి నుంచి మేడారం వరకు సారలమ్మను తీసుకొస్తున్న క్రమంలో అడుగడుగునా జనం నీరాజనాలు పట్టి స్వాగతం పలికారు. జంపన్నవాగులో నుంచి సారక్క తరలుతున్న సమయంలో భక్తులు ఆకాశన్నంటేలా జయజయధ్వానాలతో హోరెత్తించారు. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠించే ఘట్టం అంగరంగ వైభవంగా పూర్తయింది. మొదట మేడారం నుంచి సారలమ్మను తీసుకొచ్చేందుకు గిరిజన పూజారులు కాక సారయ్యతోపాటు మరికొందరు వడ్డెల సాయంతో మధ్యాహ్నం కన్నెపల్లి చేరుకున్నారు. అప్పటికే కన్నెపల్లి గ్రామానికి చెందిన ఆడపచులు మేడారానికి నీటి బిందెలతో పాదయాత్రగా తరలివచ్చి గద్దెలను కడిగి ముగ్గులతో అలంకరించారు. ఈ తంతు పూర్తి కాగానే కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో వారి ఆచారాల ప్రకారం రెండు గంటలపాటు పూజలు నిర్వహించారు. అనంతరం వెదురుబుట్టలో సారలమ్మను తీసుకొని వరంపట్టిన భక్తులపై నుంచి నడుచుకుంటూ ముందుకుసాగారు.

కోలాహలంగా ఘట్టం

సారలమ్మను తీసుకొచ్చే ఘట్టం కోలాహలంగా సాగింది. కన్నెపల్లిలో గిరిజనులు సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తూ తీసుకొచ్చే ఘట్టాన్ని రాత్రి 8.12 గంటలకు ప్రారంభించారు. సారలమ్మను తీసుకొచ్చే పూజారులకు రక్షణగా అదనపు ఎస్పీ దక్షిణామూర్తి నేతృత్వంలో సుమారు 120 మంది రోప్ పార్టీ పోలీసులు వెంట వచ్చారు. జయశంకర్ జిల్లా జేసీ అమయ్‌కుమార్ సతీసమేతంగా కన్నెపల్లికి వచ్చి అమ్మవారికి స్వాగతం పలికారు. అప్పటికే మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి వచ్చిన పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయినుంచి వచ్చిన గోవిందరాజులను కూడా తీసుకొచ్చి సిద్ధంగా ఉంచారు. అనంతరం పూజారులు బుట్టతోపాటు భారీ జనసందోహం మధ్య ఊరేగింపుగా జంపన్నవాగులోనుంచి నడుచుకుంటూనే మేడారం చేరుకొని సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మవారితోపాటు గోవిందరాజు, పగిడిద్దరాజులనూ గద్దెలపై ప్రతిష్ఠించారు.

నేడు సమ్మక్క ఆగమనం

జాతరలో అత్యంత కీలక ఘట్టమైన సమ్మక్కను గురువారం మేడారం సమీపంలోని చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి అధికారిక లాంఛనాలతో తీసుకురానున్నారు. సాయంత్రం ఈ తంతు మొదలై రాత్రి వరకు కొనసాగుతుంది. సమ్మక్కను తీసుకొచ్చేముందు పోలీసులు గాల్లోకి కాల్పులు జరుపుతారు. అనంతరం తల్లిని గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తారు. శుక్ర, శనివారాల్లో జాతర కొనసాగుతుంది. శనివారం రాత్రి గిరిజన దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

నేడు ఛత్తీస్‌గఢ్ సీఎం రాక

గురువారం ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ మేడారం జాతరకు రానున్నారు. బుధవారం శాసనసభాపతి మధుసూదనాచారితోపాటు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విచ్చేసి గద్దెలను దర్శించుకున్నారు. రమణ్‌సింగ్ పర్యటన నేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి మేడారానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఫిబ్రవరి 2న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతోపాటు సీఎం కేసీఆర్ జాతరకు విచ్చేస్తున్నట్లు జయశంకర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కర్ణన్ తెలిపారు. ప్రముఖుల రాక సందర్భంగా మేడారంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.



సారలమ్మ పూజారుల పాదస్పర్శ తాకాలని ఊరేగింపు ముందు పొర్లుదండాలు పెడుతున్న భక్తులు

చందమామ కనువిందు

- సంపూర్ణ గ్రహణంతో ఆకాశంలో అద్భుతం
- ఒకే రోజు భిన్న వర్ణాల్లో దర్శనం

దిల్లీ, కోల్‌కతా: సంపూర్ణ చంద్రగ్రహణం ఆకాశంలో కనువిందు చేసింది. పున్నమి వెలుగుల్లో మరింత అందంగా కనిపించే చందమామ కాసేపు మాయమైనా 'సూపర్, బ్లూ, బ్లడ్ మూన్'గా ఒకేరోజు భిన్న వర్ణాల్లో కనిపించి మురిపించాడు. బుధవారం సాయంత్రంనుంచి రాత్రి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కనిపించిన గ్రహణాన్ని ప్రజలు పెద్దఎత్తున వీక్షించారు. శాస్త్రీయ జిజ్ఞాస ఉన్న వారు దిల్లీ, పుణె, కోల్‌కతా, హైదరాబాద్ తదితర చోట్ల వేధశాల (ప్లానెటోరియం)ల వద్ద చేరి గ్రహణాన్ని తిలకించారు. అనేక దశాబ్దాల తర్వాత కనిపించబోతున్న ఖగోళ వింతను వీక్షించడానికి ప్రజలు డాబాలు, ఎత్తైన భవనాలు, మైదానాల్లో చేరి ప్రతీ క్షణాన్నీ ఆస్వాదించారు. దిల్లీలో ఇండియాగేట్ వద్దకు పెద్దఎత్తున విద్యార్థులు చేరుకున్నారు. కోల్‌కతాలోనూ భారీగా ఉత్సాహం కనిపించింది. దేశవ్యాప్తంగా అన్ని ఆలయాలనూ మూసివేశారు.


ఒకే నెలలో రెండుసార్లు గ్రహణం రావడం(బ్లూ మూన్) ఒక ఎత్తయితే, భూమికి దగ్గరగా రావడం వల్ల చంద్రుడు పెద్దగా కనిపించడం(సూపర్ మూన్) మరో ఎత్తు. భూ వాతావరణం మీదుగా చంద్రుడిపై సూర్యకిరణాలు పడినందువల్ల గోధుమ వర్ణంలో(రెడ్ మూన్) కనిపించడం ఇంకో ఆసక్తికరపరిణామం. ఈ మూడూ ఒకేసారి వస్తున్న విషయం ముందుగానే ప్రచారంలోకి రావడంతో ఈసారి గ్రహణంపై ఆసక్తి బాగా పెరిగింది. గ్రహణం భారత్‌లో పాక్షికంగానే కనిపించిందనీ, జులై 28న రాబోయేది దేశమంతటా కనిపిస్తుందనీ ముంబయిలోని నెహ్రూ ప్లానెటోరియం డైరెక్టర్ అరవింద్ పరాంజపే తెలిపారు.

ఆకాశంలో త్రివర్ణ 'చంద్ర'శోభితం: అపూర్వ చంద్రగ్రహణ దృశ్యాన్ని వీక్షించడానికి హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌కు ప్రజలు తరలివచ్చారు. చంద్రుడు రంగులు మారుతున్నప్పుడు వీక్షకులు ఆనందం వ్యక్తం చేశారు. బీఎం బిర్లా సైన్స్ సెంటర్ సంచాలకుడు డా.బి.జి.సిద్ధార్థ మాట్లాడుతూ.. బ్లూ మూన్, బ్లడ్‌మూన్, సూపర్ మూన్‌గా చంద్రుడు కనిపించడం అరుదైన విషయమనీ, ఇలాంటిదే మళ్లీ 2028లో కనిపించే అవకాశం ఉందని తెలిపారు.

అబ్బురపడిన భాగ్యనగరం: నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, అమీర్‌పేట్, తార్నాకా, హబ్సిగూడ, అశోక్‌నగర్, హెచ్‌సీయూ, జేఎన్టీయూ, ఓయూ తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో గూమిగూడి చంద్రగ్రహణాన్ని గమనించారు.. అద్భుత దృశ్యాన్ని చూసేందుకు చిన్నారులు కూడా ఆసక్తి చూపించారు.

శ్రీవారి ఆలయం 12 గంటల పాటు మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవారి ఆలయ ద్వారాలను బుధవారం 12 గంటల సమయంకుపైగా తితిదే మూసివేసింది. స్వామివారికి వేకువజామున సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు నిర్వహించిన అనంతరం ధర్మదర్శనాన్ని ప్రారంభించింది. తిరిగి ఉదయం 10 గంటలకు నిలిపివేసి ఆలయ శుద్ధి చేపట్టింది. అనంతరం ఉదయం సరిగ్గా 11 గంటలకు శ్రీవారి సన్నిధి నుంచి సప్తద్వారాలను మూసుకుంటూ తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ అర్చకులు వెలుపలికి వచ్చారు. తిరిగి గ్రహణానంతరం రాత్రి 9.30కు మందిరం ద్వారాల తలుపులన్నీ తెరచి ఆలయ శుద్ధిని తితిదే చేపట్టింది. సంప్రోక్షణ, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహించిన అనంతరం రాత్రి 10.30 గంటలకు శ్రీవారి దర్శనాన్ని తితిదే ప్రారంభించింది.



చంద్రగ్రహణం సందర్భంగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌పై భారీ పరిమాణంలో అలరించిన జాబిల్లి

50 కిలోమీటర్లు.. 11 గంటలు..

- మేడారం మార్గంలో స్తంభించిన ట్రాఫిక్
- ప్రయాణికుల నరకయాతన
- సమయానికి చికిత్స అందక బాలింత మృతి

ఈనాడు, మేడారం: మేడారం జాతర ఆరంభం రోజే ట్రాఫిక్ స్తంభించి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ములుగు సమీపంలోని గట్టమ్మ దగ్గరి నుంచి మేడారం వరకు సుమారు 50 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 11 గంటల సమయం పట్టిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి పోలీసుల వైఫల్యమే ముఖ్య కారణమని తెలుస్తోంది.

ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. సుమారు 7 గంటలపాటు వాహనాలు స్తంభించి ముందుకు కదలకపోవడంతో నిర్మల్ జిల్లా లోకేశ్వర్ మండలం హత్‌గల్‌కు చెందిన కళాబాయి అనే బాలింత మృతి చెందింది. జాతరకు వచ్చిన ఆమెకు పురిటినొప్పులు రావడంతో తొలుత మేడారం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆమెను వెంటనే ఏటూరునాగారం ఆసుపత్రికి పంపించగా అక్కడ మగబిడ్డకు జన్మనిచ్చింది. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న కళాబాయిని ములుగు ఏరియా ఆసుపత్రికి సిఫారసు చేశారు. ట్రాఫిక్‌జామ్ కారణంగా సకాలంలో ములుగు ఆసుపత్రికి చేరుకోలేక ఆమె మధ్యలోనే జంగాలపల్లి వరకు రాగానే ప్రాణాలు వదిలింది. ఈ వాహనంతోపాటు ట్రాఫిక్‌లో మరో నాలుగు 108 అంబులెన్స్‌లు ఇరుక్కుపోయాయి. ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన ప్రయాణికులు రాత్రంతా కారుచీకట్లు, ఎముకలు కొరికే చలిలో పిల్లాపాపలతో వాహనాల్లోనే కాలం గడిపారు. అటవీ ప్రాంతం కావడంతో మంచినీళ్లు సైతం లేక గంటలతరబడి అవస్థలు పడ్డారు. ప్రైవేటు వాహనాల్లో మేడారం బయలుదేరిన వారు వాహనాల్ని రహదారుల పక్కన నిలిపేసుకొని వంటావార్పు చేసుకున్నారు.

అసలు ఏం జరిగిందంటే..: చలాయి-గోవిందరావుపేట సమీపంలో పోలీసుల ట్రాఫిక్ నియంత్రణ సరిగాలేక వాహనాలు పోటీపడి వెళ్లాయి. అర్ధరాత్రి తర్వాత ఎదురెదురుగా వస్తున్న లారీ, బస్సులు ఒకటికొకటి తాకడంతో చోదకులు వాహనాలు ఆపుకొని వాదులాడుకోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఆ సమయంలో.. విధులు కేటాయించిన పోలీసులుగానీ, అధికారులు గానీ ఎవరూ లేరు. దీంతో నిమిషాల వ్యవధిలోనే 50 కిలోమీటర్ల దూరంలో వరంగల్ మార్గంలో ఆత్మకూరు వరకు ఏటూరునాగారం మార్గంలో పస్రా వరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో జయశంకర్ జిల్లా ఎస్పీ భాస్కరన్ స్వయంగా రంగంలోకి దిగి ద్విచక్రవాహనంపై పస్రా వరకు వెళ్లి సూచనలు చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మరోవైపు ములుగు డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి మేడారం నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి పస్రా-జంగాలపల్లి శివారులోని మేడివాగు వరకు జాతీయ రహదారిపై నిలిచిన వాహనాల రాకపోకలకు ముమ్మర ప్రయత్నం చేశారు. దీంతో ఉదయం నుంచి వాహనాలు కదలడం ప్రారంభంకాగా మధ్యాహ్నానికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. గురు, శుక్రవారాల్లో జాతరకు మరింత పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు అప్రమత్తం కావాల్సిన అవసరముంది.



ములుగు మండలం మేడివాగు వద్ద నిలిచిపోయిన వాహనాలు



కళాబాయి మృతదేహం

ప్రాథమిక పరిశోధనకు ఊతమిచ్చేలా సైన్స్ విధానం

ఈనాడు, హైదరాబాద్: విజ్ఞానశాస్త్రంలో ప్రాథమిక పరిశోధనలు కీలకమని, వీటిని ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానం ఉండాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రాథమిక పరిశోధన లేకుండా నేరుగా ప్రజోపయోగ ఆవిష్కరణలు రావన్నారు. తక్షణం ఉపకరించే ఆవిష్కరణలకే సాయం చేస్తామనే ప్రభుత్వ ఆలోచన సరికాదన్నారు. ప్రాథమిక పరిశోధనలకు తగినన్ని నిధులు కేటాయించి ప్రోత్సహించేలా భారత్ సైన్స్ విధానాన్ని అవలంబించాల్సి ఉందని చెప్పారు. భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో జరిగిన జీవకణ శాస్త్ర అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. సమావేశంలో భారత జీవకణ శాస్త్ర సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జగత్ కె రాయ్, ఆసియా పసిఫిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ సెల్ బయాలజీ అధ్యక్షుడు డాక్టర్ సత్యజిత్ మేయర్, సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా, ఆచార్యులు శశిధర మాట్లాడారు. ఐదురోజుల పాటు జరిగిన సదస్సుకు 30 దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, 1100 మంది పరిశోధక విద్యార్థులు, స్కాలర్లు హాజరయ్యారు.

సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(ప్యాక్స్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ), జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్), రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్ క్యాబ్) పాలకవర్గాలను మరో ఆరునెలల పాటు పర్సన్ ఇన్‌ఛార్జి(పీఐసీ)లుగా నియమించాలని నిర్ణయించినట్లు సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సహకార సంఘాల ఎన్నికలపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగింది. మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారంతో రాష్ట్రంలోని 456, ఫిబ్రవరి 3న మరో 427 ప్యాక్స్ పాలకవర్గాల పదవీకాలం ముగుస్తుందని మంత్రి పోచారం వివరించారు. ఈ పాలకవర్గాల నుంచి డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఎంపికైన వారి పదవీకాలం పూర్తవుతుందన్నారు. ఆరునెలల్లోగా మరోసారి సమావేశమై ఎన్నికలు ఎప్పుడు నిర్ణయించాలనే అంశంపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలతో పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగిస్తూ సహకార శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

సకాలంలో పనులు పూర్తిచేయకుంటే బిల్లుల నిలిపివేత

'భగీరథ'పై సమీక్షలో సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్

ఈనాడు, హైదరాబాద్: మిషన్ భగీరథ పనులను సకాలంలో పూర్తిచేయని గుత్తేదారులకు బిల్లులు నిలిపివేస్తామని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సభర్వాల్ స్పష్టం చేశారు. భగీరథ పనులపై బుధవారమిక్కడ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఎలక్ట్రో మెకానికల్ పనులను చేపట్టిన గుత్తేదార్లు.. సిబ్బంది సంఖ్యను పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. సమీక్షా సమావేశాల్లో గుత్తేదార్లు చెప్పే వివరాలను కలెక్టర్లకు తెలిపి వాటిని ధ్రువీకరించుకొంటామని స్పష్టంచేశారు. భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని చోట్ల చిన్నపాటి పనులు పూర్తి చేయగలిగితే వందల గ్రామాలకు మంచినీళ్లు సరఫరా చేయొచ్చని చెప్పారు.

ఖమ్మం, నల్గొండ డీసీసీబీలకు కష్టమే..

- పాలకవర్గాలకు పీఐసీ ఇవ్వవద్దని సహకార శాఖ యోచన
- 40 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకూ అంతే
- గత ఐదేళ్లుగా జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశాలు
- తిరిగి నియమించాలని నేతల పైరవీలు

ఈనాడు - హైదరాబాద్


ఐదేళ్ల పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్)కు, డీసీసీబీల్లో కొన్నింటికి ప్రస్తుత పాలకవర్గాలనే 'పర్సన్ ఇన్‌ఛార్జి'(పీఐసీ)లుగా నియమించకూడదని సహకార శాఖ యోచిస్తోంది. గత ఐదేళ్లుగా సంఘాలు, బ్యాంకుల్లో ఏమైనా అక్రమాలు జరిగితే ఆ పాలకవర్గాలకు పీఐసీ బాధ్యతలు ఇవ్వవద్దని ప్రభుత్వం సూచించింది. దీంతో ఖమ్మం, నల్గొండ పాత జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల పాలకవర్గాలను పక్కన పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కానీ ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయం మేరకు ఉత్తర్వుల్లో మార్పులుండే అవకాశాలున్నాయి. ఖమ్మం పాలకవర్గం పనితీరుపై విచారణ జరపాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నల్గొండ డీసీసీబీలోనూ పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలపై విచారణ సాగుతోంది. రాష్ట్రంలో మొత్తం 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. వీటిలో 108 సంఘాల పనితీరు సరిగా లేదని తాజాగా గుర్తించారు. కానీ వీటిలో 40 సంఘాల పాలకవర్గాలపైనే అవినీతి ఆరోపణలు ఉన్నందున వీటికి పీఐసీ బాధ్యతలు ఇవ్వకూడదని నిర్ణయించారు. మిగతా సంఘాలు వ్యాపార కార్యకలాపాలేమీ చేయకుండా నిస్తేజంగా ఉన్నాయి. వ్యాపారం చేయకపోవడానికి నిధుల కొరత, స్థానిక కారణాలుంటాయని, వీటిని సాకుగా చూపి పీఐసీ బాధ్యతలివ్వకుండా పక్కన పెట్టడం సబబు కాదని పలువురు నేతలు ప్రభుత్వానికి సూచించారు. ఈ నేపథ్యంలో అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగం అంశాలనే ప్రాతిపదికన తీసుకుని పీఐసీ నియామకాలు చేపట్టాలని సహకార శాఖ నిర్ణయించింది.

రేపు తుది నిర్ణయం...

రాష్ట్రంలో 457 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు బుధవారంతో పదవీకాలం ముగిసింది. మిగతావాటి పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 3తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికల్లా ఏ ఏ ప్రాథమిక సహకార సంఘాలు, డీసీసీబీ పాలకవర్గాలను పీఐసీలుగా నియమించాలనే అంశంపై సహకార శాఖ బుధవారం నుంచి కసరత్తు ప్రారంభించింది. ప్రతి ప్రాథమిక సహకార సంఘం, డీసీసీబీ పాలకవర్గాల పనితీరుపై వేర్వేరుగా నివేదికలు తీసుకుని శుక్రవారం సహకార రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలని అన్ని జిల్లాల సహకార అధికారి(డీసీఓ)లకు ఆదేశాలిచ్చింది. వారు ఇచ్చే నివేదికల ఆధారంగా పీఐసీ నియామకాలకు దూరంగా పెట్టే ప్రాథమిక సహకార సంఘాల సంఖ్య మారవచ్చని సమాచారం. ఎన్ని సంఘాలకు ఇవ్వాలనేది శుక్రవారం డీసీఓలతో చర్చించి ప్రభుత్వానికి నివేదించాలని సహకార రిజిస్ట్రార్ నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఐసీ నియామక ఉత్తర్వులు జారీకానున్నాయి. కొన్ని సంఘాల్లో అవినీతి బయటపడకుండా ఉండేందుకు ఆడిట్ చేయించకుండా పాలకవర్గాలు అడ్డుపుల్లలు వేస్తున్నాయి. వాటికి మరో నెల గడువు ఇస్తున్నారు. ఆడిట్ చేయించని సంఘాల కార్యకలాపాలను పరిశీలించిన తర్వాతే పీఐసీ నియామకాలుంటాయని అధికార వర్గాలు 'ఈనాడు'కు తెలిపాయి. వాస్తవానికి పీఐసీగా పాలకవర్గాలను సహకార రిజిస్ట్రార్ నియమించాలి. కానీ ఎవరిని నియమించకూడదు, ఎవరిని పక్కన పెట్టాలనేది ప్రభుత్వ స్థాయిలో నిర్ణయించాలని పలువురు నేతలు మంత్రుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. నిబంధనల ప్రకారం పీఐసీగా నియమించకుండా సహకార శాఖ పక్కన పెడితే ప్రభుత్వ స్థాయిలో తిరిగి తమ పేరు రాయించుకునేందుకు పలు సంఘాల పాలకవర్గాల నేతలు పైరవీలు చేయిస్తున్నారు. ప్రధానంగా అవినీతి, ఆరోపణలున్నవారు ఈ విషయమై గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

సొంత కణాలతోనే కృత్రిమ చెవులు

చైనాలో ఐదుగురు పిల్లలకు అమర్చిన పరిశోధకులు



శస్త్రచికిత్సకు ముందు, తరువాత..

బీజింగ్: చైనాలో ఐదుగురు చిన్నారులకు పరిశోధకులు కృత్రిమ చెవులను అమర్చారు. పిల్లల సొంత కణాలతోనే 3డీ ముద్రణా పరిజ్ఞానం సాయంతో ఈ చెవులను తయారుచేయడం విశేషం. ఆరు నుంచి తొమ్మిదేళ్ల వయసున్న ఈ చిన్నారులు చెవి వైకల్యం (మైక్రోషియా)తో జన్మించారు. అంటే వీరిలో ఒక చెవి పూర్తిగా అభివృద్ధి కాలేదన్నమాట. ఇలాంటి రుగ్మతతో పుట్టేవారికి కృత్రిమ చెవులు అమరుస్తుంటారు. అయితే ఒక్కోసారి ఇవి కొత్త సమస్యలు తెచ్చిపెడుతుంటాయి. ప్రస్తుతం ఈ రుగ్మతకు అధునాతన సాంకేతికతతో పరిశోధకులు చెక్‌పెట్టారు. మొదట సరిగ్గా ఎదిగిన చెవిని సీటీ స్కాన్‌చేశారు. జీవ విచ్ఛిన్నకర పదార్థాన్ని ఉపయోగించి వీటి అచ్చులను 3డీ ముద్రణా పరిజ్ఞానంలో తయారుచేశారు. ఈ అచ్చుల నిండా సూక్ష్మ రంధ్రాలను ఏర్పాటుచేశారు. పిల్లల రెండో చెవినుంచి సేకరించిన మృదులాస్థి కణాల (కాండ్రోసైట్లు)ను వీటితో నింపారు. ఇవి అచ్చంగా చెవి రూపంలో అభివృద్ధి అయ్యేలా చూశారు. మూడు నెలల అనంతరం వీటిని పిల్లలకు అమర్చారు. మొదటి శస్త్రచికిత్సను రెండేళ్ల క్రితమే పరిశోధకులు నిర్వహించారు. చివరి చికిత్స రెండు నెలల క్రితం జరిగింది. ఈ కృత్రిమ చెవులు శరీరంలో చక్కగా కలిసిపోతున్నాయని పరిశోధకులు తెలిపారు. 'కొత్తచెవి ఆకారం, పరిమాణం అచ్చంగా రెండో చెవిలానే ఉంది. ఈ తరహా చికిత్సను తొలిసారి విజయవంతంగా నిర్వహించాం'అని పరిశోధకులు తెలిపారు. అయితే ఈచికిత్సా విధానం కొత్తదేమీ కాదని మసాచుసెట్స్‌లోని కళ్లు, చెవి శస్త్రచికిత్సల కేంద్రం నిపుణులు టెస్సా హెడ్‌లాక్ తెలిపారు. మరోవైపు ఇది క్యాన్సర్ తరహాలో అపరిమితంగా కణజాలం పెరిగేందుకు దారితీసే ముప్పుందని ఆమె హెచ్చరించారు.

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి	బంగారం	ముడిచమురు
▼ 69	▼ 22	▲	రూ.లలో ▼	▼
35965	11028	63.58 (ఒక అమెరికా డాలరుకు)	30,390 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	68.88 (బ్రెంట్ ధర డాలర్లలో)

ఎల్ & టీకి ఆర్డర్ల దన్ను

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎల్అండ్‌టీ ఏకీకృత నికర లాభం 48% వృద్ధితో రూ.1,618 కోట్లుగా నమోదైంది. 2016 అక్టోబరు- డిసెంబరులో కంపెనీ లాభం రూ.1,090 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం కూడా 9.03 శాతం పెరిగి రూ.26,561.25 కోట్ల నుంచి రూ.28,960.36 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.26,420.43 కోట్లు కాగా.. ఏడాదిక్రితం నమోదైన రూ.24,882.85 కోట్లతో పోలిస్తే 6.17 శాతం పెరిగాయి. సమీక్ష త్రైమాసికంలో రూ.48,130 కోట్ల విలువైన ఆర్డర్లను ఎల్అండ్‌టీ పొందింది. 2016 అక్టోబరు- డిసెంబరులో వచ్చిన ఆర్డర్ల విలువతో పోలిస్తే పై విలువ 38 శాతం అధికం. రానున్న త్రైమాసికాల్లో వృద్ధిపరంగా దేశీయ, అంతర్జాతీయ విపణుల్లో సానుకూల పరిస్థితులు ఉంటాయని భావిస్తున్నామని కంపెనీ తెలిపింది.

రాణించిన కోరమాండల్ ఇంటర్నేషనల్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.172 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.112 కోట్ల కంటే ఇది 53 శాతం అధికమని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం కూడా రూ.2,283 కోట్ల నుంచి రూ.2,707 కోట్లకు పెరిగింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.8,662 కోట్ల ఆదాయంపై రూ.590 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్ష త్రైమాసికంలో సానుకూల వాతావరణం కారణంగా ఎరువులు, సస్య సంరక్షణ ఉత్పత్తుల వినియోగం పెరగడం ఆదాయం, నికర లాభం పెరగడానికి దోహదం చేసిందని కోరమాండల్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ గోయెల్ తెలిపారు. కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా ఎం.ఎం.మురగప్పను ఎన్నుకున్నారు.

ఐసీఐసీఐ లాభంలో 27% క్షీణత



దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం 27% క్షీణించి రూ.1,894 కోట్లకు పరిమితమైంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో రూ.2,611 కోట్ల నికర లాభాన్ని బ్యాంకు ఆర్జించింది. మరోవైపు ఏకీకృత ఆదాయం రూ.28,876 కోట్ల నుంచి రూ.28,501 కోట్లకు పెరిగింది. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం 32.4 శాతం తగ్గి రూ.1,650 కోట్లుగా నమోదైంది. 2016-17 అక్టోబరులో స్టాండలోన్ నికర లాభం రూ.2,442 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం పెరిగి రూ.5,363 కోట్ల నుంచి రూ.5,705 కోట్లకు చేరింది. దేశీయంగా నికర వడ్డీ మార్జిను 3.53 శాతంగా నమోదుకాగా.. మొత్తం మీద నికర వడ్డీ మార్జిన్ 3.14 శాతంగా ఉంది. సమీక్ష త్రైమాసికంలో ఆస్తుల నాణ్యత మరింత క్షీణించింది. డిసెంబరు చివరినాటికి స్థూల నిరర్థక ఆస్తులు 7.2 శాతం నుంచి 7.82 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు 3.96 శాతం నుంచి 4.2 శాతానికి పెరిగాయి.

బీఎస్ఈలో షేరు 0.1% పెరిగి రూ.352.95 వద్ద ముగిసింది.

స్వల్పంగా పెరిగిన వేదాంతా లాభం

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.2,173 కోట్ల నికర లాభాన్ని వేదాంతా ప్రకటించింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో నమోదైన రూ.2,133 కోట్లతో పోలిస్తే స్వల్పంగా 1.8 శాతంగా పెరిగింది. ఏకీకృత ఆదాయం కూడా 19 శాతం పెరిగి రూ.21,405 కోట్ల నుంచి రూ.24,934 కోట్లకు చేరింది. అల్యూమినియం వ్యాపార విభాగం మెరుగైన ప్రదర్శన, జింక్ ఇంటర్నేషనల్ విక్రయాలు పెరగడం లాంటివి ఇందుకు దోహదం చేశాయి. 'మేం పటిష్ఠ బ్యాలెన్స్ షీట్‌ను కలిగిఉన్నాం. కమొడిటీ విపణుల్లో సానుకూల పరిస్థితులు మాకు కలిసొచ్చాయి. నాలుగో త్రైమాసికంలోనూ మెరుగైన పనితీరును కనబరుస్తామన్న నమ్మకం ఉంది. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరాన్ని విజయవంతంగా ముగించాలని అనుకుంటున్నామ'ని వేదాంతా సీఈఓ కుల్‌దీప్ కౌరా తెలిపారు. డిసెంబరు 31 నాటికి వేదాంతా స్థూల రుణాలు రూ.55,218 కోట్లుగా నమోదైంది.

బీఎస్ఈలో షేరు 0.25% నష్టంతో రూ.339.50 వద్ద ముగిసింది.

విమ్టా ల్యాబ్స్ ఆదాయం రూ.48 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి విమ్టా ల్యాబ్స్ రూ.5.97 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.3.02 కోట్లతో పోలిస్తే 97 శాతం పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.38.86 కోట్ల నుంచి రూ.47.82 కోట్లకు చేరిందని కంపెనీ తెలిపింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.130.31 కోట్ల ఆదాయంపై రూ.11.36 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు


(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
ఎస్కార్ట్స్	92	22.7	1,213.23	1,100.79
హెచ్‌సీసీ	31.31	4.55	1,293.01	1,016.01
జే అండ్ కే బ్యాంక్	72.47	(498.47)	1,790.77	1,770.20
మహీంద్రా హాలీడేస్	31.7	35.7	272.5	274.8
హిందుస్థాన్ కాపర్	18.92	16.87	497.73	269.22
పీవీఆర్	28.28	22.12	550.06	513.49
జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (కన్సా)	1,774	716	17,903	15,345
కరూర్ వైశ్యా బ్యాంక్	71.49	115.76	1,647.17	1,581.26
అలెంబిక్ ఫార్మా(కన్సా)	131	86	840.34	777.38
డాబర్ (కన్సా)	333.05	294.67	2,032.78	1,935.97
ఒబెరాయ్ రియాల్టీ(కన్సా)	120.19	84.72	360.36	264.65
ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్	235.76	179.07	1,671.66	1,273.68
ఐడీబీఐ బ్యాంక్	(1,524)	(2,255)	6,645	7,104
ఎన్‌టీపీసీ	2,361	2,469	21,088	19,646
జేకే లక్ష్మీ సిమెంట్	8.59	7.60	852.03	766.11
ధంపూర్ షుగర్(కన్సా)	64.25	52.84	783.65	715.45
రిలయన్స్ ఇన్‌ఫ్రా(కన్సా)	301.38	374.82	6,345.97	6,484.45
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	154.27	151.52	2,276.54	1,935.37
నారాయణా హృదయాలయ	14.1	16.6	553.8	455.3
షాపర్స్ స్టాప్	16.34	19	966.58	1,019.93
నేషనల్ ఫెర్టిలైజర్స్	52.50	73.24	2,889.17	2,526.65
హెచ్‌సీఎల్ ఇన్ఫో	(62)	(50)	1,309.5	764.05

8 కాదు 8.2 శాతం

2015-16కు వృద్ధి రేటు అంచనాల సవరణ
2016-17 గణాంకాలు యథాతథం: సీఎస్ఓ

దిల్లీ: 2015-16 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి గణాంకాలను ప్రభుత్వం సవరించింది. ఇంతకుముందు 8 శాతం వృద్ధిని అంచనా వేయగా.. ప్రస్తుతం దానిని సవరించి 8.2 శాతానికి పెంచింది. 2016-17 వృద్ధి గణాంకాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. 7.1 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. 2015-16లో వాస్తవ జీడీపీ లేదా స్థిర ధరల వద్ద (2011-12) జీడీపీ రూ.113.86 లక్షల కోట్లని కేంద్ర గణక కార్యాలయం (సీఎస్ఓ) ఒక ప్రకటనలో తెలిపింది. 2016-17లో ఈ విలువ రూ.121.96 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు స్థూల విలువ జోడింపు (జీవీఏ) వరుసగా 7.1%, 8.1% చొప్పున నమోదైంది. సీఎస్ఓ తన ముందస్తు వృద్ధి అంచనాలో 2016-17 ఆర్థిక సంవత్సరానికి జీవీఏను 6.6 శాతంగా పేర్కొంది. 2016-17కు మొదటి సవరణ అంచనాలతో పాటు 2015-16కు రెండో సవరణ అంచనాలు, 2014-15కు మూడో సవరణ అంచనాలను బుధవారం సీఎస్ఓ విడుదల చేసింది. మూడో సవరణ కింద 2014-15 ఆర్థిక సంవత్సరానికి జీడీపీని 7.4 శాతానికి తగ్గించింది. అంతకుముందు 7.5 శాతంగా అంచనా వేసింది.



నెమ్మదించిన కీలక రంగాలు

డిసెంబరులో వృద్ధి 4 శాతమే

దిల్లీ: కీలక రంగాల పనితీరు నెమ్మదించింది. డిసెంబరులో వృద్ధి 4 శాతానికి తగ్గింది. ఇది 5 నెలల కనిష్ఠ స్థాయి. 2017 జులైలో నమోదైన 2.9 శాతం తర్వాత.. తక్కువ వృద్ధి నమోదుకావడం ఇదే తొలిసారి. 2016 డిసెంబరులో కీలక రంగాల వృద్ధి 5.6 శాతంగా ఉంది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్.. ఈ ఎనిమిదింటిని కీలక రంగాలుగా పరిగణిస్తారు. ముఖ్యంగా బొగ్గు, ముడి చమురు రంగాల్లో ప్రతికూల వృద్ధి.. కీలక రంగాల పనితీరు నెమ్మదించడానికి కారణమైంది. ఈ రెండు రంగాల ఉత్పత్తిలో వరుసగా 0.1%, 2.1% చొప్పున క్షీణత నమోదైంది. ఉక్కు రంగ వృద్ధి 2.6 శాతానికి తగ్గగా, విద్యుత్ రంగ వృద్ధి 3.3 శాతానికి పరిమితమైంది. 2016 డిసెంబరులో ఈ రెండు రంగాల వృద్ధి వరుసగా 15.9 శాతం, 6.4 శాతంగా నమోదైంది. మరోవైపు రిఫైనరీ ఉత్పత్తులు, సహజ వాయువు, ఎరువులు, సిమెంటు రంగాలు రాణించాయి. ఏప్రిల్-డిసెంబరులో 8 కీలక రంగాల వృద్ధి 4 శాతానికి తగ్గింది. 2016 ఏప్రిల్- డిసెంబరులో ఇది 5.3 శాతంగా ఉంది. పారిశ్రామికోత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ 8 కీలక రంగాల వాటా 41 శాతంగా ఉంది. అందువల్ల తాజా గణాంకాల ప్రభావం పారిశ్రామికోత్పత్తి సూచీపైనా ఉండే అవకాశం ఉంది.

మొబైల్ నెంబరు పోర్టబులిటీ రూ.4కే

దిల్లీ: మొబైల్ నెంబరు మారకుండా, నెట్‌వర్క్‌ను మార్చుకునేందుకు వినియోగదారుకు అవకాశం కల్పించే మొబైల్ నెంబరు పోర్టబులిటీ (ఎంఎన్‌పీ) ఛార్జీని రూ.4కు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ తగ్గించింది. ఇప్పటి వరకు రూ.19 వసూలు చేస్తుండగా, 79 శాతం తగ్గించి, గరిష్ఠంగా రూ.4 చేశామని, ఫలితంగా అత్యధికులు ఈ సేవను మరింతగా వినియోగించుకోగలుగుతారని పేర్కొంది. ఆపరేటర్లు ఇంతకన్నా తక్కువ కూడా వసూలు చేసుకోవచ్చని తెలిపింది. అధికారిక గజెట్ నోటిఫికేషన్ వెలువడే తేదీ నుంచి కొత్త ఛార్జీ అమల్లోకి వస్తుందని ట్రాయ్ ప్రకటించింది.

ఆగస్టుకల్లా ఇథనాల్ బైక్

ఈనాడు, దిల్లీ: పూర్తి ఇథనాల్‌తో నడిచే మోటార్‌సైకిల్‌ను బజాజ్ ఆటో సంస్థ వచ్చే ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా మార్కెట్‌లోకి తీసుకురానుంది. 100% ప్రత్యామ్నాయ ఇంధనంతో నడిచే బజాజ్ కొత్త బైక్ వి15ని కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌లు బుధవారం ఇక్కడ పరిశీలించారు. దీని ధరను ఇంకా నిర్ధారించలేదు. మైలేజ్ సాధారణ పెట్రోల్‌తో నడిచే దానికంటే 6-7% తక్కువ ఉంటుందని చెబుతున్నారు. అయితే పెట్రోల్‌కంటే చౌకైన ఇథనాల్‌తో నడుస్తుంది కాబట్టి వినియోగదారుడికి దీనివల్ల లబ్ధిచేకూరనుంది. 100% ఇథనాల్‌తో నడిచే సౌకర్యం ఉన్నప్పటికీ ఇందులో 85% ఇథనాల్, 15% పెట్రోల్ మిశ్రమం చేసి వాడితే బాగుంటుందని బజాజ్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అన్నిచోట్లా ఇది అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఇందులో ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్ వాడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల బండి స్టార్ట్‌చేయడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

మార్కెట్ కబుర్లు

రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్లయిన మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్ తమ షేర్లను విక్రయించే సమయంలో, యూఎస్ఎఫ్‌డీఏ, న్యాయశాఖ నుంచి విచారణ ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని దాచిపెట్టారనే అంశంపై జపాన్ ఫార్మా దిగ్గజం దైచి శాంక్యో వేసిన పిటిషన్‌పై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును దిల్లీ హైకోర్టు సమర్థించింది.

హెచ్‌పీసీఎల్‌లో ప్రభుత్వానికి ఉన్న 51.11 శాతం వాటాను రూ.36,915 కోట్లకు కొనుగోలు చేసినట్లు **ఓఎన్‌జీసీ** తెలిపింది. షేరుకు రూ.473.97 చొప్పున చెల్లించి, 77.88 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు వెల్లడించింది.

ప్రత్యేక రసాయనాల తయారీ సంస్థ **గెలాక్సీ సర్ఫాక్టంట్స్** తొలి పబ్లిక్ ఆఫర్, చివరిరోజుకు 20 రెట్ల అధిక స్పందన లభించింది. రూ.937 కోట్ల సమీకరణ లక్ష్యంతో, 44.32 లక్షల షేర్లు జారీ చేయనుండగా, 8.85 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి.

నరాల సంబంధిత వ్యాధుల నివారణకు ఉపకరించే కొత్త రసాయన సంస్థలకు సంబంధించి ఆఫ్రికా ప్రాంత మేధోసంపత్తి సంస్థ (ఆరిపో), దక్షిణ కొరియా నుంచి పేటెంట్లు లభించినట్లు **సువెన్ లైఫ్ సైన్సెస్** తెలిపింది. 2033, 2034 సంవత్సరాల వరకు ఇవి వర్తిస్తాయి.

మహారాష్ట్రలో 52వ నెంబరు జాతీయ రహదారి అభివృద్ధికి రూ.565 కోట్ల కాంట్రాక్టు లభించినట్లు **దిలీప్ బిల్డ్‌కాన్** ప్రకటించింది.

వయాకామ్ 18లో నియంత్రణ వాటా పొందనున్నట్లు ముకేశ్ అంబానీ నియంత్రణలోని మీడియా గ్రూప్ **టీవీ 18 బ్రాడ్‌కాస్ట్** తెలిపింది. ఇందుకు సుమారు రూ.130 కోట్లు పెట్టుబడి పెడతామంది.


2009-10 మదింపు సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖ రూ.436.80 కోట్ల జరిమానా విధించినట్లు **ఎన్‌డీటీవీ** తెలిపింది.

ఈజ్ ట్యాక్స్ నుంచి జీఎస్‌టీ అకౌంటింగ్ యాప్

ఈనాడు, హైదరాబాద్: పన్ను చెల్లింపుదారులకు మరింత వెసులుబాటు కల్పించడానికి మొబైల్ ఫోన్‌పై కూడా రిటర్న్‌లు దాఖలు చేయడానికి హైదరాబాద్‌కు చెందిన ఈజ్‌ట్యాక్స్ డాట్ ఇన్ (EZTax.in) జీఎస్‌టీ అకౌంటింగ్, ఐటీఆర్ ఫైలింగ్ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. జీఎస్‌టీలో బిల్లింగ్, అకౌంటింగ్, రిటర్న్స్ వంటి అన్నింటిని యాప్ ద్వారా చేసుకోవచ్చని ఈజ్‌ట్యాక్స్‌ను నిర్వహిస్తున్న ఎంవైడీ ల్యాబ్స్ సీఈఓ సునీల్ దాసరి తెలిపారు. కంప్యూటర్ లేకుండా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు రిటర్న్‌లు, ఇతరాలు దాఖలు చేయడానికి ఐటీఆర్ ఫైలింగ్ యాప్ దోహదం చేస్తుందని చెప్పారు.

36000 దిగువకు..

మార్కెట్లకు అమ్మకాల వెల్లువ
బడ్జెట్ ముందు అప్రమత్తత



ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. సూచీలు నష్టాలతో ముగిశాయి. సాధారణ బడ్జెట్ నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి అడుగేయడంతో సెన్సెక్స్ 36,000 పాయింట్ల దిగువకు చేరింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 11,000 పాయింట్లకు కిందకు వచ్చింది. అమెరికా ఫెడ్ సమావేశాలు సైతం ముందుజాగ్రత్తకు కారణమయ్యాయి. ఇక జనవరి మొత్తం చూస్తే. సెన్సెక్స్ 1,908.19 పాయింట్లు, నిఫ్టీ 497 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఇక ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సమీక్ష

సెన్సెక్స్ ఉదయం 35,951.64 పాయింట్ల వద్ద నష్టాల్లోనే ప్రారంభమైంది. రోజంతా మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంలో ఏదశలోనూ కోలుకోని సూచీ. ఇంట్రాడేలో 35,818.41 పాయంట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 68.71 పాయింట్ల నష్టంతో 35,965.02 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 21.95 పాయింట్లు కోల్పోయి 11,027.70 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,979.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.

వెలుగులోకి పీవీఆర్: ఆకర్షణీయమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ షేరు వెలుగులోకి రావొచ్చు. ఒకానొకదశలో 3.80 శాతం రాణించిన షేరు.. చివరకు 2.83 శాతం లాభంతో రూ.1,461,15 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టాలను చవిచూశాయి. డాక్టర్ రెడ్డీస్ 3.75%, టాటా స్టీల్ 3.49%, కోల్ ఇండియా 2.32%, హిందుస్థాన్ యునిలీవర్ 2.13%, సన్ ఫార్మా 2.02%, ఇన్ఫోసిస్ 1.63%, ఐటీసీ 1.51%, టీసీఎస్ 1.33%, విప్రో 0.99%, ఎల్ అండ్ టీ 0.87% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.85%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.25%, హెచ్‌డీఎఫ్‌సీ 1.16%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1%, టాటా మోటార్స్ 0.77%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో ఆరోగ్య సంరక్షణ 1.62% నీరసపడింది. ఎఫ్ఎమ్‌సీజీ 1.25%, లోహ 1.25%, యంత్ర పరికరాలు 1.12%, ఐటీ 1.10%, మన్నికైన వినిమయ వస్తువులు 0.98%, టెక్ 0.86%, మౌలిక 0.56% చొప్పున డీలాపడ్డాయి. చమురు-గ్యాస్, బ్యాంకింగ్ షేర్లు రాణించాయి.

హైదరాబాద్‌లో 3-4 విద్యుత్ కేంద్రాలు

వ్యర్థాల నుంచి 72 మె.వా.
రామ్‌కీ ఎన్విరో యోచన



విస్తరణ ప్రణాళికలను వివరిస్తున్న సంస్థ ఎండీ ఎం.గౌతమ్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: వ్యర్థాల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్‌లో 3-4 (వేస్ట్ టు ఎనర్జీ) కేంద్రాలు ఏర్పాటు చేయాలని రామ్‌కీ ఎన్విరో ఇంజినీర్స్ యోచిస్తోంది. హైదరాబాద్‌లో వచ్చే మూడేళ్లలో 72 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3-4 యూనిట్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని రామ్‌కీ ఎన్విరో ఇంజినీర్స్ ఎండీ, సీఈఓ ఎం.గౌతమ్ రెడ్డి తెలిపారు. ఒక్కో యూనిట్ సామర్థ్యం 20-25 మెగావాట్ల వరకూ ఉంటుందన్నారు. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేయడానికి ఒక మెగావాట్ సామర్థ్యం ప్లాంటుకు దాదాపు రూ.16 కోట్లు ఖర్చవుతుంది. హైదరాబాద్‌లో చెత్త, స్థల లభ్యత బాగానే ఉందన్నారు. ఇప్పటికే హైదరాబాద్ జవహర్‌నగర్‌లో 20 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే పనులను కంపెనీ ప్రారంభించింది. 'రూ.330-340 కోట్లతో దీన్ని బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బాట్) పద్ధతిలో నిర్మిస్తున్నాం. 2019, మార్చి నాటికి ఈ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నా'రు. దిల్లీలో ఇప్పటికే 24 మెగావాట్ల కేంద్రం ఉండగా, మరో 24 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశం ఉందని గౌతమ్ రెడ్డి చెప్పారు. మున్సిపల్ చెత్తలో వ్యాపార అవకాశాలు అపారంగా ఉన్నాయని.. దేశ వ్యాప్తంగా రోజుకు 2 లక్షల టన్నుల మున్సిపల్ చెత్త ఉత్పత్తి అవుతుంటే.. 5 శాతం కూడా వినియోగించుకోవడం లేదని చెప్పారు.

విదేశాల్లో వ్యాపార విస్తరణ: ఆసియాలోనే అతిపెద్ద వేస్ట్ మేనేజిమెంట్ కంపెనీ అయిన రామ్‌కీ ఎన్విరో విదేశాల్లో కార్యకలాపాలను విస్తరించాలని భావిస్తోంది. మున్సిపల్ చెత్త నుంచి బయో మెడికల్, హానికర వ్యర్థాల వరకూ అన్ని రకాల నిర్వహణను కంపెనీ చేపడుతోంది. ఇప్పటికే యూఎస్, యూఏఈ తదితర దేశాల్లో సేవలందిస్తున్న కంపెనీ మరిన్ని దేశాలకు సేవలను విస్తరించనుందని, గత ఆరు నెలల్లో 10-12 వేస్ట్ మేనేజిమెంట్ ప్రాజెక్టులను విదేశాల్లో చేజిక్కించుకున్నామని గౌతమ్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టులపై రూ.850 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టనున్నామన్నారు. వచ్చే రెండేళ్లలో కంపెనీ మొత్తం రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,800 కోట్ల ఆదాయం (విక్రయాలు) లభించగలవని ఇందులో రూ.600 కోట్లు విదేశాల నుంచి రాగలదని చెప్పారు. వచ్చే అయిదేళ్లలో విదేశాల వాటా 50 శాతానికి చేరగలదని, వచ్చే రెండేళ్లలో విక్రయాలు రూ.3,400-3,500 కోట్లకు చేరగలవని వివరించారు.

శ్రీకాళహస్తి పైప్స్ లాభం రూ.39 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: శ్రీకాళహస్తి పైప్స్ నికర లాభం స్వల్పంగా తగ్గింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నికర లాభం రూ.40.09 కోట్లు ఉండగా.. 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ.39.46 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.301 కోట్ల నుంచి రూ.398.49 కోట్లకు చేరింది. 2017-18 మొదటి తొమ్మిది నెలలకు రూ.1,190.79 కోట్ల ఆదాయంపై రూ.113.07 కోట్ల నికర లాభాన్ని ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టరు జి.ఎస్.రాఠీ తెలిపారు. క్యూఐపీ ద్వారా డిసెంబరులో రూ.250 కోట్లు సమీకరించినట్లు చెప్పారు.

నేటి బోర్డు సమావేశాలు

సీసీఎల్ ప్రొడక్ట్స్ | అశోక్ లేలాండ్ | టైటన్ | బజాజ్ ఫిన్‌సర్వ్ | బజాజ్ ఫైనాన్స్ | పవర్‌గ్రిడ్ | సియట్ | ఎంఆర్ఎఫ్ | సెరా శానిటరీవేర్ | కమిన్స్ | అక్జో నోబెల్ | ఎస్సెల్ ప్రోప్యాక్ | మ్యాగ్మా ఫిన్‌కార్ప్ | రాయల్ ఆర్కిడ్

31వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	360	వరంగల్	362
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	382
బెంగళూరు	380	చెన్నై	390
1న		చిత్తూరు	383
విజయవాడ/గోదావరి	372	నమక్కల్	375

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 428.85 (428.25) 2734628
AMBUJA CEMEN 261.80 (261.50) 2708846
ASIAN PAINTS 1128.30 (1126.70) 961596
AUROBIND PHA 629.55 (631.70) 1877445
AXIS BANK LT 593.60 (593.75) 7108060
BAJAJ AUTO L 3337.15 (3358.30) 275934
BAJAJ FINANC 1677.85 (1678.40) 1332225
BHARTI AIRTE 439.85 (440.60) 6371320
BHARTI INFRA 351.55 (344.45) 3997015
BOSCH LTD 19400.25 (19495.55) 34590
BPCL 492.30 (485.60) 6111327
CIPLA 592.15 (605.95) 1264055
COAL INDIA L 299.55 (305.90) 5198298
DR. REDDYS 2225.35 (2306.15) 1143907
EICHER MOTOR 26923.60 (26689.40) 137766
GAIL 478.60 (476.10) 2470120
HCL TECH 986.55 (1000.40) 1610572
HDFC 1956.30 (1937.50) 3665385
HDFC BANK 2005.70 (1995.50) 1735837
HERO MOTOCOR 3691.45 (3687.85) 558327
HINDALCO IND 256.15 (253.55) 17514495
HINDUSTAN UN 1369.35 (1400.25) 1491912
HPCL 397.70 (393.00) 6975667
ICICI BANK 352.95 (353.25) 22638319
INDIABULLS H 1390.95 (1415.00) 1337755
INDIAN OIL 417.60 (416.25) 13503235
INDUSINDBANK 1753.10 (1736.05) 1237098
INFOSYS LTD 1150.25 (1170.65) 4606849
ITC 271.40 (275.20) 18945945
KOTAK MAHIND 1108.95 (1088.05) 3143011
LARSEN & TOU 1416.50 (1429.90) 2614515
LUPIN 883.75 (902.75) 1590192
M&M 763.05 (764.90) 2242045
MARUTI SUZIK 9509.70 (9571.55) 462650
NTPC LTD 170.25 (170.30) 6517115
ONGC 203.45 (204.80) 11990243
POWER GRID C 193.80 (194.95) 8084501
RELIANCE IND 961.30 (950.40) 5738209
SBI 313.25 (313.55) 16409938
SUN PHARMA 579.90 (591.95) 4781423
TATA CONSULT 3112.35 (3152.85) 1521607
TATA MOTORS 399.50 (395.85) 5111454
TATA STEEL L 705.05 (775.85) 12958902
TECH MAHINDR 612.65 (602.95) 7244068
ULTRATECH 4382.00 (4363.20) 189153
UPL LIMITED 752.05 (770.75) 1831502
VEDANTA LIMI 340.35 (341.30) 8287707
WIPRO 304.70 (307.30) 2823913
YES BANK LTD 354.40 (353.35) 8527044
ZEE ENTERTAI 593.70 (603.00) 1844853

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1653.20 (1605.80) 125376
ACC 1715.25 (1728.10) 335683
ASHOK LEYLAN 126.10 (125.75) 10040333
AVENUE SUPER 1179.65 (1184.60) 750588
BAJAJ FINSER 4812.35 (4875.65) 220161
BANK OFBAROD 156.80 (160.20) 13420760
BEL 169.35 (177.00) 14411761
BHEL 100.20 (101.60) 12559349
BRITANNIA 4684.15 (4705.60) 71887
CADILA HEALT 425.80 (425.30) 1240632
COLGATE PALM 1121.35 (1138.60) 86920
CONTAINER 1390.30 (1380.00) 312099
CUMMINS INDI 903.90 (909.20) 212326
DABUR INDIA 355.60 (358.60) 4361853
DLF LIMITED 250.10 (253.90) 6309912
EMAMI LIMITE 1124.75 (1142.60) 557660
GLAXOSMI CON 6642.65 (6540.55) 19756
GLAXOSMI PHA 2460.60 (2456.30) 10599
GLENMARK PHA 606.20 (615.80) 667577
GODREJ CONSU 1053.40 (1057.70) 2353345
HAVELLS INDI 522.35 (552.85) 7290911
HINDUSTAN ZI 310.25 (310.90) 3717227
ICICI PRU LI 406.70 (414.75) 1439050
IDEA CELLULR 93.10 (94.00) 15241120
INTERGLOBE A 1214.95 (1213.10) 393839
JSW STEEL LT 289.95 (289.10) 6604621
LIC HOUS.FIN 534.95 (537.60) 2992832
MARICO LIMIT 309.40 (315.45) 721880
MCDOWELL 3285.60 (3281.15) 434481
MOTHERSON 365.80 (362.30) 1984871
MRF 68113.35 (68261.55) 8102
NHPC LTD 29.45 (29.90) 5433820
NMDC LTD 140.30 (143.70) 5265833
OIL INDIA 358.95 (359.45) 399404
ORACLE FIN S 4182.65 (4121.35) 35226
P&G HYG&HEAL 9271.70 (9310.60) 3676
PETRONET LNG 254.75 (257.90) 7215527
PIDILITE IND 896.30 (885.95) 709011
PIRAMAL ENTE 2743.00 (2766.95) 233914
PNB 171.35 (172.65) 15313331
POWER FIN CO 116.80 (117.35) 5522906
RURAL ELEC C 155.50 (156.80) 3294640
SAIL 88.90 (91.10) 13643595
SHREE CEMENT 17206.30 (17326.55) 17037
SHRIRAM TRAN 1379.75 (1374.85) 755720
SIEMENS 1301.85 (1289.25) 518457
SUN TV LTD 1024.40 (1027.55) 491600
TATA POWER 89.00 (90.60) 5862598
TITAN IND 869.55 (884.15) 1431670
TORRENT PHAR 1362.40 (1356.60) 115158

ఘనం (+) నిఫ్టీ	31న	మార్పు %
BHARTI INFRATEL	351.55	2.06
KOTAK MAHI BANK	1108.95	1.92
TECH MAHINDRA	612.65	1.61
BPCL	492.30	1.38
HPCL	397.70	1.20
RELIANCE IND	961.30	1.15
HINDALCO	256.15	1.03

గ్రహణం (-) నిఫ్టీ	31న	మార్పు %
DR. REDDYS LAB	2225.35	-3.50
UPL	752.05	-2.43
CIPLA	592.15	-2.28
HUL	1369.35	-2.21
LUPIN	883.75	-2.10
COAL INDIA	299.55	-2.08
SUN PHARMA	579.90	-2.04

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 8.60 (8.98) 6445
ALPHAGEO 910 (907.50) 2863
AMAR RAJA BA 807.75 (812.10) 31380
ANDHRA BANK 52.60 (53.15) 450838
ANDHRA CEMEN 13.03 (12.46) 58293
ANDHRA PAPER 348.80 (346.15) 23943
ANDHRA PETRO 70.45 (69.25) 300385
ANDHRA SUGAR 628.70 (652.55) 3031
ASTRA MICROW 114.30 (113.75) 103833
AUROBINDO PH 629.50 (631.15) 117903
AVANTEL SOFT 538.90 (553.20) 12009
AVANTI FEEDS 2223.95 (2271.65) 15786
BALAJI AMIN 656.40 (682.15) 20917
BARTRONICS 14.04 (14.10) 16656
BHAGIRA CHEM 299.15 (305.05) 4144
BHAGYA NAG 41.55 (42.25) 11440
BRILLIANT SE 16.46 (16.04) 893761
CAMBRIDGE TE 84.80 (86.25) 9678
CONT COFFEE 294.80 (285.25) 8165
COROMAN FERT 552.50 (528.35) 25527
CYBERMATE 3.67 (3.63) 27521
CYIENT LIMIT 642.45 (627.35) 41095
DECCAN CEMEN 574.20 (579.45) 122
DIVI'S LAB 1036.45 (1084.85) 65870
DR REDDY 2225.25 (2312) 132603
GATI CORPN 130.55 (129.95) 266158
GMR INFRASTR 21.75 (22.10) 3941814
GOLDST INFRA 224.60 (224.25) 41710
GRANULES (I) 132.20 (132.50) 141592
GVK POWER 20.55 (20.75) 588530
HBL NIFE POW 61.10 (61.90) 123563
HYD INDUS 1736.05 (1788.20) 3836
IKF SOFT 1.04 (0.95) 1929992
ILFS ENGINEE 44.25 (45.05) 16854
INNAREDY COM 4.29 (4.09) 155588
IVRCL INFRAS 5.31 (5.35) 96023
KAKATIYA CEM 366.45 (365.45) 9353
KAVERI SEED 515.45 (488.10) 92188
KCP LTD 145.70 (145.40) 25346
KNR CONSTRUC 307.45 (312.95) 13918
LANCO INDUS 377.05 (382.10) 30248
LANCO INFRAT 1.60 (1.53) 8754740
LAURUS LABS 519 (516.25) 6169
MADHUCON PRO 32 (32.20) 21304
MIC ELECTRON 8.76 (8.97) 66257
MOLD-TEK.TEC 67.65 (70.35) 5290
MOLDTK PLA 343.25 (349.75) 18294
NAGARJAGRICH 55.45 (54.25) 30975
NATCO PHARMA 944.30 (965.60) 47669
NAVA BH VENT 157.05 (161.40) 27890
NCC 122.60 (125.25) 419943
NCL IND 274.85 (267.50) 7733
NEHA INTER 7.73 (7.90) 15189
NETTLINX 91.65 (89.95) 30299
NEULAND LAB 836.65 (840.90) 1125
NIHAR INFO 14.50 (14.49) 480
NILE 907.20 (928.40) 3380
OIL COUNTRY 50.70 (51.75) 7040
PANYAM CEMEN 57.15 (57.25) 17653
PENNER IND 61.15 (61.25) 79280
PITTI LAMIN 86.25 (84.60) 9062
POKARNA 219.35 (218.20) 4853
PRAJAY ENGS 15.45 (14.72) 55179
PRISM CEMENT 138.45 (137.85) 151503
PRUDENTL PHA 4.68 (4.79) 238642
RAIN INDUSTR 380.90 (395.65) 496029
SAMKRG PIST 313 (324.15) 14410
SAMPRE NUTRI 69.05 (69.80) 4234
SATVAH. ISPA 27.75 (27.40) 5960
SMS PHARMA 97.70 (99.35) 18899
SREE RAYAL A 62.45 (63.85) 272677
STEEL EXCHAN 32.60 (33.15) 38142
SUJANA TOWER 4.55 (4.64) 4395
SUJANA UNIVE 1.12 (1.07) 135796
SURANA TELE 5.94 (5.75) 7832
SURYALAKSH.C 90.25 (90.25) 7798
SUVEN PHARMA 214.30 (224.40) 300279
TAJ GVK HOTE 176.35 (177) 29873
TANLA 33.95 (33.75) 183980
TERA SOFTWAR 67.15 (68.80) 8182
VICEROY HOTE 17.50 (17.70) 116038
VIMTA LABS 209.55 (212.55) 41717
VISAKA IND 743.60 (740.05) 56866
VISTA PHARMA 41.70 (42.30) 106142
VIVIMED LABS 86.15 (84.75) 328680
YBRANT DIGIT 6.11 (6.22) 280127
ZENTECH 120.70 (122.75) 23416

పద్దు పొడుపు వేళైంది.

ప్రధాని మోదీ నేతృత్వంలో ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశపెట్టబోయే ఈ బడ్జెట్ ప్రస్తుత ప్రభుత్వానికి చివరి పూర్తి స్థాయి బడ్జెట్.

ఎన్నికల ముందు ఏవైనా పథకాలు, సంస్కరణలు ప్రకటించాలన్నా ఇదే అసలు సిసలు అవకాశం.

జీఎస్‌టీ అమలు నేపథ్యంలో వస్తున్న తొలి బడ్జెట్ కూడా ఇదే.

జీఎస్‌టీయేతర వస్తువులను మినహాయిస్తే పన్ను పద్దులన్నీ ఒకే రూపంలో ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ కాస్త సరళంగా కనిపించే అవకాశం ఉంది. యథావిధిగా పేదరికం, యువత, వ్యవసాయంపై ఎక్కువ దృష్టి ఉండొచ్చని మార్కెట్ పండితులు అంటున్నారు. మరి వేతనజీవులకు పన్ను ఊరట లభిస్తుందా లేదా అన్నదే సగటు మధ్యతరగతి జీవి ప్రశ్న.

ఎన్నికలకు ముందు అందరికీ ఎంతో కొంత ఇస్తుందా.. లేదంటే సంస్కరణల బాటను కొనసాగిస్తుందా లేదూ.. మధ్యే మార్గంగా బడ్జెట్ దారి నడుస్తుందా అన్నది ఇవాళే తేలిపోతుంది..!!

ఈనాడు బిజినెస్

జన్‌ధన్ ఖాతాదార్లకు కానుక!

బడ్జెట్లో జన్‌ధన్ ఖాతాదార్లకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ శుభవార్తను వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఖాతాల్లో ఓవర్‌డ్రాఫ్ట్ మొత్తాన్ని రెట్టింపు చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఖాతాలను ఆరు నెలల పాటు సంతృప్తికరంగా నిర్వహిస్తే ఓవర్‌డ్రాఫ్ట్ కింద రూ.5,000 పొందే అవకాశం ఉంది. అయితే ఒక్కో కుటుంబంలో ఒక ఖాతాకు మాత్రమే ఈ సౌకర్యం ఉంది. ఈ మొత్తాన్ని రూ.10,000కు పెంచి అత్యవసర అవసరాలకు ఉపయోగపడేలా చేయాలని ఆర్థిక మంత్రి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ఖాతాదారు తమ ఖాతాలో ఉన్న మొత్తం కంటే ఎక్కువ డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి వీలు కల్పించేదే ఈ ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం. ఒక వ్యక్తి లేదా చిన్న వ్యాపారికి స్వల్పకాలంలో ఉండే నగదు సమస్యలు తీరతాయి. అయితే ఖాతాలో ఉన్న మొత్తం కంటే ఎక్కువ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకున్నపుడు ఆ పైమొత్తాన్ని నెల రోజుల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 31 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో రూ.73,689.72 కోట్లు ఉన్నాయి. 24 కోట్ల ఖాతాదార్లకు రుపే డెబిట్ కార్డులు సైతం ఉన్నాయి.



ఇది బడ్జెట్ సమయం మిత్రమా..

జైట్లీ గత 4 బడ్జెట్‌లలో..

2014-15

భాజపా ప్రభుత్వ తొలి బడ్జెట్ ఇది. మోదీ మే 26, 2014న అధికారం చేపట్టిన తర్వాత జులై 10న ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. 'దేశానికి నిరుద్యోగం, ప్రాథమిక అవసరాల కొరత, మౌలిక కొరత, పాలన పరమైన సమస్యలు మంచివి కావు. అయితే ప్రభుత్వం ఏర్పడ్డ 45 రోజుల్లోనే ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌లో అద్భుతాలను ఆశించకూడద'ని జైట్లీ తన ప్రసంగంలో అన్నారు. ద్రవ్య స్థిరీకరణ ముఖ్యమని గట్టిగా నొక్కి చెప్పారు. నైపుణ్య భారత్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ గ్రామ్ జ్యోతి యోజన తదితర పథకాలనూ సృష్టించారు. 2014-15లో రూ.8 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యకు కూడా భారీ కేటాయింపులు చేశారు.

2015-16

ప్రధాన మంత్రి 2022 దార్శనికత కేంద్రంగా ఆర్థిక మంత్రి జైట్లీ ప్రసంగం సాగింది. భారత్‌లో ఇప్పటికీ గ్రామీణ జనాభా 70 శాతంగా ఉందనీ.. గ్రామీణ యువతకు ఉపాధి కలిగించినపుడే భారత వృద్ధి ముందుకెళుతుందని ఘంటాపథంగా చెప్పారు. 80,000 గ్రామీణ పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. భారత జనాభాలో మూడింట రెండొంతుల మంది వయసు 35లోపే. ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్‌ను తయారు చేయాలంటే ఉద్యోగావకాశాల కల్పనే కీలకమని నొక్కి చెప్పారు. ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద బీమాను ప్రవేశపెట్టారు.

2016-17

గ్రామీణ కరవు ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పంచాయతీలు, మున్సిపాలిటీలకు రూ.2.87 లక్షల కోట్ల నిధుల సహాయాన్ని జైట్లీ ప్రకటించారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. 2022 కల్లా రైతుల ఆదాయాలను రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 1000 రోజుల్లో అన్ని గ్రామాలకు విద్యుదీకరణ హామీనిచ్చారు. కొత్త ఉద్యోగాల సృష్టి వేగవంతం చేయడం కోసం ఈపీఎఫ్ఓలో నమోదైన తొలి మూడేళ్ల పాటు అందరు కొత్త ఉద్యోగులకు పీపీఎస్ వాటా 8.33 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. పేద మహిళలకు ఎల్‌పీజీ కనెక్షన్‌ను హామీనిచ్చారు.

2017-18

పెద్ద నోట్ల రద్దుపై మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉటంకించిన 'ఒక సరైన కారణం ఎపుడూ విఫలం కాదు' వ్యాఖ్యలను జైట్లీ ఉదహరించారు. రైతులు, గ్రామీణ జనాభా, యువత, పేదలు, అణగారిన వర్గాల చుట్టూనే బడ్జెట్ ప్రసంగం సాగింది. కోటి కుటుంబాలను పేదరికం బారి నుంచి బయటకు లాగడానికి మిషన్ అంత్యోదయతో ముందుకెళతామని హామీనిచ్చారు. 2019 కల్లా 50,000 గ్రామ పంచాయతీలను పేదరికం నుంచి దూరం చేస్తామన్నారు. 2022 కల్లా 5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. 2025 కల్లా ట్యూబర్‌క్యులోసిస్‌ను పారదోలే లక్ష్యాన్ని పెట్టుకున్నామన్నారు. అందుబాటు ధరలో గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.

ఇలా చేయండి

మదుపర్లకు విశ్లేషకుల సూచనలు

అటు సామాన్యుడికి.. ఇటు పారిశ్రామికవేత్తకు బడ్జెట్ ఎంత కీలకమో సగటు మదుపరికి సైతం కేంద్ర బడ్జెట్‌పై అంతే ఆసక్తి ఉంటుంది. అందులోనే స్టాక్ మార్కెట్లు జీవన కాల గరిష్ఠాల వద్ద ట్రేడవుతున్న ఈ తరుణంలో మరింత ఆసక్తి సహజం. బడ్జెట్ అనంతరం మార్కెట్ పడుతుందా.. పడితే పెట్టుబడులు పెట్టవచ్చా? దిద్దుబాటు ఉంటుందా.. ఉండదా? ఒక వేళ లేకుంటే ఏం చేయాలి? లాభాలు పెరుగుతూనే ఉంటాయా? ఇలా ఎన్నో అనుమానాలు మదుపర్ల బుర్రను తొలిచేస్తూ ఉంటాయి.

బడ్జెట్ అనంతరం మార్కెట్ దిద్దుబాటుకు గురైతే తాజా పెట్టుబడులతో బరిలోకి దిగేవారూ లేకపోలేదు. అయితే గత పదేళ్ల చరిత్ర చూస్తే.. బడ్జెట్ అనంతరం నెల రోజుల్లో మూడు సార్లు మాత్రమే నిఫ్టీ ప్రతికూల ప్రతిఫలాలు.. అంటే నష్టాలను ఇచ్చింది. మిగతా సందర్భాల్లో లాభాలే వచ్చాయి. మరి ఈ సారి ఏం జరుగుతున్నది కీలకంగా మారింది. సోమవారం వెలువడిన ఆర్థిక సర్వే సైతం స్టాక్ మార్కెట్లకు కొన్ని నష్టభయాలు తప్పవని హెచ్చరించింది. నిధుల ప్రవాహం, అధిక ముడి చమురు ధరలు, అధిక షేర్ల ధరలను ఉటంకించింది. అయితే ప్రస్తుతం మార్కెట్ తీరును చూస్తే లాభాలకు ఇవి అడ్డుతగిలేలా కనిపించడం లేదు. 2017లో నిఫ్టీ బడ్జెట్‌కు నెల రోజుల ముందు ఏకంగా 11 శాతం పెరిగింది. ఆ తర్వాత(నెల రోజులు) కూడా 3 శాతం దాకా పెరిగింది. ఈ సారి మాత్రం గత 10 బడ్జెట్‌లతో పోలిస్తే బడ్జెట్‌కు ముందు మార్కెట్ ఊగిసలాట తక్కువగా ఉందనే చెప్పాలి. కానీ బడ్జెట్ తర్వాత మాత్రం కొంత లాభాల స్వీకరణ జరగవచ్చని విశ్లేషకులు అంచనా కడుతున్నారు.

ఏం చేయవచ్చునంటే..

ప్రస్తుత పరిస్థితుల్లో ఎంపిక చేసిన షేర్లపై మదుపర్లు దృష్టి సారించడం మంచిదని నిపుణులు సలహానిస్తున్నారు. మార్కెట్ పడిన ప్రతిసారీ కొంత పెట్టుబడులు పెట్టడం కూడా మంచి వ్యూహమంటున్నారు. డిసెంబరు 2018 కల్లా నిఫ్టీ 12000 స్థాయిని చేరుతుందని అంచనా కడుతున్నారు. గతంలో చిన్న, మధ్య స్థాయి షేర్లలో ర్యాలీ కనిపించింది. ఈ సారి ఆ బాధ్యతను పెద్ద స్థాయి షేర్లు భుజాన వేసుకునే అవకాశం ఉందంటున్నారు.



బడ్జెట్‌కు ముందు, తర్వాత, ఆ రోజున.. నిఫ్టీ కదలికలు

గత బడ్జెట్ తేదీలు	ఒక నెల ముందు	బడ్జెట్ రోజున	ఒక నెల తర్వాత	బడ్జెట్ రోజుతో పోలిస్తే నెల ముందు మార్పు(%లో)	బడ్జెట్ రోజుతో పోలిస్తే నెల తర్వాత మార్పు(%లో)
16 ఫిబ్రవరి 2009	2,828	2,849	2,777	1	–3
26 ఫిబ్రవరి 2010	5,008	4,922	5,282	–2	7
28 ఫిబ్రవరి 2011	5,512	5,333	5,687	–3	7
16 మార్చి2012	5,522	5,318	5,226	–4	–2
28 ఫిబ్రవరి 2013	6,075	5,693	5,683	–6	0
17 ఫిబ్రవరి2014	6,262	6,073	6,504	–3	7
10 జులై 2014	6,696	6,696	6,696	0	0
28 ఫిబ్రవరి2015	8,914	8,902	8,341	0	–6
29 ఫిబ్రవరి 2016	7,564	6,987	7,597	–8	9
1 ఫిబ్రవరి 2017	7,850	8,716	8,946	11	3

సాకారం కావాలి

డిజిటల్ లావాదేవీలకు జీఎస్‌టీ రేట్లు తగ్గాలి

డెబిట్‌కార్డు ద్వారా వినియోగదారులు రూ.2,000 వరకు జరిపే చెల్లింపులకు సంబంధించి, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలు సమకూర్చిన బ్యాంకులు, వ్యాపారుల వద్ద ఛార్జీ ఏమీ (ఎండీఆర్) వసూలు చేయడం లేదు. దీన్ని క్రెడిట్‌కార్డులు, ఇతర డిజిటల్ చెల్లింపులకూ విస్తరించాలి. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి జీఎస్‌టీ రేట్లను 1-3 శాతం రద్దు చేస్తే, చిన్న వ్యాపారులూ మరింతగా సహకరించవచ్చు.

టర్మ్ పాలసీలకు ప్రత్యేక మినహాయింపు కావాలి

ప్రస్తుతం సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు కోసం ఎక్కువమంది జీవితబీమా పథకాలు తీసుకుంటున్నారు. ఇందువల్ల బీమా రక్షణ తక్కువ మొత్తానికే లభిస్తోంది. అదే టర్మ్ పాలసీలు అయితే వార్షికాదాయానికి 10-15 రెట్లు అధిక బీమా తక్కువ ప్రీమియంకే లభిస్తుంది. అందువల్ల ఆరోగ్య బీమా తరహాలో వీటికీ ప్రత్యేక పన్ను మినహాయింపు కల్పించాలి.

ఎన్‌పీఎస్‌పై 100% పన్ను మినహాయింపు ఇవ్వాలి

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) 2009లనే అమల్లోకి వచ్చినా, పాలసీ గడువు ముగిశాక కార్పస్‌లో 40శాతంపై మాత్రమే పన్ను మినహాయింపు ఇస్తున్నందున ఎక్కువమంది ఈ పాలసీలు తీసుకోవడం లేదు. ఈపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్‌లయితే పూర్తిగా పన్ను మినహాయింపు లభిస్తోంది. అందువల్ల ఎన్‌పీఎస్‌కూ 100 శాతం పన్ను మినహాయింపు ఇవ్వాలి. ఈక్విటీల్లో 50 శాతం వరకే పరిమితి ఉంది, దీన్ని 100 శాతం వరకు అనుమతించాలి.

దీర్ఘకాలిక లాభాలపై పన్నులో మార్పులొద్దు

పెట్టుబడులకు ఈక్విటీ మార్కెట్లు బాగా ఉపకరిస్తున్నాయి. దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను మినహాయింపు ఉండటం వల్ల వ్యక్తిగత, సంస్థాగత పెట్టుబడిదార్లు అధికంగా పాల్గొంటున్నారు. ఈ పన్ను ప్రవేశపెడితే, మళ్లీ పెట్టుబడులు బంగారం, స్థిరాస్తికి మళ్లుతాయి. అందువల్ల అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో, ఈక్విటీ మార్కెట్లలోకి వ్యక్తిగత పెట్టుబడిదార్లు వచ్చేవరకు పన్ను మినహాయింపు కొనసాగించాలి.

జాతీయ రిటైలింగ్ విధానం కావాలి

భారత్‌మాల రోడ్డు నిర్మాణ పథకంలో భాగంగా మరిన్ని ప్రాజెక్టులను రవాణా రంగ సంస్థలు కోరుతున్నాయి. జాతీయ రిటైలింగ్ విధానాన్ని రిటైల్, ఇ కామర్స్ సంస్థలు ఆకాంక్షిస్తున్నాయి. లాభాల ఆధారిత ప్రోత్సాహకాలుండాలని లోహ, గనుల సంస్థలు ఆశిస్తున్నాయి. భారత్ 6 ప్రమాణాలకు మారేందుకు, అనుబంధ పరికరాలపై జీఎస్‌టీ రేటు తగ్గించాలని, వాహన రంగ సంస్థలు పేర్కొంటున్నాయి. భారీయంత్రాలు, పర్యావరణ పరిరక్షణ వ్యవస్థల దిగుమతికి పన్ను వద్దని కోరుకుంటున్నాయి.

అంకురాలకు కార్పొరేట్ పన్ను తగ్గించాలి

అంకుర సంస్థలు, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే కంపెనీలకు కార్పొరేట్ పన్ను తగ్గించాలి. స్మార్ట్‌ఫోన్ల నుంచే రుణాలు, పెట్టుబడి పథకాలకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కల్పించాలి. ఇందువల్ల నగదు వినియోగం తగ్గుతుంది. డేటా రక్షణ కోసం ఆర్థిక సాంకేతిక సంస్థలకు రాయితీలివ్వాలి. మహిళల శానిటరీ నాప్‌కిన్లపై జీఎస్‌టీ తొలగించాలి. మహిళల రక్షణ కోసం నిర్భయ పథకాలకు నిధులు పెంచాలి.



సొంతింటి కల నెరవేరాలంటే..

ఇంటి నిర్మాణం జరుగుతున్నపుడు, రుణంపై విధించే వడ్డీని 5 వార్షిక వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉంది. ఇంటి నిర్మాణం పూర్తయిన ఏడాది నుంచి ఇది చెల్లించాల్సి వస్తుంది. ఇందులోనే యజమాని సొంతగా నివసిస్తే, ఏడాదికి రూ.2 లక్షల వరకు వడ్డీకి ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తోంది. అయితే గృహరుణ చెల్లింపునకు సంబంధించి నెలవారీ వాయిదాల్లో, వడ్డీ భాగం ఎక్కువగా ఉంటూ, గృహరుణ వడ్డీ మినహాయింపు పరిమితిని మించుతున్నందున, అదనంగా నిర్మాణ సమయానికి వడ్డీకి పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోలేకపోతున్నారు. అందువల్ల నిర్మాణ సమయం వడ్డీని విడిగా పరిగణించాలి. కనీసం తొలిసారి ఇల్లు కొనుగోలుదార్లకు అయినా వర్తింప చేయాలి.

గృహానికి ఏర్పడే నష్టంపై, పన్ను చెల్లించే ఆదాయం నుంచి రూ.2 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నారు. దీన్ని కనీసం రూ.3 లక్షలకు పెంచాలి. ఇందువల్ల ఇంటి అద్దె కంటే, గృహరుణ వాయిదా ఎక్కువ చెల్లించేవారికి ఊరట మిగులుతుంది.

గృహరుణం చెల్లింపులో, అసలుపై ఏడాదికి రూ.లక్షన్నర వరకు మినహాయింపు ఉంది. ఇది కూడా సెక్షన్ 80సి కింద ఇతర పన్ను ఆదా చేసే పథకాల్లో కలిసి ఉంది. తొలిసారి ఇల్లు కొనుగోలుదార్లకు, ఇతర పన్ను ఆదా పథకాలతో సంబంధం లేకుండా అసలుపై రూ.1.50 లక్షల మినహాయింపు ఇవ్వాలి.

పరిశ్రమ హోదాతో స్థిరాస్తికి మెరుపు!

దీర్ఘకాలంగా నెరవేరకుండా ఉన్న పరిశ్రమ హోదా, వచ్చే బడ్జెట్‌లో సాకరమవుతుందని స్థిరాస్తిరంగ సంస్థలు ఆశిస్తున్నాయి. ఇప్పటికే అందుబాటు ధర గృహాలకు మౌలిక హోదా ఇచ్చినందున, 2018-19 బడ్జెట్‌లో తమ ఆకాంక్షను మోదీ ప్రభుత్వం నెరవేరుస్తుందనే భావిస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), స్థిరాస్తి నియంత్రణ చట్టం (రెరా) అమలుకు తోడు రూ.2 లక్షలకు మించి కొనుగోళ్లను నగదు రూపేణ రద్దు చేయడంతో, గతేడాదిలో స్థిరాస్తిరంగంలో వృద్ధి నెమ్మదించింది. దేశీయంగా వ్యవసాయం తరవాత, నైపుణ్యం లేనివారికీ అత్యధికంగా ఉపాధి చూపే ఈ రంగంపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని ఆకాంక్షిస్తున్నారు.

ఆకాంక్షలివీ

పరిశ్రమ హోదా లభిస్తే కనుక, స్థిరాస్తి రంగ సంస్థలకు తక్కువ వడ్డీకి రుణాలు లభిస్తాయి. ఇందువల్ల అందుబాటు ధరకు నివాసాలు లభించి, అంతిమంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

అందరికీ సొంతిల్లు సమకూర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ప్రభుత్వం, ఇందుకోసం అందుబాటు ధర గృహాలను మార్గంగా ఎంచుకుంది. వివిధ కారణాల వల్ల స్థిరాస్తి రంగానికి గిరాకీ తగ్గినందున, కొనుగోలుదార్లకు తాజా ప్రోత్సాహకాలను పరిశ్రమ ఆశిస్తోంది. తొలిసారి ఇల్లు కొనుగోలు చేసేవారికి, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఎక్కువ ప్రోత్సాహకాలు కావాలి.

2050 నాటికి పట్టణాలు, నగరాల్లో నివసించే వారి సంఖ్య మరో 90 కోట్లు పెరుగుతుందని అంచనా. అందుబాటు ధర ఇళ్లతోనే వీరికి సొంత నివాసం సాకారమవుతుంది. కనుక 'అందుబాటు ధర ఇల్లు'గా ధ్రువీకరణకు ప్రస్తుతం విధించిన విస్తీర్ణ పరిమితి పెంచాలని పరిశ్రమ కోరుతోంది. ఇందువల్ల వీటి కొనుగోలుకు మధ్యతరగతి వర్గీయులు కూడా ముందుకొస్తారని, రాయితీలు వారికి ఉపకరిస్తాయని పేర్కొంటోంది.

నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యం నివారించేందుకు ఏక గవాక్ష అనుమతులు కోరుతున్నారు.

గృహరుణం తీసుకునేవారు నెలవారీ చెల్లించే కిస్తీలో, అసలుపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి.

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై జీఎస్‌టీకి తోడు స్టాంప్ డ్యూటీ చెల్లించడం భారంగా మారుతోంది. అందువల్ల స్థిరాస్తులపై పన్నులు హేతుబద్ధీకరించాలి.

భూమి కొనుగోలుకు చెల్లించిన స్టాంప్‌డ్యూటీపై రుణం ఇచ్చేందుకు తగిన వ్యవస్థను నెలకొల్పాలి.

మోక్షం లభించేనా?

- ఎనిమిది కొత్త, అదనపు మార్గాలకు పూర్తయిన సర్వే
- భారీగా నిధులు కేటాయిస్తేనే అపరిష్కృత ప్రాజెక్టులు వడివడిగా
- నేడు కేంద్ర బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై ఆసక్తి

ఈనాడు - హైదరాబాద్

దక్షిణమధ్యరైల్వేలో ప్రతిపాదిత కొత్త రైలు మార్గాలు, అదనపు లైన్లలో ఎనిమిదింటికి సర్వే పూర్తయ్యింది.. గురువారం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న దృష్ట్యా వీటిలో ఎన్నింటికి మోక్షం లభిస్తుంది? నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు భారీగా నిధుల కేటాయింపు జరుగుతుందా? అన్నదానిపై తెలుగురాష్ట్రాల్లో ఆసక్తి నెలకొంది. 2017-18లో 113 కి.మీ. కొత్త రైలు మార్గం ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. 17 కి.మీ. రెండో లైను (డబ్లింగ్) పనులు, 490 కి.మీ. మేర విద్యుదీకరణను దక్షిణమధ్యరైల్వే పూర్తిచేసింది. 2018-19లో 307 కి.మీ. కొత్తమార్గం, రెండోలైను.. 359 కి.మీ. మేర విద్యుదీకరణ పనుల్ని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిని పూర్తిచేయడంతో పాటు తెలుగురాష్ట్రాల్లో కీలకమైన దాదాపు రూ.ఆరువేల కోట్ల విలువైన అమరావతి.. విజయవాడ నుంచి గుంటూరు, ఆర్మూర్-అదిలాబాద్‌కొత్త లైన్లను పట్టాలు ఎక్కించాలంటే పెద్దఎత్తున నిధులు కేటాయింపు జరగాల్సి ఉంది. గత మూడేళ్లలో దక్షిణ మధ్యరైల్వేలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో 16 కొత్త, అదనపు లైన్ల సర్వేకు ఆమోదం లభించింది. వీటిలో నల్లపాడు-బీబీనగర్ రెండోలైను సహా ఎనిమిది మార్గాలకు సర్వే పూర్తిచేసి రైల్వేబోర్డుకు పంపారు. బోర్డు నిర్ణయాన్ని బట్టి వీటిలో ఎన్నింటికి మోక్షం లభిస్తుందన్నదానిపై స్పష్టత రానుంది. కాజీపేట-విజయవాడ, కాజీపేట-బల్లార్ష నాలుగోలైను సర్వే టెండర్ల దశలోనే ఉండటంతో ఈ ఏడాది వాటికి అవకాశం లేనట్లే. ఘన్‌పూర్-సూర్యాపేట వయా పాలకుర్తి, కొత్తగూడెం-కిరండోల్, బోధన్-ముద్కేడ్-లాతూర్ కొత్త మార్గాల సర్వే పూర్తికావచ్చింది. ఫిబ్రవరి, మార్చిలోనే రైల్వేబోర్డుకు సమర్పించాలని దక్షిణమధ్య రైల్వే నిర్ణయించడంతో ఆ మార్గాలకూ ఈ ఏడాది మోక్షం కలిగే అవకాశం లేకుండా పోయింది.

సర్వే పూర్తయ్యి బోర్డుకు సమర్పించిన లైన్లు

నర్సాపూర్-మచిలీపట్నం, కంభం-ఒంగోలు, ఓబుళవారిపల్లి-వాయల్పాడు, చిత్తూరు-కుప్పం, తుని-కొత్తవలస, సింగరాయకొండ-కనిగిరి, బీబీనగర్-నల్లపాడు, కాజీపేట-కరీంనగర్ వయా హుజూరాబాద్.

టెర్మినల్, వ్యాగన్ వర్క్‌షాప్‌లకు నిధులే కీలకం

సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు చర్లపల్లిలో కొత్త టెర్మినల్ నిర్మిస్తామని.. త్వరలోనే టెండర్లు పిలుస్తామని దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. దీనికి రూ.80 కోట్లు కావాలి. అదేవిధంగా కాజీపేటలో వ్యాగన్ల పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌కు రూ.269 కోట్ల నిధులు కావాలి. ఈ రెండింటికి ఈ బడ్జెట్‌లో కేటాయించే నిధులే కీలకం కానున్నాయి. తెలంగాణకు గత ఏడాది మంజూరు చేసిన కొత్త ప్రాజెక్టుల్లో ఆర్మూర్-ఆదిలాబాద్ వయా నిర్మల్‌కు రూ.2,800 కోట్లు, ఘట్‌కేసర్-రాయగిరి (యాదాద్రి) ఎంఎంటీఎస్ రెండోదశ విస్తరణకు రూ.330కోట్లు కావాలి. ఎంఎంటీఎస్ రెండోదశ పనులు నిధుల కొరత వల్ల ఆలస్యమవుతున్నాయి. ఈ బడ్జెట్‌లో వీటికి ఎన్ని నిధులు కేటాయిస్తారన్నదాన్ని బట్టి పనుల పురోగతి ఉంటుంది. 2017-18లో... రూ.2,063 కోట్లతో మంజూరుచేసిన కాజీపేట-బల్లార్ష మూడోలైనుకు రూ.160 కోట్లు కేటాయిస్తే రూ.50కోట్లే ఖర్చుచేశారు. రూ.728 కోట్ల వ్యయంతో చేపడుతున్న సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ రెండో లైను కూడా ఉత్తరాదివైపు, బెంగళూరు వైపు రాకపోకలకు కీలకమైనదే. కాజీపేట-కరీంనగర్ వయా హుజూరాబాద్ కొత్త మార్గానికి ఆమోదం లభిస్తే.. దక్షిణాదిరాష్ట్రాల నుంచి.. కాజీపేట, హుజురాబాద్, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్; నాందేడ్, ఔరంగాబాద్ మీదుగా షిర్డీకి నేరుగా మార్గం అందుబాటులోకి వస్తుంది.



రైల్వేబోర్డు నిర్ణయమే కీలకం

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిని రైలు మార్గంతో అనుసంధానించే విజయవాడ-గుంటూరు వయా అమరావతి..ప్రాజెక్టును పట్టాలు ఎక్కించే విషయంలో రైల్వే బోర్డు నిర్ణయం కీలకం కానుంది. మొత్తం నిర్మాణవ్యయాన్ని రైల్వేశాఖే భరించాల్సి ఉన్నప్పటికీ..ఆదాయం తక్కువ వస్తుందన్న అంచనాలతో ఏపీ ప్రభుత్వాన్ని కొంత వాటా చెల్లించాలని రైల్వేశాఖ కోరింది. రాష్ట్ర వాటాకు అంగీకారం కాదని, కేంద్రమే నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. విజయవాడ-గూడూరు మూడోలైను, గుంటూరు-గుంతకల్లు రెండోలైనుకు దాదాపు రూ.ఏడువేల కోట్లు ఖర్చుచేయాల్సి ఉంది. వీటికి ఎన్ని నిధులు కేటాయిస్తారన్నదానిబట్టి పనులు ముందుకు సాగనున్నాయి.



నెలలు నిండే కొద్దీ
కంటినిండా కునుకు కరవు!!


64శాతం మంది గర్భిణులకు ఇదే సమస్య

లండన్: గర్భిణుల్లో సుమారు 64 శాతం మంది చివరి నెలల్లోకి వచ్చేసరికి విపరీతమైన నిద్రలేమితో బాధపడతారని తాజా అధ్యయనం వెల్లడించింది. గర్భం దాల్చడానికంటే ముందు సకాలంలో కమ్మని నిద్రపోయిన మహిళలు... ఆ తర్వాత మాత్రం కంటిమీద కునుకురాక ఇబ్బంది పడతారని ఓ జర్నల్ పేర్కొంది. పరిశోధకులు తాము ఎంపిక చేసుకున్న గర్భిణులను తొలి మూడునెలల కాలం నుంచీ ప్రసవం అయ్యేదాకా క్షుణ్ణంగా పరీక్షించారు.

ఆరునెలల గర్భిణిగా ఉన్నవారిలో 46 శాతం మంది....తొమ్మిదో నెలలో పడిన వారిలో 64 శాతం మంది నిద్రలేమితో ఇబ్బంది పడతారనీ...అందుకే, ఈ సమస్య పరిష్కారానికి ఓ నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలనీ పరిశోధకులు సూచిస్తున్నారు.

అందుకే, ఆరోనెల దాటినప్పటి నుంచీ గర్భిణులు తేలికపాటి వ్యాయామాలు చేయాలని పేర్కొన్నారు. నిద్రపోవడానికి ముందు ఓ గ్లాసు పాలు స్వీకరిస్తే మేలుకలుగుతుందని బెంగళూరుకు చెందిన పౌష్టికాహార నిపుణులు డాక్టర్. అనుజ్ సూద్ తెలిపారు. ఓ గ్లాసు గోరువెచ్చని పాలు తీసుకుంటే హాయిగా నిద్రపడుతుందని డాక్టర్. అనుజ్ వెల్లడించారు.

పాలల్లోని ఓ రకం
బాక్టీరియాతో కీళ్లవాతం!!




ఫ్లోరిడా: పాలు తాగితే ఎముకలు బలంగా ఉంటాయన్న విశ్వాసం నేపథ్యంలో ఓ తాజా అధ్యయనం తద్విరుద్ధమైన హెచ్చరిక చేస్తోంది. పాలల్లో ఉండే ఓ రకమైన బాక్టీరియా మూలంగా కీళ్లనొప్పులు వచ్చే ముప్పు లేకపోలేదని అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఫ్లోరిడా'(యుసీఎఫ్) పరిశోధకులు పేర్కొన్నారు. జన్యుపరంగా కీళ్లవాతం సంక్రమించే లక్షణాలు ఉన్న వారిలో పాలల్లోని 'ఎంఏపీ' అనే బాక్టీరియా ఆ సమస్యను ప్రేరేపిస్తుందని పరిశోధకులు స్పష్టం చేశారు.

ఏ వయసులోనైనా వారికి ఈ సమస్య తలెత్త వచ్చు. కాళ్లూ, చేతుల్లో విపరీతమైన నొప్పులతో బాధపడవచ్చు. ముఖ్యంగా 40-60 ఏళ్ల వయసు వారికి ఈ సమస్య విపరీతం కావచ్చునని పరిశోధకులు వెల్లడించారు. 'ఎంఏపీ' బాక్టీరియా పూరిత పాలను స్వీకరిస్తే...ఈ సమస్య తలెత్తుతుందని వారు తెలిపారు.

కీళ్లవాతం, నొప్పులతో బాధపడుతున్న వందమందిని ఎంపిక చేసుకుని అధ్యయనం నిర్వహించారు. వారిలో దాదాపు 80 శాతం మందిలో ఎంఏపీ బాక్టీరియాను కనుగొన్నట్లు వారు తెలిపారు.

విటమిన్ డీ3తో గుండెకు రక్ష



వాషింగ్టన్: దెబ్బతిన్న గుండె కణజాలాన్ని బాగుచేసే శక్తి విటమిన్ డీ3కు ఉంటుందని తాజా పరిశోధనలో తేలింది. అమెరికాలోని ఒహైయో స్టేట్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. మనపై సూర్యకాంతి పడినప్పుడు సహజంగానే శరీరం ఈ విటమిన్‌ను ఉత్పత్తిచేస్తుంది. ఎముకలు గట్టిపడేందుకు ఇది తోడ్పడుతుందని ఇదివరకటి పరిశోధనల్లోనే రుజువైంది. ప్రస్తుతం గుండె పనితీరు మీద ఈ విటమిన్ చూపే ప్రభావంపై శాస్త్రవేత్తలు దృష్టిసారించారు. దీని కోసం వెంట్రుక కంటే వెయ్యి రెట్లు తక్కువ మందంగల సూక్ష్మ నానోసెన్సర్‌లను ఉపయోగించారు. దీంతో రక్తసరఫరాలో కీలకంగా పనిచేసే, రక్తం గడ్డకట్టకుండా చూసే నైట్రిక్ ఆక్సైడ్ (ఎన్‌వో) అణువులను ఈ విటమిన్ చక్కగా ప్రేరేపించగలుగుతున్నట్లు తేలింది. అంతేకాదు గుండె కణజాలంపై ఒత్తిడిని తగ్గించేందుకు ఇది తోడ్పడుతున్నట్లు పరిశోధకులు కనిపెట్టారు. ఈ విటమిన్ లోపంతో గుండె పోటు రాకపోయినా.. హృద్రోగ ముప్పు పెరుగుతుందని పరిశోధనలో పాలుపంచుకున్న టెడూస్ మలిన్స్కి తెలిపారు.

స్మార్ట్ వస్త్రాల కోసం..
"సూపర్" ఘటాలు




బీజింగ్: ధరించగలిగే అధునాతన ఎలక్ట్రానిక్ వస్త్రాలకు బాటలు పరిచే సూపర్ కెపాసిటర్లను శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఇవి అచ్చంగా వస్త్రాలను పోలివుండటం విశేషం. వీటిని రెండు చేతులతో పట్టుకుని ఎలా సాగదీసినా, మడతలు పెట్టేసినా చక్కగా పనిచేస్తాయట. వేగంగా ఛార్జింగ్ ఎక్కిపోయే బ్యాటరీల్లానే ఇవి పనిచేస్తాయని, వీటిని చాలాసార్లు ఛార్జ్ చేసుకోవచ్చని చైనాలోని స్కూల్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ పరిశోధకులు చెన్ షియావోడాంగ్ తెలిపారు. సంప్రదాయ సూపర్ కెపాసిటర్ల కంటే వీటిలో నాలుగు రెట్లు ఎక్కువగా విద్యుత్‌ను నిల్వచేసే వీలుందని చెప్పారు. మామూలు పొడవు కంటే నాలుగు రెట్లు పెద్దగా దీన్ని సాగదీసినా 98 శాతం విద్యుత్ నిల్వ సామర్థ్యం వీటిలో అలానే ఉంటుందని పేర్కొన్నారు. వీటిని మాంగనీస్ డయాక్సైడ్ నానోవైర్లతో తయారుచేశామని చెప్పారు.

పాత టీకాలపై దర్యాప్తు షురూ

ఈనాడు, హైదరాబాద్: ఔషధ నియంత్రణ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న టెటనస్ టీకాల వ్యవహారం సంచలనంసృష్టిస్తోంది. వీటిని మందుల దుకాణాల్లో విక్రయించారా? ఎవరైనా వినియోగించారా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘట్‌కేసర్‌లో టెటనస్ టీకాలు తయారుచేస్తున్న డానో వ్యాక్సిన్ బయలాజికల్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో బుధవారం సోదాలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి ఎవరెవరికి సరఫరా చేస్తున్నారు? ఎన్ని లక్షల టీకాలు నెలకువిక్రయిస్తున్నారు? ప్రయోగపరీక్షల్లో (ట్రయల్‌టెస్ట్) విఫలమైన టీకాలను ధ్వంసం చేయకుండా అంబర్‌పేటలోని గోదాంలో ఎందుకు నిల్వ చేశారంటూ డానోకంపెనీ సంచాలకులు వేణుగోపాల్ రాజును ప్రశ్నించారు. ముద్రణసంస్థ పేరుతో గోదాంను తీసుకున్న వ్యవహారంపైనా ఆరాతీశారు. మరోవైపు మార్కెట్‌లో ఉన్న డానో టీకాల నిల్వలను వెనక్కు తీసుకోవాలంటూ పోలీసులు ఔషధ నియంత్రణశాఖ అధికారులకు సూచించారు.

కొన్నేళ్లుగా జరుగుతోందా?: ప్రయోగ పరీక్షల్లో విఫలమైన టీకాలను కొత్తగా మార్చి మార్కెట్‌లో పంపించే ప్రక్రియ కొన్నేళ్లుగా జరుగుతోందని పోలీసులు అనుమానిస్తున్నారు. నాణ్యత లేని టీకా మందును పారబోయకుండా సీసా మూతను తీసి కొత్త సీసాల్లో పోస్తున్నారు. వాస్తవానికి ఈ టీకాలను అతిశీతలీకరణ వాతావరణంలో ఉంచాలి. ఇందుకు విరుద్ధంగా అక్కడున్న కూలీలు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఒక ముద్రణాలయంలో అక్రమాలు జరుగుతున్నాయని పగలూ, రాత్రీ మందుల వాసన వస్తోందని పోలీసులకు సమాచారం అందింది. ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఎస్సై రవి మంగళవారం ముద్రణాలయానికి వెళ్లారు. అక్కడ అట్టపెట్టెల్లో టీకాలు సర్దడం, టీకాల మూతలను తీసి వేరే సీసాల్లోకి పోస్తుండడాన్ని గుర్తించారు. స్థానికుల నుంచి మరిన్ని వివరాలు సేకరించారు. అదే రోజు సాయంత్రం వరకూ కాపుకాశారు. డానో కంపెనీ నుంచి మరికొన్ని అట్టపెట్టెలు రావడంతో ఎస్సై రవి పోలీస్ ఉన్నతాధికారులకు, ఔషధనియంత్రణ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 8గంటల ప్రాంతంలో పోలీస్, ఔషధనియంత్రణ అధికారులు సంయుక్తంగా దాడులుచేసి 64వేల టీకాలను స్వాధీనంచేసుకున్నారు. టీకాలను ఔషధనియంత్రణ శాఖ అధికారులకు బుధవారం అప్పగించారు. తదుపరి చర్యలన్నీ ఆ శాఖ అధికారులే పర్యవేక్షిస్తారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిటనస్ వ్యాక్సిన్ నిల్వలు (అంతర్‌చిత్రంలో పాత టీకాలను కొత్త సీసాల్లోకి మార్చి అంటించేందుకు సిద్ధం చేసిన లేబుల్)

ఆరున్నర నిమిషాలకో మెట్రో

- ఏప్రిల్ 7 తర్వాత వేగం పెంపు
- మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: మెట్రో రైలులో రెండు నెలల అనంతరం సగటు ప్రయాణికుల సంఖ్య 70వేలకు పడిపోయింది. వారాంతాల్లో 80వేల మంది ప్రయాణిస్తున్నారు. తొలినెలలో సగటు ప్రయాణికులు 1.13 లక్షలు ఉన్న సంగతి తెలిసిందే. సరదాగా మెట్రో చూద్దామనే వారు తగ్గి నిత్యం ప్రయాణించేవారు పెరిగారని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. చెన్నైలో మెట్రో ప్రారంభించి మూడేళ్లు అయినా రోజువారీ ప్రయాణికులు పాతికవేలు మాత్రమేనని గుర్తుచేశారు. మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద బుధవారం మెట్రోబైక్ సేవలను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 7 నుంచి మెట్రోరైలు వేగం పెంచుతామన్నారు. ప్రస్తుతం మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు ప్రతి 8 నిమిషాలకు, అమీర్‌పేట నుంచి నాగోల్ వరకు ప్రతి 15 నిమిషాలకు మెట్రోరైళ్లు నడుస్తున్నాయని.. అనుమతి రాగానే రెండు మార్గాల్లో ఆరున్నర నిమిషాలకో మెట్రో నడపనున్నట్లు చెప్పారు. మిగతా మార్గాలను త్వరగా పూర్తిచేసే పనిలో ఉన్నామన్నారు. మెట్రో పాసులపై కసరత్తు చేస్తున్నామని ఎల్ అండ్ టీ మెట్రో సీవోవో అనిల్‌కుమార్ సైనీ తెలిపారు. మియాపూర్‌లోని కల్వరీ టెంపుల్ చర్చ్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు చర్చి బొమ్మతో అయిదు వేల మెట్రో కార్డులు అందజేసినట్లు అనిల్‌కుమార్ చెప్పారు.



బుధవారం హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణిస్తున్న అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ బి హడ్డా, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

భారత్-అమెరికా మైత్రీ మరింత బలోపేతం

భారత్-యూఎస్ రెండు అతిపెద్దప్రజాస్వామ్య దేశాల మధ్య మైత్రీ మరింత బలపడనుందని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ క్యాథరిన్ హడ్డా అన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు అయిన సందర్భంగా వేర్వేరు పాఠశాలలకు చెందిన విద్యార్థులు గీసిన చిత్రాలను ఆసియాలోనే అతిపెద్ద మెట్రో స్టేషన్ అయిన అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె మెట్రో ఎండీతో కలిసి ప్రారంభించారు. ఫిబ్రవరి 14 వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.

మెట్రో బైకు అద్దె 4 రూపాయలే!

ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు స్టేషన్ల నుంచి గమ్యస్థానం చేరుకునేందుకు రవాణా సదుపాయాలు ఒక్కొటిగా అందుబాటులోకి వస్తున్నాయి. బస్సులు, క్యాబ్‌లు, సైకిల్ సేవలు ప్రారంభమైనా కొన్ని స్టేషన్లకే పరిమితం కావడంతో క్రమంగా వీటిని విస్తరించే ప్రయత్నాల్లో మెట్రో వర్గాలు ఉన్నాయి. తాజాగా మియాపూర్ స్టేషన్ నుంచి బైకులను అద్దెకిచ్చే సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. బెంగళూరులో మెట్రోబైక్స్ సేవలను ప్రారంభించిన ఔత్సాహికవేత్త శమంత్.. తాజాగా ఈ సేవలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 20 బైకులతో మియాపూర్‌లో తొలిగావీటిని అందుబాటులోకి తెచ్చారు. కి.మీ.కు రూ.4 అద్దె వసూలు చేస్తున్నారు. ఎలాంటి డిపాజిట్ లేకుండానే బైకును అద్దెకు ఇచ్చేందుకు నిర్వాహకులు ముందుకొచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ చూపించడం తప్పనిసరి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి మెట్రోబైక్స్.ఇన్ యాప్‌ను మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకుని అద్దె బైకులను వినియోగించవచ్చు. ప్రస్తుతానికి మియాపూర్ స్టేషన్ నుంచి అద్దెకు తీసుకెళితే తిరిగి అక్కడే ఇవ్వాలి. 10కి.మీ. రూ.40 చెల్లిస్తే సరిపోతుంది. పర్యావరణ హితంగా ఉండేలా త్వరలో ఎలక్ట్రికల్ బైకులను అందుబాటులోకి తేనున్నారు.

కోటు గుండీ.. కోటికి బురిడీ

- రూ.4 కోట్ల విలువైన వజ్రమంటూ మోసం
- ఇద్దరు అరెస్ట్
- రూ.1.15 కోట్ల నగదు స్వాధీనం

ఈనాడు - హైదరాబాద్

కోటు గుండీలా ఉన్న గాజును రూ.4 కోట్ల వజ్రంగా నమ్మించి రూ.1.20 కోట్లు కొట్టేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులు మహ్మద్ అతర్ సిద్ధిఖీ, మహ్మద్ సలామ్‌ఖాన్‌లను బుధవారం అరెస్టు చేసిన మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి దగ్గర నుంచి రూ.1.15 కోట్ల నగదు, వజ్రాల క్యారెట్‌ను నిర్ధారించే యంత్రం, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధాకిషన్‌రావు విలేకర్లకు వెల్లడించారు. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లో ఉంటున్న మహ్మద్ సిద్ధిఖీ, సలామ్‌ఖాన్ కొన్నేళ్లుగా ముత్యాలు, పగడాలను విక్రయిస్తున్నారు. సలామ్ గతంలో నాంపల్లిలోని మహ్మద్‌ఖాన్ జువెలర్స్‌లో పనిచేసేటప్పుడు సహోద్యోగి అయిన షేక్ హాజీతో స్నేహం ఏర్పడింది. 1996 నుంచి ఐదేళ్లపాటు అక్కడ పనిచేసిన తర్వాత సలామ్, హాజీ ఇద్దరూ వ్యాపారులుగా మారారు. హాజీ సనత్‌నగర్‌లో ముత్యాలు, పగడాలు విక్రయించేవాడు. ఈ నెల 15న సలామ్.. హాజీకి ఫోన్ చేసి తమ దగ్గరికి వేరేవారు రూ.4 కోట్ల విలువైన వజ్రం తీసుకువచ్చారని, వారికి ఆర్థిక ఇబ్బందులున్నందున రూ.1.20 కోట్లకు అమ్ముతున్నారని వివరించారు. సలామ్ మాటలు నమ్మిన హాజీ తన దగ్గరున్న సొమ్ముతోపాటు పరిచయస్తుల నుంచి అప్పు తీసుకుని రూ.1.2 కోట్ల నగదును ఈ నెల 18న మహ్మద్ సిద్ధిఖీ, సలామ్‌లకు ఇచ్చాడు.

డబ్బు తీసుకుని మోసం: కోటు గుండీ తరహాలో ఉన్న గాజును వజ్రంగా నమ్మించేందుకు సిద్ధిఖీ, సలామ్‌లు పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. చార్మినార్ సంతలో ఈ నెల 14న నకిలీ వజ్రాన్ని రూ.3,500కు కొన్నారు. షేక్ హాజీని పిలిపించి అది నిజం వజ్రం అని నమ్మించడానికి అందులో నుంచి కాంతి వచ్చేలా చేశారు. మరో పరికరాన్ని గాజు వద్ద ఉంచి లేజర్ కిరణాలు వచ్చేలా చేశారు. 25 క్యారెట్ల వజ్రమేని నిర్ధారించే తూకం యంత్రంపై తూచి చూపించారు. వారం రోజుల్లో రూ.4 కోట్లకు అమ్మిస్తామంటూ హామీ కూడా ఇచ్చారు. ఈలోగా సలామ్ స్నేహితుడు ఒకరు హాజీ దగ్గరకొచ్చి నువ్వు చాలా అదృష్టవంతుడివి.. రూ.4 కోట్లకు వజ్రం అమ్ముడవుతుందని చెప్పాడు. ఇది కూడా సలామ్ మాయేనని తెలియని హాజీ నకిలీ వజ్రాన్ని తీసుకుకెళ్లాడు. వారం రోజులైనా సలామ్ స్పందించలేదు. అప్పిచ్చినవారు ఒత్తిడి చేయడంతో హాజీ ఆ వజ్రాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. నకిలీదని తేలడంతో మోసపోయానని గ్రహించాడు. పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. మధ్యమండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బృందం మహ్మద్ సిద్ధిఖీ, సలామ్‌ఖాన్‌లను బుధవారం అదుపులోకి తీసుకుంది. విచారణలో నేరం అంగీకరించడంతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్వాహా చేసిన సొమ్ములో కొంత తీసుకుని సలామ్ తన సోదరుడి చదువు కోసం చేసిన అప్పులు తీర్చాడని కమిషనర్ తెలిపారు. ఎవరైనా సరే వజ్రాలు, బంగారం తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మొద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.



విలేకరుల సమావేశంలో నకిలీ వజ్రాన్ని చూపుతున్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

దరఖాస్తును స్వీకరించి హాల్‌టికెట్ జారీచేయండి

కర్నూలు వాసి వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తన పాఠశాల విద్య అయిదు నుంచి పదో తరగతి వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో అభ్యసించానని, ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లో తెలంగాణ అభ్యర్థిగా పరిగణించి.. రిజర్వేషన్ వర్తింపజేయాలని అభ్యర్థిస్తూ కర్నూలు మండలం రెమట గ్రామానికి చెందిన ఎం.రంగస్వామి ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు బుధవారం విచారణ జరిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసినప్పటికీ పిటిషనర్ దరఖాస్తును నేరుగా(ఆఫ్‌లైన్) స్వీకరించి హాల్‌టికెట్ జారీచేయాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిని ఆదేశించారు. పిటిషనర్‌కు రిజర్వేషన్ వర్తింపజేయాలని స్పష్టంచేశారు.

7 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

గురుకులాల్లో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 612 పోస్టులకు, 1:2 నిష్పత్తిలో 963 మంది అభ్యర్థులను పరిశీలనకు పిలిచామని పేర్కొన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ సాంకేతిక విద్యాభవన్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది.

బ్యూటీపార్లర్ నిర్వహణలో శిక్షణ

బీసీ నిరుద్యోగ యువతకు బ్యూటీ పార్లర్ యాజమాన్య నిర్వహణలో శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ కమిషనర్ తెలిపారు. అభ్యర్థులకు తెలంగాణ బీసీ ఉద్యోగ, నైపుణ్య శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామని, ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతి పాసై 19-35 ఏళ్లలోపు వయసున్న యువత దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు.

కొత్త పంచాయతీలపై ఇక సర్కారుదే నిర్ణయం


రాష్ట్రంలో ఎక్కడెక్కడ కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసేది రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ల ద్వారా వెల్లడించనుంది. కొత్త పంచాయతీలపై పలు జిల్లాల ప్రతిపాదనలు బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యాలయానికి చేరాయి. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి తయారు చేసిన ప్రతిపాదనలతో పాటు ఆయా ప్రాంతాల మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినవీ వీటిలో ఉన్నట్టు తెలిసింది. వీటన్నింటినీ యథాతథంగా ఆమోదించటం సాధ్యంకాదు కనుక రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ తీసుకొనే నిర్ణయమే ఇప్పుడు కీలకం కానుంది. ప్రతిపాదిత పంచాయతీల్లో ఏ జిల్లాలో ఎన్ని అవసరమనేది నిర్ణయించిన తర్వాత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లను వెలువరిస్తుంది.

బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ బాధ్యతారాహిత్యం

సాంకేతిక సమస్యతో గంటల తరబడి నిలిచిన విమానం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: విమాన ప్రయాణికుల విషయంలో ఎయిర్‌లైన్స్ సంస్థల నిర్లక్ష్య వైఖరి మరోసారి బహిర్గతమైంది.ఉదయం వెళ్లాల్సిన విమానం రాత్రయినా కదలకపోవడం.. ఎప్పుడు బయలుదేరుతుందనే సమాచారంచెప్పడంలో సిబ్బంది విఫలం కావడంతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు. హైదరాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే నిలిచి పోవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. బీఏ277 నంబరు విమానం 180 మందితో బుధవారం ఉదయం 7.20 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సి ఉంది. చివరి నిమిషంలో లోపాన్ని గమనించిన పైలట్ అధికారులకు సమాచారం అందించారు. నిపుణులు శ్రమించినా ఫలితం లేకపోవడంతోప్రయాణికులను 10 గంటలకు విమానం నుంచి దించేశారు. మరమ్మతుల అనంతరం పంపిస్తామని వెల్లడించారు. ఆతర్వాత సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.ఆందోళనఅనంతరం కొంతమందిని హైటెక్ సిటీ నోవాటెల్ హోటల్‌కు, మరికొందరిని విమానాశ్రయంలోని నోవాటెల్‌కు తరలించారు. విమానం మరమ్మతులు పూర్తిచేసుకుని గురువారం తెల్లవారుజామున 2 గంటలకు లండన్‌కు బయలుదేరుతుందని అధికారులు వెల్లడించారు.

నేడు తెలుగు నేతలతో కమల దళపతి భేటీ



ఈనాడు, దిల్లీ: భాజపా అధ్యక్షుడు అమిత్‌షా గురువారం తెలుగు రాష్ట్రాల భాజపా నేతలతో సమావేశం కానున్నారు. అయిదుగురు చొప్పున రావాలని సూచిస్తూ అమిత్‌షా కార్యాలయం నుంచి ఇరు రాష్ట్రాల పార్టీ అధ్యక్షులకు వర్తమానం అందింది. ఈ సమావేశం అజెండా ఏమిటన్నది మాత్రం వెల్లడించలేదు. నియోజకవర్గాల పునర్ విభజనపై చర్చ ఉండొచ్చని ఇరు రాష్ట్రాల పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ఈ హామీని నిలబెట్టుకోవాలని ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో రాజకీయ నిర్ణయం తీసుకోవడానికి పార్టీ ముఖ్యనేతలతో చర్చించేందుకు పిలిచి ఉండొచ్చని భావిస్తున్నారు. అలాగే. . భాజపా వద్దనుకుంటే నమస్కారం పెట్టేసి మాట్లాడుకుందాం అంటూ ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఏపీలోని పరిస్థితులపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై అవగాహనకు రావడానికి ఈ సమావేశాన్ని వేదికగా చేసుకోవచ్చంటున్నారు. తెలంగాణలో భవిష్యత్తు ఎన్నికల్లో పోటీకి అనుసరించాల్సిన వ్యూహంపైనా ప్రధాన చర్చ జరగొచ్చని చెబుతున్నారు. గురువారం ఇరురాష్ట్ర నేతలతో అమిత్‌షా వేర్వేరుగా భేటీ కానున్నారు. తెలంగాణ నుంచి భాజపా అధ్యక్షుడు కె.లక్ష్మణ్, శాసనసభలో పార్టీనేత కిషన్‌రెడ్డి, సంస్థాగత కార్యదర్శి మంత్రి శ్రీనివాస్, కేంద్ర మాజీమంత్రి దత్తాత్రేయ, పార్టీ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు హాజరుకావొచ్చని సమాచారం. ఏపీ నుంచి భాజపా అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు, సంస్థాగత కార్యదర్శి రవీంద్రరాజు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి హాజరుకావొచ్చని తెలుస్తోంది.

నియోజకవర్గాల పునర్ విభజనపైనే..

నియోజకవర్గాల పునర్ విభజనపై ఇంతవరకూ అధిష్ఠానం స్థానిక పార్టీ నాయకత్వాలతో చర్చించలేదనీ, తాజా సమావేశంలో ఈ అంశం చర్చకు రావచ్చని భావిస్తున్నారు. తెలంగాణ భాజపా నాయకులు తొలుత సీట్ల పెంపు ప్రతిపాదనను వ్యతిరేకించినా ప్రస్తుతం దానిపై పెద్దగా అయిష్టతేమీ వ్యక్తం చేయడంలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఏపీ భాజపా నాయకుల్లో ఓ వర్గం వ్యతిరేకిస్తున్నా, ఎక్కువ మంది సమర్థిస్తున్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీని నెరవేర్చామని ప్రజలకు చెప్పుకోవడం, ఏపీలో తెదేపాను ఎక్కువ సీట్ల కోసం డిమాండ్ చేయడం, ఒంటరిగా పోటీచేస్తే భాజపాలో ఎక్కువమంది నాయకులకు అవకాశం కల్పించడం, సీట్ల పెంపుతో రాజకీయ సుస్థిరతకు ఇబ్బంది లేకుండా చేశామని ప్రజలకు చెప్పుకోవడానికి అవకాశం ఉండటం వంటి ప్రయోజనాలు ఉంటాయని పార్టీ నేతలు చెబుతున్నారు.

30 పైసలకే వంద లీటర్ల శుద్ధజలం

టెక్నోకాం (గ్రూపు) డైరెక్టర్ శ్రీరాం కులకర్ణి

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థ జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు, నీటిని శుద్ధిచేసి ప్రజలకు సరఫరా చేసేందుకు ఇండో అమెరికన్ స్వచ్ఛంద సంస్థ 'షల్‌డీసెల్' ముందుకొచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు 30 పైసలకే వంద లీటర్లతాగునీరు అందిస్తామని ప్రకటించింది. బుధవారం ముంబయికి చెందిన టెక్నోకాం గ్రూపు డైరెక్టర్ శ్రీరాం కులకర్ణి, షల్‌డీసెల్ సంస్థ కార్యనిర్వాహక సభ్యులు నర్సింహాచారి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో సమావేశమయ్యారు. నీటి శుద్ధి విధానంపై వాక్‌దృశ్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శ్రీరాం మాట్లాడుతూ..'ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు అందిస్తున్న 20 లీటర్ల నీళ్ల క్యాన్లలోనిది పూర్తిగా స్వచ్ఛమైన నీరు కాదు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీరూ సురక్షితం కాదు. జిల్లాలోని ఫ్లోరైడ్ బాధిత గ్రామాల ప్రజలను ఇవి ఎంతమాత్రం రక్షించలేవు. ఈ నీటిని సాంకేతిక పరిజ్ఞానంతో శుద్ధిచేయాల్సిన అవసరం ఉంది. ఆ బాధ్యతను మేము స్వీకరిస్తాం.' అని వివరించారు.

ఆదాయపన్నుశాఖ తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: ఆదాయపన్నుశాఖ అధికారులు బుధవారం కొన్ని స్థిరాస్తి వ్యాపార సంస్థల కార్యాలయాల్లో తనిఖీలు మొదలుపెట్టారు. టీడీఎస్‌కు సంబంధించి ఏవైనా తేడాలు ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా సంస్థలు సమర్పించిన పత్రాల ఆధారంగా కార్యాలయాల్లోని దస్త్రాలను పరిశీలిస్తున్నారు. ఇందులో నెల్లూరుకు చెందిన ప్రముఖ స్థిరాస్తి వ్యాపార సంస్థ కూడా ఉంది. ఇదంతా మామూలు వ్యవహారమేనని, మార్చి నెలాఖరు వరకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఆదాయపన్నుశాఖ అధికారులు వెల్లడించారు.

ఛాంపియన్స్



రాయుడిపై 2 మ్యాచ్‌ల నిషేధం

ముంబయి: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో మరో మ్యాచ్ ఆలస్యానికి కారణమైన హైదరాబాద్ జట్టు కెప్టెన్‌పై బీసీసీఐ రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. విజయ్ హజారే వన్డే టోర్నీలో నిషేధం అమలవుతుంది. గత నెల విశాఖపట్నంలో కర్ణాటకతో మ్యాచ్ సందర్భంగా లక్ష్య సవరణపై వివాదం చెలరేగింది. తౌలుత ఫీల్డర్ బంతిని ఆపాడని భావించిన అంపైర్లు రెండు పరుగులను కర్ణాటక జట్టు స్కోరులో కలపలేదు. ఆ తర్వాత లక్ష్యం 204 అన్న భావనతో హైదరాబాద్ బ్యాటింగ్‌కు వచ్చింది. ఐతే రెండు పరుగులను కలిపి లక్ష్యాన్ని సవరించాలని కర్ణాటక కెప్టెన్ వినయ్ కుమార్ పట్టుబట్టాడు. అదెలా సాధ్యమవుతుందని రాయుడు వాదనకు దిగాడు. అప్పుడు అంపైర్లు.. తర్వాత చూద్దామని మ్యాచ్‌ను కొనసాగించారు. ఐతే రెండు జట్ల స్కోర్లు సమం కావడంతో సమస్య జటిలమైంది. రాయుడు సూపర్ ఓవర్ కోసం హైదరాబాద్ జట్టుతో కలిసి మైదానంలో చాలాసేపు ప్రాక్టీస్ చేశాడు. ఐతే అప్పటికే మ్యాచ్ ముగిసిందని అంపైర్లు తేల్చేశారు. మొత్తానికి సమయం వృథా అయి ఆ తర్వాత కేరళ, ఆంధ్ర మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. బీసీసీఐ నియమావళిని ఉల్లంఘించాడని అంపైర్ల తనపై మోపిన అభియోగాలను అంగీకరించిన రాయుడు.. రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని వ్యతిరేకించలేదు. దీంతో విచారణ చేపట్టాల్సిన అవసరం లేకుండా నిషేధం అమలు చేశారు.



ఫైనల్లో మేరీకోం శ్యామ్‌కుమార్

దిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో స్టార్ బాక్సర్ మేరీకోం, తెలుగు తేజం శ్యాం కుమార్ ఫైనల్లో ప్రవేశించారు. ఐతే శివ థాప, మనోజ్ కుమార్‌లకు నిరాశ తప్పలేదు. సెమీస్‌లో ఓడిన ఈ ఇద్దరు కాంస్యంతో సరిపెట్టుకున్నారు. మహిళల 48 కిలోల సెమీస్‌లో పన్నెండో సీడ్ మేరీకోం కఠిన ప్రత్యర్థి అల్తాన్‌సెత్సెగ్ లుత్సైఖాన్‌ను అలవోకగా ఓడించింది. సరిత దేవి, పింకి జాంగ్ర, సోనియా కూడా ఫైనల్ చేరారు. పురుషుల విభాగంలో శ్యామ్ కుమార్ (49 కిలోలు), అమిత్ పంగల్, సతీశ్ కుమార్ (+91 కిలోలు) ఫైనల్ బెర్తులు దక్కించుకున్నారు. గాయం కారణంగా సుమిత్ సంగ్వాన్ సెమీస్ నుంచి వైదొలిగాడు. పురుషుల 60 కిలోల విభాగంలో టాప్‌సీడ్ శివ థాపకు మనీష్ కౌశిక్ షాకిచ్చాడు. నిరుడు జాతీయ ఛాంపియన్‌షిప్‌లో కూడా శివను మనీష్ ఓడించాడు. 69 కిలోల సెమీస్‌లో మనోజ్ కుమార్ సహచరుడు దినేశ్ చేతిలో ఓడిపోయాడు. మరోవైపు థాయ్‌లాండ్‌కు చెందిన నరిన్‌రామ్ థాని గాయం కారణంగా వైదొలగడంతో పోటీపడకుండానే శ్యాం ఫైనల్లో చోటు దక్కించుకున్నాడు.



మొమినుల్ 175 బ్యాటింగ్

బంగ్లాదేశ్ 374/4

చిట్టగాంగ్: శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ ధాటిగా ఆరంభించింది. తొలి టెస్టు తొలి రోజు లంక బౌలింగ్‌ను బంగ్లా బ్యాట్స్‌మెన్ ఆటాడుకున్నారు. యువ బ్యాట్స్‌మన్ మొమినుల్ హక్ చెలరేగి ఆడి తొలి రోజే 175 పరుగులతో (203 బంతుల్లో 16×4, 1×6) అజేయంగా నిలిచాడు. దీంతో ఆట ఆఖరుకు బంగ్లా 4 వికెట్లు కోల్పోయి 374 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (52), ఇమ్రుల్ కయెస్ (40) శుభారంభాన్నందించగా.. తర్వాత ముష్ఫికర్ రహీమ్ (92; 192 బంతుల్లో 10×4)తో కలిసి మొమినుల్ మూడో వికెట్‌కు 236 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును తిరుగులేని స్థితికి చేర్చాడు. ఒక దశలో బంగ్లా స్కోరు 356/2. ఐతే చివర్లో లక్మల్ (2/43) రెండు వికెట్లు తీసి లంకకు కాస్త ఉపశమనాన్నిచ్చాడు. ఆట ఆఖరుకు మొమినుల్‌కు తోడుగా మహ్మదుల్లా (9) క్రీజులో ఉన్నాడు.



బదులు తీర్చేస్తారా?

5 — దక్షిణాఫ్రికాలో జరిగిన 28 వన్డేల్లో భారత్ విజయాలు. తొలి వన్డే వేదికైన డర్బన్‌లో మాత్రం ఒక్క వన్డే కూడా గెలవలేదు.

సఫారీలతో ఇక వన్డే సమరం
నేడే డర్బన్‌లో తొలి మ్యాచ్
ఆత్మవిశ్వాసంతో కోహ్లీసేన

సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-I, 3ల్లో

సిరీస్ పోయినా.. చివరగా ఒక చిరునవ్వు! దక్షిణాఫ్రికాను వారి గడ్డపై ఒక టెస్టులో మట్టికరిపించామన్న తృప్తి! వన్డే సిరీస్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించడానికి ఆ విజయం చాలు! టెస్టులతో పోలిస్తే వన్డేల్లో భారత్‌కు మెరుగైన అవకాశాలుంటాయన్నది ముందు నుంచి ఉన్న అంచనానే. దూకుడైన ఆటగాళ్లతో నిండిన టీమ్‌ఇండియా.. వన్డే సిరీస్‌లో భిన్నమైన ఫలితం రాబట్టగలదన్న ధీమా అభిమానుల్లో ఉంది. రెండు జట్ల మధ్య అంతరం కూడా పెద్దగా లేదు. తొలి మూడు వన్డేల్లో ప్రత్యర్థి జట్టు ప్రధాన ఆటగాడు డివిలియర్స్ కూడా ఉండడాయె. మరి ఈ సానుకూలతల మధ్య కోహ్లీసేన ఎలా ఆడుతుంది? టెస్టు సిరీస్ ఓటమికి వన్డేల్లో బదులు తీర్చుకుంటుందా?

డర్బన్

కొంత విరామం తర్వాత సఫారీలతో మళ్లీ సమరానికి సిద్ధమైంది టీమ్‌ఇండియా. ఆరు వన్డేల సిరీస్ గురువారమే ఆరంభం. డర్బన్‌లోని కింగ్స్‌మీడ్‌లో తొలి వన్డే జరగబోతోంది. రెండేళ్ల కిందట భారత్‌లో టెస్టు సిరీస్ ఓడినప్పటికీ.. వన్డే సిరీస్ గెలిచి సంతృప్తిగా పర్యటనను ముగించింది దక్షిణాఫ్రికా. ఇప్పుడు అలాగే టెస్టుల్లో ఓడిన భారత్.. వన్డేల్లో ప్రత్యర్థిని దెబ్బ తీస్తుందేమో చూడాలి. చివరి టెస్టులో విజయంతో ఆత్మవిశ్వాసం అందుకోవడం, జట్టు కూడా బలంగా ఉండటంతో భారత్ తేలిగ్గా లొంగకపోవచ్చని అంచనా.



అందరి దృష్టీ అతడి మీదే..: వన్డే సిరీస్ ముంగిట భారత జట్టులో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది రోహిత్ శర్మే. విదేశీ టెస్టుల్లో పేలవమైన రికార్డున్నప్పటికీ.. స్వదేశీ ఫామ్ ఆధారంగా రోహిత్‌ను దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో ఆడించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. తొలి రెండు టెస్టుల్లో అతను సత్తా చాటలేక తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నాడు. మూడో టెస్టుకు జట్టులో చోటు కోల్పోయాడు కూడా. మరి ఇప్పుడు వన్డేల్లో రోహిత్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం. డిఫెన్స్ ఆడటంలో ఇబ్బంది పడే రోహిత్.. తన సహజ శైలిలో ధాటిగా ఆడేందుకు వీలున్న వన్డేల్లో భిన్నమైన ప్రదర్శన చేయగలడని అంచనా. అందులోనూ తనకిష్టమైన ఓపెనింగ్‌లో రానున్నాడు రోహిత్. మరి తొలి వన్డేలో అతనెలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరం. తొలి టెస్టు తర్వాత జట్టులో చోటు కోల్పోయిన మరో ఓపెనర్ ధావన్ సైతం తనేంటో రుజువు చేసుకోవాల్సిన స్థితిలో ఉన్నాడు. టెస్టుల్లో చక్కటి ఫామ్ కనబరిచిన కోహ్లి వన్డేల్లోనూ కీలకమే. ఈ మధ్య ఆశించినంత వేగంగా ఆడలేక విమర్శలెదుర్కొన్న ధోనికి ఈ సిరీస్ పరీక్షే కానుంది. అతడితో పాటు జాదవ్, పాండ్య మిడిలార్డర్లో కీలకం.

రహానె ఉంటాడా?: కొంత కాలంగా రహానెను పరిమిత ఓవర్ల క్రికెట్లో పక్కన పెట్టేస్తున్నారు. ఐతే దక్షిణాఫ్రికాలో పిచ్‌లు కఠినం కాబట్టి రహానెను ఎంచుకున్నా ఆశ్చర్యమేమీ లేదు. అతను వద్దనుకుంటే పాండే ఆడొచ్చు. టెస్టుల్లో సత్తా చాటిన పేసర్లపై వన్డేల్లోనూ మంచి అంచనాలే ఉన్నాయి. ముఖ్యంగా భువనేశ్వర్, బుమ్రాలతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు. స్పిన్నర్లు కుల్‌దీప్, చాహల్‌ల్లో ఒకరికే తుది జట్టులో చోటు ఉంటుంది. మూడో పేసర్‌గా ఉమేశ్ యాదవ్‌ను ఆడిస్తారా? షమినే ఎంచుకుంటారా అన్నది ఆసక్తికరం.

ఏబీ లేడు కానీ..: డివిలియర్స్ తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం దక్షిణాఫ్రికాకు పెద్ద ఎదురు దెబ్బే. ఇది భారత్ అవకాశాల్ని పెంచేదే. ఐతే ఆ జట్టు బలమేమీ తక్కువగా లేదు. బ్యాటింగ్‌లో ఆమ్లా, డికాక్, డుప్లెసిస్, డుమిని, మిల్లర్.. బౌలింగ్‌లో రబాడ, మోర్నీ మోర్కెల్, తాహిర్‌లతో ఆ జట్టు బలంగా ఉంది. ఇంకా మోరిస్, ఫెలుక్వాయో లాంటి ఆల్‌రౌండర్లు కూడా ఆ జట్టుకు బలమే. పైగా ఆ జట్టు ఆడుతున్నది సొంతగడ్డపై అన్నది మరువరాదు. ఆరంభంలో మోర్నీ, రబాడలను భారత బ్యాట్స్‌మెన్ ఎలా ఎదుర్కొంటారన్న దాన్ని బట్టి విజయావకాశాలు ఆధారపడి ఉంటాయన్నది స్పష్టం.

'దేశంలో క్రీడా ప్రతిభకు లోటు లేదు'



దిల్లీలో బుధవారం ఖేలో ఇండియా పాఠశాలల క్రీడల ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ, క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్, సుశీల్, సింధు, గోపీచంద్, శ్రీకాంత్ తదితరులు

దిల్లీ: భారత్‌లో క్రీడా ప్రతిభకు లోటు లేదని, మన దేశం క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరగలదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో క్రీడాభివృద్ధి కోసం ఉద్దేశించిన తొలి ఖేలో ఇండియా పాఠశాలల క్రీడల్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. "క్రీడలు మానసిక వికాసానికి ఎంతో ముఖ్యం. ఖేలో ఇండియా ఒక కార్యక్రమం కాదు. అదొక ఉద్యమం. ఇవి భారత యువ క్రీడా ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చి.. మన దేశ క్రీడా సామర్థ్యాన్ని చాటి చెబుతాయి. ఖేలో ఇండియా కేవలం పతకాలు గెలవడానికి ఉద్దేశించిందే కాదు, మరింత ఎక్కువమందిని ఆటల్లోకి తీసుకురావడానికి బలం ఇచ్చేందుకు చేసే ఒక ప్రయత్నం. దేశంలో క్రీడలకు మరింత ఆదరణ పెరిగేలా ప్రతి చిన్న విషయం మీదా దృష్టిపెడతాం. ప్రపంచ వేదికపై భారత్ బలంగా ఉండటమంటే కేవలం బలమైన సైన్యం, శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థ ఉండటమే కాదు. శాస్త్ర, కళ, క్రీడా రంగాల్లోనూ మనం బలంగా ఉండాలి. ఈ రంగాల్లోనూ భారత్ ఉన్నత స్థాయికి వెళ్తుందని నాకు నమ్మకముంది. యువతపై నాకు భరోసా ఉంది. దేశంలో క్రీడా ప్రతిభకు లోటు లేదు. క్రీడల్లో మనం మరింత ఉన్నతి సాధించగలం" అని మోదీ అన్నారు.

ఆ స్థానానికి రహానె పోటీదారే

"రహానెను మూడో ఓపెనర్‌గా చూస్తున్నామని గతంలో అన్నాను. కానీ ఆ పరిస్థితి మారొచ్చు. ఎందుకంటే అతను ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో ఇన్నింగ్స్ ఆద్యంతం ఫాస్ట్‌బౌలింగ్‌ను ఎదుర్కోవాలి. ఈ నేపథ్యంలో రహానె నాలుగో స్థానానికి బలమైన ఆటగాడవుతాడు. ఇప్పుడు మేం ఒకే కోణంలో చూడట్లేదు. పాండే, అయ్యర్, జాదవ్, పాండ్య, ధోని.. వీళ్లందరూ 5-6 స్థానాల్లో ఆడగలవాళ్లే. ఇక్కడి పరిస్థితుల్లో నాలుగో స్థానంలో ఆడేందుకు అవసరమైన టెక్నిక్ ఎవరికుందన్నది కూడా చూడాలి. మేం అన్ని ప్రత్యామ్నాయాల్ని తెరిచి ఉంచాం"

– భారత కెప్టెన్ కోహ్లి

4-2తో గెలిస్తే...

భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్టుల్లోనే కాదు.. వన్డేల్లోనూ అగ్రస్థానం కోసం పోరు సాగబోతోంది. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా.. మూడు టెస్టుల సిరీస్‌ను 2-1తో గెలవడం ద్వారా అగ్రస్థానంలో ఉన్న భారత్‌కు చేరువగా వచ్చింది. ఇప్పుడు వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న దక్షిణాఫ్రికాను అందుకోవడానికి భారత్ ప్రయత్నించనుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 120 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారత్ 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ గురువారం ఆరంభమయ్యే ఆరు వన్డేల సిరీస్‌ను భారత్ 4-2తో గెలిస్తే 121 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంటుంది. దక్షిణాఫ్రికా 119 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోతుంది. సిరీస్‌ను భారత్ 3-2తో గెలిచినా ర్యాంకులో మార్పుండదు. భారత్ ర్యాంకు మూడుకు పడిపోకూడదంటే సిరీస్‌లో కనీసం ఒక్క వన్డే గెలవాలి. భారత్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే దక్షిణాఫ్రికా మూడో ర్యాంకుకు పడిపోతుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ 116 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

పేసర్లదే కానీ..

కింగ్స్‌మీడ్ పిచ్ సాధారణంగా ఫాస్ట్‌బౌలర్లకే అనుకూలం. తొలి వన్డేకు కూడా పిచ్ భిన్నంగా ఏమీ ఉండదని అంచనా. ఐతే దక్షిణాఫ్రికాలోని మిగతా పిచ్‌లతో పోలిస్తే ఇది కొంచెం నెమ్మదిగానే ఉంటుందని, బ్యాట్స్‌మెన్ మరీ ఆడలేని పరిస్థితేమీ ఉండదని.. పరుగులు బాగానే వస్తాయని అంటున్నారు. గురువారం మధ్యాహ్నం డర్బన్‌లో వర్షం పడే సూచనలున్నాయి. ఐతే మ్యాచ్ సమయానికి పెద్దగా ఇబ్బంది ఉండదని సమాచారం.

భారత్, దక్షిణాఫ్రికా చివరగా 2015లో ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఆడాయి. భారత్‌లో జరిగిన ఐదు వన్డేల ఆ సిరీస్‌లో దక్షిణాఫ్రికా 3-2తో నెగ్గింది.



పాపం ప్రణయ్!

గాయమైనా పోరాడక తప్పలేదు
తొలి రౌండ్లో ఓటమి | **సైనా, సింధు, శ్రీకాంత్ ముందంజ**

దిల్లీ: ఫిట్‌నెస్ లేదు.. కోర్టులో పోరాడే పరిస్థితి లేదు.. ఒకవైపు పాదం నొప్పి వేధిస్తోన్నప్పటికీ అతడు ఆడక తప్పలేదు. ఓడతానని తెలిసినా మ్యాచ్ అయ్యే వరకు నిరీక్షించక తప్పలేదు. ఇండియా ఓపెన్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్ ఐదో సీడ్ హెచ్.ఎస్. ప్రణయ్ పరిస్థితి ఇది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య కొత్త నిబంధన కారణంగా బుధవారం అతడు తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. మహిళల విభాగంలో ఫేవరెట్లు పి.వి. సింధు, సైనా నెహ్వాల్ శుభారంభం చేయగా ప్రణయ్ తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. కొత్త షెడ్యూల్ ప్రకారం సింగిల్స్‌లో టాప్-15 క్రీడాకారులు సూపర్ సిరీస్‌ల్లో పన్నెండు టోర్నీలు కచ్చితంగా ఆడాల్సిందే. ఐతే గాయం కారణంగా ఈ ఏడాది తొలి రెండు సూపర్ 500 టోర్నీలకు ప్రపంచ నం.10 ప్రణయ్ దూరమయ్యాడు. తప్పక ఆడాల్సిన పరిస్థితుల్లో స్వదేశంలో అతడు బరిలో దిగాడు. కాలి ఆనెలతో బాధపడుతున్న అతడు గురువారం చాలా ఇబ్బందిగా కదిలాడు. అలాగని మ్యాచ్‌ను వదిలేస్తే కుదరదు. ఎందుకంటే ప్రత్యర్థి భారత ఆటగాడే. సొంత దేశానికి చెందిన షట్లర్‌తో మ్యాచ్‌ను వదిలేసుకుంటే ర్యాంకింగ్ పాయింట్లు కోల్పోతాడు. దీంతో మ్యాచ్ ముగిసే వరకు కోర్టులో ఉన్న ప్రణయ్ 4-21, 6-21తో శ్రేయాంష్ జైస్వాల్ చేతిలో ఓడిపోయాడు. "సరైన చికిత్స అందకపోవడంతో ఆనెలు తిరగబెట్టాయి. పదిహేను రోజుల పాటు కనీసం ప్రాక్టీస్ కూడా చేయలేకపోయాను" అని మ్యాచ్ అనంతరం ప్రణయ్ చెప్పాడు. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ కిదాంబి శ్రీకాంత్ 21-17, 21-18తో లీ చువుక్ యు (హాంకాంగ్)పై, సాయి ప్రణీత్ 21-11, 17-21, 21-17తో రాజీవ్ ఔసెఫ్‌పై, కశ్యప్ 21-14, 21-18తో హన్స్ క్రిస్టియన్ సోల్బర్గ్ (డెన్మార్క్)పై విజయం సాధించగా.. సమీర్ వర్మ 22-20, 21-8తో ఏడో సీడ్ ఆండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)కు షాకిచ్చాడు. మహిళల విభాగంలో టాప్‌సీడ్ పి.వి. సింధు 21-10, 21-13తో నతాలియా కోచ్ రోహడె (డెన్మార్క్)పై, నాలుగో సీడ్ సైనా నెహ్వాల్ 21-15, 21-9తో సోఫీ దహి (డెన్మార్క్)పై అలవోకగా గెలిచారు. రుత్విక శివాని 21-17, 21-10తో అమలీ హెర్జ్ (డెన్మార్క్)పై నెగ్గి ముందంజ వేయగా.. వైష్ణవి రెడ్డి, శ్రీకృష్ణ ప్రియ ఇంటిముఖం పట్టారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి 16-21, 21-17, 21-17తో హఫీజ్-గ్లోరియా (ఇండోనేషియా)పై, మను అత్రి-సుమీత్ 21-7, 21-13తో ఆదర్శ్-జగదీశ్‌పై, సాత్విక్ సాయిరాజ్-అశ్విని 21-9, 21-10తో రాజు-అనీస్‌పై గెలిచారు.

మాకూ ఓ ద్రవిడ్ కావాలి



కరాచి: భారత యువ క్రికెటర్ల సత్తాను వెలుగులోకి తీసుకొన్నాడంటూ భారత అండర్-19 కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను పాక్ మాజీ బ్యాట్స్‌మన్ రమీజ్ రాజా పొగడ్తల్లో ముంచెత్తాడు. భారత యువ క్రికెటర్లను ద్రవిడ్ సానబెడుతున్నాడని రాజా అన్నాడు. పాక్‌లోని యువ ఆటగాళ్ల సత్తాను వెలికితీసేందుకు ద్రవిడ్ లాంటి కోచ్ తమ దేశానికీ కావాలని రాజా చెప్పాడు. ''కొంత మంది భారత క్రికెటర్ల ఆట చూసి ముగ్ధుడినయ్యా. శుభ్‌మన్ గిల్ లాంటి ప్రతిభావంతులు జట్టులో ఉన్నారు. వాళ్లను తీర్చిదిద్దిన ద్రవిడ్‌కు ఘనత చెందాలి. భారత ఆటగాళ్లు ద్రవిడ్ నుంచి కేవలం క్రికెట్టే కాకుండా ఆటను అర్థం చేసుకునే విధానం, మైదానంలో ప్రవర్తించే పద్ధతి లాంటి ఇతర విషయాలను చాలానే నేర్చుకుంటున్నారు" అని రాజా తెలిపాడు.

కోహ్లీని చూసి నేర్చుకోవాలి

మొహిందర్ అమర్‌నాథ్



దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులో టీమ్‌ఇండియా గెలిచినందుకు ఆనందంగా ఉంది. భారత్ ఓ మంచి పోరాటంతో సిరీస్‌ను ముగించింది. తొలి టెస్టులో కాస్త అదృష్టం కలిసొచ్చివుంటే సిరీస్ కోహ్లి సేన సొంతమయ్యేది. నిజానికి సిరీస్‌లో పిచ్‌లన్నీ అంత గొప్పగా ఏం లేవు. ఈ ఒక్క సిరీస్ మాత్రమే కాదు అన్ని సిరీస్‌లపై ఐసీసీ దృష్టి సారించి.. ఐదు రోజులు నాణ్యమైన క్రికెట్ అందించే పిచ్‌లు రూపొందేలా చర్యలు తీసుకోవాలి. విదేశీ సిరీస్‌కు ముందు సరైన సన్నాహకం అవసరమని ఈ సిరీస్ నుంచి టీమ్‌ఇండియా పాఠం నేర్వాలి. ప్రత్యేకంగా బ్యాటింగ్ విషయంలో..! బౌలర్లు ప్రతిసారి రాణిస్తూనేవున్నారు. ఐతే బ్యాటింగ్ సమస్యగా మారుతోంది. మిగతా బ్యాట్స్‌మెన్ విరాట్‌ను చూసి ఎలా ఆడాలన్నది నేర్చుకోవాలి. సిరీస్‌లో గొప్పగా రాణించిన ఆటగాడు అతడే. మూడో టెస్టులో విజయం వన్డే సిరీస్ ముందు భారత్ విశ్వాసాన్ని పెంచుతుందనడంలో సందేహం లేదు. టీమ్‌ఇండియా మేటి వన్డే జట్టు. ప్రపంచవ్యాప్తంగా తామేంటో నిరూపించారు. నిజానికి రెండు వన్డే జట్ల మధ్య పెద్దగా తేడా ఏం లేదు. ఐతే భారతే కాస్త మెరుగ్గా కనిపిస్తోంది.

రైతుకు 'మద్దతు' ఒట్టిదే!

- క్వింటా ధాన్యం సాగు వ్యయం రూ.2202
- ప్రస్తుత మద్దతు ధర రూ.1,570
- పత్తి క్వింటా ఉత్పత్తి వ్యయం రూ.6083.. ఇప్పుడిచ్చేది రూ.4,320
- సాగుచేస్తే నికరంగా మిగిలేది నష్టమే
- సీఏసీపీకు రాష్ట్ర వ్యవసాయ శాఖ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: కిలో బియ్యం ఉత్పత్తికి రైతుకు రూ.33 వ్యయమవుతున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ స్పష్టంచేసింది. రాష్ట్రంలో పంటల సాగుకు అవుతున్న వ్యయాన్ని లెక్కించి 'జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్' (సీఏసీపీ)కి బుధవారం అందజేసింది. ఈ వ్యయాల ఆధారంగా వచ్చే జూన్ నుంచి మొదలవుతున్న కొత్త ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరలు నిర్ణయించాలని కోరింది. పలు రాష్ట్రాలకంటే తెలంగాణలో పంటల సాగు వ్యయం అధికంగా ఉందని, ఇక్కడ రసాయన ఎరువులు అధికంగా వాడటమే ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ తెలపగా.. తగ్గించాలని కమిషన్ సూచించింది. పంటల సాగు వ్యయంపై తెలిపిన ముఖ్యాంశాలు..

రాష్ట్రంలో అన్నింటికన్నా పత్తి సాగుకు రైతు ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కానీ దీనికి ప్రస్తుత ఏడాది మద్దతు ధర చాలా తక్కువగా ఉంది. క్వింటా పత్తి పండించడానికి రూ.6,083 ఖర్చు పెడుతుంటే మద్దతు ధర రూ.4,320 ఇవ్వడం వల్ల నష్టం అధికంగా ఉంటోంది.

వరి సాగు వ్యయానికి, మద్దతు ధరలకు పొంతనే లేదని తేలింది. క్వింటా ధాన్యం పండించడానికి ఈ ఏడాది రూ.2200 ఖర్చుపెట్టారు. కానీ అదే ధాన్యానికి మద్దతు ధరగా రూ.1570 మాత్రమే కేంద్రం నిర్ణయించింది.

పంటల సగటు దిగుబడులు సైతం పెద్దగా లేకపోవడం, పండే అరకొర పంటకూ ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర లేనందున రైతులు నష్టపోతున్నారు.

ఉదాహరణకు తెలంగాణ వరి ధాన్యం ఎకరానికి 14.50 క్వింటాళ్లే సగటున పండుతున్నట్లు తెలిపారు. ఈ పంట పండాలంటే రూ.32,103 పెట్టుబడి పెట్టాలి. కానీ అదే పంటను తీసుకెళ్లి మార్కెట్‌లో మద్దతు ధరకు అమ్మినా రైతు చేతికి వచ్చేది రూ.22,875 మాత్రమే. దీనివల్ల పూర్తిస్థాయిలో పంట పండి అమ్మినా వరి రైతుకు నికరంగా నష్టం వస్తున్నట్లు వ్యవసాయశాఖ అధ్యయనం ద్వారా తేలింది.

ప్రతి పంటలో ఇలా సాగు వ్యయానికి, మద్దతు ధరల ద్వారా వస్తున్న ఆదాయానికి పొంతనే ఉండటం లేదు. మరోవైపు సగానికి పైగా రైతులకు అసలు మద్దతు ధరనే రానుందున వారి నష్టాలు ఇంకా అధికంగా ఉంటున్నాయి.

ప్రస్తుతం కందులను రైతుల నుంచి వ్యాపారులు క్వింటాను రూ.4 వేల లోపే కొంటున్నారు. కానీ, ఇవే కందులు పండించడానికి రైతు రూ.5878 ఖర్చుపెట్టినట్లు వ్యవసాయశాఖ తెలిపింది.

ఇలా చేస్తే ఆదాయం పెరుగుదల...

రైతుల ఆదాయం పెరగాలంటే కొన్ని చర్యలు చేపట్టాలని సీఏసీపీకి వ్యవసాయశాఖ సూచించింది. అవి..

పంట సాగు వ్యయం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ఎకరానికి సగటు ఉత్పాదకత పెరగాలి. ఇందుకోసం జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థల సహకారం తీసుకోవాలి.

భూసార పరీక్షలు అధికంగా చేసి రసాయన ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించాలి.

రాష్ట్రంలో పంటల సాగు వ్యయం, ఉత్పాదకత

పంట	క్వింటా ఉత్పత్తి వ్యయం	హెక్టారుకు పండే కిలోలు
వరి	2,202	3,600
పత్తి	6,083	1,300
మక్కలు	1,356	3,600
కందులు	5,878	550
పెసలు	4,674	600
మినుములు	4,836	600
వేరుసెనగ	3,697	1,200
సోయాచిక్కుడు	3,244	1,200

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటలూ ఉచిత కరెంటు ఇస్తోంది. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరానికి రూ.4 వేలు పెట్టుబడిగా ఇస్తాం.

ప్రతి పంటకు తప్పనిసరిగా మద్దతు ధర ఇచ్చేలా మార్కెటింగ్ సదుపాయాలుండాలి.

పంటల సాగుకు ప్రాంతాలవారీగా కాలనీలు ఏర్పాటు చేయాలి.

సకాలంలో పంటరుణాలిచ్చి, వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలి.

మద్దతు ధరలను హేతుబద్ధంగా నిర్ణయించి రైతుల ఆదాయం పెంచేందుకు సహకరించాలని సీఏసీపీని కోరినట్లు వ్యవసాయ కమిషనర్ జగన్మోహన్ 'ఈనాడు'కు చెప్పారు. తెలంగాణలో ఎకరానికి రూ.4 వేలు ఇవ్వడం మంచి చర్య అని ఇలాంటివి దేశవ్యాప్తంగా జరగాలని సీఏసీపీ అభిప్రాయపడినట్లు ఆయన తెలిపారు.



జాతీయ మహిళా సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మేనకాగాంధీ. చిత్రంలో త్రిపురాన వెంకటరత్నం, నన్నపనేని రాజకుమారి

నిందితులపై కఠిన చర్యలు అవసరం

తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

ఈనాడు, దిల్లీ: మహిళలపై దాడుల కేసుల్లో నిందితులపై చర్యలు మరింత కఠినంగా ఉండాలని, అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉందని తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ త్రిపురాన వెంకటరత్నం అభిప్రాయపడ్డారు. బుధవారమిక్కడ జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 25వ వార్షికోత్సవ సదస్సులో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు, పలు రంగాలకు చెందిన మహిళలతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ..గృహహింస, పని చేసే ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, అమ్మదాడులు తదితర అంశాలపై సదస్సులో చర్చ జరిగిందన్నారు. ఎన్నారై వివాహాల వల్ల తలెత్తున్న సమస్యలకు సంబంధించిన చర్చలో సంధానకర్తగా వ్యవహరించే అవకాశం లభించిందన్నారు. ఇలాంటి సదస్సులు బాధిత మహిళల్లో ధైర్యం నింపుతాయన్నారు. రాష్ట్రంలో బాధిత మహిళలకు తెలంగాణ మహిళా కమిషన్ అండగా నిలుస్తోందన్నారు.

'మత్తు' చిత్రం..విడుదలకు సిద్ధం!

- కొలిక్కిరానున్న మత్తుమందుల కేసు
- రెండు రోజుల్లో అమెరికా నుంచి రానున్న ఎల్ఎస్డీ నమూనా
- దాని ఆధారంగా విశ్లేషణ నివేదిక న్యాయస్థానానికి
- తదనంతరం అభియోగపత్రాలు దాఖలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మత్తుమందుల కేసు త్వరలో కొలిక్కి రాబోతోంది. కీలకమైన ఎల్ఎస్డీ నమూనాలు త్వరలో ఫోరెన్సిక్ ప్రయోగశాలకు చేరనున్నాయి. ఆ తర్వాత రెండు మూడు రోజుల్లోనే విశ్లేషణ పూర్తి చేసి సంబంధిత నివేదికను న్యాయస్థానంలో సమర్పించేందుకు, అభియోగపత్రాలు దాఖలు చేసేందుకు సిట్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆబ్కారీ అధికారులు బట్టబయలు చేసిన మత్తుమందుల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. అనేక మంది సినీతారలకు ఇందులో భాగస్వామ్యమున్నట్లు ఆరోపణలు రావడం, పలువుర్ని సిట్ విచారించడంతో ఈ వ్యవహారం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. మరోవైపు ఈ తంతు ముగిసి ఆర్నెల్లు పూర్తయినా ఇప్పటివరకూ నిందితులపై అభియోగపత్రాలు దాఖలు చేయలేకపోవడం పట్ల అనేక అనుమానాలూ వ్యక్తమవుతూ వచ్చాయి. కేసు అటకెక్కించారన్న ఆరోపణలూ వెల్లువెత్తాయి.

నమూనాలు దొరక్కనే జాప్యం: విచారణలో భాగంగా అనుమానితుల నుంచి సేకరించిన రక్తం, గోళ్లు, వెంట్రుకల నమూనాలను సిట్ అధికారులు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. వాటిలో మత్తుమందుల అవశేషాలు ఉన్నాయో? లేవో? తేల్చి చెప్పాలని కోరారు. ప్రధానంగా నిందితులు కొకైన్, ఎల్ఎస్డీ అనే రెండు రకాల మత్తుమందులు వాడినట్లు ఆరోపణలుండగా..అనుమానితుల నుంచి సేకరించిన నమూనాల్లో వాటి అవశేషాలను విశ్లేషించాల్సి ఉంది. అది జరగాలంటూ..ముందుగా సదరు మత్తుమందు తాలూకూ ప్రామాణిక నమూనా(స్టాండర్డ్ సాంపిల్) ఉండాలి.

అమెరికా సాయంతో ఇప్పటికి..: మన దేశంలో కేవలం కొకైన్‌కు సంబంధించిన ప్రామాణిక నమూనా మాత్రమే ఉండగా..ఎల్ఎస్డీ నమూనా అమెరికాలో మాత్రమే దొరుకుతుంది. దానికోసం తెలంగాణ ఆబ్కారీ అధికారులు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమెరికాను సంప్రదించారు. అనేక దశల్లో ఈ విజ్ఞప్తిని పరిశీలించిన ఆ దేశ ఫోరెన్సిక్ అధికారులు ఎట్టకేలకు గత వారం దాన్ని పంపారు. ఒకటి రెండు రోజుల్లోనే ఇది ఇక్కడికి చేరే అవకాశం ఉంది. కొకైన్ ప్రామాణిక నమూనా ద్వారా పూర్తిచేసిన విశ్లేషణ నివేదికలను ఇదివరకే ఫోరెన్సిక్ అధికారులు న్యాయస్థానానికి పంపారు. తదుపరి దశలో ఎల్ఎస్డీ నమూనాను.. అనుమానితుల నమూనాలతో విశ్లేషించి సంబంధిత నివేదికను న్యాయస్థానానికి అందిస్తారు. తదనంతరం రెండు మూడు రోజుల వ్యవధిలోనే అభియోగపత్రాలు దాఖలు చేయాలనే ఆలోచనలో సిట్ ఉంది. 'ఈ కేసులో ఫోరెన్సిక్ నివేదిక కీలకం కానుంది. దీని ఆధారంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీతారలు, ఇతరుల నుంచి సేకరించిన నమూనాల్లో మత్తుమందులు అవశేషాలు ఉన్నాయా? లేవా? అన్నది తేలనుంది. మత్తుమందులు వాడుతున్నట్టు ఈ నివేదిక తేల్చిన పక్షంలో..వారికి చిక్కులు తప్పవు.' అని ఓ అధికారి తెలిపారు.



శిక్షణ మహిళా కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి

పోలీసులు సేవా దృక్పథంతో పనిచేయాలి: మంత్రి నాయిని

నార్సింగి, న్యూస్‌టుడే: పోలీసులు సేవా దృక్పథంతో పనిచేసినప్పుడే ప్రజలకు మరింత చేరువవుతారని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌బీవీఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 735 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు నాయిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం పోలీసు శాఖ ఆధునికీకరణకు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. షీ బృందాలకు దేశవ్యాప్తంగా అనేక ప్రశంసలు వచ్చాయన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలన్నారు. 24 గంటలు ప్రజల కోసం పనిచేస్తామని.. అయినా 10 ప్రభుత్వ విభాగాల పేర్లను చెప్పి వీటిలో ఏ విభాగం నచ్చుతుందని అడిగితే పోలీసు శాఖ పేరు మొదట చెప్పకపోవడం బాధిస్తుందన్నారు. అలాంటి గుర్తింపు ఎందుకు లభించడం లేదనే విషయాన్ని ఆలోచించుకోవాలన్నారు. మాట్లాడే పద్ధతి, సేవ, ప్రజలతో కలవడం తదితర అంశాల్లో కొద్దిపాటి మార్పు చేసుకున్నట్లయితే పోలీసులను దేవుళ్లుగా, ఠాణాలను దేవాలయాలుగా భావిస్తారన్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆర్జిత సేవా టిక్కెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. వచ్చే మే మాసానికి సంబంధించి 50 వేలకుపైగా టిక్కెట్లు అందుబాటులోకి రానున్నాయి. సేవా టిక్కెట్లను భక్తులు తితిదే వెబ్‌సైట్ www.tirumala.org ద్వారా ఉదయం 10 గంటల నుంచి నమోదుకు అవకాశం ఉంటుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం టిక్కెట్లను ఈనెల 6న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. అనంతరం ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా ఎంపికైన భక్తుల జాబితాను మధ్యాహ్నం 12 గంటలకు వెబ్‌సైట్‌లో తితిదే ప్రకటిస్తుంది.

ఆదేశాలు అమలు చేయని తెలంగాణ

- కేటాయించినా నీరు విడుదల చేయడం లేదు
- కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శికి ఆంధ్రప్రదేశ్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆదేశాలు జారీ చేసినా తెలంగాణ అమలు చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ ఫిర్యాదు చేసింది. నవంబరు నుంచి జనవరి వరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువకు 12 టీఎంసీల విడుదలకు బోర్డు ఆదేశాలు జారీ చేస్తే దీనికి తగ్గట్లుగా విడుదల చేయలేదని పేర్కొంటూ ఏపీ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు బోర్డు సభ్య కార్యదర్శికి లేఖ రాశారు. నీటి ఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని, బోర్డు విడుదల చేయమన్న 12 టీఎంసీలకు గాను 6.61 టీఎంసీలు ఇంకా రావలసి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. సంబంధిత చీఫ్ ఇంజినీర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాసిన లేఖను తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీకి పంపిన బోర్డు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎంత నీరు ఆవిరైందన్న దానిపై కమిటీ నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకొంటామని, దీంతో సంబంధం లేకుండా విడుదలకు చర్యలు తీసుకోవాలని బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం కోరారు.

10.80 టీఎంసీలు తక్కువగా చూపారు.. తెలంగాణ ఫిర్యాదు

శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా తీసుకొన్న నీటిలో ఆంధ్రప్రదేశ్ 10.80 టీఎంసీలను తక్కువగా చూపిందని కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు చేసింది. దీనిపై వీలైనంత త్వరగా వివరణ ఇవ్వాలని బోర్డు సభ్య కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను కోరారు. పోతిరెడ్డిపాడు నుంచి 91.77 టీఎంసీలు తీసుకొన్నట్లుగా చూపించారని.. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ వద్ద రికార్డును బట్టి 102.57 టీఎంసీలు తీసుకొన్నారని, 10.80 టిఎంసీలు తక్కువగా చూపించినట్లు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బోర్డుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనిపై వెంటనే బోర్డు ఆంధ్రప్రదేశ్ వివరణ కోరింది.

కృష్ణా బోర్డు ఛైర్మన్ పదవీ విరమణ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవ బుధవారం పదవీ విరమణ చేశారు. కొత్త ఛైర్మన్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. గోదావరి బోర్డు ఛైర్మన్ సాహు, కేంద్ర జల సంఘం హైదరాబాద్ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, జాతీయ జల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు శ్రీవాత్సవ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'గ్రేడ్-2 పోస్టుల్లో అవకాశమివ్వండి'

ఈనాడు, హైదరాబాద్: వైద్యఆరోగ్యశాఖలో ఫార్మసిస్టు గ్రేడ్ 2 పోస్టుల భర్తీలో భాగంగా టీఎస్‌పీఎస్సీ గత నెల 25న విడుదల చేసిన నియామక ప్రకటనలో 'డి ఫార్మసీ' విద్యార్థులకు మాత్రమే అర్హతగా ప్రకటించారని, తమకూ అవకాశం కల్పించాలని బీ ఫార్మసీ విద్యార్థులు కోరుతున్నారు. డి ఫార్మసీ కంటే ఎక్కువ అర్హతతో ఉన్నా బీ ఫార్మసీకి అవకాశం కల్పించకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి దరఖాస్తులో బీ ఫార్మసీ విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు పలువురు బీ ఫార్మసీ విద్యార్థులు బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అంతర్జాలంలో 'జి.ఎస్.టి' చిత్రం తొలగింపు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ తాజా చిత్రం 'గాడ్, సెక్స్ అండ్ ట్రూత్ (జి.ఎస్.టి)' వెబ్‌సిరీస్ చిత్రాన్ని అంతర్జాలంలో విమియో డాట్ కాం సంస్థ బుధవారం తొలగించింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల సూచనతో ఈ నిర్ణయం తీసుకుంది. వర్మ రూపొందించిన ఈ చిత్రంలో అసభ్యత, అశ్లీలం ఉన్నాయంటూ తమకు ఫిర్యాదు రావడంతో ఆయనపై కేసు నమోదు చేశామని పోలీసులు కొద్దిరోజుల క్రితం విమియో డాట్‌కాం సంస్థకు లిఖితపూర్వకంగా వివరించారు. దీంతో ఇకపై ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా ఎక్కడా చూసేందుకు వీలుండదు. మూడు డాలర్లు చెల్లిస్తే జీఎస్‌టీ చిత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చంటూ తమకు సమాచారం రావడంతో ఆ సౌకర్యాన్నీ రద్దు చేయాలంటూ మరో లేఖ రాశామని సైబర్‌క్రైమ్ అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు.

శ్రీశైలం రుద్రాక్ష మఠంలో సొరంగం

- ప్రాచీన వస్తువులు లభ్యం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలోని ప్రాచీన పంచమఠాల్లో ఒకటైన రుద్రాక్ష మఠంలో బుధవారం సొరంగం బయటపడింది. మఠం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా పునాదుల వరకు తొలగించారు. ఈ క్రమంలో మఠం నైరుతి భాగంలో తొలుత చిన్నపాటి రంధ్రాన్ని ఆలయ స్తపతి జవహర్ గుర్తించారు. ఈ విషయాన్ని ఈవో భరత్‌గుప్తకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు సొరంగాన్ని గుర్తించేందుకు రాళ్లను తొలగించారు. సుమారు 5 మీటర్ల పొడవు కలిగిన సొరంగాన్ని గుర్తించారు. వెంటనే సీఐ నీలకంఠేశ్వరయ్య, ఎస్సై వరప్రసాద్, తహసీల్దారు కె.వి.శ్రీనివాసులు, ఈఈ రామిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సొరంగాన్ని మరింత తవ్వించడంతో చెంబుల ఆకారంలోని పాత్రలు, పూజా హారతి సామగ్రి, పళ్లాలు వంటి వస్తువులు బయటపడ్డాయి. దశాబ్దాల క్రితం అప్పట్లో సాధువులు, యోగులు తపస్సు కోసం సొరంగంలో దాచుకుని ఉండవచ్చని అధికారులు భావించారు. బాహ్యంగా అతిపెద్ద బండతో కూడిన సొరంగం ఉండటంతో లోపల ఉన్న మిగతా వస్తువులను గుర్తించేందుకు గురువారం నుంచి తవ్వకాలను చేపడతామని స్తపతి తెలిపారు. సమాచారం తెలుసుకున్న భక్తులు, స్థానికులు తండోపతండాలుగా తరలివచ్చి వాటిని వీక్షించారు. విలువైన బంగారు, వెండి వస్తువులు లభ్యమవుతాయన్న భావనతో అందరూ ఆసక్తిగా తిలకించారు. ఏడాది క్రితం ఘంటామఠంలో బంగారు, వెండి నాణేలు వెలుగు చూసిన సంగతి తెలిసిందే.



రుద్రాక్ష మఠంలో గుర్తించిన సొరంగం



సొరంగం నుంచి బయట పడిన వస్తువులు

అధికారుల జాబితాతో రండి

రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి నియామకంపై ఈసీ లేఖ

ఈనాడు, హైదరబాద్: తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి నియామకానికి వీలుగా అధికారుల జాబితాతో రావాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. "మూడు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. జాబితా పంపాలని గతంలోనూ కోరాం. ఆ జాబితాతో ప్రత్యేకాధికారిని దిల్లీ పంపండి" అని లేఖలో పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారిగా పని చేసిన భన్వర్‌లాల్ గతేడాది అక్టోబరు 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టును భర్తీ చేయలేదు. ఈ లోగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన జాబితా నుంచి ఆర్పీ సిసోడియాను కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేయటంతో ఆయన ఇటీవల ఏపీలో బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ఎన్నికల సంఘం ఇదే విషయమై లేఖ రాయగా వ్యవధి ఇవ్వాలని అప్పటి సీఎస్ ఎస్పీ సింగ్ ఈసీకి లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా లేఖ నేపథ్యంలో త్వరలో పూర్తి స్థాయి అధికారిని నియమించాల్సిన అవసరముందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

నటి అమలాపాల్‌కు లైంగిక వేధింపులు

నృత్య పాఠశాల యజమాని అళగేశన్ అరెస్టు



అమలాపాల్



నిందితుడు అళగేశన్

చెన్నై, న్యూస్‌టుడే: నృత్య పాఠశాల యజమాని అళగేశన్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ.. చెన్నై మాంబలం పోలీస్‌స్టేషన్‌లో నటి అమలాపాల్ బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గంట వ్యవధిలోనే నిందితుడు అళగేశన్‌ను అరెస్టు చేశారు. ఆయనపై 3 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై అమలాపాల్ మాట్లాడుతూ.. మలేసియాలో మహిళాభివృద్ధికి సంబంధించి 'డాన్సింగ్ తమిళచ్చి' కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో టీ నగర్‌లోని నృత్య పాఠశాలలో 3 రోజులుగా శిక్షణ పొందుతున్నానని, అక్కడ అళగేశన్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.

సిద్దిపేట వైద్యకళాశాలపై ఎంసీఐకి నివేదిక

ఈనాడు, హైదరాబాద్: సిద్దిపేటలో ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుమతించాలని కోరుతూ బుధవారం తెలంగాణ ప్రభుత్వం మరోసారి నివేదిక అందజేసింది. ఎంసీఐ బృందం సిద్దిపేట వైద్యకళాశాలలో పరిశీలనలు జరిపిన సందర్భంలో గుర్తించిన లోటుపాట్లపై రెణ్నెళ్ల కిందటే సమగ్ర నివేదిక అందజేయగా.. అందులోని అంశాల ఆధారంగా వైద్యకళాశాల ఏర్పాటు వినతిని ఎంసీఐ తోసిపుచ్చింది. ఆ లోటుపాట్లను చక్కదిద్దామని పేర్కొంటూ తాజాగా వైద్యఆరోగ్యశాఖ ఎంసీఐకి సవివర నివేదికను పంపించింది. దీన్ని ఆధారంగా చేసుకొని ఎంసీఐ బృందం మరోదఫా పరిశీలనకు రానుంది.

తరగతికి ఒక ఉపాధ్యాయుడు

- దీన్ని తప్పనిసరి చేయాలి
- విద్యాశాఖ కమిషనర్‌కు '3 ఆర్' పరిశీలన బృందాల నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం తప్పనిసరని 3 ఆర్ (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్) కార్యక్రమాన్ని పరిశీలించిన ఉపాధ్యాయ బృందాలు సిఫార్సు చేశాయి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని స్పష్టంచేశాయి. ప్రస్తుతం ఒకరిద్దరు ఉపాధ్యాయులున్న బడులు 4 వేలకుపైగా ఉన్నాయి. జనవరి 3వ తేదీ నుంచి 9 వరకు 10 బృందాలు రాష్ట్రంలోని సుమారు 500 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలను తనిఖీ చేశాయి. 3ఆర్ కార్యక్రమం అమలు ఎలా ఉందో సమగ్రంగా పరిశీలించాయి. దీనిపై ఇటీవల తుది నివేదికను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్‌కు అందజేశాయి. త్వరలో నివేదికపై చర్చించి వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి కమిషనర్ నివేదిక అందజేయనున్నారు.

నివేదికలోని అంశాలు, సిఫార్సులు..

పర్యవేక్షించే విధానాన్ని బలోపేతం చేయాలి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యా సలహా మండళ్లను ఏర్పాటు చేయాలి.


తరగతి గదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకుండా నిషేధించాలి. బహిరంగంగానూ బడి ప్రాంగణంలో మాట్లాడరాదు. ప్రత్యేక గదిలోకి వెళ్లి మాట్లాడుకోవాలి.

సీసీఈ విధానంలో పుస్తకాల సమీక్ష ఉంది. అది పిల్లలకు సమస్యగా మారింది. పుస్తకానికి బదులు ఏదైనా కథ, అంశంపై ఉంటే బాగుంటుంది. 28 ప్రాజెక్టులు తయారు చేయాల్సి వస్తోంది. దాన్ని సగం తగ్గించాలి. ముఖ్యంగా రాత పని తగ్గించాలి.

ఉన్నత పాఠశాలల్లో ప్రతిరోజూ 8 రకాల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా పంపించాలి. దానికోసం బయట అంతర్జాల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. అందుకే రెండు కంప్యూటర్లను సమకూర్చి అంతర్జాల సౌకర్యం కల్పించాలి. కంప్యూటర్ ఆపరేటర్‌ను సమకూర్చాలి.

పదో తరగతి పరీక్షల్లో సీసీఈ విధానం వల్ల పాఠ్య పుస్తకం నుంచి ప్రశ్నలు రావడం లేదు. కనీసం 30-40 శాతం పాఠ్య పుస్తకం నుంచి నేరుగా వస్తే వాటిని పూర్తిగా చదువుతారు.

కిరోసిన్ పోసి నిప్పంటించి.. మహిళ దారుణ హత్య



సేవంత (పాతచిత్రం)

బెజ్జూరు, న్యూస్‌టుడే: అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగితే మహిళపై కిరోసిన్ పోసి నిప్పంటించిన ఘటన కుమురం భీం జిల్లా బెజ్జూరు మండలంలోని జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం మర్థిడి గ్రామానికి చెందిన దుర్గం సేవంత (45) అనే మహిళపై మంగళవారం అర్ధరాత్రి తరువాత అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కిరోసిన్ పోసి నిప్పంటించారు. గాయపడ్డ సేవంతను కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. గతేడాది గ్రామానికి చెందిన కామేర దుర్గయ్య కూతురు పెళ్లికి రూ.47 వేలు ఆయనకు సేవంత అప్పు ఇచ్చారు. ఈ విషయంలో తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో బషరత్‌ఖాన్, కామిరే సాలుబాయి, కామిరే సాయిలు.. సేవంతపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేశారని సేవంత కుమారుడు దుర్గం దాసు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00